మధుకోశము

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సన్మాన సంచిక

PAK12A202

యా కుందేందు తుషారహార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా
యా వీణావరదండ మండితకరా యా శ్వేత పద్మాసనా ।
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైస్సదా పూజితా
సా మాం పాతు పరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా॥

నతు లర్పింతుము బిడ్డలందు నభిమానం బుంచుమమ్మా, కృతజ్ఞతఁ జూపింతు మభిజ్ఞశేఖరుల కాశాస్యంబు లిమ్మా, నిరాకృతిఁ జూపించితి మిన్నినాళు లిది సైరిఁపంగదమ్మా, సరస్వతి ! దేశస్థులకుం గృపామతి నుపజ్ఞా భైక్ష్యముం బంచుమా !

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

మధుకోశము

స్వస్తిశ్రీ రాక్షస కార్తిక శుద్ధ పంచమీ స్థిరవారం

8 - 11 - 1975

ఆవిష్కరణము :

శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు

సభాధ్యక్షులు :

డా॥ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు

సభా ప్రారంభకులు :

డా॥ శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు

సమర్పణ :

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సమ్మాన సంఘం

రాజమహేంద్రవరము.

MADHU KOSAMU
(Telugu)

Published by :
Sri Madhunapantula Satyanarayana Sastry Sammana Sangham,
Rajahmundry.

November 1975

For Copies :
M. Venkata Chalapathi,
V. T. High School, Rajahmundry.

Price : Rs. 15/-

Chief Editor :
SRI MALLAMPALLI SARABHESWARA SARMA

Title Design : Sri S. N. Buddha

Printers : M/s Premier Printers, Rajahmundry,

Title : M/s Box Press, Rajahmundry.

Blocks : M/s Vijaya Block Making Works, Rajahmundry.

V1

సమ్మాన సంఘం

గౌరవ అధ్యక్షులు :

డా॥ బెజవాడ గోపాలరెడ్డి (ఆం.సా.అ. అధ్యక్షులు)
శ్రీ తెన్నేటి విశ్వనాథం (స్వాతంత్ర్యసమర యోధులు)
శ్రీ రాజా వత్సవాయి వేంకట సూర్యనారాయణ జగపతిరాజావారు (తుని రాజావారు)
డా॥ దివాకర్ల వేంకటావధాని
శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య
శ్రీ రేమెళ్ళ తిరుపతిరావు, ఎమ్. ఎల్. సి.
శ్రీ దేవులపల్లి రామానుజరావు
శ్రీ బి. యస్. మూర్తి, ఎమ్. పి.
శ్రీ యస్. బి. పి. కె. పట్టాభిరామారావు, ఎమ్. పి.
శ్రీ యా. యస్. సంజీవరావు, ఎమ్. పి.
శ్రీ ద్విభాష్యం వెంకట సూర్యనారాయణమూర్తి

గౌరవ ఉపాధ్యక్షులు :

శ్రీ కేశిరాజు వేంకట నృసింహ అప్పారావు
డా. దాశరథి
డా. సి. నారాయణరెడ్డి
శ్రీ జి. అచ్యుతరామరాజు
శ్రీ కరుటూరి సత్యనారాయణ
డా. యస్. యస్. ఆర్. శాస్త్రి
శ్రీ తన్నీరు బుల్లయ్య యం. యల్. సి.
శ్రీ గన్నాబత్తుల పెదతాత
శ్రీ పోతుల వీరభద్రరావు
శ్రీ మేడూరి సత్యనారాయణ
శ్రీ గ్రంధి సుబ్రహ్మణ్యం

అధ్యక్షులు :

శ్రీ ఎల్. మాలకొండయ్య, ఐ. ఎ. ఎస్.

ఉపాధ్యక్షులు :

గంధం సీతారామాంజనేయులు

ప్రధాన కార్యదర్శి :

శ్రీ నార్ని కేదారేశ్వరుడు

సహాయ కార్యదర్శి :

శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు

కోశాధికారి :

శ్రీ మేడపాటి సత్యనారాయణరెడ్డి

సభ్యులు :

శ్రీ పి. వి. వి. రావు,
శ్రీ పున్నమరాజు నాగేశ్వరరావు

సభ్యులు :

హైద్రాబాద్ : సర్వశ్రీ పోతుకూచి సాంబశివరావు, దేవత సుబ్బారావు, కుందుర్తి ఆంజనేయులు, జి. వి. సుబ్రహ్మణ్యం, కొల్లూరి ఉమామహేశ్వరశాస్త్రి. వరంగల్లు : కేతవరపు రామకోటిశాస్త్రి బొంబాయి : లక్కావఝ్ఝల వెంకటేశ్వర్లు. మునగాల గంగాధరరామారావు. బెంగుళూరు : డా. చెన్నాప్రగడ తిరుపతిరావు. ఢిల్లీ: పి. వి. దాస్. కలకత్తా: పులుగుర్త పార్థసారధి. మద్రాసు: మేకా రామచంద్రఅప్పారావు. భమిడిపాటి రాధాకృష్ణ. పి. రాజబాబు, పూనా : కె. సాంబశివరావు. నందివాడ మోహనరావు; విజయవాడ : ఉషశ్రీ. కర్నూలు : రాపాక ఏకాంబరాచార్యులు, నూజివీడు : ఎర్రోజు మాధవాచార్యులు, ఆర్. వి. చిన్నారావు. పామర్రు : కోగంటి దుర్గామల్లికార్జున కవి. గుంటూరు : జంధ్యాల పాపయ్యశాస్త్రి, యేలూరిపాటి అనంతరామయ్య. తాడేపల్లిగూడెం : పూడి సూర్యనారాయణమూర్తి. పాలకొల్లు : శ్రీపాద కృష్ణమూర్తి. తణుకు : ముళ్ళపూడి తిమ్మరాజు' నిడదవోలు : డా. అన్నపురెడ్డి శ్రీరామరెడ్డి. కొవ్వూరు : సత్యవరపు అప్పలరాజు, వేదుల చంద్రశేఖరరావు, సింగులూరి బాపిరాజు. విశాఖపట్నం : పురిపండా అప్పలస్వామి. కోసూరి రామారావు. నాళచెరువు శ్యాంబాబు. విజయనగరం : మానాప్రగడ శేషశాయి శ్రీకాకుళం : తిమ్మరాజు వెంకటశివరావు, త్రిపురాన రాఘవదాసు. శ్రీకూర్మం : ఎస్. టి. పి. వి కూర్మాచార్యులుగారు. చోడవరం : వి, పాలవెల్లి. అనకాపల్లి : బైరభట్ల విశ్వనాధం. కాకినాడ : దంటు భాస్కరావు యస్. టి. జ్ఞానానందకవి, డా. యస్, ఎస్. ఆర్. శాస్త్రి. జానకిజాని చాగంటి కనకయ్య. సి. పద్మనాభం. కోరుకొండ : డా, పి. సీతారామభార్గవ, నాగులాపల్లి : భూపతిరాజు సూరపరాజు, కోలంక : దంతులూరి వెంకటరామభద్రరాజు, వత్సవాయి సూర్యనారాయణరాజు, నెలివెల వేణుగోపాలరావు, కొత్తపేట: కోసూరి రామకృష్ణంరాజు. దుగ్గుదుఱు: రేమెళ్ళ వేంకట వేణుగోపాలరావు. రేమెళ్ల వెంకటఅప్పారావు, రేమెళ్ల చంద్రరావు, రేమెళ్ళ వెంకటవేణుగోపాలరావు. సంపర తిమ్మరాజు నండూరి ఉమామహేశ్వరావు. ఇంజరం : దుడ్డు రామమూర్తి. నృసింహదేవర సత్యనారాయణమూర్తి రాజమండ్రి : సర్వశ్రీ డా ఎ. బి. నాగేశ్వరావు. కొప్పర్తి లింగరాజు. రేమెళ్ళ సూర్యప్రకాశశాస్త్రి బులుసు సీతారామశాస్త్రి, ఆర్, యమ్ చల్లా. అడ్దేపల్లి నాగేశ్వరరావు, ఎస్. టి సి. వి కోనప్పాచార్యులు సహదేవ సూర్యప్రకాశరావు, వి. యల్. ఎన్. వెంకటామయ్య. ఎ. వి. యస్. చలపతిరావు శ్రీకాకోళపు సత్యానందం, తాతినేని కుటుంబరావు, ఆర్. బి పెండ్యాల. బుగ్గా పాపయ్యశాస్త్రి. కొండపల్లి భాస్కరరావు, పత్యవోలువరప్రసాదమూర్తి, మహీధరజగన్మోహనరావు, తమ్మనరసింహారావు చేబియ్యం వేంకటామయ్య, డా. పి కాశీప్రసాద్. మెరపల సన్యాసిరావు, సన్నిధానం నరసింహశర్మ, పి. బి వీరాచారి, ఎమ్. చిరంజీవి, మద్దుల వాసుదేవమూర్తి, అల్లుభాస్కరరావు వరదా బ్రహ్మానందం పొడిపిరెడ్డి సత్యనారాయణ, యమ్. బి. బి. యస్. ఆర్. శర్మ, చేబోలు శేషగిరిరావు, కొట్నాక లక్ష్మణస్వామి, ఎమ్, వి. నారాయణచార్యులు, సి, వి. పూర్ణచంద్రరావు, హెచ్. ఎస్. ఎమ్, కామేశ్వరరావు, ఎమ్, వి, సత్యనారాయణమూర్తి, కె. వి, సుబ్బారావు, సి, హెచ్. వి. ఆర్. ప్రసాదశర్మ, కె. శేషయ్యశాస్త్రి, ఎ. ఎల్. భాస్కరావు, ఇనుమర్తి బసవరాజు, పత్రిశేషాద్రిరావు, మద్దూరి కృష్ణ, న్యాపతి రాఘవరావు, ఎమ్, వి, ప్రసాదరావు, పి. రామనాథన్, చల్లా అప్పారావు, వి. అప్పాజి, ఎస్. రామారావు.

సమ్మాన సంఘ అధ్యక్షులు



శ్రీ ఎల్. మాలకొండయ్య
ఐ. ఏ. ఎస్.

సమ్మానసంఘ ప్రధాన కార్యదర్శి



సరస్వతీ సామ్రాజ్య సార్వభౌమ
శ్రీ నార్ని కేదారేశ్వరుడు



శ్రీ శాస్త్రిగారితో కేదారేశ్వరుడు

మధుకోశము ... విషయానుక్రమణిక

		పుట
నోయిలి...పద్యము		8
సదాశివ పంచాశిక ... సర్వదర్శన స్తవము		9
అన్నగారి ఆంధ్రీసమర్చనము	శ్రీ చెలికపల్లి జమదగ్నిశర్మ	14
పద్యప్రసూనములు	శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	24
ఆంధ్రపురాణము కవితాకామనీయకము	శ్రీ దివాకర్ల వేంకటావధాని	25
ఉడుగర	శ్రీ తుమ్మల సీతారామమూర్తి	37
కవిత్వమున లాక్షణికత	శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి	39
సంప్రదాయ మర్మజ్ఞత	శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు	50
నేనెరిగిన కవులు "మధునాపంతుల"	శ్రీ అంబటిపూడి వెంకటరత్నం	53
అభిజ్ఞవాణి	శతావధాని వేలూరి శివరామశాస్త్రి	55
	శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి	
	శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి	
	శ్రీ వానమామలై వరదాచార్యులు...	
అభిరూప వచనము	వేటూరి ప్రభాకరశాస్త్రి	62
	మల్లంపల్లి సోమశేఖరశర్మ	
	కాటూరి వేంకటేశ్వరరావు...	
సుకృతీ	డా॥ సి. నారాయణరెడ్డి	69
"సుధీమధుమూర్తి"	శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి	70
అధునా–మధునా	డా॥ దాశరథి	74
శరన్మల్లిక	శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ	75

శైష్యోపాధ్యాయిక	శ్రీ వేదుల (శ్రీ)రామచంద్రకీర్తి	78
గురుదక్షిణ	శ్రీ శనగన నరసింహస్వామి	81
సంధ్యాసఖ	శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ	83
చిరంజీయాత్	శ్రీ మల్లంపల్లి వీరేశ్వరశర్మ	84
అక్షరదర్శనము	ఉమ(శ్రీ)	84
ఆంధ్ర రచయితలు...అక్షరార్చన	స్ఫూర్తి(శ్రీ)	85
రాజమహేంద్రవరం అంటే...	శ్రీ ఎల్. మాలకొండయ్య	90
ఆధునికాంధ్రసాహితీ చంద్రశాల	(శ్రీ) జోశ్యుల సూర్యనారాయణమూర్తి	92
పీఠిక	శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	95
ఆంధ్రి	మల్లంపల్లి సోమశేఖరశర్మ	101
ఉషోవీణ	పాలెపు వెంకటరత్నం	104
వాఙ్మయము–దేశాభ్యుదయము	జటావల్లభుల పురుషోత్తము	105
అభాగిని	విక్రమదేవవర్మ	108
గోపాలలీలా సుధాలహరి	శ్రీ నిడదవోలు వేంకటరావు	110
గారు (శబ్దవిచారము)	శతావధాని వేలూరి శివరామశాస్త్రి	112
ఆంధ్రి	కుందూరు ఈశ్వరదత్తు	115
'ఆంధ్రపురాణము' ఈనాటి మహాకావ్యము	శ్రీ దామెర్ల వేంకటరావు	117
వెన్నెలలు	శ్రీ మధునాపంతుల సూరయ్యశాస్త్రి	120
తెలుగుభారతము...వచనోపక్రమము	శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి	121
నన్నయ తిక్కనల అవతారికల తెన్నులు		125
నన్నయ తిక్కనల గద్యపద్యములు		129
సమ్మాన సభావిశేషములు		

xii

మధుకోశము

రాజమహేంద్రవరము — 8—11—1975

ఉడుగర

ఇది —

సహృదయ భృంగములు మధుమయ కావ్యపుష్ప వనవీథులలో తిరిగితిరిగి బిందువు బిందువుగా సేకరించి నింపుకొన్న మధుకోశము!

రాశీకృతమైన మధు వ్యవసాయఫలము! ఇందు నింపిన మధువంతయు నేటిదికాదు. ఈ భృంగములన్నియును ఒక్కనాటివి కావు. కొన్ని పురాణములు, నడిమికాలమునాటివి కొన్ని. మఱికొన్ని నవీనములు. అన్నింటికి కృతజ్ఞతామధువుకాక ఏమి పంచి యీయఁగలము!

వస్తుతః —

మధుమయ ఫణితియైన సత్యనారాయణశాస్త్రిగారు తొలినాటి నుండి తమ సృష్టియంతయు మధుకోశముగానే సంతరించుకొనియున్నారు. ‘ఆంధ్రి’లో— ‘ఆంధ్ర రచయితల’లో— ‘ఆంధ్ర పురాణము’లో.

ఈ సహృదయ భృంగముల వ్యవసాయము ఆ ఉపవనముల నుండి సేకరించిన అచ్చపుఁదేనెను నేఁడు తమగీతిమధువు కొంతకూర్చి యిచ్చుట కావచ్చును.

అయిన —

క్రొత్తసేసి వారిది వారికిచ్చుట కాక ఈ ఉడుగర అపూర్వమనుటకు లేదు. ఇది ఒకరు సేకరించినది కాదు. ఒకరిది కాదు. సహృదయుల అందఱిది.

ఆంధ్ర రసజ్ఞపుష్పంధయముల కన్నింటికి ఇది ఆమెత! ఈ మహోత్సవ సమయములో ఇట్టి నిర్మక్షిక నిస్సపత్నమైన మధుకోశమును ‘పురాణ కవిభృంగము’కదా! అన్న విశ్వాసముతో శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి సన్నిధిలో సభక్తికముగ సమర్పించుకొనుచున్నాము.

ఇఁక వారి చిత్తము— మన భాగ్యమును.

సంపాదకవర్గము :

శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ

శ్రీ చేబోలు చిన్మయబ్రహ్మకవి

శ్రీ వారణాసి వీరభద్రము

శ్రీ పోతుకూచి సూర్యనారాయణమూర్తి

M. R. APPA ROW, M.A.
M. L. A.
Vice-Chancellor

Andhra University
Waltair
VISAKHAPATNAM.
A. P.
8-10-1975

అభినందనము

మహాకవి శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారికి సన్మానం జరుగుతున్నదంటే ఆంధ్రుల చరిత్రకూ సాహిత్యానికీ సన్మానం జరుగుతున్నట్టుగా భావిస్తున్నాను. ఆంధ్రపురాణం ద్వారా ఆంధ్రసాహితీలోకంలో తాము సుప్రతిష్ఠితులు కావడమేకాక, ఆంధ్ర వీరచరిత్రనూ ఆంధ్రత్వాన్నీ ఆంధ్ర ప్రజాహృదయాల్లో సుప్రతిష్ఠితాలు చేసిన మహాకవి శ్రీ మధునాపంతుల. ఇది వారి కవితావ్యవసాయానికి అమృతఫలం అయితే వారి విమర్శాపాటవానికీ విజ్ఞతకూ వారి 'ఆంధ్ర రచయితలు' చక్కని వక్కణ.

శ్రీ శాస్త్రిగారి సన్మానసభ సర్వథా విజయవంతం కావాలనీ భగవంతుడు వారికి ఇతోధికాయు రారోగ్యాలు ప్రసాదించి, వారి మధురలేఖిని నుండి మరిన్ని మహత్తర కృతులు మనకు ప్రసాదించగలరనీ ఆశిస్తున్నాను.

(Sd.) M. R. APPA ROW.

వావిలాల గోపాలకృష్ణయ్య
(మకాం) హైదరాబాదు.

శ్రీ మధునాపంతులవారికి సన్మానం చేయదలచడం— అది విద్వత్కవుల సాహితీరంగాల కేంద్ర మైన రాజమహేంద్రవరంలో జరుపుట— పురానికి ఉన్నసాహితీ సార్వభౌమత్వం మరొకసారి ధ్రువపరువ దలచారు. అందుకు జేజేలు.

శ్రీ మధునాపంతులవారు తెలుగు సంస్కృత సాహిత్యాలలో నిష్ణాతులు. రచించిన ప్రతి కృతి లోనూ కవితాశిఖరా లందుకున్నవారు అరుదు. అట్టివారిలో మధునాపంతులవారొకరు. వారి ఆంధ్ర పురాణం ఒక్కటిచాలు వారి నిశితపరిశీలనాశక్తికి దర్పణం. వారికి మా జేజేలు. సన్మానం జరుపుతున్న మీకు అభినందనలు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ

హైదరాబాదు
14-5-1974

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారిని రాజమహేంద్రవరములో సన్మానించవలెనని నిర్ణయించడము చాల సంతోషము. శ్రీ శాస్త్రిగారు సమస్తాంధ్రములో సుప్రసిద్ధులైన విద్వాంసులు, విమర్శకులు, కవులు. నేటి సాహితీప్రపంచములో వారిది ఉన్నతస్థానము.

దేవులపల్లి రామానుజరావు

AVULA SAMBASIVA RAO
Judge, High Court of A. P.

"Saahithi"
Judges' Colony,
Malakpet, Hyderabad-500036.
D/ 27th Sept., 1975

My dear Sri Kedareswarudu,

The name 'Madhukosam' you are giving to the volume of Madhunapantula Satyanarayana Sastry's writings is very appropriate. His poetry is so sweet and very fluent that the collection of them is certainly a Madhukosam. I expect Sastry Garu to bring forth very many beatiful poems of which he is immensely capable. I send him my best regards.

yours sincerely,
(Sd.) SAMBASIVA RAO

B. S. MURTHY
CHAIRMAN
Railway Convention Committee.

Cabin No. 2 Libraey.
Ground Floor.
Parliment House.
New Delhi, May 17, 1974.

Dear Sir Kedareswarudu,

I am extremely happy to learn that yourself, Vidwan Suryapracasa Rao and other friends have thought it fit to honour Sri Madhunapanthula Satyanarayana Sastri, the great scholar who did lasting service to Telugu literature. I agree with you that every Andhra should be proud of thc great schlor and be anxious to join with you and others to pay his homage.

Wishing you all success,

Yours sincerely,
(Sd). B. S, MURTHY.

జాగృతి
ప్రముఖ తెలుగు వారపత్రిక,

తూములూరి లక్ష్మీనారాయణ
విజయవాడ.

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారికి జరుగుతున్న సన్మానము ఆంధ్రభారతికి నీరాజనం. భారతీయ ధార్మిక సాంస్కృతిక హృదయముతో తెలుగుభాషలో వారు సాగించిన సాహితీవ్యవసాయం యువ రచయితలకు ఆదర్శప్రాయం.



జననీజనకులు



కవిదంపతులు (1948)



రాజమండ్రి తిరుపతిరాయ కాంగ్రెసుభవనంలో
(శ్రీ) శాస్త్రిగారి నుండి ఆంధ్రపురాణము
కృతి నందుకొనుచున్న
శ్రీ రేమెల్ల వెంకటరావుగారు (1954) దుగ్గుమర్రు.



శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు (మధ్యనున్నవారు)
గారి అధ్యక్షతన కోలంకలో శ్రీ దంతులూరి
వీరవెంకటసత్యనారాయరాజుగారి ప్రాంగణము
సన్మాన సందర్భము.

శ్రీ మధునాపంతుల

అద్యత నాంధ్ర కవిప్రపంచంలో కావ్యనామంతో కవిపేరుకూడ కలిసి ప్రహతంగా వినబడే పేరు, ఆంధ్రపురాణ కర్త శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి పేరు.

ఆంధ్ర పురాణకర్త
ఆంధ్రరచయితల రచయిత
'ఆంధ్రి' సంపాదకుడు—

పెట్టుబిరుదులులేని శాస్త్రిగారికివి పుట్టుబిరుదులు. కేవల ప్రతిభావైదుష్యాలతో ప్రసిద్ధికెక్కి మహాకవి పదము నధిష్ఠించిన మధునాపంతులవారి మహత్తుకు ఇవి మువ్వన్నెల యశ్శపతాక.

* * *

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు సిద్ధార్థినామ సంవత్సర ఫాల్గునపూర్ణిమనాడు (5 మార్చి 1920) అమలాపురం తాలూకా (ఐలెండ్) పోలవరంలో మాతామహస్థానమున జన్మించారు. అభిజనము కాకినాడ తాలూకా పల్లెపాలెము. శాస్త్రిగారి తండ్రి సత్యనారాయణమూర్తిగారు సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు, భిషగ్రత్న బిరుదాంకితులు. తల్లి లచ్చమ్మగారు. సతీమణి శ్రీమతి కామేశ్వరమ్మ. శ్రీ శాస్త్రిగారికి నలుగురు కుమారులు, ఇరువురు కుమార్తెలు. వీరికి సన్నిహిత బంధుకోటిలోనివారు ఎందరో కవులూ, పండితులూ. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి గురుపరంపరలోని 'మధునపంతుల సూరయ్య బుధుడు' వీరి పినముత్తాత.

పంచదారకంటెఁ బరిపక్వమైనట్టి
తీయద్రాక్షకంటెఁ దేనెకంటె
సుధల వాసకంటె మధురతరంబయి
ముద్దులొలుకు రామమూర్తికవిత:- గా

పానుగంటివారి ప్రశంసలందిన 'స్వప్నానసూయ' కృతికర్త, దేవీభాగవతాంధ్రీకర్త (తిరుపతి వేంకటకవుల దేవీభాగవతంలో నవమస్కంధం మాత్రమే); వైద్యరాజ ఆకొండి రామమూర్తిశాస్త్రి గారు వీరి మాతామహులు. పీఠికాపురాధీశాస్థాన కవులజంటలోని శతావధాని ఓలేటి వేంకటరామ శాస్త్రిగారు మధునాపంతులవారికి తొల్లిటి కవితా గురువులేగాక సాక్షాత్తు మేనత్తభర్త. వీరందరి ప్రతిభావాసనలు బాల్యంలోనే శాస్త్రిగారిలో పరిమళించాయి. పితురంతేవాసులై శాస్త్రిగారు సాహిత్యంతో పాటు ధార్మికసాహిత్యం కూడ పొందారు.

శ్రీ సత్యనారాయణ శాస్త్రిగారు ఇంజరం సంస్కృతపాఠశాలలో వ్యాకరణాచార్య మహేం

ద్రవాడ సుబ్బరాయశాస్త్రిగారి సన్నిధిని సంస్కృత కావ్యనాటకాలంకారములూ, వ్యాకరణశాస్త్రమూ అధ్యయనం చేశారు. తరువాత విజయనగరం మహారాజ సంస్కృతకళాశాలలో 'సాహిత్యవిద్యా ప్రవీణ (1435) ఒక్కసంవత్సరమే చదివారు. పిఠాపురం సంస్థానవిద్వత్కవి, శతావధాని ఓలేటి వేంకటరామశాస్త్రిగారి దగ్గర మూడేళ్ళు (1936–39) ఆంధ్రసారస్వతాధ్యయనం సాగించి, కవితారచనలో ఎన్నో మెలకువలు తెలిసికొన్నారు. 1940 లో మదరాసు విశ్వవిద్యాలయ విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులయారు.

తమ పదవయేటనే శాస్త్రిగారు పద్యాలలో మామయ్య ఓలేటి వేంకటరామశాస్త్రుగారికి లేఖ వ్రాయగా ఆయన "...నీ పసితనపుఁ గవిత్వరీతిఁ గరికించితి... నీవలెఁ బెపద్దెములు నేను రచింపగలేదు..." అని, ఆశీర్వదిస్తూ పద్యాలే పారితోషికంగా పంపారు. చిన్నవయసుననే ఆంధ్రాభిమానం ఆయన కవితాహృదయాన్ని కదలించగా "... తుదకు స్మరణీయులైన యాంధ్రులఁ దలంప గాజుకన్నైన నొక యశ్రుకణమురాల్చు"నంటూ ఆంధ్ర పుత్రులను ప్రబోధిస్తూ ఆరు ఖండికలనుకూర్చి ఆంధ్రీకుటీరంవారి తొలిపువ్వుగా 'తోరణము'ను (1938) ప్రకటించారు. ఈ కావ్యసంపుటికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు పీఠిక దయచేశారు.

ఒక సాహిత్య పత్రికను ప్రారంభించి తద్వారా పల్లెసీమలలో విద్యావిజ్ఞానాలను వ్యాపింప జేయాలనే సంకల్పం శాస్త్రిగారికి పందొమ్మిదోఏట కలిగింది. ఆయన స్వస్థాన వేషభాషాభిమాని. అనూనమైన, అనన్యమైన వీరి ఆంధ్రాభిమానం 'ఆంధ్రి' సాహిత్య మాసపత్రిక స్థాపనకు కారణమైంది. ఆ పత్రిక సంవత్సరచందా ఒక రూపాయి మాత్రమే! నాడు సాహిత్యరంగంలో లబ్ధప్రతిష్ఠులైన కవివతంసులూ, పండితప్రకాండుల రచనలేగాక, నాటికి వర్ధమానులై నేడు దేశంలో ఉత్తమకవులుగా, విమర్శకులుగా పరిశోధకులుగా స్థిరపడిన సాహిత్యవేత్తల రచనలతో 'ఆంధ్రి' ఉన్నత ప్రమాణాలను నిలుపుతూ కొద్దికాలమే నడచినా పెద్ద పేరుగడించుకొన్నది (ఆంధ్రి ప్రారంభం 1939 మార్చి, నవంబరు 1941 తో ఆగిపోయింది.)

పత్రికలో ప్రకటించే రచనల దిగువ సంపాదకుని సంగ్రహ విమర్శనలు ప్రచురించే నూతన పద్ధతిని 'ఆంధ్రి' ప్రారంభించింది. ఏ యితర తెలుగు పత్రికలలోను లేని వైలక్షణ్యమిది. 'ఇప్పటి రచయితలలో పెక్కండ్రు ఉచ్ఛృంఖలులగుటవలన అట్టివారి రచనలకు సమాలోచన లుండుట భాషకును దేశమునకును క్షేమకరము; కనుక ఆంధ్రి అవలంబించు విమర్శవిధానము సమంజసము' అంటూ శ్రీ విక్రమదేవవర్మగారు, శ్రీ సి. ఆర్. రెడ్డిగారు 'ఆంధ్రి' కి ఆశీస్సులు పలికారు.

పల్లిపాలెంలో సత్యనారాయణశాస్త్రిగారు మిత్రులతో స్థాపించిన ఆంధ్రీకుటీరం (1938 జనవరి 13) 'ఆంధ్రి' పత్రికతోపాటు, కుటీరపక్షాన చిన్న చిన్న గ్రంథాలనుకూడ ప్రకటించింది. 1948 లో ఆంధ్రీకుటీరం దశమవార్షికోత్సవంజరుపుకొని ప్రముఖుల రచనలతో దశమవార్షిక సంచికనుకూడ వెలువరించింది. 'ఆంధ్రి' మరి వెలువడలేదు. 'నిద్రలో కలవరింతల్ నేఁటినా యూహముల్' అంటూ పత్రిక ఆగిపోయినందుకు ఆవేదనచెందారు, ఆంధ్ర

రచయితల గ్రంథావతారికలో శాస్త్రిగారు, 'ఆంధ్రి'ని పునః ప్రారంభించాలనేది నేటికీ శాస్త్రిగారి తీరనికోరిక.

కాకినాడ పీఠికాపురాధీశ కళాశాలలో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి అధ్యక్షతన అత్యంత వైభవోపేతంగా తొలిసారి జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాలలో సత్యనారాయణశాస్త్రిగారు తమ తొలి కవితాప్రసంగాన్ని చేశారు. నాటికి శాస్త్రిగారి వయస్సు ఇరవైయేళ్ళు (ఆ సభ 31-1-40 న జరిగింది.) అదే సంవత్సరం డిశంబరు 10 వ తేదీన సి.వి. రామన్ మహాశయుని అగ్రాసనాధిపత్యంలో ఆంధ్రవిశ్వకళాపరిషత్ వాల్తేరులో జరిగిన కట్టమంచి రామలింగారెడ్డిగారి షష్టిపూర్తి సమ్మానసభకు ఆహ్వానితులై శాస్త్రిగారు రెడ్డిగారికి పద్యకవితా నీరాజనం అర్పించే అదృష్టాన్ని పొందారు.

శ్రీ పిఠాపురం మహారాజావారి సహాయంతో ప్రచలితమైన శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయంలో (Lexicon office, కాకినాడ) ప్రముఖవిద్వాంసులతో కలిసి నిఘంటు నిర్మాణంలో కృషిచేశారు. (1940-1944) రాజావారి కోరికపై పింగళి సూరన 'కళాపూర్ణోదయ' కావ్యంలోని పాఠభేదాల పరిశీలనకై 'తంజావూరు సరస్వతీ మహల్' గ్రంథాలయాన్నికూడ దర్శించారు. పీఠికాపురప్రభువుకోరికపై సర్వజ్ఞసింగభూపాల విరచితమైన, కువలయావళి నామాంతరంగల 'రత్నపాంచాలిక' అనే రమణీయ సంస్కృత నాటికను శాస్త్రిగారు అనువదించారు. శ్రీ రాజావారి తొలిపలుకుతో ఈ నాటిక మూలానువాద సహితంగా (1943) వెలువడింది.

"నీకొఱకె నే కవిత్వ నేర్చినాఁడ
నీతదర్థమె కృతులు వర్ణించినాఁడ
లోకబాంధవ ! నీ కృపాలోకసిద్ధిఁ
బడయు టబ్బురమే సర్వభాగ్యవృద్ధి॥"

అంటూ, సూర్యదేవునికి ప్రణతు లర్పిస్తూ స్తుతిరూపంగా డెబ్బదిపద్యాలువ్రాసి 'సూర్యసప్తతి'గా (1943)లో ముద్రించారు. పై గ్రంథాలు రెండూ పిఠాపుర ప్రభువు కంకితమైనాయి.

బౌద్ధ, నైయాయిక, సాంఖ్య, వైశేషిక, జైమినీయ, చార్వాకదర్శన సిద్ధాంతాలను సంగ్రహంగా వివరిస్తూ "షడ్దర్శనసంగ్రహము" (1942) అనే పేరుతో ఒక వచనగ్రంథాన్ని వెలువరించారు. 'పతంజలి చరిత్ర' ను వచనంలో ప్రచురించారు. ద్విభాష్యం వేంకటేశ్వర్లుగారు చింతలూరులో నిర్మించిన ధన్వంతరి ఆలయాన్ని చూచి శాస్త్రిగారు 'ధన్వంతరి చరిత్ర' (1945) పద్యగద్య కృతిని రచించి ప్రకటించారు. శ్రీ భూపతిరాజు సూరపరాజుగారనే సహృదయులు శ్రీ రేమెళ్ళ తిరుపతిరావుగారు, దుగ్గుదుర్రులో శ్రీ శాస్త్రిగారిని (16/1-1944) కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి సభాపతిత్వంలో సమ్మానించారు.

1947 లో శాస్త్రిగారు రాజమహేంద్రవర వీరేశలింగ ఆస్తికోన్నత పాఠశాలలో ఆంధ్రపండితు

సిగా ప్రవేశించి, నేటికీ, విశిష్టమైన తమ పాఠ ప్రవచన పద్ధతిలో విద్యార్థులలో చక్కని సాహిత్యాభిరుచిని కలిగిస్తూ పాఠశాల గౌరవప్రతిష్ఠలను ఇనుమడింప జేస్తున్నారు. శాస్త్రిగారి రాజమహేంద్రవర నివాసానికి, ఆ పాఠశాలలో వారి ఆంధ్ర పండిత పదవి మొదటి కారణమైతే, నన్నయ్యగారియందు వారికున్న అపారమైన గౌరవం రెండో కారణం.

మంచన కేయూరబాహుచరిత్రాన్ని వచనంలో "నీతికథాజ్యోతి" పేరుతో (1947) ప్రకటించారు. శాలివాహనుడు, మాధవవర్మ, గొంకరాజు, అన్నమయ్యలను గూర్చి శాస్త్రిగారు రచించిన వచనకృతి 'చరిత్ర ధన్యులు' (1955). శ్రీ మధ్వాచార్యశంకరుల అద్వైతంపట్ల పరమభక్తి తాత్పర్యాలు కలవారై కూడ, మానవుల కారాధనీయమైన జీవదయ, శౌచం, సత్యవ్రతం, కార్యదీక్షాది సుగుణాలకు ఆకరితులై బుద్ధుని జీవితకథ ఇతివృత్తంగా శాస్త్రిగారు బోధివృక్షము (1951) అనే నవల రచించారు. కృష్ణదేవరాయల కొండవీటిముట్టడికి సంబంధించిన కథను గ్రహించి 'కళ్యాణతార' (1956) అనే చిన్న నవలనుకూడ ప్రచురించారు.

ఎన్నడో వేంకటరామకృష్ణ కవులు నడిపిన 'కవిత' పత్రికలోని ఒక ప్రకటన రేకెత్తించిన ఉత్సాహమే సత్యనారాయణశాస్త్రిగారికి 'ఆంధ్ర రచయితల' రచనకు ప్రోత్సాహ కారణమైనదట. ఆధునికాంధ్ర సారస్వతంలో శాస్త్రిగారి సారస్వత వైశిష్ట్యాన్ని చాటి, వారిపాండిత్య ప్రతిభలకు అద్దం పట్టే ప్రసిద్ధకృతులు రెంటిలోను, మొదటిది వారి 'ఆంధ్రరచయితలు' శాస్త్రిగారు తొలుత తాము నడిపిన 'ఆంధ్ర' పత్రికలో అధునిక కవుల జీవ చరిత్రలు వరుసగా కొన్ని ప్రకటించి 1944 లో మొదటి, "ఆంధ్రరచయితలు" (జంటకవులతో కలిపి 44 గురు) గ్రంథరూపాన ప్రకటించారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి "తొలిపలుకు" తో ఆ గ్రంథం వెలువడింది. 1806–1901 నడుమ జననతిథిగల నూరుగురు తెలుగు రచయితల జీవిత కవితాసమీక్షలుగల ఉద్గ్రంథంగా 1950లో 'ఆంధ్రరచయితలు' వెలువడి, 1973లో పునర్ముద్రణ భాగ్యానికి నోచుకొన్నది. విమర్శకులకు, విశేషించి పరిశోధకులకు, సాహిత్య విద్యార్థులకు 'ఆంధ్రరచయితలు' రిఫరెన్సు గ్రంథంగా ఉపయోగపడుతోంది. ఇందులో కవితా పరిమళ భరితమైనశాస్త్రిగారి వచన, రచన వచన రచనకేకాక, తెలుగులో సరస సారస్వత విమర్శక పద్ధతికికూడ మార్గదర్శకమవుతున్నది. ఇందలి శాస్త్రిగారి సలక్షణ గ్రాంథికవచనరచన వ్యావహారికమేమో అనే భ్రమకూడ కలిగిస్తూంటుంది. శాస్త్రిగారికి సహజమైన మితభాషిత వారిరచనకు గొప్ప గాంభీర్యగుణాన్ని ప్రసాదిస్తోంది.

ఆంధ్రదేశంలో శ్రీ మధునాపంతులవారిని ఉత్తమోత్తమ కవులశ్రేణిలో నిలిపిన మహాకావ్యం 'ఆంధ్రపురాణం' పురాణమనే పేరుతో రచింపబడిన, ఆంధ్రేతిహాస వస్తుకమైన కావ్యమిది. "కవికావ్యశంఖములోబడి పవిత్రతీర్థమై ఆంధ్రజనసేవ్యమయిన ఆంధ్రజాతి చరిత్రము". "చరిత్రపరిశోధకుల కృషి ఫలమును శాస్త్రిగారు సార్థకముచేసినారు". అని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు "ఆంధ్ర పురాణ చరిత్రభూమిక" లో పేర్కొన్నారు.



శ్రీ రాజావత్సవాయి వేంకటసూర్యనారాయణ జగపతిరాజబహద్దరు
తుని రాజావారి సత్కారము నందుకొనుచున్న సందర్భము.



పరీధావి ఉగాదినాడు (16-3-72) పూనా ఆంధ్రసంఘమువారి సత్కారము.



1974 లో తాడేపల్లి గూడెం కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి
సమక్షంలో శ్రీ శాస్త్రిగారు ప్రసంగిస్తున్న సందర్భము.



1975 ఏప్రియల్ 18న హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగుమహాసభలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ జలగం వెంగళరావు, విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగార్లచే సన్మానింపబడుతున్న సందర్భము.

మొదటి భాగానికి శ్రీవిశ్వనాథ వారి పీఠిక వ్రాశారు. నవపర్వ పరిమితమైన ఈ చారిత్రిక కావ్యంలో ఉదయ, సాతవాహన, చాళుక్య, కాకతీయ పర్వములు గల తొలిపాలు (1954) తండ్రి గారి కోరికపై శాస్త్రిగారు శ్రీ రేమెళ్ళ వేంకటరావు గారికి అంకితంచేశారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి పర్యవేక్షణలో జరిగిన రాజమహేంద్రవర సభలో ఈ కావ్యం ఆవిష్కృతమైనది. పునఃప్రతిష్ఠాపర్వ, విద్యానగర, శ్రీకృష్ణదేవరాయ, విజయ, నాయక రాజ పర్వములాదిగాగల మలిపాలు (భాగద్వయ ముద్రణము 1964) తొలిపాలుతో కలసి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ద్రవ్య సహాస్ర సహకృతితో ప్రకటితంకావడమేగాక, ఉత్తమ కావ్యంగా 1966లో ఆం. ప్ర. సా. అకాడమి అవార్డుకూడ పొందింది. ఆంధ్రపురాణం తెలుగునేలనేలిన పూర్వరాజన్యుల చరిత్రమేకాదు. నన్నయాది కవితాగుణాఢ్యుల కావ్య జీవితాలకు ఛందస్సుందరమైన రసవత్కవితారూపం కూడ. ఆంధ్రపురాణరచనతో శాస్త్రిగారు పూర్వాంధ్ర కవుల చరిత్రకూడ రచించినవారయారు

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి ముద్రిత-అముద్రిత గ్రంథాలను కొన్నిటిని ఇక్కడ పేర్కొనవలసి ఉన్నది:-

శ్రీహర్షవిరచితమైన 'రత్నావళి'ని (1947). భాస కవికృత 'స్వప్న వాసవదత్త' (1956) నాటకాన్ని అనువదించారు. ఇవి ముద్రితాలు. విజ్జికకవయిత్రి రచించిన సంస్కృత రూపకం 'కౌముదీ మహోత్సవము' 1948 లో తెనిగించారు, వరరుచికృత సంస్కృతభాణం 'ఉభయాభిసారిక'ను 1944లో అనువదించారు. ఈ రూపకాలు రెండూ అముద్రితాలు 'వసుంధర' పేరుతో ఒక విషాదాంత కథా కావ్యం వ్రాశారు. ఇదీ అముద్రితమే. 'వీరేశలింగోదాహరణం'తో సహా శాస్త్రిగారి కావ్యఖండికలన్నీ ఒకే సంపుటంగా రావలసి ఉంది. వివిధ పత్రికలలో ప్రచురితమైన సాహిత్యవ్యాసములు 'పత్రలేఖ' పేర సంపుటంగా వెలువడవలసియున్నది.

అప్పుడప్పుడు రచించిన కావ్యఖండికలు కొన్నిటిని 1968లో 'శ్రీఖండము' అనే పేరుతో ప్రకటించారు. తెలుగులో శతకరచనలు పరశ్శతంగా ఉన్నవికాని 'పంచాశిక' (50 పద్యాలు) లు లేవు. సంస్కృతంలో చౌరపంచాశిక, పవన పంచాశిక వంటి ప్రక్రియయిది. పదహారు ప్రసిద్ధ దర్శన సిద్ధాంతాలను గ్రహించి ఈశ్వర స్తవరూపంలో 'సదాశివ పంచాశిక' రచించారు. సర్వదర్శన స్తవమైన ఈ రచన ఈ 'మధుశోకము'లో ప్రకటితమైంది.

శాస్త్రిగారి రచనలు కొన్ని హిందీలోనికి అనువదించబడినవి. "మోతినథ్" పేరుతో చేబోలు శేషగిరిరావుగారు సత్యనారాయణశాస్త్రిగారి ఆంధ్రపురాణంలోని నాయకరాజ పర్వంలోని 'ముత్యాల ముక్కర'ను కావ్యంగా హిందీలోనికి అనువదించి (1973) పుస్తకంగా ప్రకటించారు

చిలకమర్తి శతజయంతి సందర్భంగా 1974లో తెలుగువ్యాసము (శతజయంతికి) శాస్త్రిగారు చేసిన ప్రసంగాన్ని ఆం. ప్ర. సా. అకాడమి గ్రంథాలుగా ప్రకటించారు. 1974లో 'యువభారతి' వారి కోరి

కపై పానుగంటివారిపై శాస్త్రిగారిచ్చిన ప్రసంగమును యువభారతివారు 'ప్రతిభాలవారి'లో ప్రకటించారు. 'తెలుగులో రామాయణాలు' అనే చిన్న పుస్తకాన్ని 1975 ఏప్రిల్ నెలలో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆం. ప్ర. సా. అకాడమీ వారు వెలువరించారు.

ఇక– 1953 మార్చినుండి, రాజమండ్రినుండి కొద్ది సంవత్సరాలు మాత్రమే వెలువడిన 'సంస్కృతి' అనే సారస్వత మాసపత్రిక సంపాదక మండలిలో శాస్త్రిగారు సభ్యులై ఆ పత్రికను ఉత్తమ రచనలతో ప్రకటించారు.

శాస్త్రిగారికి ఆంధ్రదేశంలోనేకాక ఆంధ్రేతర ప్రాంతాలలోకూడ ఎన్నో సమ్మానములు జరిగినవి. అనేక సారస్వత సంస్థలతో వారికి చక్కని సంబంధములున్నవి. ఇటు కొన్నిమాత్రమే పేర్కొనుట జరుగుచున్నది:–

హైదరాబాదు– విజయవాడ ఆకాశవాణి కేంద్రాలకు అనుబంధి పబడిన విద్యాసంబంధమైన ప్రసారాల సలహాసంఘంలో 1937 నుండి నాలుగు సంవత్సరాలు సభ్యులుగా ఉన్నారు. తూ గో. జిల్లా అలమూరులో 1948లో స్థాపింపబడి, 1968లో బాపట్ల కార్యస్థానంగా రిజిష్టరయి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి అనుబంధింపబడిన 'తరుణ సాహితి సమితి'కి 1965 నుండి నేటికీ శాస్త్రిగారే అధ్యక్షులు. 1959లో రాజమండ్రిలో ప్రారంభించిన 'సాహిత్య గౌతమి'కి ఆ పేరుపెట్టి సాహిత్యసభల నిర్వహణలో చక్కని సలహాలనిచ్చినది శాస్త్రిగారే. తూర్పు గోదావరిజిల్లా రచయితల మహాసభకు ఇప్పుడు వారే అధ్యక్షులు.

కల్యాణదుర్గము, అమరాపురము, అనంతపురము, ప్రొద్దుటూరు మొదలైన రాయలసీమ ప్రాంతాలలో జరిగిన సాహిత్యసభలకు శాస్త్రిగారు ఆహ్వానింపబడి పెక్కు సమ్మానాలు పొందారు. 1970 లో హైదరాబాదులో జరిగిన ఆంధ్రప్రదేశావతరణ వార్షికోత్సవ కవి సమ్మేళనంలో కావ్యగానం చేశారు. 1972లో (ఉగాదినాడు) పూనా ఆంధ్రా అసోసియేషనువారు ఏర్పాటుచేసిన సభలో సమ్మానింపబడ్డారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 18-4-75న హైదరాబాదులో సమ్మాన సత్కారాన్ని పొందారు.

ఇక– ఆంధ్రదేశం నలుమూలలనుండి రాజమహేంద్రవరం విచ్చేసే సాహితీయాత్రికులకు శాస్త్రిగారి నివాసం ఒక తీర్థభూమి. వారిది సంప్రదాయ బద్ధమైన ప్రాచీన మార్గమైనను అత్యాధునికమగు భిన్నభిన్న సాహిత్య ధోరణులను సహృదయదృష్టితో సముచిత సహానుభూతితో అనుశీలించుట శాస్త్రిగారిలోని విలక్షణత్వము. వయసుచే పెద్దలైన స్వర్గీయ భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రభృతి స్థానిక ప్రముఖ సాహితీపరులు శాస్త్రిగారితో దృఢతరమైన స్నేహ, ప్రేమానుబంధాలు కలిగి ఉండేవారు.

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి రచనలలో హృదయగోచరమగు సర్వ సద్గుణములు వారి మూర్తిలో, వాక్కులో, ప్రవర్తనలో దర్శనీయమై

హాయిగొలుపుతవి వారిది సత్త్వమసృణమైన వాక్కు. మితభాషులు, హితవచనులు. ఏ విషయంలోను నోరుజారని ధీరగంభీరులు. వారి మూర్తిలో సాత్త్వికసంపద తొలుకాడుతుంది. వీనినిబట్టి నేటి కవిలోకమున శాస్త్రిగారు అజాతశత్రువు.

ఇట్టి స్తవనీయ గుణసంపత్తి, ఉదాత్త చరిత్రలు గల శాస్త్రిగారిని యావదాంధ్ర సహృదయపక్షమున శ్రీ వారి శిష్యులు, అభిమానులు, సాహితీవేత్తలు, ఉదారులతో రాష్ట్రస్థాయిని సమ్మానసంఘ మేర్పరచి రాజమహేంద్రవరములో సమ్మానించుటకు పూనుకొనుట సమర్థమైన కార్యముగా తలంచుచున్నాము. విజయవంత మొనర్చుటకు సర్వవిధ సహాయ సహకారము లందించిన వారికందరకు సాధువాదములర్పించుచున్నాము.

సమ్మానసంఘ పక్షమున
చామర్తి కనకయ్య

—o—

అసమానంబగు పాండితీవిభవ మీవార్జించి మాకెల్ల సం
తసముంగూర్చుచు సత్కవీశ్వరత నౌన్నత్యంబునుం గీర్తియున్
వసుధం బెంపువహింప వర్ధిల్లఁగదే వత్సా! చిరంజీవివై
పసివానిన్ నినుఁజూచి పెక్కుపలుకన్ భావ్యంబె మాబోంట్లకున్

11-9-1933
అడయారు, మద్రాసు
(లేఖనుండి)

మీ మామయ్య
శతావధాని **ఓలేటి వేంకటరామశాస్త్రి**
"పిఠాపుర సంస్థానకవి"

చెలువుని తలమీఁద సేసఁబ్రాల్వోసెడి యిందిరం జేవ దోయిళ్ళ సిగ్గ
విభుని కేలుందమ్మివిరి తాఁకునప్పటి రమ తనూలత గగుర్పాటు మొలక
మగని కటాక్షంపు జిగి పిల్చినప్పటి లక్ష్మి లోలోని లీలాస్మితమ్ము
రమణుండు బింబాధరము నానునప్పటి శ్రీదేవి ముగ్ధనిషేధసుషమ–

సరసమూర్తి సింహాచలచక్రవర్తి యంతపాళిఁ గరంగు పద్మాక్షి తలఁపు
క్రోధలోభాదిక ప్రజాక్షోభ మణఁచి తెలుఁగుదేశమ్ము నాశీర్వదించుపోల్పు.

నీ వివాహమైనన నెలయన్న తలఁపువ రాముండు తాను చైత్రమునఁ బుట్టె
నీవు లక్ష్మిని గొన్న నెలయన్న నెనరున తోడరి యీనెల వసంతుఁడు చిగిర్చె
కడలికన్నెకు నీవు కన్నుగీటినయట్టి ఋతువని యారామవితతి పూచె
నీవొక గృహమేధి భావమందినమాస మని యిక్షుచాపమ్ము గుణము నేర్చె

నిన్నుఁ బట్టి కాలనియతి సర్వమ్మును సౌమ్యభావ సాత్త్వరమ్యమయ్యె
సింహశైలరాజ్య సింహాసనాసీన చారుమూర్తి! దేవచక్రవర్తి!

మణిమయ స్తంభ సంభ్రమ సంభవంబైన నీ భయానక తనూశోభ కాక
కంఠహుంకృతి రవోగ్రం పశ్యరూపమా నీయాస్య భీకరచ్ఛాయ కాక
ఉరుపమశ్రోత్రిధాన్నిభర శిఖాకంబైన నీనయనాబ్జ శోణిమము కాక
అసుర వక్షఃపాటనాతి పాటవమైన నీవాడి కొనగోళ్ళ చేసగాక

నాకుఁ బ్రహ్లాద మయ జగన్మంగళార్ద్ర భాగధేయ సుధామృదుస్వాదువైన
నీదు చిఱునవ్వు చిన్నివెన్నెలలు నలయు శ్రీవరాహలక్ష్మీనరసింహ దేవర!

ఉచ్ఛ్రిత సింహశిలోచ్చయ నలయంబు డంబైన పావనట్టంబు గాఁగ
గిరి శిరోధస్సర త్సరిదఖండోదార సలిలమ్ము లభిషేక జలముగాఁగ
నిరత భక్త ప్రజోచ్చరిత స్తవమ్ములు తత మహాన్యాస మంత్రములు గాఁగ
సరస బంధుర సాంద్రచందన మృదుచర్చ దనళ్విభూతి పూఁతగ నెలర్ప

నల నృసింహుని నిన్ను దయాస్ఫుటమ్ము స్ఫటిక శివలింగమటులు భావనము సేయు
భక్తులకు ముక్తి నిడెదు నిష్పక్షపాత దైవత శిరశ్చిరత్న రత్నమ! జోహారు.

—o—

శ్రీ

సదాశివ పంచాశిక

[సర్వదర్శన స్తవము]

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి,

ఏ శబ్దంబున కెద్ది యర్థమగునో యే యర్థ మే వాఙ్మహా
రాశిన్ వీచిన తావియో తెలియఁగారాకున్న యల్పాల్ప మే
ధాశాలింగడ; సర్వనామ మవు నీ తత్త్వాంబురాశిన్‌బయో
లేశంబైనవకాశ మిచ్చితివి కేళీలాలితో మాకళా !

*   *   *   *

అవతారంబులు తావకీనములు సంఖ్యం దేరనేకాని మ
ద్భక్తముల్ లెక్కకురావు; నీదగు జటా బంధంబునం
దెన్ని యు
న్నవియో కేశములన్ని పుట్టువులలోనై చిక్కియున్నాడఁదే
ల్లువఁడే! యెన్నటికేని నాకతటినీ తోయార్ద్ర శీర్షోదయా!

*   *   *   *

వంచిన నా శిరమ్మిది భవచ్చరణాబ్జ గళన్మధూళికన్
ముంచుమనీ వనన్న తలఁపుంబడి నాతల నాఁడునాఁడుసం
ఢించుకొనంగ నిల్లలమటించు హిమాచల కన్యకా మనో
భృంగిత నీరజ భ్రమరమా ! భ్రమదూర యథార్థ విభ్రమా!

*   *   *   *

సాధీయంబు లుదాత్త భావరస కాసారంబు లయ్యున్ భవ
ద్గాథా సౌరధునీ వినా కృత కృతుల్ గాధంబు మర్త్యాంబులై
యూధాత్రిం జిరకాలము న్నిలువ వం చేనాఁటికే నొక్కయు
ద్బోధం బిచ్చిన నంతె చాలు ననుకొందున్ శైలజాత్మప్రభూ!

*   *   *   *

దీపంబున్ సకలశ్రుతి స్మృతి వచోధిష్ఠానమున్ విశ్వవి
శ్వ వ్యామోహనమౌ మహామహము సంభావించుచున్ స్వ
స్వబు
ద్ధి పీఠిన్ బహురీతులన్ నొడివి రర్థిన్ శర్వ! యవ్వారి స
ర్వ ప్రస్థాన సముచ్చయంబునకుఁ దాత్పర్యంబు నీయం
దగున్.

లేఁడని కొందఱున్‌గలఁడు లేఁడని కొందఱుఁ గొందఱెంచియు
న్నాఁడని పల్కునట్టి కథనంబులలో రుచిభేద ఫక్కిఁ జూ
డాడుచు నొక్క దివ్యరసమై పసినవ్వులు వెల్వరించుచు
న్నాఁడవ యో త్రిశూలకలనా వగణీయకరా! జటాధరా!

*   *   *   *

ఆరంభంబునఁ దియ్యనౌచుఁ బరిణామాభీలమౌ నొక్క ప్ర
స్తారం బెంచిన చారువాకులు గిరీశా ! కాలకంఠా ! నినున్
దూరస్థం బొనరించు కొందు; రల చేతోవృత్తులన్
ద్వన్మహః
పారావారమునన్ ఘటిల్లు కుటిలావర్తంబు లౌనో శివా !

*   *   *   *

తనువున్ మించిన యాత్మ లేదనుచుఁ బ్రత్యక్షంబె మానం
బటం
చనుమానాదిక మప్రమాణమని కాంతాలింగ నోపాత్తమౌ
తనుపే మాకుఁ బుమర్థమంచు మృతియే తత్త్వం బటంచుం
దలం
చిన లోకాయతికోక్తులన్ మెసవితే ! శ్రీకంఠ ! కంఠోద్భటా!

*   *   *   *

ఆరయంజాలని కొంచెపుందెలివి తీపై పాపపుణ్యంబులున్
నిరయస్వర్గము లెవ్వి లేవని భవానీజాని ! యీలోకమున్
బరిపాలించెడు ఱేఁడు వేల్పనెడి చార్వాకుల్ నిరాధారులం
బరమున్ గుప్పిటఁ బట్టఁ జూచిన శిశుప్రాయుల్ గదే
నీ యెడన్ !

*   *   *   *

కనుఁగన్ విప్పనిదౌచు బుద్ధినిరపేక్షాస్వైర సంచార పా
రణమై యస్మరణీయమైన యలబ్రాహ్మస్పత్య మార్గంబు గ
ర్హణముం జేసెడి శిష్టహుంకృతులలో నంకూరమై నవ్వఁబో
యని మృత్యుంజయ ! విందు నీయజగవజ్యాటం కృతి
స్వానముల్.

అణువున్ మించి యణీయమై యలరు భర్గా! యీ జగన్మూలకా
రణముల్ తత్పరమాణురాశి గాని యారంభించి
యంతర్బహిః
క్షణికం బంచు స్వలక్షణం బనుచు దుఃఖం బంచు శూన్యం
బటం
చును జింతించిన సౌగతంబు తలవంచుంగదే!
నీ యునికిన్

* * * *

వేద విరుద్ధమార్గ పదవింబడి తోఁచిన బుద్ధి వెంబడిన్
బోఁ దలపోయు సౌగతము పొందద యాంతరశిక్ష; యాది భి
క్షూ! దయనీయ మమ్మతము కోరక కోరిన దయ్యె; నీకటా
క్షోదయ లబ్ధి; కాన యెడ నోర్మిభజించునె! భిక్షుకత్వముల్.

* * * *

అల సర్వజ్ఞునిఁ గొల్చు మాధ్యమిక యోగాచార సౌత్రాంతికా
ఖ్యులు వైభాషికు లన్న తత్సుగత శిష్యుల్ నల్వురు
న్నాల్గు త్రో
వలుగాఁబోయిన పోలన్ గనెడి సర్వవ్యాపకా! నిన్ను బౌ
ద్ధుల మోక్షాఖ్య నిరోధతత్త్వము నిరుద్ధుం జేయఁగాఁ జాలునే!

* * * *

జిన దేవున్ గురుమూర్తిగాఁ దలఁచుచున్ జీవాఖ్య తత్త్వంబు
వెం
ట నజీవాఖ్యము తత్త్వము న్నొడువుచున్ స్యాద్వాదమున్
జేసి నీ
యునికిన్ సంశయమందు వార్హతులలో నోహో మహాదేవ! నీ
యనుసంప్రాప్తి దిగంబరత్వమున దండై తోఁపఁగా జేసితే!

* * * *

కని జీవుండు జడంబు నీశ్వరుఁ డనంగా మూఁడు తత్త్వంబు
లెం
చిన రామానుజదర్శనంబు భజియింపన్ జిజ్జడాంతర్నియం
తను నిన్నున్ సవిశేషుఁగా సగుణుఁగా స్థాపించి నీచెంత వే
ల్పని యుండెం గద! విష్ణురూప శివ! కైకోరమ్మ
కైంకర్యమున్.

బహుకళ్యాణగుణా! సమస్త భువనోపాదాన! కర్తృత్వధూ
ర్వహ! పాపాపహ! వాసుదేవ పరమబ్రహ్మాభిధా
పంచధా
స్స్పృహణీయా! నిరపాయ భక్తజన లక్షీభూత సర్వాత్మ! ప్ర
త్యహ మర్చింతును బాంచరాత్ర విహితార్చా ధార!
సర్వేశ్వరా!

* * * *

అణు నిత్యత్వము లోననెంచి పరిణామాలంబమాత్రోపఁ బో
యని 'సత్ఖ్యాతి' గణించి మించు విశిష్టాద్వైత వాదంబు చె
ప్పిన భేదాకృతి నాకుఁ జూపినను దప్పే! మంగళాకారమో
హన! గౌరీధన! చాలు భక్తిపరిచర్యా రక్తిఁ జూటాడెదన్.

* * * *

పరితాత్ముండ నినున్ భజింతు నెద జీవన్మోక్ష మాశింప నో
యతిరాడ్దర్శిత దివ్యరూప గుణధామా! త్వత్సపర్యా సము
చ్చిత విజ్ఞానము వెంబడిన్ స్వపద సంసిద్ధిం బ్రసాదింపఁ గో
రితిఁ బోనీ, యిటు లేని నాయలఁతి కోర్కిం దీర్పవే
ధూర్జటీ!

* * * *

సతమున్ తత్త్వమసీతి వాక్యసరణిన్ పక్షీసమాసార్థ గ
ణ్యత కల్పించిన ద్వైతవాదులగు పూర్ణప్రజ్ఞ శీనాకు ను
న్నతుఁడౌ నీకును నంతరంబు విధియున్ సన్ దోషమే! రాజరం
జిత మూర్ధా! భవదంఘ్రి సేవనము కాంక్షింతుం
గటాక్షింపవే!

* * * *

సనే యేలిక నంచుఁ జెప్పుకొను వాసం బట్టి పాలార్చుఁ గో
పానన్ భూపతి; స్వీయమౌగుణ మనల్ప ప్రీతిఁ
గొండాడు న
వ్వానిన్ జేర్చి యభీష్ట మిచ్చు; విభుభావం బిట్టి దౌటన్
మహే
శానా! మధ్వమతానురోధ కృత దాస్య శ్రద్ధ నర్థించెదన్.

హర్షాయాయక మేమియిచ్చినను మోక్షావస్థలోఁ ద్వద్గుణో
త్కర్షజ్ఞానము నాయెడ న్నిలిచినంగానీ విచారింప; నా
కర్థింపంగలనే! యతప్తతప వుఁగా నెన్నఁడే గ్లౌకళా
శీర్షా! వాయు తృతీయసూను వినుత శ్రీనాథ సేవాదరా!

* * * *

నెరపి కలంగు నీయెడఁద చిక్కఁగ నోపి జపాది యోగముస్
వదలక సేయఁగాఁ ద్రిషవణ వ్రతరూప విధిన్ జరింపఁగా
గుదురక యున్న మత్పశుతనన్ భవపాశ విమోచనం బట
న్నది యెటు లిత్తువో తెలియ నంచితపాశుపతాధ్వ గోచరా!

* * * *

నిరపేక్షుఁడవు నీవు కారణముగా నిండారు నాచేయు నీ
శ్వర సంభావన రూపకార్యము కృతార్థంబౌత! పంచార్థ భా
స్వరపూర్వాపరశాస్త్రతంబు చూపిన యథావత్తత్త్వ మాసించి ఈ
శ్వర! దుఃఖాంతలతా ప్రసూనఫలితైశ్వర్యంబ పేక్షింతిన్

* * * *

ఆకారంబది నాకుఁ జూపఁగదె! యీశా! కానిచో ధ్యాన పూ
జా కార్యం బిది యెట్లు సంభవ మగున్! శాక్తంబున
ప్రాకృతం
బౌ కొండొక్క శరీర ముండె నదియున్ నైతాదృశం
బోమృడా
నీకాంతామణి! శైవదర్శన వచోనేదిష్ఠ తేజోఘృణీ!

* * * *

ఒక పర్యాయము పట్టనీయఁగదె సద్యోజాత పాదాబ్జ! స్వో
త్సుకతా నిర్మిత కృత్స్నకారణతనూ! జోడించెదు నీశాన మ
స్తక! నమ్ముండఁడు నీకుఁ దత్పురుష వక్త్రా! మంత్రసాకార! య
త్యకలంకంబగు నీయఘోరహృదయంబర్థింతు నందీఁగదే!

* * * *

ఏ నీశానుఁడ వేఱుగా ననెడి తాదృగ్దివ్య సాక్షాత్కృతి
శ్రీ నిత్యోత్సవ మబ్బఁగావుత! పురారీ! యచ్చపుండెల్ల నీ
లో నేనొండొక యంశగా నెపుడు నిల్తుంగాక! మాయా దురు
చ్ఛానం బౌ బ్రదుకున్ శివాత్మక మొనర్చంగాక నీభావనల్

నక్షత్రేశ కళా కలాపిత జటాంతర్దేశ! యీశా! కృపా
భిక్షాభ్యర్థికి నాకు ముచ్చట యిడన్ విచ్చేసినంగాని నీ
సాక్షాన్మూర్తిని గుర్తుపట్టక జగత్సామాన్య భావంబునన్
వీక్షింపంగలవాఁడ నేమొ! దయనీవే ప్రత్యభిజ్ఞానమున్.

* * * *

ప్రాణాయామ శరీరశోషణ జపప్రారంభ భంగీ దరి
ద్రాణంబైన యెడందతో నిలిచితిన్ దాదాత్మ్యసంపత్తి కు
గ్రాణంబైనది ప్రత్యభిజ్ఞ యదియుం గల్పించి దాక్షాయణీ
ప్రాణ ప్రాణమ! వెమ్మి నభ్యుదయ లాభం బిమ్ము
మోక్షాఖ్యమున్.

* * * *

అరుదారన్ సుహితా శారదాది పద వాచ్యంబైన నీదౌరసే
శ్వర రూపంబు సపర్య చేసికొని జీవన్మోక్ష కాంక్షారతిన్
హర గౌరీ స్వజనోద్ధత ప్రకట దేహశ్రీ విరాజిల్లునా
సరణిం గానని నాకు నీవిడెదవో! సంసారవుం బారమున్.

* * * *

అసదృక్పావన శారద గసన సమ్యగ్దేహ దార్ఢ్యోదయుల్
రస సిద్ధుల్ దరణిం గరామలక వత్ప్రత్యక్ష మోక్షం బనా
గసులై పొందుదు రట్టె! మూలమగు నజ్ఞానంబు నాబోఁటి నీ
రసుఁడే పాపఁ దొలంగఁ జేకొను శర్వాణీ మనోమోహనా!

* * * *

చేత శ్రద్ధ స్వతఃప్రమాణము శ్రుతిశ్రీవాణి నల్మిన్ గృత
జ్యోతిష్టోము లు స్వర్గకాములగు శిష్టుల్ నిన్ను సర్వజ్ఞతా
స్వీతున్ జేరక యూరకుందురె; భవానీ నేత్ర దీపా! శ్రుతి
ఖ్యాతానుష్ఠిత యాగధర్మ ఫలరూపా! పుణ్యతృష్ణా ప్రపా!

* * * *

జయ గౌరీశ! యపౌరుషేయమగు నా శబ్దంబు సర్వజ్ఞతో
చ్చయమై నీయెడ జైమినీయ మనపేక్షం బయ్యు వేదోదిత
క్రియలం జెందు నపూర్వమందు ననుషక్తిన్ ద్వత్ప్ర
సాదంబె యా
రయవచ్చున్ శతరుద్రియ శ్రుతి వచః ప్రాగ్భావగీతా కృతీ!

పాయని దుఃఖరేఖఁ దోఁపంగల యన్నపుఁడెల్ల కల్మి ని
శ్రేయస లాభమున్ వెలవరించిన తచ్ఛ్రవణానఁబు నై
యాయిక సింహపీఠిక మహావిభవం గొంచ నుండి మద్భవా
పాయ మడంపఁ జూచు నభవా! గిరిజాధవ! నిన్ వరించితిన్.

*　　*　　*　　*

నీదయతోడి యాజ్ఞ సరణింగదె మున్న గణాదమౌని సం
పాదన సేయఁ గల్గెఁ బ్రమంబగు దర్శన మొండు దుఃఖ వి
చ్ఛేదక సప్తతత్త్వ పరిశీలన నిర్ణిత మోక్ష మోయప
ర్ణాదయితా! భవత్కృప వినా కణభోజి వచింపఁ గల్గెనే?

*　　*　　*　　*

త్రిపురధ్వంసన చండనిర్దయ! కపర్దీ! యాది విద్వాంసుఁడౌ
కపిలుం డింపెరఁగన్ ప్రధానపురుషాఖ్యంబైన
తత్త్వద్వయం
బుపదేశించుట నీకు నాకుఁ గలదేమో భేద మేతన్మతా
లపనస్థాపన యావ! శంకర! నిరాలంబుండ నన్ జేమకో,

*　　*　　*　　*

సారోదారగమా తత్పతంజలి మతాచారమ్మనన్ సాఁగి రోగా
గరూఢిన్ గవఁగొన్నఁ దోఁచెదవు లోకానుగ్రహాకాంక్ష సం
సారాంగారక తప్యమాన జనరక్షా శీతలాపాంగ వీ
క్షా! రాజన్నిజవాహనీకృత మహోక్షా! యాదిగర్భేశ్వరా!

*　　*　　*　　*

ప్రకటిత యోగవీథి భగవత్ఫణిరాట్కృతిఁ గ్లేశకర్మ లే
పకుఁడవు గాక పూతపత వైదిక లౌకిక సంప్రదాయ చా
లకుఁడవ యయ్యుఁ బుష్కరపలాశము పోల్కి వహించి
బుక్షనా
యక శిఖామణీ! యిర్వదియు నాలవ తత్త్వముగాఁగ నిల్చితే

*　　*　　*　　*

అయినా ప్యాయన సిద్ధి వాయి! పరిణామారంభ వాదద్వయీ
లయ కృద్బ్రహ్మవివర్తవాద గురులీలా మూర్తి మచ్ఛంకరా
ద్వయతాపత్తివి నీకు జీవునకు భేదం బేమి దేవా! యన
ద్వయనారబ్ధ మనాది బ్రహ్మ కీర్తిన్ నీవ పోఁద్రోలినన్.

పాల వ్యాయత పట్టికా తిలకిత స్వాహానహాయా! జగ
ల్లీలా మాంగళికోప సంహరణ కేళీగేయ! కాశీప్రియా!
చాలన్ శంకర దర్శనాన్య నిరపేక్షంబైన మద్భావమున్
నీలోఁ బర్యవసన్న మౌనటులు నాందీవాద మాసించితిన్.

X　　X　　X　　X

అంధకవైరి! యీయెడఁద నంటి కలంచు వికారముల్ కృపా
మంథర దృష్టిమై నపశమం బొనరింపుము చాలనింక జ
న్మాంధువునందుఁ ద్రోయకుమయా! వినిబద్ధ జటాప్రబంధసౌ
గంధిక బంధుఖండ! కలికాలజ దోష తమో విఖండనా!

X　　X　　X　　X

ఉడుగని భీతి పట్టుకొని యున్నది పుట్టిననాఁటఁగోలె నె
న్నఁడు నది యెంతగాఁ దొలచినన్ గడమట్టదొ! రజ్జు
వందు నా
యెడఁద భుజంగమభ్రమ వహించి ప్రతిక్షణ గండ
మౌచుఁ ద్రొ
క్కుడు పడుచుండఁగా నభయ గుప్తియొసంగవె! శేష
భూషణా!

X　　X　　X　　X

ప్రచురంబున్ సచరాచరంబు నగు విశ్వంబెల్ల నీయందని
ర్వచనీయంబగు ఖ్యాతిమై మెఱయు నార్యాజాని! భేదత్రయా
పచితి వ్యాపృతమైన నీయునికికిన్ ప్రాల్మాలి మాయాబలి
ష్ఠున పాచిత్యము తోడ వేర్పడెద నేమో! నాఁడు కాపాడవే!

X　　X　　X　　X

సవిశేషోన్నతి శాస్త్రయోనివి జగజ్జన్మ స్థితి ధ్వంస హే
తువుగా నిన్నుఁ దటస్థ లక్షణముచేఁ దెల్పున్ జ్ఞానమానంద మీ
వపుటం జేసి స్వరూపలక్షణము నీయందుండెఁ గండీ! భవో
ద్భవ! నాకేలవ మోచ్చి నిన్నెడఁద సంభావింతు మోక్షార్థినై.

X　　X　　X　　X

నావిశ్వాసము నీదెవ న్నిలిపి చింతల్ ద్రోసికొందున్ మహా!
దేవా! ఖేగములం బురాణ గృహమేధిన్ నిన్ను భావింతు మో
దావిర్భావము నందునున్ మదికి విందై నిల్వ నిచ్చేయవా
జీవంజీవ సుహృత్కళాధర! జగత్క్షేమంకరా! శంకరా!

తృత పుణ్యుండు సగర్వ్య విద్యుఁడు భవన్నృత్యాంపాన ప్రవ
ర్తిత ఢక్కా విపుల చతుర్దశ రసశ్రీ శ్రోత్రభవ్యుండు వ్యా
కృతి పీఠాన భవానితోడ నిను నిక్షేపించి యర్చించి శా
శ్వతుఁ డయ్యెన్ మఱి నిన్నుఁ జేరుటకుఁ బ్రస్థానం బదే
చాలదే !

*　*　*　*

ప్రణవస్పంద సమస్త మంగళ పదార్థ వ్యస్త! శబ్దానుశా
సన శాస్త్రం బపవర్గ సాధనముగా సాక్షాద్భవత్సత్త్ర భా
వనకుం దెచ్చు నటం దెఱింగి యును శబ్దబ్రహ్మ నిష్ణాత ల
క్షణ దూరస్థుఁడ నేను నీవగు కటాక్షం బెట్లు సాధించెదన్.

*　*　*　*

నినుఁ జేరంగఁ బరంపరాగతము లెన్నేదారు లా యస్తిటన్
నిగటన్ వందల వేలుపుట్టువులు కల్పించుంగదే! నీకు నాకు
ననాదఃగతము బాంధవం బది చెలంగున్; గానినో, బాదరా
యణ సంబంధ మటంచువో! యదియు నాయాంతర్య
మార్యాప్రియా !

శ్రీరుచిరంబు నీదెస రచింప్రతి మానసమున్ శిరస్తటీ
ధారిత చంద్రమః పృథుక వర్ధిత జాటవని కుటీనకా !
చారు మ త్సరి ద్వికచ చంక్రమణ ప్రవహద్భుహూదకా
ఆరయ హంసవున్ బగమ హంసవు నీవకదా సదాశివా !

*　*　*　*

ఇల రుచి భేదభిన్నులు బహిర్విషయ ప్రవణుల్ పుమర్థపుం
దాపులు మెల్ల మెల్ల నెడఁడన్ బదిలించుచు లోవెలుంగుతోఁ
జెలిమిం డన్మహర్షులు వచించిన నాఁటిలపుప్రకార వా
క్కులు విలఁబెట్టు నొందు వెలుఁగున్ నెలతాలుపు నిన్
దలంచితిన్.

*　*　*　*

ఆల లోకాయత బౌద్ధ జైన సవిశేషాద్వైతముల్ ద్వైతను
వ్వల నాయా నకులీశ పాశుపత శైవ ప్రత్యభిజ్ఞా రసో
త్కుల కాణాదము నక్షపాద గదితో క్తుల్ జైమినీయంబు లా !
విల పాతంజల పాణినీయములు కావే! శాంకరాభిన్న ముల్,
*　*　*　*
భవ! యేసంపద దూర! సూత్రకృతియై ప్రస్థాన భేదస్తవ
వ్యవహారాభిధమై సమన్వితమిత వ్యాహారమై యాజనం
బవ సంతారక సర్వదర్శన వచ స్సంవాదమై శ్రీ సదా
శివ పంచాశిక తత్త్వభావయుతకుంజేకూర్చు నైశ్వర్యమున్.

శ్రీ శాస్త్రిగారి రచన 'సదాశివ పంచాశిక' యందు ప్రక
టింప బడినది. ఈ యేబది పద్యములలో పదునాఱు ప్రధాన
దర్శనములు, తత్సిద్ధాంతములు సూచితము లైనవి. సర్వ
దర్శనములకుఁ దాత్పర్యము శివుని యందే యను సమ
న్వయము మనోహరముగా నిందు చేయబడినది. చార్వా
కము, బౌద్ధము, జైనము, రామానుజ దర్శనము, పూర్ణ
ప్రజ్ఞ దర్శనము, నకులీశపాశుపతము, శైవము, ప్రత్యభిజ్ఞా
దర్శనము, రసేశ్వర దర్శనము, వైశేషికము, నైయాయి
కము, జైమినీయము, సాంఖ్యము, పాతంజలము. పాణి
నీయము, శాంకరము – ఈ దర్శనముల తత్త్వములకు
సదాశివ పంచాశిక చిన్ని కవితా దర్పణము.

సంపాదకుఁడు.

అన్నగారి ఆంధ్రీసమర్పనము

శ్రీ చెఱకుపల్లి జమదగ్ని శర్మ

మధునాపంతుల వారి సన్మానాంకము మధుకోశమును వారాంధ్రిని సమర్చించిన మధువుతో నింపవలెనని మధురేక్షు పల్ల్యుపనామునకు నాకు నాదరాహ్వానము !

ఈ సన్నివేశమే మధురము !
సర్వము మధుమయముగా నున్నది.

అవును మఱి. అయాచితముగా యోగ్యునకుపదేశింపవలయునను ప్రశస్తి గల త్రినుపర్ణమున బ్రహ్మవిదుల ప్రార్థనమే అదిగదా !

మధు వాతా ఋతా యతే
మధు క్షరంతి సింధవః
మాధ్వీర్న స్సంత్వోషధీః
మధు నక్త ముతోషసి
మధు మత్పార్థివగ్ం రజః
మధు ద్యౌరస్తు నః పితా
మధు మాన్నో వన స్పతిః
మధు మాగ్ం అస్తు సూర్యః
మాధ్వీ ర్గావో భవంతు నః —
ఆంధ్రీ పద శ్రవణమే మధురము !
ఆంధ్రీ పత్రికాస్మృతి మఱింత మధురము !
అది ఇప్పటి మాటయా ?
ఎన్నాళ్ళైన దా పత్రిక స్మృతికి వచ్చి ?

స్మృతికి వచ్చినంతనే మధురస్మృతుల చెలరేవు చున్నది.

అది ప్రమాధి విక్రమ వృషవత్సరములనాటిమాట!

1939 నుండి 1941 వఱకన్నమాట !

ఒకటా రెండా ? ముప్పది యైదు సంవత్సరముల క్రిందటి మాట!

ఈ ఆనందలో ఆనంద మేమున్నది ? ఉన్న కొంచెము గత స్మృత్యాగతమే కాని నవంనవము కాదు.

అప్పుడు నేను రాజమహేంద్రవరములో ప్రభుత్వ కళాశాలలో పట్టపరీక్షకు చదువుచుంటిని. నివాసము వ. సు. రాయకవి యింటి పట్టున. ఇరుగు పొరుగులు అర్క సోమయాజి, నటనాచార్య మున్నగు వారు. కళాశాలలో బ్రహ్మశ్రీ ప్రయాగ వేంకటరామ శాస్త్రి, సాగి నరసింహము ప్రభృతి గురుశ్చరణులు. వీథిలో నడుగుపెట్టినచాలు శ్రీపాద భమిడిపాటి నాళం, నండూరి, కవికొండల, వద్దాది, పిలకా, జనమంచి, సహదేవ, కందుకూరి, మున్నగు కవుల పండితుల విమర్శకుల కథారచయితల గేయకారుల రసిక వరేణ్యుల నిత్య పసన్న పరిచయానందము ! అప్పుడప్పు డద్యత నాంధ్రకవి

ప్రపంచ నిర్మాతలు చెళ్ళపిళ్ళవారు ఏ సివిలుకోర్టు వాయిదాకో వచ్చి తమ గురువులు శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి ఇంట మడిబట్టలు ఆరవేయించి తమ పని చూచుకొనుచుండుట, వారి దర్శన శ్రవణ సౌభాగ్యము! మదరాసులో 'ఇంటర్మీడియేటు' లెక్కలతో నెట్లో ముక్కి బయటపడినా తెలుగు ముఖ్యాంశముగా పట్టపరీక్షకు చదువవలెనని మా పెద్దల యనుమతి. పట్టుపట్టి సాధించి ఆంధ్రిలో ఆదికావ్యమునకు శ్రీకారము చుట్టిన నన్నయ నారాయణుడు నడయాడిన చోటునకు చేరుకొనిన నాకు అప్పుడచ్చటి పరిసర పరిస్థితులు ఎంత ప్రాణము పోసినవో, ఎంత ఉత్తేజితు నొనర్చినవో వర్ణించుట కొక పెదవ్యాసమే వ్రాయవచ్చును. నేను, నా ప్రాణాధిక మిత్రుడు శ్రీతుమ్మలపల్లి రామలింగేశ్వరరావు కృష్ణార్జునులవలె ఎప్పుడెడబాయక సంచరించుచు మధుర మధురోహాలలో తేలియాడిన దినములవి! ఉన్న దింటి దొకచోట నేను మరొకచోట నయినను నిత్యము రెండు మూడు మారులయిన కలియవలసినదే! మా కలియు చోట్లు పుణ్యగోదావరీ తీరము, గౌతమీ గ్రంథాలయము, నాళంవారి యింటి యెదుట, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి గంధర్వ ఫార్మసీ ఎచ్చట కలిసినను అతడు వ్రాసినవి నాకు, నేను వ్రాసినవతనికి వినిపించుట; పత్రికలలో నెప్పటికప్పుడు ప్రకటితమైన రచనల గూర్చి స్వేచ్ఛగా చర్చించుకొనుట; ఎంత పెద్దలతో నైనను మా భావములు మేము నిర్భయముగా చెప్పుచుండుట! అట్లు చెప్పగల చనవు వారిచ్చుచుండుట! ఎంత మంచి కాలమది! అది మరల రానేరదు! గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్ - ఎవరెంత పెదవి విరిచినను మహాకవి మాట సత్యము!

అప్పుడే నాకాంధ్రిలో పరిచయము,
నా వయసప్పుడ కొన వింశతియే!

అంతియే వయసున్న అన్నగారి సంపాదకత్వములో వెలువడుచున్న 'ఆంధ్రిని' కన్నుల కద్దుకొని హృదయమున భద్రపరచుకొనెడి వాడను.

శ్రీ సత్యనారాయణ శాస్త్రి గారు వయసున నాకంటె కొంచెమే పెద్దయయినను పాండిత్యమున, విజ్ఞానమున, ఆంధ్రాభిమానమున, వృద్ధోపసేవయందు బహుశతాధికులు. పత్రికను చూచి వారంత చిన్నవారని నేనప్పు డూహింపలేదు. తరువాత తెలిసినను నా కెప్పు డట్లనిపించ లేదు. వారెవరో ఆంధ్రాభ్యుదయమున కవతరించిన మహానుభావులు. ఆంధ్రీ మహత్త్వ మెఱిగిన మహామనీషులు నాడు నాకేర్పడిన ఈయభిప్రాయం ఎన్నటికి చెక్కు చెదరదు, దానికి తగినట్లే వారి నుండి ఆంధ్ర పురాణ జాతీయ మహాకావ్య మావిష్కృత మగుచున్న దినములలో నేనక్కడ ఔద్యోగికముగ నుండుటతో మేము సన్నిహితులమై పరస్పర మేకోదర భావమునే దృఢపరచుకొంటిమి. ఒకమారు పల్లిపాలెమున కేగి ఆంధ్రి ఆవిర్భవించిన పుణ్యాశ్రమము, సేవించి సుశ్రావ్య పవిత్ర వేద

గానము విని ఆదర వాత్సల్యములతోడి ఆతిథ్య మందికొను మహాభాగ్యము నబ్బినది.

ఆంధ్రి నిజముగా నప్పుడు మహాంధ్రమున కొనర్చిన సేవ అమూల్య మయినది!

పత్రిక నడపుట, అందులో నట్టిపత్రిక నడపుట సామాన్యమైన విషయమా?

సంపాదకు లుండునది పల్లిపాలెములో. ముద్రణ మగునది పిఠాపురము నందలి ఓలేటి వెంకటరామ శాస్త్రిగారివిద్వజ్జనమనోరంజనీ ముద్రాక్షరశాలలో. వ్యావహారిక భాషావాద ఝంఝా మారుతము ప్రచండముగా వీచుచు చెళ్లపిళ్లవారి వంటి కింక వీంద్ర ఘటా పంచాననులను ప్రభావితుల నొనర్చుటయే కాక విశ్వవిద్యాలయములను గూడ పెకలించి వేయునేమో యనిపించుచున్న తుపాను సమయములో నేటి కెదురీతగా గ్రాంథికాంధ్రీ ప్రతిష్ఠకై ఈ పత్రిక పెనగులాడుట! తమ కనుకూలమైన పత్రికలనే కొని చదివెడి అలవాటు లేని రసికమ్మన్యులైన నవీనాంధ్రుల కందించుచు తన్నుతాను నిలువద్రొక్కుకొను ప్రయత్న మొనర్చుట

బాల్య ప్రాయులైన సంపాదకులను ఏ మహాశక్తి ఇంతటి సాహసమున కొడిగట్టజేసినది? ఉన్నది మూడేండ్లే కావచ్చును. వెలువడినవి ముప్పది యారు సంచికలే కావచ్చును. ఆ లేత హృదయములో నేదివ్యశక్తియో దిగివచ్చి తిష్ఠవేసి యుండనిచో ఇంతటి మహాకష్టము నంత సునాయాసముగా భరింప వీలయ్యెడి దేనా?

ఆ మహాశక్తి ఏది?

అది యే ఆంధ్రీ మహత్త్వము!

అప్పు డవగతము కాలేదుగాని ఇప్పుడు తెలిసి వచ్చినది.

ఆంధ్రీ! నా ఆంధ్రీ!

నే నెంత ధన్యుడను! ఎంత దౌర్భాగ్యుడను!

నీ బిడ్డడనై ధన్యాతి ధన్యుడనగుచు నే నీ మహత్త్వము సంపూర్ణముగా నెఱుగ నేరని, నేర్చినంత వఱకయినను ఒక్కొక్క తెలుగు గుండెకు హత్తుకొనునట్లు చెప్పలేని దౌర్భాగ్యుడను.

ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ
ఆంధ్ర దేశ స్స్వజన్మ భూః
తత్రాపి యాజుషీ శాఖా
నాల్పస్య తపసః ఫలమ్ —

అని అపరశంకరుల వంటి తమిళులైన అప్పయ్య దీక్షితులవారు ఆంధ్రీమహత్త్వము నగ్గించుటయా! వారన్నమాట ఎంత లోతైనది! (ఈ శ్లోకమున ద్వితీయపాదమును 'ప్రాభాకర పరిశ్రమః' అని కొందఱు చెప్పుచున్నారు, అప్పయ్య దీక్షితులవారి స్వగ్రామమునకు అయిదాఱు మైళ్లదగ్గరి గ్రామమునకు చెందిన వేదవిద్యానిధులు బ్రహ్మశ్రీ కృష్ణమూర్తి ఘనపాఠీ గారు మా పెద్దలు మాకిట్లే చెప్పిరని ఈ పాఠమును తెలిపియున్నారు. ఇదియే దీక్షితులవారి భావమును సమగ్రముగా చెప్పుచున్నదని నా తలంపు.

తెలుగు మాటాడుట అదృష్టము. తెలుగు దేశమున పుట్టుట అదృష్టము. తెలుగు తన మబ్బుట అదృష్టము, ఈ మూడు దేనికదియే అదృష్టము. తెలుగు దేశమున పట్టియుండవచ్చును, తెలుగు

మాటాడక పోవచ్చును. ఏ అన్యభాషా మోహమో పుట్టి తెలుఁగు వదలి పోవచ్చును. తెలుఁగు గడ్డను బుట్టి తెలుఁగేమాటయై, తెలుఁగు తనము మూర్తీభ వించిన తెలుఁగు బిడ్డ లీనాఁడెంత మంది? వ్రేళ్ళ మీఁద లెక్క పెట్టవచ్చునేమో! ఈ మూఁడు సంపూర్ణముగానుండి యజుశ్శాఖీయుఁడగుట అనంత తపః ఫలము గాని సామాన్యముగాదని వారి హృదయా వేదన. వారు తెలుఁగు నెఱుఁగుదురు. తెలుఁగు గడ్డ నెఱుఁగుదురు, శ్రీ కాళహస్తితో వారికి సన్నిహిత సంబంధ మున్నది. తాము తెలుఁగు గడ్డను పుట్టక పోతిమే, తెలుఁగు తమ మాట కాకపోయెనే యని వారి పరితాపము! ఆ మహావేత్త కంతటి ఆవేదన మేల కలిగినది!

తెలుఁగు గడ్డ త్రిలింగ దేశము. ఇది సాక్షాత్ పరమశివ స్వరూపము, శ్రీశైల దక్షారామ కాళేశ్వర శివు లీ గడ్డ నధిష్ఠించి ఈ గడ్డ శివ స్వరూపమని విస్పష్టము చేయుచున్నారు. ఈ గడ్డను పుట్టిన తెనుఁగు నుడి దేవీ స్వరూపము. ప్రపంచ లిపులన్నిటిలో తెలుఁగు లిపి యొక్కటే వామావర్తమై అర్ధ నారీశ్వర రూపమున వామభాగాధిష్ఠితయైన దేవి కభిముఖముగా సాగులక్షణ మంది కొన్నది. ఈ వైశిష్ట్య మీలిపి కుండుటచేతనే యావద్భారతమును యజ్ఞవేదిగా భావించి నాలుగు దిక్కుల నాలుగు పీఠములు స్థాపించి వేదధర్మోద్ధారములో తద్ధర్మ రక్షణకు వ్యవస్థ నేర్పరచిన శ్రీ మచ్ఛంకర భగవత్పాదాచార్యులవారు తాము స్థాపించిన పీఠములలో నే యొక్కటియు తెలుఁగు మాటాడు ప్రాంతమున లేకున్నను పీఠముద్ర తెలుఁగు లిపియందే ఉండవలెనని శాసించి యున్నారు. పీఠాధిపతు లే భాషవారైనను నేఁటి కా సంప్రదాయము నాలుగు పీఠములలో సమాదృతమగుచునే యున్నది. శంకర సంప్రదాయ బద్ధులమని చెప్పుకొను ఇతర పీఠముల వారు నీ నియమునే పాటించుచున్నారు. శ్రీ శంకరులు తాము కేరళులు వారి గ్రంథజాలమంతయు దేవభాషలో వెలువడినది. పీఠములు ఆంధ్రేతర భాషాప్రాంతములలో నున్నవి. తమ మాతృభాషా లిపి యనక, దేవనాగర లిపి యనక, పీఠప్రాంతీయ భాషా లిపి యనక తెలుఁగు లిపి యందే ఉండవలెననుటలో నీ దేవి యన్న వారికెంత అపారగౌరవ మున్నదో తెలియనగును. ఈ రహస్యము దీక్షితుల వారికి తెలియును. అంతేకాదు. యావద్భారతమున ఈ తెలుఁగు గడ్డయం దొక్క చోటనే అ, ఆలతో గాక ఓనమాలతో విద్యాభ్యాస మారంభ మగును. అనగా నరియైన అక్షరాభ్యాసము అనగా అక్షర పరబ్రహ్మాభ్యాస మిక్కడనే జరుగుచున్నది. అనుప నీతులకు మహామంత్రోపదేశము వాల్మీకులకు మరా యని చెప్పినట్లు చేయబడు చున్నది. ఇది యెంత సదవకాశము. వీరు వారనక నియమము నతిక్రమింపక ఎల్లరకు బాగుపడు నుపాయము ననపాయముగా ననుగ్రహించుట. ఈ వెలుగు పసితనముననే యెదల కందుచున్నది. వారి వారి అధికారము ననుసరించి ప్రజ్వలింప చేసికొన వచ్చును. ఇన్ని విశేషము లున్నందు వలననే దీక్షితుల వారంత ఆవేదన ప్రకటించిరి. వారి మహోన్నత ప్రశంసలో తమకా భాగ్య మబ్బలేదన్న తీవ్రావేదన మున్నది.

తమిళులు, కేరళులే కాదు, కన్నడిగుఁడైన శ్రీ కృష్ణదేవరాయ మహాప్రభువు దేశభాషలందు తెలుఁగు లెస్స యని ముక్త కంఠముతో నంగీకరి

రించుట యెల్ల రెఱిఁగినదే! ఇట్లు సర్వభారతీయులే కాక విదేశీయులు గూడ ఈ నుడి గొప్పతనమును వేనోళ్ళ పొగడియున్నారు. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు అని దీని మాధుర్యమును ప్రశంసించి నట్లు అవసర మైనప్పు డాత్మభాషా ప్రాశస్త్యమును ప్రకటింపని ఆంగ్లమెఱిఁగిన తెలుఁగు వాఁడుండడు. ఆ మాట చిలకపలుకుగా ననుచునే ఆంగ్లమును విడిచి ఆంధ్రి నుపాసింపఁడు అదే ఈ తెలుఁగు వారి దౌర్భాగ్యము, అప్పు డెప్పుడో ఈ దేశమునకు క్రొత్తగా వచ్చినపుడు శ్రవణమాత్రమున ముగ్ధులై ఆంగ్లేయుఁడనిన ఆమాట నట్లుంచుఁడు. భారతము స్వతంత్రమైన పిమ్మట యావత్ప్రపంచములో విశ్రాంతి జీవితముగడపుటకు ప్రశాంతమైన దేశము భారతముమాత్రమే యని నమ్మి ఇచ్చటనే శేష జీవితము గడపవలెనను నిశ్చయముతోవచ్చి మొదట వంగదేశమున కలకత్తాలో కొంతకాల ముండి అక్కడ తన కనుకూలముగా తోచక మన ఆంధ్ర దేశమునకు వచ్చి విశాఖపట్టణములో చాల కాల ముండి ప్రాణనిర్యాణ వేళ నీ తెలుఁగు దేశముపై నుడిపై తనకున్న అభిమానము కొలఁది తన కళేబర మును పరిశోధనార్థమై కాకినాడలో నప్పుడు క్రొత్తగా నేర్పడిన శ్రీరంగారాయ వైద్యకళా శాలకు దానమీయ వలసినదని విలునామా వ్రాసి స్వర్గీయుఁడైన మహానుభావుఁడు (వారి కళేబర మిప్పటికి ఆ కళాశాలలో సురక్షితమై యున్నది) శ్రీ జె. బి. ఎస్. హాల్డేను, బహుభాషా వేత, [illegible] శాస్త్ర పరిశోధకుఁడు, మహా మేధావి దేశములో యావద్భారత భాషగా నుండదగినభాష యేదను వివాదము పత్రికలలో ముమ్మరముగా సాగుచున్నప్పుడు ఏమాత్ర మధికారము లేని ఇతర భాషల వారు స్వాభిమాన దురహంకారములతో తమ తమ భాషలే అట్టి యోగ్యత కర్హములైన వని బహుముఖముగా వాదించి వ్యాసములు వ్రాయు చుండ నిజమైన అర్హతగల తెలుఁగువారు అభిమాన శూన్యులయి చచ్చుబడి ఊరకుండుటకు వగచి తెలుఁగు వారు కోరకుండగనే తెలుఁగు యోగ్యత గూర్చి 'హిందూ' పత్రికలలో రెండు గొప్ప వ్యాస ములు వ్రాసియుండిన విషయము అభిజ్ఞులకు విదిత మైనదే! వారా వ్యాసములలో కొన్ని మహత్తర సత్యములను ప్రకటించియున్నారు.

1. ఈ దేశమున కొకప్పుడు యావద్భారత భాషగా నుండి ప్రపంచ భాషలలో నత్యుత్తమ భాషగా గణింపదగిన సంస్కృత భాషయందలి శక్తి సామర్థ్యముల నన్నింటిని సంపూర్ణముగా తనలో దమిడ్చికొన్న దేశభాష తెలుఁగొక్కటియే!

2. సంస్కృతభాష వ్యాకరణ లింగము కల దగుటచే అన్యభాషా పదములను స్వీకరించుటలో ఎన్నో ఇబ్బందుల కవకాశ మున్నది. క్రొత్తపదము లకు లింగ నిర్ణయము చేయుటలో నైకమత్యము సాధించుట కష్టము. తెలుఁగున కా చిక్కు లేదు ఏ భాషాపదమునైనను ఎట్టి యుచ్చారణ కలదాని నైనను తనలో నిమిడ్చికొనగలదు,

3. దక్షిణదేశ భాషల కన్నింటిని నుత్తరమునను ఉత్తరదేశభాషల కన్నింటికిని దక్షిణమునను ఈ దేశ ముండి ఈభాష యావద్భారతమునకును హృదయ స్థాన మన్నట్లున్నది.

4. పూర్వమెన్నఁడో శాతవాహనుల కాలమున నైనను యావద్భారత భాషగా గౌరవ మందిన అదృష్టమీ తెలుఁగు పూర్వరూపమున నున్నది. శ్రీకృష్ణదేవరాయల కాలములో అన్ని భాషల వారును ఈ తెలుఁగు గొప్పను గుర్తించి ఆరాధించినారు. తక్కినవాని కా అదృష్ట మెప్పుడును పట్టలేదు.

ఇట్టి హేతువులు మఱెన్నియో చెప్పి ఆమహాశయుఁడు అనసూయులై భారతీయులు తెలుఁగు నట్లు సమాదరించినచో యావద్భారత భాష నేర్పరచుకొనుటలో కృతకృత్యులు కాగల రనియు, అన్యభాషల కట్టి గౌరవము కల్పించుట కెవ రెంత ప్రయత్నించినను కృతకృత్యులు కాలేరనియు సుస్పష్టముగా ప్రకటించి యున్నాఁడు.

ఆంధ్రీమహత్త్వ మింత మందిచే ఇన్ని విధములుగా గుర్తింపబడినను తెలుఁగులు నేఁటికిని "తెలుఁగెవ్వరి పాలుచేసి తరిగెదవన్నా?" యని వేలూరి వారా వేసిన పసినట్లు తిరుగుచునే యున్నారు ఇప్పుడే యిట్లు దిన రాష్ట్రమేర్పడని యేర్పడునన్న ఆశకూడ పొడచూపని నాఁడు తెలుఁగు నాదరించిన వారెవరు! ఆదరించుచున్నా మనుకొనుచు నందఱు వ్యావహారికమున కెగబ్రాకు దినములవి. నేనును వ్యావహారికము నాదరించిన వాఁడనే! గ్రాంథికాంధ్ర మెఱిఁగి విశిష్ట ప్రయోజనమునకై వ్యావహారికము నాదరించుటయొకటి, గ్రాంథికము మొగమెరుంగక వ్యావహారికము పట్టుకొని ఊగులాడుట మఱొకటి. నాఁటివ్యావహారిక రచయితలలో చెళ్ళపిళ్ల, వేలూరి, గిడుగు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి విశ్వనాథ మున్నగు వారివలె గ్రాంథికమున మహోన్నత వైశారద్యముండి వ్యావహారికము నాదరించిన వారా నేఁటి వ్యావహారిక రచయితలు? వారి వ్యావహారిక రచనముల కున్న శక్తి సామర్థ్యములు నేఁటి వారి రచనలలో మృగ్యమనుట అతిశయోక్తి కానేరదుగదా!

శ్రీ మధునాపంతుల వారు ఇట్టి విపరీత పరిణామము రానున్నదని యెఱిఁగి యే ఆంధ్రీమహత్త్వావిష్టులై స్వజాతీయులకు మహాతపస్సంపన్నులైన పూర్వాంధ్ర మహాకవుల కావ్యములతోడి సంబంధము తెగిపోనీయరాదని మొసలిపట్టు పట్టి మూండేండ్లపాటయినను ముచ్చటుగా ఆంధ్రిని నిర్వహించినారు నాదృష్టిలో నది కేవలము పత్రికా నిర్వహణము కాదు. దివ్యాంధ్ర సమర్చనము.

ఆ సమర్చన మెంత సభక్తికమో, ఎంత సశ్రద్ధాకమో, ఎంత సమగ్రమో అందలి విశేషములను స్థూలముగా స్మరించినను విస్పష్టము గాఁగలదు.

సాధారణముగా సాహిత్య పత్రికా సంపాదకులు తమసత్తబయటపడిపోవునను భయమో ఏమో ముక్తసరిగా సంపాదకీయములు వ్రాసి ఊరకుండుటేగాని స్వతంత్రముగా తమపేరిట రచనలు ప్రకటింపరు. అట్లు చేయుటకు తమ రచనల కొఱకే పత్రిక పెట్టికొన్నారని లోకులనుకొందురను భయము కూడ హేతువు కావచ్చును. కొందఱు కొందఱు సంపాదకీయమును గూడ పరిహరించి ఏ శ్రమము లేకుండ తమ ఇష్టానిష్టలతో పత్రిక నిర్వహింతురు. ఆంధ్రియం దట్లు కాక సంపాదకుఁడు ప్రతిసంచిక యందును ఒకటి రెండు పరమ ప్రమాణములైన రచనలు చేయుచుండెడి వాఁడు. ఆంధ్ర రచయితలు వ్యాస పరంపర అట్లా విష్కృతమైపదే! అతఁడెన్నికొన్న

రచయితలందఱు ఇంచుమించు సమకాలీనులు, సజీవులు, కావున అసూయాద్వేషములు లేని అచ్ఛమైన హృదయము, గుణమునే గ్రహించెడి మధుమక్షికా వృత్తి ఉన్నవారికే అట్టివారిని గూర్చి వ్రాయుట సాధ్యము. వ్రేలు మడచి లెక్కింపదగిన పెద్ద రచయితలెల్లరు నీపరంపరలో నిమిడినట్లే చెప్పవచ్చును. ఇందులో ప్రభు ప్రకరణమను ప్రత్యేక విభాగము నున్నది. ఆయా ప్రభువులు స్వయంకవులై యొనర్చిన సాహిత్యసేవతో పాటు కవిపండిత పోషణమూలమున వారు జాతికొనర్చిన సేవయు బహుధా ప్రశస్తమైనది. ఈ వ్యాస పరంపరయే తరువాత కొన్ని మార్పులు చేర్పులతో ఆంధ్ర రచయితలు సంపుటులుగా అనేక ముద్రణము లందికొన్నది.

సంపాదకుడే తెలుగు బిడ్డడు అను పేరుతో ఆంధ్రాభిమానోద్దీపక పద్య శీర్షికలు ప్రకటించుట విశేషము. ప్రమాధి భాద్రపదిలో 'ఆంధ్రియే నా యభీష్టదేవత' అను శీర్షికలో ప్రశ్నము సమాధానము నిమిడ్చి వ్రాయుచు మొమ్మొదటి పద్యముననే

తెలుగునాట బుట్టితిని దెల్గు బిడ్డండ
నైతి దెలుగు మాటలాడ నేర్చి
యుంటి దెల్గు బాస నుచిత విజ్ఞానంబు
బడయగంటి దృప్తి పడుచు నుంటి—

అను పద్యము వ్రాయునప్పుడు వారి మనసులో అప్పయ్యదీక్షితులవారి ప్రశంసయు నావేదనము మెదలి యుండవచ్చునని నేననుకొందును. ఆ జన్మమున తామందలేని యీ మహాభాగ్యమును ఈ జన్మమన తెలుగు బిడ్డలై యందికొనిరేమో! లేకున్న ఆ తృప్తియనుట యెందులకు? అదియు నాంధ్ర ద్రావిడ శాఖ లోనగుట ఈ యూహకు ప్రోద్బలకము. తెలుగు బిడ్డ డాంధ్రాభ్యర్చనము పేరుతో ఎందఱో మహనీయులపై ప్రత్యేక పద్యములుగూడ చెప్పియున్నాడు. ఇవి యన్నియు నాత్మప్రత్యయముతో గూడిన గాఢాభిమాన ఫలములు.

ఆంధ్రి వైశిష్ట్యములలో సంపాదకీయాభిప్రాయములు రచనలపై ఎక్కడికక్కడనే ప్రకటించుట ముఖ్యముగా పేర్కొనదగినది. ఇది నిజముగా కత్తిమీదసాము, సంపాదకునకగు కష్టముటుండ రచయితలకు దీనిని సహృదయతతో చూడగల్గుట చాల కష్టము. ప్రశంసల కందఱు పరవశులగుదురే కాని ఎదురుమాట కేమాత్రము సహింపలేరు అయినను ఇది నిజముగా వాంఛనీయమైన సంప్రదాయము. ఉత్తమాధికారులయిన వారు తప్పక పాటింప వలసినది, లేనిచో బాగోగులు తెలియుట యెట్లు? రచయితలు పెద్దవారైన బాలాదపి సుభాషితమ్మని చిరునవ్వుతో స్వీకరింప వలెను. చిన్నవారైన కృతజ్ఞులు కావలెను. సములైన సహృదయితతో నంగీకరింప వలెను. ఈ పత్రికను చూచియే కాబోలు నాటి ప్రసిద్ధ పత్రికలలో చాల ప్రముఖ సాహిత్య పత్రికకు సంపాదకులైనవారు దురధికారులై తోచినట్లు వ్రాసి మాబోటి అభిజ్ఞుల తిరుగుబాటునకు తట్టుకొనలేక పదవికే ముప్పు తెచ్చుకొనిరి. శ్రీశాస్త్రి గారట్లు కాక చాల సౌజన్యముతో "న బ్రూయాత్ సత్యమప్రియమ్" అను హితోక్తికి చాల మంది అనుకొనినట్లు అప్రియమైన సత్యమును చెప్పనే రాదను నర్థమును గాక ఎట్టి సత్యమునైనను ప్రియముగానే చెప్పవలెనను తాత్పర్యముతో విషయమును

త్రిమింగి నమలక మెలఁకువతో మనసునకు కష్టము తోఁపనీయక చాల మృదువుగా వ్యాఖ్యలతో ప్రకటించుచు సమర్థతతో నిర్వహించి కృతార్థులయిరి. ఈ వ్యాఖ్యలలో పెద్దలను జంకు ఉండెడిదికాదు. పిన్నలను ఉపేక్షము లేదు. చెప్పవలసినది చెప్పుటయే ఒకమాఱు చెళ్ళపిళ్లవారికే చుఱుక తగిలినది 'శాస్త్రంబన్న జంకన్వలెన్' అని కవి కుల గురువుల మాట, వారి పద్యశీర్షిక 'కాలదుస్థితి' ప్రజలు శాస్త్ర ప్రామాణ్యము నే మాత్రము గణింపక యథేచ్ఛాచారులగు చున్నారని ఆ పెద్దల ఆవేదన బాగుగనే యున్నది. 'శబ్దశాస్త్రంబన్ననో ?' అని సంపాదకీయ వ్యాఖ్య వెం శా శతావధాను లప్పటికే భాషా విషయమున చాల సడలింపు లంగీకరించుచున్నారు. ఈ రచనయందును సమృద్ధిగానున్నవి ఈ వాఖ్యను చూచి ఆ సరస కవి వృద్ధులు 'ఓరి గడుసుపిండమా' అనుచు నవ్వికొని యుందురని నాయూహ. సంపాదకు లీ వ్యాఖ్యా పద్ధతిని ఎంత సమర్థతతో ఎంత సదుద్దేశముతో ఎంత జాగరూకతతో నిర్వహించినను తుదిముట్ట సాగింపలేక పోవుటకు పాఠకుల వ్యతిరేకతయే హేతువను కొందును,

ఆంధ్రి పరిమాణమున చిన్నదయ్యును ప్రమాణమున చాల పెద్దదై ఆనాఁటి ప్రముఖ రచయితలందఱ సహకారము నందికొన్నది దిగ్గంతు లందఱు దానికి రచన లందించి అటునిటు నొరగనీయక సుస్థిర ప్రతిష్ఠ నార్జించి పెట్టిరి.

విక్రమ దేవవర్మ ప్రభువులనుండి నాబోటి అకించనులవఱకు కవికులగురువులనుండి కలము క్రొత్తగాఁ బట్టిన వారివఱకు నందరు నాప్యాయముగా సహకరించినవారే ! ఈ విజయమునకు హేతువు తెలిసియో తెలియకయో పైకిచెప్పలేకపోయినను అంతరాంతరాలలో గాఢముగా నుండియో ఆంధ్రీలక్ష్యముతో నందఱ కేకీభావ ముండుటయే ! ఆంధ్రి రచయితలకు ద్రవ్యమెఱచూపి రచనలు పిలిచికొనలేదు. హృదయమిచ్చి పిలిచికొన్నది, కావుననే దానితోడి అనుబంధము మధురమై సుదృఢమై ఎప్పటికి విస్మృతము కాదు !

ఆంధ్రియందలి పరమోత్తమ విశేషము రచనా వైవిధ్యము. సంపాదకుని ఔదార్యము, రచయితలు స్వంతంత్రులైతమకుతోఁచినవి వ్రాయుట, సంపాదకు లెప్పుడును సిద్ధాంతమును ప్రకటించి దాని కనుగుణముగా నున్నచో సమర్థుల రచనలను ప్రకటింపవలయునేగాని తమ ఇష్టానిష్టములతో యథేచ్ఛారాజ్యమొనర్చి రచయితల నవమానింపరాదు,ఒకప్పుడెంతో పేరుపొంది సర్వజాతికి ప్రాణపదముగా నుండి ప్రతిష్ఠ నార్జించి ఇంక నాకేమన్న తలవిసురులతో నేఁటికి ఆత్మాభిమానముగల ప్రసిద్ధు లందఱ సహకారము కోలుపోయి ప్రకటితమైతే చాలునని పంపువారి రచనలతోడను సంపాదకుల ఇష్టానిష్టములబట్టి వ్రాయువారి రచనల తోడను స్థలోదరము నింపుకొనుచు నామ మాత్రముగా బ్రతుకుచున్న సాహిత్య పత్రిక ఇప్పటి దుస్థితికి దిగజారుటకు సంపాదకుల ఈ మనస్థితియే హేతువు. ఆంధ్రిలో సంపాదకుల కిష్టము కాని రచనలెన్నో యున్నవి. ఉదాహరణకు చెళ్ళపిళ్ళవారి శివశంకర విజ్ఞప్తి విషయ మభిమతమైనదే. విన్యాస మెప్పటికి నభిమతముకాదు మధునాపంతుల వారిట్టి రచనచేయరు. అయిననేమి ? కీర్తి ప్రతిష్ఠలు రచయితకు చెందిన

వని విడువకున్నచో రచనా స్వాతంత్ర్యమే అడుగంటును. అంత పెద్దవారి రచనయైనను ఈ ఔదార్య లేనివారైనచో తిరస్కరించి అవమానించెడివారే! ఆంధ్రి అట్టిపని చేయలేదు. "చా" పద్యమును గూడ ప్రకటించినది. ఒక పాదము శార్దూలము, రెండవది మత్తేభము, 'చా' పద్యమనగా నిట్టిదన్నమాట. ఈ రచన సంపాదకుల కిష్టమనుకొను వీలున్నదా? వీరు వారను భేదమెంచక అందఱ రచనలు స్వీకరించిరి. తాము అద్వైతసిద్ధాంత దార్ఢ్యముకలవారగుట చేతనే యిది సాధ్యమైనదని నా నమ్మకము. మహమ్మదీయులు, క్రైస్తవులు అందఱు ఆంధ్రీ సమర్చనములో మతవర్ణ కులవర్గభేదములకు తావెక్కడిది? సంపాదకు లవలంబించిన ఈ విశాలదృష్టి వలననే ఎన్నో అమూల్య వ్యాసముల నాంధ్రి ప్రకటింపగల్గినది వేలూరి వారి గారు శబ్దచింతామణి, చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు, పాలెపు వేంకటరత్నముగారు, కుందూరి ఈశ్వరదత్తు మున్నగు వారి విశిష్టరచనము లాంధ్రితో లభ్యములు.

వెలువడిన ముప్పదియారు సంచికలలో సగమునకు సగమున నా తొలినాటి రచనలున్నవి అందుచేతనే కాపశంస యెంతదీ తో నాంధ్రి కొలిగి వచ్చెడిదేమియు లేదు. ఇది లేకున్న దాని కీర్తి తఱుగదు. నాటి నారచనల జ్ఞప్తికి తెచ్చుకొన్నచో నాకే ఆశ్చర్య మగుచున్నది ఆంధ్రిలో ప్రకటితమైన నా మొదటి రచన, "పోలిక" యున్నది కాబోలు నా గురు ననుసరించి ప్రమాధిమార్గశీర్షిలో చైత్రిలో నారంభించి యుండగా దానితో నా పరిచయమంత ఆలస్యమైనదేమో అని? బహుశః ఒత్తులేని వత్సర దోషము నాకు కొంత అంటినదేమో! ప్రథమ వత్సరము ముగియ నున్నప్పుడు మొదలైన నా పరిచయము ద్వితీయ-వత్సరము విక్రమముతో విజృంభించినది. విక్రమచైత్ర సంచికలో "విక్రమేశ్వరా!" అను శీర్షికతో నీ పద్యము చిత్రగింపుడు.

> క్షితి జన్మించిన దాదిగాఁగడచె నీ క్రేగంటి మూఁతన్ దశ
>
> ద్వితయాబ్దంబులు నాఁటినుండి యును రౌద్రి క్రోధ రక్తాక్షులు
>
> ధృతులం గూడిన శ్రీముఖాదుల తమో మాలిన్యమే గాని భా
>
> రతి నూరించెడి విక్రమం బెపుడు చేరన్ లేదురా ఈశ్వరా!

నా పుట్టిన రాదిలో జ్యేష్ఠ బహుళమున, ఇప్పుడాపద్యము నేను వ్రాసినది కాదేమో అనిపించుచున్నది. ఉత్సాహాతిశయ మటువంటిది నిజముగా నవి భారతి నూరించిన పుణ్యదినములు!

ఈ నామాటతోడనే అన్నగారి ఆంధ్రీ పత్రికా నిర్వహణము కేవలము పత్రికా నిర్వహణము కాదనియు, ఆంధ్రీ దేవతా సమర్చనమనియు పస్పష్టము కాఁగలదు అయినను ఆ పత్రికను గూర్చి తన్నిర్వహణమును గూర్చి పెద్ద లేమనిరో గమనింపుఁడు.

"నవ్యభావ ప్రాభవముతో వెలయు గ్రామవాతావరణమున "ఆంధ్రి" ఉదయించినది, పత్రిక పెరిగి పెంపొంద వలయు నని సంపాదకుఁడు వేయి యిక్కట్టుల నెదుర్కొన వలయును, మాతృభాష

నాదరించు వారును మాతృభాషలో నుచ్చరింపబడు మాటకు వీను లొగ్గు వారును గ్రామము లందే యున్నారు. నందనమున మొక్క మొలచిన దనిన దాని భావి జీవితమునకై ఆతురపడనేల? గ్రామ హృదయము నందనమని రుజువు చేయ వచ్చును. భావసౌరభ మొందున్నదో ఆనందలక్ష్మి అందే వెల యును. ఈ లక్ష్మి పొత్తిళ్ళలో తోంచిన నిసుంగు 'ఆంధ్రి' అనుకూల వాతావరణమున వృద్ధి నంది తోడి పత్రికలలో శమంతక మల్లు వఱలుగాక!'

—జొన్నలగడ్డ సత్యనారాయణ.

'మీరు స్థాపించిన ఆంధ్రీ కుటీరమువంటివి ప్రతి పల్లెటూరున వెలసిననాఁడు భాషకువిముక్తి. రసజ్ఞత మీ యూరిలో వెదచల్లుట మీ బాధ్యత. మీరు తలపెట్టిన పనికి నా అభివందనములు, నా సాను భూతియు.'

—విశ్వనాథ సత్యనారాయణ.

'నాయనా! మీ పత్రిక అందుచునే యున్నది. సర్వధా చక్కఁగనే నిర్వహింపఁబడు చున్నది సంశ యము లేదు. భగవంతుఁడు నీ యుత్సాహమును మన్నించి నీకు సర్వవిధములఁ దోడ్పడి నీకుఁబేరుఁ బ్రతిష్ఠలనే గాక నిరామ యాయుర్భాగ్యాది శ్రేయ స్సుల నొడగూర్చుఁగాక! యని మనఃపూర్వకముగా నాశీర్వదించు చున్నాను!'

—శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి.

అన్నగారి నేటి అభ్యుదయమున కంతకు నాటి ఆశీస్సులే హేతువు. వారన్ని విధముల ధన్యులు! కాని ఆ పత్రికను, అంతటి ఉత్తమ పత్రికను. పరమ పవిత్ర లక్ష్యముతో సర్వాంగ సుందరముగా సర్వ సమర్థముగా సరస హృదయ రంజకముగా సద్భావ బోధకముగా జాజ్జ్వల్యమానముగా వెలుగుచుండిన ఆంధ్రిని నిలబెట్టుకొనఁ లేకపోయిన జాతిదే దురదృ ష్టము. ఈ ఆంధ్రజాతి ఎప్పటికైన పూర్తిగా నిదుర మత్తు వదల్చుకొని మోహాక్రాంతము కాక ఆత్మాభి మానముతో నిత్యజాగరూకమై నిలుచు సౌభాగ్య మబ్బునా?

మిత్ర మిశ్రులకు,

మీ పుస్తకము ఉత్తరము అందినవి. ఆంధ్రపురాణము ఇదివఱకే చదివాను. తప్పిపోయిన లేగకు తల్లిగోవు కనిపించినట్లయి ది... 'చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్ర' అని 40 ఏండ్ల క్రిందట పలికాను ఆ ఉజ్జ్వల ముక్తావళిని, మణులను, వెదకి విలువకట్టి హారము గ్రుచ్చి యిచ్చారు మీరు. ఆకృతికి అర్హమైన అర్చన జరుగలేదు. ఏదో వ్రాసిన, లేదా గ్రథనము చేసినవారికి గండపెండేరము తగిలించారు. ఏమి చేయాలెనో తెలియదు.

ఇపుడు సాహితికి 'చత్వారదశ' వచ్చిందేమో! కాని నేను ఆశావాదిని. పునర్వికాసం ఆవిష్క రిస్తుందనే విశ్వాసం ఉంది.

తిరుపతి

3 – 10 – 1957

రాయప్రోలు సుబ్బారావు.

(లేఖనుండి)

కవిసమ్రాట్
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ.

ప ద్య ప్ర సూ న ము లు

మధుకోశమ్మను పేరిట
మధుమధుకల బంభరాయమాణము కవితా
పృథు సుధ నొలికింపించిన
మధునాపంతుల కవీట్ సమర్వ్వాణమగుతన్.

ఒక్కటి యున్న నింకొకటి యుండదు నేఁటికవీంద్రులందు నీ
దృక్కవులందు సర్వమమరించును దైవము పాండితీ పరి
స్పృక్కమనీయ ధారయు వరిష్ఠముగా లలితత్వమున్ గడున్
పెక్కువగాఁగనుండిన కవిప్రభు వీయన యంచు చెప్పెదన్.

అధునాత్యుల్ పెనువెట్టి వేసములుగా నాటాడుచుండంగ ధీ
ప్రథకన్నట్టిరు వారి పోకిళుల కౌరా యీయమద్దత్తు నీ
మధునాపంతుల వంటి వారలు చరింపంబోరు తన్మార్గముల్
సుధమే లౌరుచి యెక్కినన్ మరమరాల్ సొంపౌన యాజిహ్వకున్.

చిన్ని చిన్ని శీర్షికలందు చెలఁగబోదు
రసమను మహాపదార్థము రసము సిద్ధ
కావ్యముల యందె కలుఁగు నెక్కటి రహస్య
మిద్ది తెలియ దాలోచనాహీనులకును.

రసభావమ్ములు ముఖ్యముల్ కవితకున్ వ్రాయంగనౌ ఖండకా
వ్యసమాసక్తముకావు భావమన నాభావంబు కాదిద్ది స
త్యసముస్మేషము భావమింకొకటి, తద్భావమ్ము పోనిమ్ము ఛాం
దస మైనట్టి కవిత్వ మీదినములన్ తప్పయ్యె లోకజ్ఞతన్.

మధునాపంతుల కవుబో
అధరీకృత దురభిమానమగు సద్యశమున్
పృథుతర మాయువు నెగడుత
సుధామయ సుకావ్యసమితి చొప్పడునట్టుల్.

ఆంధ్ర పురాణము

కవితా కామనీయకము

శ్రీ దివాకర్ల వేంకటావధాని

ఆధునికాంధ్ర వాఙ్మయ నందనోద్యానమున మొలకెత్తి భావసారథముచేతను రసప్రసవమకరందము చేతను సహృదయ బంభరముల కాహ్వాయన మొనరించు ననవద్య కావ్యకల్పకములలో నగ్రేసరమైన దాంధ్రపురాణము. నామమున పురాణమయ్యు నిది సర్గప్రతిసర్గాది పంచలక్షణ లక్షితము కాని కతమున నిందలి పురాణపదమునకు ప్రాచీన కథ యని యర్థము చెప్పుకొన వలయును. ప్రాచీనాంధ్రదేశమునకు లేక ప్రాచీనాంధ్రరాజులకు సంబంధించిన కథతోఁ గూడిన యీ మహాకావ్యము రెండు భాగములుగా నవపర్వ పరిమితమై పరిఢవిల్లుచున్నది. ప్రథమ భాగావతారికలో కవిగారు నుడివి నట్లిందు తెల్గువారి చరిత్ర సారము రసవన్మనోహరముగాఁ జెప్పఁబడినది. కావ్య చరిత్రలొకప్పుడు సమానవస్తుకములే యయ్యు రచనా విధానమున వైలక్షణ్యము కలిగియుండును. రసధ్వన్యాత్మకము కావ్యము, యథార్థవిషయకథన ప్రధానము చరిత్ర. కావ్యము ప్రతిభైకజన్యము. చరిత్ర పరిశోధన పరిశ్రమ జన్యము "కావ్యంతు జాయతే జాతు కస్యచిత్ప్రతి భావతః" అని భామహుడును. "నహికవేరితి వృత్తమాత్ర నిర్వాహేణాత్మ పదలాభః ఇతిహాసాదేవ తత్సిద్ధేః" అని ఆనందవర్ధనుఁడును చెప్పి యుండుట యీ భేదము నిరూపించుటకే. ప్రధానములైన యంశములను విడువకయు నన్యథా కరింపకయు శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారాంధ్ర పురాణమున శుష్కమైన చరిత్రను రసభరితమైన మహాకావ్యముగా తీర్చిదిద్దుటలో ప్రదర్శించిన ప్రతిభా పాండిత్యములకు మేరలు లేవు. ఆంధ్ర మహావీరచరిత్రను కావ్యకవితాకల్యాణ నీరంధ్రముగా సంతరించి వారు పితృపాదుల శుశ్రూషపూరించి యున్నారు. పంచపర్వ ప్రమితమైన ద్వితీయ భాగమును పురస్కరించుకొని యీ వ్యాసమున నా విద్వత్కవివతంసుల కవితా కామనీయకమును దిఙ్మాత్రముగా ప్రకటించుటకు యత్నింతును.

కాకతీయ రాజుల యనంతర మాంధ్రధాత్రిని పవనజవన వాజివ్రాత రంగత్తరంగమైన యవనజల మహాబ్ధి ముంచెత్తి వేసెను. అప్పుడు వరాహదేవుని దంష్ట్రాగ్రము మువ్వొనలవలె ముసునూరి నాయకులును రెడ్డిరాజులును, రాచకొండ వెలమ ప్రభువులును దాని నుద్ధరించి పునః ప్రతిష్ఠితముఁ గావించిరి తరువాత విద్యారణ్య మహర్షి పరమ తపస్సునకు ఫలముగా విజయనగర రాజ్యముదయించెను. దానిని సంగమ సాళువ, తుళువవంగడములకుఁ జెందిన రాజులు ధర్మబుద్ధితోఁ బాలించిరి. తద్రాజన్య పరంపరా హారమున శ్రీ కృష్ణదేవరాయలు తరళస్ఫూర్తిని విడంబించెను. విజయనగర రాజ్యపతనానంతరము దక్షిణమున నాయకరాజ్యము పెంపొందెను. రఘునాథ విజయరాఘవ నాయకులు దానిని వైభవమున పాలించిరి. ఆంధ్రపురాణ ద్వితీయ భాగమునందలి ప్రధానేతివృత్త విశేషము లివి.

వస్తుసంవిధానమున శ్రీ శాస్త్రిగారు ప్రదర్శించిన నేర్పు ప్రశంసనీయమైనది. వారు చరిత్రగ్రంథము లన్నియు చదివి, యందలి ముఖ్య విషయములకు ప్రాధాన్యమొసంగి యెడనెడ కావ్యోచితములైన సంభాషణములను వర్ణనలను జేర్చి వస్తువును హృద్యానవద్యముగా సాగించియున్నారు. చరిత్రాంశములను సన్నిహితముగా ననుసరించుచునే యించుకంతయు విసువుగొల్పకుండ కావ్యమును కొనసాగింపఁజాలుట వారి యప్రతిమాన ప్రతిభావిశేషమునకుఁ దార్కాణము. ముసునూరి ప్రోలయ కాపయనాయకులకును తిమ్మరసు గోవిందరాజులకును జరిగిన సంభాషణలు సరసములును కథాపరిణామ సహకారులునై యింపునింపుచున్నవి. గజపతికిని పాత్రులకును భేదము కలిగించుటలో దిమ్మరుసు ప్రదర్శించిన రాజనీతి చాతుర్యమద్భుతముగా వర్ణింపబడినది. రాయలు తన కొడుకు హత్యకుఁ గారణమై ద్రోహమొ రించెనను నెపమున మహామంత్రి తిమ్మరుసు కనులు తీయించి యతని కారాగృహబద్ధునొనరించెనని చరిత్ర చెప్పు విషయమును శ్రీ శాస్త్రిగారు విడిచివైచినారు. ధీరోదాత్తుడు యుక్తాయుక్త విచక్షణుఁడు, విశేషించి తిమ్మరుసును పితృనిర్విశేషముగ పూజించినవాఁడు నగు రాయలట్లొనరించి యుండునాయను సందేహము సాధారణముగా నారాజమంత్రిశేఖరుల చరిత్ర నెఱింగిన వారి కెల్లరకును గలుగకమానదు. శ్రీ శాస్త్రిగారు కూడ నట్టి సందేహముతోడనే దానిని విడిచియుందురు. విడిచినను ఆ విషయమున వారు రాజభక్తికి మేలి తార్కాణమైన తిమ్మరుసువంటి మంత్రియు మంత్రి యెడనట్టి యడఁకువగల రాయలవంటి ఱేఁడును కన్నులు పొడుచ కొన్నఁగానఁబడుదురే యని చెప్పియు,

శీలవంతుల నిరువురు చెలిమికాండ్ర
నరయఁ గన్నులుకుట్టుఁ గొందఱకు, వారి
కుత్రులు చరిత్రనెల్ల గగ్గోలు పఱచి
చేయు నొక్కయపూర్వమౌ సృష్టికృతిని.

అను పద్యము వ్రాసియు లెస్సగా వ్యంజిత మొనరించిరి. నాయక రాజపర్వమున రంగధామేశ్వరి ముంగర మాయమైన వృత్తాంత మతిలోక స్పృక్కుతోఁ గూడి యున్నను పరమాద్భుతముగా నున్నది, భక్తిభావ సంభృతుఁడైన విజయరాఘవుఁడు శ్రీరంగనాథేశ్వరీ చరణ సన్నిధానమున నిలఁబడి యామంగళ దేవతకు నొనరించిన నివేదనముతోఁ గావ్యము ముగియుట రమ్యమై భవిష్యదాంధ్రాభ్యుదయ సూచకముగా నున్నది.

శ్రీ శాస్త్రిగారు రాయారాజుల పరిపాలన కాలముల జరిగిన విశేషముల నన్నింటిని సూచించినను వారి సారస్వత పోషణమున కెక్కువ ప్రాధాన్య మొసంగి యుండిరి అందుచేతనే వారు కావ్యాంతమున

అభి[illegible] పరిమళిత యశః
ప్రభవిష్ణులు, సుకవిజన సభాజన లీలా
ర్భటీకాస్థానులు ప్రౌ
ఢప్రభువుల చారిత్ర మిటు పురాణింపఁబడెన్.

అని వారియాస్థానములు సుకవిజనసభాజన లీలారభటి కలవని ప్రత్యేకముగ పేర్కొని యున్నారు, ప్రోలయ వేమారెడ్డి శంభుదాసుని పోషించి యాతనిచే రామాయణ హరివంశములు కృతిపొందెను. కుమార గిరిరెడ్డి భరతభోజదేవాదుల గ్రంథములు పరిశీలించి వసంత రాజీయమను నాట్యశాస్త్రమును

రచించెను అతని బావమఱది కాటయవేమా(డు రాజ్యతంత్రమున వలెనే సంస్కృత భాషా పాండిత్యమునను దంటయై కాళిదాసు నాటకములకు కుమారగిరి రాజీయమను పేర వ్యాఖ్య రచించెను. పెదకోమటి వేముని కొల్వున కలంకారమైన వామనభట్టు భాణుఁడు వేమ భూపాల చరిత్రమను గద్యకావ్యమునకు కర్తయై పేరువడసెను. సకల విద్యాసనాథుఁడైన శ్రీనాథుఁడాతని యాస్థానమున విద్యాధికారియై యుండెను. అతఁడు పరశివ కపర్దిపదత్సురధుని కెనయైన కవితాధారచే సర్వజ్ఞ సింగమనీని మెచ్చించి యాతనిసాయమున నంది కంత పోతరాజు కటారి తెచ్చి రెడ్డిరాజుల కిచ్చిన కథ హృద్యముగా వర్ణింపఁబడినది. రావుసింగ మహీపాలుఁడు రసార్ణవ సుధాకర రత్నపాంచాలి కాది కృతులు నిర్మించి తన సాహితీ ప్రాభవముచే శ్రీనాథునే యాశ్చర్య చకితుని గావించెను. ఆ సింగ భూపాలుఁడేలు కాలమునకు పరమభక్త చక్రవర్తి పోతనకవి రసకవిత్వసృష్టి ప్రాణయష్టియై విరాజిల్లెను బుక్క రాయలు "విద్యారణ్య శ్రుతిభాష్యగణ్యమగు ధన్యత్వము" చూఱలాడిన ధన్యాత్ముఁడు అలికమున నక్షి దాచిన సర్వజ్ఞుఁడని పేరువడ్డ నాచన సోమనాథుఁడాతని యానతి నుత్తర హరివంశము రచించి బుక్కరాయ పురము నగ్రహారముగా పొందెను ఆ వితరణము నావిష్కరించు తామ్రశాసనమును శ్రీ శాస్త్రిగారు మంజరీ ద్విపదలో ననువదించిన తీరు కడుంగడు రమణీయముగా నున్నది

విద్యానగర పర్వమున చంద్రభూషక్రియా శక్తి మధ్యస్థుఁడై యుండ శ్రీనాథ డిండిములు కావించిన శాస్త్రార్థవాదమును వర్ణించునెడ శ్రీ శాస్త్రిగారు తమ కవితాశాస్త్ర మర్మజ్ఞతను చక్కఁగా వెల్లడించి యున్నారు. పర్యవేక్షణ పీఠాధ్యక్షుఁడైన క్రియాశక్తి శ్రీనాథుని విజయము చాటుచుండ దేవరాయలాతనికి కనకాభిషేక మొనరించు ఘట్టము దృశ్యకావ్యోచితమై యమందమైన యానందమును నందిచ్చుచున్నది. సాళువ నరసింహరాయలు పిల్లలమఱ్ఱి పినవీరభద్రునిచే జైమిని భారతాశ్వమేధ పర్వమునంకితముగాఁ బడసెను. రసికరంజకమైన తత్ప్రబంధకథన వైచిత్రిని శ్రీ శాస్త్రిగారు రసవంతముగా వర్ణించి యున్నారు. వాణి నారాణియను వాక్యమునందలి నా అనుదాని కనఁగ ననునర్థము చెప్పి కవి చతురాస్యుఁడనియు వాణియనఁజతురాననునకు రాణియనియు నారన్వయించిన తీరౌచిత్య శోభితమై యున్నది. తుళువ నరస నాయకుఁడు వాగీశ్వరీ మంత్రరాజ సిద్ధి పారంగతులైన నంది మల్లయ ఘంట సింగన కవుల నాదరించి వరాహ పురాణ నాయకత్వమున ఖిలము గాని యశము నార్జించెను. రాయలవారి పరిపాలనకాలమున భువన విజయ మహా సభాభవనము "పరిష్కృత నిబంధరస భావ బంధురాంధ్ర సుకవి తేందుముఖీ పాణి మకుటమై" విరాజిల్లెను, నాయకరాజ చూడామణియైన రఘునాథ రాయలు ప్రతిపద్య చమత్కృతి మత్కృతాసనాథుఁడైన వేంకటు కవినధునకును అన్య కవీంద్రులకును ఆశ్రయస్థానమగుటయేకాక తానును సాహిత్య చక్రవర్తియై కీర్తి గాంచెను, ఇట్లాంధ్ర రాజులు పలువురు సాహిత్య రసలోలుపులై కవీంద్రుల నాదరించి తత్కవితా సుధాతరంగిణుల నోలలాడిన తెలుంగు శ్రీ శాస్త్రిగారెడనెడ హృద్యముగ వర్ణించి కావ్యరక్తికి పుష్టికలిగించి యుండిరి,

ఈ భాగమున నైదు శతాబ్దులలో నాంధ్రదేశమును పరిపాలించిన పలువంశముల రాజుల పాలన

సము లందలి బహు విషయములను సరయముగా వర్ణింపవలసి వచ్చుటచే శ్రీ శాస్త్రిగారిందనవసరములు, కథాగమన భంగకరములునైన వర్ణనములపై దృష్టిసారించి యుండలేదు. ప్రకృతి దృశ్యవర్ణనము కావించుటకు కూడ నిందవకాశమంతగా కలిగి యుండలేదు, విజయరాఘవుని కాలమున నతని నిరతాన్నదాన నిరతిని పరీక్షించుటకో యన విజృంభించిన యతివృష్టిని వారద్భుతముగా వర్ణించి యుండిరి. వాన యొకటి రెండు నాళ్ళుకాక యవిచ్ఛిన్నముగా నొక మాసముపైఁబడి మిన్ను కన్నములు పడినట్లు కడవల గ్రుమ్మరించినట్లు కురియుటచే ప్రొయ్యిమీఁది పటులుండఁ గ్రమంబుగ ప్రొయ్యి క్రిందికిఁ గూడ' లేమి సంభవించెను. 'అతివృష్టికి లోకము వెఱ నిటునటు పోకాలఁగా జడిసి తడిసి మోపగుచుండెన్' అనుచో తడిసి మోపగుచుండెనను ప్రయోగమును, పాచకుఁడు విజయరాఘవునితో వానలహావళి వర్ణించిచెప్పు సందర్భమునందలి 'పాపవువానల వెల్లువఁ జేపడెనో దేవ గుండె చెఱువైపోవన్' అనుచో గుండె చెఱువైపోవన్ అను ప్రయోగమును సాభిప్రాయములై విజయవిలాసకారుని పదప్రయోగమును తలపించుచున్నవి. వానల మూలమున.

అణుకణువు ప్రొయ్యి పెనుచెమ్మయైన యపుడు
గగనవీధికిఁ బరువిడు పొగలెకాని
మావి చివురంతయేనియు మంటరాదు
వచ్చునో, పాచకులకంటి వానవచ్చు.

అను పద్యము పాచకులు పడినశ్రమను ప్రత్యక్షము చేయుచున్నది, మావిచివురంత యేనియు మంటరాదను ప్రయోగము సార వర్ణనాతీతము- శ్రీనాథుఁడు డిండిమునివాదమున నోడించిన పిమ్మట కన్నెలు హారతు లిచ్చుచుండ, వృద్ధ డిండిముఁడు స్వాగతము వల్కి హస్తసంస్పర్శనమున లాలించుచుండ నెత్తిన యంఘ్రిని సముద్దిష్టమైన పీఠమునందుంచెను. అప్పుడు

ప్రౌఢ ఒతి మౌళి కుచ్చుతురాయిచుంగు
నల్కియాశక్తి మేని వెన్నెలపెసరంగు
సకల కవి సార్వభౌమోప చారమునకుఁ
గుడియెడమ వైపువీచోపు వడుపులయ్యె.

అని శ్రీ శాస్త్రిగారు కావించిన వర్ణన వారా సభాస్థలమున కూర్చుండి చూచుచు రచించినట్లున్నది. 'కస్తూరికాపుండ్రకమ్మ దిద్దిన మేలిపస చిందులాడు నెన్నొసలివాఁడు' ఇత్యాదిగా కనకాభిషేకపుఁ బెండ్లికొడుకును వర్ణించు సీసమచ్చమగు తెల్గు నొడుపుతోఁ గూడి యాతని సవినయమగు ఠీవిని పఠితలకు సాక్షాత్కరింపఁజేయుచున్నది. విజయపర్వమున రాయలు పూర్వదిగ్విజయ యాత్రకుఁగదలునపుడు.

సముదగజపతిఁ గడిమిమై సంహరింప
హరుఁడు తాను బహిర్దర్శితాభిరామ
సత్త్వరూపమ్ముతో నున్న ఛాయదోఁప
నరుగుతెని గృష్ణభూవరుఁడు కదలె

అని శ్రీ శాస్త్రిగారు రాయలను శివునితోఁ బోల్చుచు, శివుఁడు రౌద్రరూపమును గప్పివుచ్చి సత్త్వరూపముతో నున్న ఛాయ యతనియందుఁ దోఁచెనని వర్ణించిన సీసమద్భుతముగా నున్నది. సీసపాదములు నాల్గింట నాకప్పిపుచ్చినతీరు రమణీయముగా ఇవరి పంఁబడినది. గజపతి పదమునందలి శ్లేష యాపన్యునకు సమగ్రత నావహించినది కృష్ణదేవరాయ పర్వమునందలి శైష్యోపాధ్యాయిక లోని రాయలను వర్ణించు సీసము లా ధీరోదాత్తుని గుణరూప స్వభావములను చక్కగా వెల్లడించు చున్నవి. 'తలఁగ్రుచ్చుకొన్న తెక్కలనంటి వంట కాలువఁ బవ్వళించు బాతువుల నరసి' 'అతఁడుచ్చరించు మహావాక్యములలోని భావధ్వని వ్యంగ్య వరతనరసి' మన్నగు వాక్యము లాముక్తమాల్యదయందాతఁడు ప్రదర్శించిన పరిశీలన పాటవమును, కవితాప్రతిభను వెల్వరించుచున్నవి. అభిషేకానంతరము భద్రగజాధిపతుఁడైన రాయలకు తిమ్మరుసు నగరమునందలి విశేషముల నన్నింటిని వర్ణించి తెల్పెను. ఆంధ్రపురాణ ద్వితీయ భాగమునందలి వర్ణనములలోఁ గొంతదీర్ఘమును భావగంభీరమునైన వర్ణనమిది. 'తత్పురాణ నగరవర్ణన ఫక్కి నూత్నత గడించు తిమ్మరుసు వాక్కని శ్రీ శాస్త్రిగారారంభమునందే సూచించి నట్లు లందు వర్ణన సంప్రదాయము ప్రాఁతదేయైనను భావములు మాత్రము క్రొత్తవై పఠితల చిత్తముల నానందాయత్తములఁ గావించుచున్నవి. తిమ్మరు సీ సందర్భమున తుంగభద్రను, పట్టణము చుట్టునున్న కొండలను, వీధులు సూత్రపట్టి తీర్చిన సౌధముల యందమును, హర్మ్యములను, వీధుల కిరువైపులనున్న వృక్షములను, రాజకన్యలు వోయు నాచారలాజలను, ఆలయమండపాగ్రమును, వణిగ్వీధియందలి ముత్యాలప్రోవులను, ఆరామములను, వృక్షములను శాద్వలములను వర్ణించి యావత్ప్రపంచ నగరీ శిఖరాయమాణమగు విజయనగరము తృణకాష్ఠ జలసమృద్ధిని, సంపద్వైభవములను, వైరి దుర్నిరీక్ష్యతను మనోజ్ఞరీతి విశదీకరించెను. ఇట్లు వర్ణించి యాతఁడు 'ఇవ్విజయనగరమ్ము నెంతని వర్ణింతు నింతకుం గవినిగాదుకదా' యని పలికెను. అప్పుడు రాయలు మందహాస మొనరించి 'కవివి కావయ్య పోనిమ్ము కాకయుండె అతిశయ విధావిడంబనాన్వితముకాని యకృతకము మితవాణి నీయందుఁ గలదని ప్రశంసించెను. ఈ ప్రశంస పైవర్ణన మంతయు నతిశయోక్తికాక స్వభావోక్తియే యని తెల్లము చేయుచు కవుల వర్ణనము లతిశయోక్తి విధా విడంబ నాన్వితములును కృతకములునై యుండునని సూచించుచున్నది. ఈ వర్ణనమున శ్రీ శాస్త్రిగారు వెల్లడించిన భావములు సంప్రదాయానుగుణములయ్యు నత్యంత హృద్యములై యున్నవి. ఒక్క యుదాహరణము మాత్ర మొసంగెదను.

మోదాం కూరిత హాస మాఘ్య
ముకుళంబుల్ తోడుగాఁజేసి ప్రా
సాదాగ్రస్థిత రాజ కన్యకలు
లాజల్వోసి సాలాగ్రశా
ఖాదండంబులఁ జిక్కుకొన్నవి
వడంగాఁ గొమ్మలన్ దుల్పుచో
స్వేదంపుం గొన చిమ్ముకాల్లు
రదిగో శ్రీకృష్ణ రాడ్భావజా !

ఇటు నవ్వుమల్లెలన్ని లాజలతోఁ గలిపి రాయలపైఁ జల్లు రాజకన్యల సాత్త్విక భావస్ఫూర్తి సరససుందరమై యున్నది. హరిహరుఁడు సానుజుఁడై విద్యారణ్యస్వామిని దర్శించి చక్కని వాచిక మందుకొనుటకై వెడలి నప్పుడు స్వామి సమాధి స్థితుఁడై యుండెను. ఆ సందర్భమున

అరుణార్కద్యుతి రేఖ లాశ్రమ
పురః ప్రాంతావనీ జాత బం
ధుర పర్ణాంతర జాల భాసురములై
తోఁపన్ సమాధ్యంతమం
దర విప్పంగను లెత్తి యివ్వి
పొడలేళ్ళారార చెల్లెక్కుట
బ్బుర మంచున్ మఱి యంతలో
నపుడ నవ్వున్ దాను దద్భ్రాంతికిన్.

అను పద్యమున్నది. ఆశ్రమ ప్రాంత భూరుహ పర్ణాంతర జాల భాసురములైన సూర్యకాంతులు పొడలేళ్ళవలె కన్పించుట శ్రీ శాస్త్రిగారి పరిశీలన పాటవమునకు తార్కాణ. సమాధ్యంతమం దర విప్పఁగనులతోనుండిన కతమున స్వామి కట్టి భ్రాంతి కలిగెను. ఈ విధముగా శ్రీ శాస్త్రిగారు కావించిన వర్ణనలు సందర్భానుగుణములును, నాతి దీర్ఘములును, సుందరభావ బంధములును, ప్రౌఢములునై యింపు నింపుచున్నవి.

శ్రీ శాస్త్రిగారు వైదిక సంప్రదాయములను శ్రౌతవిధాన మును బాగుగా నెఱింగినవారు. ఆధునికులలో నిట్టి పరిజ్ఞానమున్న వారరుదుగా కనిపింతురు. రాయల యభిషేక సందర్భమున తిమ్మరుసు లౌకిక మర్యాదలకు వలెనే వైదిక మార్గములకును అధిక ప్రాధాన్య మొసంగి వానిని యథాశాస్త్రముగా సాగించెను. 'అది విష్వక్సేను నర్చనకై తెచ్చిన పసపులోఁ జాయ నేర్పఱచి చూచు... హరి సమర్చనోప క్రాంతమగుచు నృపగజాధిరోహితమైన పట్టాభిషేక కర్మ కాండము శుభేష్టి గాఁగ నడపుఁదిమ్మరుసు మంత్రి భావనా దీప్తవీథి— (124) అను పద్యమాతని వైదిక కర్మకాండా సక్తిని విశదము చేయుచున్నది. విష్వక్సేన స్మరణ. పుణ్యాహవాచనము, గ్రహశాంతి, బ్రహ్మవిష్ణ్వాది దేవ సమర్చనము మున్నగు విధులన్నియు నిట వర్ణింపఁబడినవి. దూర్వాగ్రములతో పురోహితులు శాంతిజలము రాయలపై చిలుకరించిరి. రాయలు విధ్యుక్తములైన దానములన్నియు నాచరించెను. తరువాత నింద్రశాంతి హోమము లాచరింపఁబడెను. గౌతమీ కృష్ణాది సమస్త నదీ జలంబుల చేతను, సరః కూపోదకముల చేతను సముద్ర సలిలములచేతను పరిపూరితములైన కలశములు స్థాపింపఁబడెను. మృత్తికా పంచగవ్య స్నానములు జరిగెను. నైష్ఠికుఁడైన పండితుఁడు వేదములు పఠించుచు శతచ్ఛిద్రకనక కలశమున నభిషేకము కావించెను. రాయలు ప్రభుత్వము నామతించిన యనంతర మతనికి వెల్ల గొడుగును వింజామరలును పట్టిరి. వేత్రహస్తులు పజ్జ నిలబడిరి.

శ్రోత్రపేయములైన వాద్య నాదములును, వంది మాగధ స్తోత్రములును చెలంగెను. లలాటమునపట్ట బంధమును, మూర్ధమున ముకుటమును అలంకరించి సకల మంత్రి మాండలిక ప్రజాధ్యక్ష సమక్షమున బహుమృగచర్మాచ్ఛాదితమైన వజ్ర సింహాసనమున సపత్నీకుఁడైన రాయలను ప్రవేశింపఁజేసిరి. వృషభ పూజయు, సవత్స గోపూజయు జరిగెను. పిమ్మట రాయలు జాత్యశ్వమును భద్రగజమును సంభావించెను. ఈ రీతిగా శ్రీ శాస్త్రిగారు పట్టాభిషేక కల్పమును యథావిధిగా వర్ణించి తమకు వైదికాచార కర్మకాండము లందుఁగల పరిచయమును ప్రకటించిరి.

ఆంధ్ర పురాణమున నుత్సాహక స్థాయికమైన వీరము ప్రధానరసము. వీరము చతుర్విధము అందు ధర్మయుద్ధవీరము లింకు సముచితముగా పోషింపఁబడినవి. కాకతీయరాజు లంతరించుటతో హైందవ ధర్మమునకు గ్లానియు సంభవించెను. మునునూరి ప్రోలయ కాపయనాకుల విజృంభణ మంతయు సంస్థాపనము కొఱకే.

కెరవి సులతాను పట్టి లాఁగిన తెలుంగు
పుడమి పడఁతి చెఱంగుఁ గొప్పువిడిపించి
వీని దుశ్శాసనతఁ ద్రుంచివేయుదునను
తలఁపుకాపయ భీముండు నిలుపు కొనియె

212_52

అతని చల్లని యేల్బడిలో 'తఱిఁగిన హైందవ మ్ములగు ధర్మనిబంధనముల్ పునః పురాపరిగత వైభవోదయ విభాశుభమూర్తులఁ గందళింప సుంద రముగఁ బెంపుచెందెను' విజయనగర సామ్రాజ్య స్థాపనమునకు హైందవ ధర్మప్రతిష్ఠాపనమే మూల సూత్రము. తన్మహారాజ్య సృష్టికి విద్యారణ్యస్వామి బ్రహ్మ. అతఁడు తన్ను దర్శింప వచ్చిన హరిహర రాయ సోదరులను

ఇచట మేముండి పయినీశ్వరేచ్ఛయుండి
యచట నసమాన విక్రమ ప్రచురమూర్తు
లైన మీరిందఱుండి ధర్మావనంబు
నోఁచుకొనలేవె నేఁడు హిందూధరిత్రి.

అని ప్రశ్నించి "హైందవ ధర్మపాలన పరాయత్తైక చిత్తంబులన్ పదనౌకత్తులు" దూసినను పాప ముండదని హెచ్చరించెను. అతఁడు వారిని ధర్మేందిరామందిరమగు హైందవ సామ్రాజ్యము చిరస్థాయిగా నిల్పుండని పురికొల్పి వేదధర్మ గోపాయన విధికై శ్రీవిరూపాక్ష విభి స్వీకరించుట కనుజ్ఞ యొసంగెను. తిమ్మరుసుమంత్రి రాయలవారితో రాజు పోషించు కళలయందతని భోగము వసెపు లించుననియు, నతఁడేవినధర్మమందు దానిత్యాగము సహస్రవిధములు ఫలించుననియు తెల్పి యతనిని ధర్మ పరిపోషణమునకు ప్రోత్సహించెను. ఈ విధముగా నీభాగమున ధర్మవీరము మొదటినుండి తుదదాక పరిపోషము నందినది, ఇందు యుద్ధవీరము కూడఁగలదు. మునునూరి ప్రోలయ యూహర ప్రజాసేవలు కూర్చి పరుల్యాక్రమించుకొన్న దుర్గములు తెఱచి వీరవిహార మొనరించెను కాపయ నాయకుఁ డన్నయొరవడిలోఁ దన శీలమును గౌఁకల మును దీఱుచేసికొని విక్రమము ప్రదర్శించెను. విజయపర్వ మాద్యంతము యుద్ధవీరపరము మైనట్టిది. ఉదయగిరి, కొండవీడు, రాయచూరు దుర్గముల ముట్టడించు సందర్భమున రాయలు ప్రదర్శించిన పరాక్రమ మద్వితీయము. తిమ్మరుసుమంత్రి రాజ

నీతి చాతుర్యముచే కటకవిజయము సాధించెను, దేవీకోట ముట్టడి సందర్భమునను, తోసూరు యుద్ధ సందర్భమునను రఘునాథరాయల పరాక్రమముతో పాటు ధర్మాభినివేశమును వ్యక్తమగును. ఈ యుద్ధములను వర్ణించు ఘట్టములందు శ్రీశాస్త్రిగారు తామెప్పుడును యుద్ధములను చేసినవారు కాకపోయినను ఎంతో సంగ్రామ కళాకౌశలమును ప్రదర్శించిరి. ప్రతిభానేత్రమునకు ప్రత్యక్షముకాని విశేషముండదనుట నిజము శ్రీనాథ డిండిముల వాగ్వివాద సందర్భమున విద్యావీరమును విజయరాఘవుని యన్నదాన తత్పరతయందు దానవీరమును గోచరించుచున్నవి. కావ్యాంతమున విజయరాఘవుఁడు శ్రీరంగనాథేశ్వరిని స్తుతించునప్పుడు శాంతాంతర్భూతమైన భక్తి పరవళ్ళు త్రొక్కుచున్నది.

సాళువనరసరాయలు మరణోన్ముఖుఁడై తన బిడ్డల నిర్వర తుళువనరసనాయకు నప్పగించునప్పుడును, అట్లే వీరనరసింహరాయలు తనతరువాత రాజ్యమున కుమారుఁడైన తిరుమలరాయని నిల్పుమని తిమ్మరుసును ప్రార్థించునపుడును కరుణరసము వెల్లివిరియును. శ్రీ శాస్త్రిగారి దృష్టి యేఘట్టమును రచించునప్పుడైనను రసపోషణ ప్రవణమైయుండును. శ్రీకృష్ణదేవరాయ పర్వము మొదటువారు తండ్రిగారిని 'రసభరిత వాఙ్మధుప్రవతసరణి', యని సంబోధించిరి. ఆ విశేషణము తండ్రిగారికివలె తనయునకును అన్వయించును.

పాత్రపోషణమున శ్రీ శాస్త్రిగారందెవేసిన చేయి. ఇందలి సర్వపాత్రలను వారు సుస్పష్ట రేఖలతో తీర్చిదిద్దిరి. ముసునూరి ప్రోలయ హైందవ మతావలంబన తత్పరబుద్ధి; జాతీయనవోదయ పరివిప్లాఘనుఁడు. అతఁడు దేశీయధర్మమును పెంపొందింప నరులనొప్పించి తటిమినను స్వరాజ్యమును తానే యేలవలెననెడు కాంక్షకల స్వార్థపరుడుకాఁడు. అతఁడు ముసలియై కాపయతోఁ జెప్పిన వాక్యము లతని ధర్మాభినివేశమును వాత్సల్యమును వెల్లడించును. కాపయ సర్వవిధముల నాయన్నకుఁ దగిన తమ్ముఁడు ప్రోలయవేమునికీర్తి భవనమున తెలువారికి హోమపుత్తఫలముల విందు సాగెను. అతని గురుభక్తి యనన్యసామాన్యమైనట్టిది సంవద్వైభవ ప్రీణితావని దేవోత్తముఁడైన అనవేమారెడ్డి ధర్మాన్నవేమనయను ప్రతిష్ఠ సంపాదించెను. మధూత్సవములం దతఁడు చల్లిన చంద్రచందనాదులచే భూమియేకాక నభమును గంధవతియయ్యెను. పెదకోమటివేముఁ డర్థి సంతానాభీప్సిత కార్యనిర్వహణ చింతారత్నకము; కళాసాహితీ తృష్ణాత్ముఁడు రాచవేముఁడు చెఱకు తుదవెన్నువలెఁ చుట్టి పుట్టి మంచములకుఁగూడ పన్ను పుచ్చుకొని కొండవీడి రాజులకీర్తి కళంకితమొనరించెను. రాచకొండ వెలప్రభువులు రాజ్యపాలనమునవలె విద్వత్కవి పాలనమునందును ఎనలేని యశము గాంచిరి. హరిహరరాయ బుక్కరాయల ధర్మతత్పరతను, గురుభక్తిని, సమయోచిత పరిజ్ఞానమును శ్రీ శాస్త్రిగారు చక్కగా విశదీకరించిరి. విద్యారణ్యస్వామి కాలత్రయవేది వైదుష్యము, అనుష్ఠానము, ప్రతిభ, తపస్సు మున్నగు గుణములన్నియు ఏకత్రమూర్తీభవించిన యపరబ్రహ్మయా మహనీయుడు. శ్రీనాథుఁ డిందు రజోదర్పదూషితుఁడు

కాఁడు; వినయ భారోదర పాండిత్య గౌరవమున వినమితశీర్షుఁడు. అతఁడు దేవరాయలతో 'నరవర మౌళీ! యొక్క కవినాథుని యోఁదలఁగాదు శారదా చరణాబ్జంబులందుఁ బాద్యము నొసంగితి ... బంగరునకుఁ దావిపొంగు తొలఁగాదెను నీకతనం దెనుఁగు నన్' అనుట అతని వినయమునకుఁ దార్కాణము. డిండిముఁడు కూడ నిందుదాత్త చిత్తుఁడుగ చిత్రింపఁ బడినాఁడు. అతఁడు శ్రీనాథుని విజయమును మౌన కమనీయ గంభీరహాసమున నామోదించుటే కాక యతనికి స్వాగతము పల్కి మృదుహస్త ద్వంద్వ సంస్పర్శనమున నతనిఁ దేలించెను. క్రియాశక్తి పక్షపాత దూరుఁడు. ప్రౌఢ దేవరాయల యౌదార్యము మేరలు లేనిది. సాళువ నరసరాయలు వీరత్వమునను గపుత్వమునను దానే ముందుండినట్లు వర్తించిన మహారాజు. పినవీరభద్రుఁడు కవి చతురాన్యుఁడు. వాణీ దయాపాత్రుఁడు. తుళువ నరసనాయకుఁడు నరసరాయల పుత్త్రులకు హాని కలిగించిన కృతఘ్నుఁడు కాఁడు అకృతక రాజభక్తి భరితాంతరుఁడు. అతఁడు నరసరాయల జ్యేష్ఠ కుమారుఁడు మరణించిన వెనుక తనకుఁ గల్గిన యపవాదమును రెండవ కుమారుని పట్టాభిషిక్తునిఁ గావించి తొలఁగించుకొనెను. ఇమ్మడి నరసింహరాయనికి తిమ్మరుసు నుపదేశము జబ్బునోట చక్కెర పోసినట్లయ్యెను. అతఁడు భ్రాతృఘాతుకుఁడౌ దళవాయి మాటలు విని దుష్ట మార్గము ననుసరించుటచే నరసనాయకుఁ డాతనితోఁ బోరవలసి వచ్చెను. వీర నరసింహరాయలు ధర్మ దూరుఁడై ప్రజల విశ్వాసమును గోల్పోయెను. అతఁడు తిమ్మరుసును బిల్చి రాయల కన్నుదోయి పీకి తన చేతఁ బెట్టుమని కోరిన క్రూరుఁడు. రాయలను మంత్రిసత్తముఁడైన తిమ్మరుసును శ్రీ శాస్త్రిగారు చిత్రించిన తెఱంగద్భుతముగా నున్నది. తిమ్మరుసు రాజనీతి చతురుఁడు. గుణ పక్షపాతి. ధర్మ తత్పరుఁడు, సమయస్ఫూర్తి శోభితుఁడు, రాయలయం దుత్తమ చక్రవర్తి కుండవలసిన లక్షణము లన్నియు నిండారి యున్నవి. "అన్న విభుండు నాకు, జనకాభుఁడు గాఁడొకో" యను పద్యము న నాతఁడు ప్రకటించిన యుదాత్తత వర్ణింప నలవికాదు. అది చూచి తిమ్మరు సాశ్చర్య చకితుఁడై" ష్యుని చేనైన పరాజయమున' కాత్మలో నెంతో మెచ్చుకొనెను. రాయలు మహావీరుఁడు. ఔచిత్యజ్ఞుఁడు; గురు మాతృభక్తుఁడు సాహితీ సమరాంగణ చక్రవర్తి గోవిందదీక్షిత రఘునాథనాయకులు తిమ్మరుసు శ్రీకృష్ణరాయలతోఁ బోల్పఁదగిన వారు. రఘునాథుఁడు తోపూరు యుద్ధమున జగ్గరాయల నోడించి యాచమనీని సాయకమున రామరాయలను సింహాసనాసీనుని గావించుట యాతని ధర్మ పక్షపాతమునకుఁ దార్కాణము అతఁడు రాయలవలె సాహిత్య పోషకుఁడే కాక స్వయముగా కవి. విజయరాఘవుఁ డన్నదాన దీక్షాపరుఁడు గురుదేవతా భూదేవతా భక్తుఁడు. శ్రీరంగనాథేశ్వరి కతనిపైఁ గల దయ యపారము. ఈభాగమున స్త్రీ పాత్రలు రెండే ఒకటి రాయల తల్లి నాగాంబ; రెండవది శ్రీరంగధామేశ్వరి ఆ యిరువురు తల్లులకుఁ గల పుత్త్రభక్త వాత్సల్యములను శ్రీ శాస్త్రిగారు చక్కగా పోషించియున్నారు. వారు చరిత్రయందలి వ్యక్తుల గుణ శీల స్వభావములను చక్కగా పరిశీలించి వానికి తమ కావ్యమున మెఱుఁగులు దిద్ది వానిని హృదయవంతములు సజీవములు కావించియున్నారు.

శ్రీ శాస్త్రిగారి భావములు గంభీరములైనవి. వారు రచించిన పద్యములం దన్నిట నేదో యొక రమ్యమైన భావము తొంగి చూచుచునే యుండును;

వాణి దయకల్మి సుకవికి భద్రనిద్ర
యామె దయలేమి కుకవికి నంతులేని
మొద్దునిద్దుర తెలియని మొఱకు మదికిఁ
గుకవి సుకవుల నిద్రలొక్కొ డుగఁ దోఁచు
273-203

పినవీరభద్రుడు జైమిని భారతము రచించిన ఘట్టములోనిదీ పద్యము. వాణీ కటాక్ష పాత్రుఁడైన కవి పొందునది కవితా సమాధి; వాణి దయలేని కుకవి పొందునది మొద్దునిద్దుర. పైకా రెండు నొక్కవిధము గనే కన్పడును. సామాన్యుల కా రెండింటి యందభేదము గోచరింపదు. ఆ భేదము నిందు శ్రీ శాస్త్రి గారు రమణీయముగ నిరూపించి యున్నారు.

కొడుకు నభిషిక్తుఁ జేయ వాకొనఁగ వచ్చు
రామ నిర్వాసనంబుఁ గోరంగ తగునె
యదిర! యాడుది నడపె రామాయణంబు
నడపుచున్నాఁడు కృష్ణాయణంబు జేఁడు
311-79

కైక తన కుమారునికి పట్టాభిషేకము కోరవచ్చును. కాని రాముని వన గమనముకూడ కోరనేల? ఆ కోరుటయే రామాయణము ప్రవర్తిల్లుటకు హేతువయ్యెను. అట్లే వీర నరసింహరాయలు కొడుకునందలి ప్రేమచే నతనికి పట్టాభిషేకము కావలెనని కోరుటతో తృప్తిపడక రాయల కన్నులు కూడ పెఱికి తెమ్మని తిమ్మరుసును ప్రార్థించి కృష్ణాయణమునకు కారణ మగుచున్నాఁడని యిందలి భావము.

దాసీభూత సమస్త దేవతలు చేతః ప్రీతి
నీదీప్తి నెం
తే సేవింపఁగ సాగి వేగిరమ తల్లీ! రంగ
ధామేశ్వరీ

నాసాగ్రంబున కీవు భూషణమ పైనంగాని
యోగుల్ నిధి
ధ్యాస ధ్యానములందు ముక్కుకొసలందన్
లేరు నిక్కంబుగన్
435-135

ఇది విజయరాఘవుఁడు దేవి నాసికామణి నుద్దేశించి చెప్పిన పద్యము. ఇందు యోగరహస్య మిమిడి యున్నది. ఇది సౌందర్యలహరి యందలి "అసౌ నాసా వంశస్తుహినగిరి వంశ ధ్వజపటే" అను శ్లోకమును స్ఫురింపఁ జేయుచున్నది

రాయలవైపు చూచి యనురాగము చిందఁగ
నెట్టులుండెనో
నాయన వీఁ విందులివిచ్చునె యంచు గురుండ
నంగ న
ప్పా! యిది పుట్టినిల్లగుఁగదా యని రాయలు
పల్కె నౌను దం
డ్రీ! యనియూర్చి మంత్రి యిది కృష్ణుఁడు
పుట్టినచోటె చూడఁగన్
314-95

కృష్ణుఁడు పుట్టినచోటు కారాగారము. తిమ్మరుసు రాయలను రాజు క్రౌర్యమునుండి కాపాడుటకై తనయింట దాచెను. తమ్ముఁడు గోవిందరాజు నతనికి కాపటుగా నుంచెను. నిజమునకు రాయలకది కారాగారమే. రాయలు మంత్రియిల్లు తనకు జన్మగృహముతో సమానమని పల్క తిమ్మరుసది కృష్ణుఁడు పుట్టిన చోటెయని చమత్కరించెను. ఈవిధముగా నెన్నుకొనుచుఁ బోయిన నీకావ్యమంతయు నొక సముజ్జ్వల భావరత్నాకరమువలెఁ దోఁచును. శ్రీ శాస్త్రిగారి భావనాశక్తి యెంత లోఁతులకుఁ బోఁజాలునో యంతగా నౌచిత్యమును

చూఁటలిచ్చును. భావపటిమ సడలకుండ కావ్య మంతయు నిట్లు హృద్యముగా సాగించు శక్తి కతిపయులైన మహాకవులకు మాత్రమే యుండును.

శ్రీ శాస్త్రిగారి కవిత వ్యంగ్య చమత్కార మయము. అదే ఆంధ్ర పురాణమును వట్టి చరిత్ర కావ్యముగాఁ గాక మహాకావ్యముగాఁ జేసినది. తిమ్మరుసు రాయలకు విజయనగరము నందలి వివిధ దృశ్యములను చూపి చెప్పు సందర్భమున నాలయ మండపాగ్రమునందలి శిల్పమును గూర్చి చెప్పుచు "ఇందె త్తినరాలకున్ బ్రతుకు లిచ్చిరి సత్కవులట్లు వ్యంజనావృత్తియెకాని యొండితర వృత్తి నెఱుంగని శిల్పకోవిదు" లని కవిత్వమున వ్యంజనావృత్తికిఁగల ప్రాధాన్యము తెల్పిరి. అట్లే విజయరాఘవుఁడు దేవినిస్తుతించు సందర్భమున "ప్రతిభావద్విబుధుల్ మహాకవులనల్ప ప్రీతిమైఁబల్కు సత్కృతులన్ వస్తువలంకృతుల్ రసముఁ దాఁగృక్ప్రాభవ శ్రీసము ద్గతమౌ నొండు ప్రతీయమాన రుచిరార్థంబున్ భవత్సుందర స్మితబిందూద్భవ వైభవంబగుఁ గదే" యని ప్రతీయమాన రుచిరార్థమును బ్రశంసించిరి. పారిజాతాపహరణమును వారు "వ్యంగ్యపుం దావి చెడని పదార్థదళము వాడనిరసోత్తరము కవిత్వమ్ము కుదురు"గా వర్ణించిరి.

పుడమి బరువిక రాయలు మోయుననుచుఁ
దీరుబడి చూచుకొని యష్టదిగ్గజములు
చుట్టె శ్రీకారముల్ రసజ్ఞుల శ్రవస్సు
లలర భవ్యమహాకావ్యములకు నాఁడు.

ఇట దిక్కులను మోయు నష్టదిగ్గజములు కూడ ధ్వనితములగుచున్నవి రాయలు పుడమి భారమును తన భుజాగ్రముచే వహింపఁబూనుటచే దానికా బాధ్యత తీరుటయు తీరుబడి కల్గుటయు సంభవించెను. చెవులను కవులు శ్రీకారముతోఁ బోల్చు కవి సమయముకూడ నిందు వ్యంజితమగుచున్నది.

వకుళ శిఖరావలంబి మౌక్తిక సరంబు
కదలికలలోన గండభాగమ్ము విరియఁ
జిఱునగవు కాన్కలొసఁగి తిమ్మరుసు ముందు
రాజసుందరి బింబాధరమ్ముతోనఁకె. 335-210

రాయలు తిమ్మరుసుతో మాటాడెననుటను శ్రీ శాస్త్రిగా రెంత మనోరముగా వ్యక్తముచేసిరో పరికించినవారి కీ కృతియందలి చమత్కృతి మత్త్వము తేట తెల్లమగును. వారి కావ్యమున నన్నయాది మహాకవుల పోకడలెన్నో కానిపించును. రఘునాథుఁడు మధురరాజును జూచి "వీరెవ్వరయ్య మధుర మహారాజులె (424)" యన్న పద్యము నన్నయ ద్రోణునిచే ద్రుపదునిగూర్చి యనిపించిన యా పద్యము సోయగము పుడికిపుచ్చుకొనుచున్నది. "పుడమిన్ ధర్మమధర్మపున్ బెడఁదఁ బెంపుం బాసిపోనున్న యప్పు". (237) ఇత్యాది పద్యము తిక్కనగారి "సారపు ధర్మమున్ విమల సత్యము" అను పద్యమును స్మృతికిఁ దెచ్చుచున్నది. వారు రచించిన పెక్కు సీసముల నడక కవిసార్వభౌముని సీసముల మత్తేభమందగమనమును స్ఫురింపజేయును. వారెచ్చటను అలంకారములకై యత్నింపరు. అవి వానియంతనవి యప్రయత్నముగా నా యా పద్యములందుఁ జొచ్చి యంతర్వ్యాప్యమైన యందము నొల్కబోయును.

నడుమ విసరిన వడగాడ్పునకుఁ దొలంకి
తలలువాల్చు సనాతన ధర్మలతలు
తేఱుకొని యప్పుడపుడె నర్తింపఁ దొడఁగెఁ
బ్రోలయ మనీషి కృషివర్షమునకుఁ దనిసి.
207-22

ముస్లిముల వందయాత్రలు వడగాడ్పులు, ఇందలి రూపకమత్యంత హృద్యము. "శ్రీనాథకనకాభిషేక సమ్మానమంగళాచరణ వాద్యనిస్వాన మదియొక్క స్వాతివాన తనువుగా మొగ్గవిచ్చె ముత్యాలశాల" అని యా వాద్య నిస్వానమున స్వాతివానతనము నారోపించుటయు ముత్యాలశాల మొగ్గవిచ్చె ననుటయు మహామనోహరముగా నున్నవి. గౌడడిండిమ భట్టుపేరు ద్రాcచువలెc గొండవీటి పొంతలకుc ద్రాకెసనుటలోని యుపమానము సౌందర్యము శ్లాఘాలంఘనజాంఘికము.

> జగము సృజియించు క్రొత్తముచ్చట జనింప
> నబ్జయోని సమాధిస్థుcడైన నాcటి
> తొcటితలపేదొ వీరభద్రునకు నంటె
> బహుజనుః ప్రాప్త సుకృతమ్ము పంటగాcగ. 273-206

వాణి నారాణి యనc జాలిన వీరభద్రుని విషయమున నీయుపమాన మెంతో యుచితమై యున్నది. శ్రీ శాస్త్రిగారి రచన యెంత యాలంకారికమో యంత సరసము. ఎంత సరసమో యంత ప్రౌఢము. "సింగబుధునిc గవితారసార్ణవ పూర్ణవిధుని నఖిల శాస్త్రకళాప్రవేశాతి రధుని" చివరి చేర్వాలు నాటి యాస్తికతజాలు" "పోతవ కవిరప కవిత్వసృష్టి ప్రాణయష్టి" మున్నగు నంత్యప్రాసములు వారి కవిత్వమునకు పెట్టని సొమ్ములు. ఆ రాయా సందర్భములందు "నీటికొలcది తామర" "అతనికతండె సాటి" మున్నగు జాతీయములను గుమ్మరించి పద్యముల కఖండమైన యందము చేకూర్చుచుందురు. వారి ప్రౌఢసమాస రచనకుc గావ్యమున ననేక నిదర్శనములు కలవు. తిమ్మరుసు రాయలతో

> కరcగవలెన్ గళారుచిరకల్పనలన్ గరcగింcగావలెన్
> జరుపవలెన్ రసజ్ఞ పరిషద్వితతుల్ జరిపింపcగావలెన్
> మురియవలెన్ వినోద నవమోహనతన్ మురిపింపcగావలెన్.
> నరపతి పూలవాకిలి నొనర్పవలెన్ నిజరాజ్య సంపదన్. 342-11

మున్నగు పద్యములలో వారి తెలుcగు నుడికారపుసొంపు పుష్కలముగా కనిపించును. శబ్దార్థాలంకారముల వాడినను వారు రసౌచిత్యములకు భంగము కలుగనీయరు. "శ్రీ ఉసితమందహసిత ప్రారంభవిధా నిరాదృతాద్యత వాంధ్ర స్వైర చరత్కతిపయ కవిధోరణీ" యని వారు పితృపాదులకు వాడిన విశేషణము వారికి కొంద ఆధునిక కవుల కవిత్వమునెడcగల యభిప్రాయమునకు నిదర్శనము. పితృపాదులయెడ వారికిcగల భక్తి గౌరవము లసాధారణములు. పెద్దన కవితను వర్ణించుచు వారు రచించిన "వికచాంబురుహవనీవీథిc దారిన యట్లు విచికిలామోదంబు విరిసినట్లు" (40) అను పద్యము ఆంధ్ర కవితాపితామహుని కవిత్వమునకు వలెనే శ్రీ శాస్త్రిగారి కవిత్వమునకును అన్వయించును.

—o—

ఉడుగర

తెనుఁగు లెంక

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

తీయని కైతతోడ గడిదేఱిన పాండితితోడ నాంధ్ర రా
ష్ట్రీయవికాసమున్ వలచు డెందముతోడ నపారశౌచల
క్ష్మీయుత జీవనప్రవణ శీలముతోడ నెసంగు సత్యనా
రాయణశాస్త్రికిన్ జయపరంపర సంతతమై లభించుతన్!

తాలను రాగిరేకులఁ బురాతన వాఙ్మయకందరమ్ములన్
మూలుగుచున్న తెల్గుకథ ముమ్మరపుంబడ లోర్చి తీర్చి మేల్
మే లని కోవిదుల్ పొగడ మేటిప్రబంధముగా సృజించి ని
ర్వేల యశమ్ము గన్నసుకవిన్ గొనియాడెద నిమ్మహామతిన్.

మన మనుజేశ్వరుల్ కవు లమాత్యులు యోద్ధలు దాతృతాపరా
యణులు మనీషిపుంగవు లహస్కరసోములు నిల్చునంతకున్
మనఁగల కీర్తి నంది రని మాటికి మాటికి మెచ్చు లోక వి
యనఘుని సాధుసుందరము నాంధ్రపురాణకృతిన్ బఠించుచున్.

కులమత వాద భేదములకున్ దవుదవ్వుల నిల్చి సత్యమున్
బలుకుట వేయిజన్నముల పాటి ఫలం బిడు నన్న ధర్మువున్
వలచుచు శాస్త్రి కూర్చు కవివర్య చరిత్రము తెల్గువాణికిన్
జెలువము సంతరించు కయిసేఁతలలోఁ దొలిబంతి దాఁగదా!

తొలుతను జోళభూపతులతో నిటు వచ్చిన కంచిద్రావిడుల్
తెలుఁగున కున్నతీపి గని దిగ్గన మానిరి మాతృభాష; నే
పెలితియు లేని తెల్గులయి వెల్గిరి; చెళ్పిళసత్కవీంద్రుఁ డీ
వలఁతియు నవ్వ! రాతమిళవాసన వాసిన బాఁపలే సుఁడీ!

అచ్చపుఁ దెల్గువార లదిరా! యనఁ గమ్మనికైత సెప్పి వి
శ్వచ్ఛయ మెన్నఁగా నమరవాణికి వన్నెలు దిద్ది శాస్త్రముల్
త్రచ్చి శ్రుతుల్ పఠించి ఋషిధర్మముఁ గొల్చి తెలుంగుజాతి కీ
సచ్చరితుల్ ఘటించిన ప్రశస్తిఁ దలంచి శిరమ్ము వంచెదన్.

చదురుల నిండియున్ వినయ సంగతి వీడఁడు శాస్త్రి: దైవసం
పద లభియౌను లంచు మారి పల్కుచు నమ్రత నందుఁ జేర్చె; ని
య్యది కొఱవడ్డనాఁడు నరుఁ డర్వాణకున్ దగఁ డెన్ని శాస్త్రముల్
చదివిన నెన్ని కావ్యములు సల్పిన శిల్పములెన్ని కూర్చినన్.

మన్ననచేయఁ దగ్గ నెఱమానిసియా! మధునాన్వవాయుఁ డీ
యన్నను సత్కరించు ప్రజ లైన నలంతులె! పూజ్యపూజకున్
బన్నుట సంఘధర్మ మను పాడి నెఱింగిన కార్యకర్తలన్
చిన్నలఁ బెద్దలన్ సుగుణపీఠములన్ మనసార మెచ్చెదన్.

నేఁ డొక ఝుంఝు రేఁగినది నెట్టన! దీనికి జంకి ధర్మమున్
వీడఁడు శాస్త్రి వెన్కడుగు వేయఁడు మున్నటి నన్నతిక్కనల్
ప్రోడలు చన్నమార్గమునఁ బోవుచు రేపటినుండి యుర్వదా
జేఁడులు నిల్చి పల్కఁగలఁ డిద్ధకృతుల్ శతముల్ సహస్రముల్.

శ్రీగురు మూర్తయే నమః

మధునాపంతులవారి కవిత్వమున లాక్షణికత

శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి

'శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు లాక్షణికమైన కవితారంగమున మల్లచఱచి నిలిచిన జగజెట్టి' అని యొక్క వాక్యము వ్రాసినచో, నావ్యాసము పర్యాప్తమగును. అయినను చాదస్తముగా వివరింపఁబూనుదునా :— సుమారు ముప్పదేండ్ల నాఁటినుండియు ఆంధ్రపత్త్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రసాహిత్య పరిషత్పత్త్రిక, భారతి, మున్నగు నెన్నియో సారస్వత ప్రధాన పత్త్రికలందును. అయనచే నడుపఁబడిన 'ఆంధ్రి యను మాసపత్త్రికయందును, గద్య పద్యాత్మకములగు మధునాపంతులవారి వ్యాసము లెఱుఁగమా? ఆంధ్రీకృతము లగు స్వప్నవాసవదత్త, రత్నపాంచాలిక, రత్నావళి మొదలగు నాటకములు విద్యార్థులు పఠనీయ గ్రంథములుగా పఠించుచుండఁ జూడమా ? వీరేశలింగం పంతులు గారి ఆంధ్ర కవుల చరిత్రమునకు పరిశిష్టముగా నూఱుగు రాధునికకవుల కావ్యజీవితములకు నిష్పాక్షిక విమర్శనాత్మక మైన "ఆంధ్రరచయితలు" అను వచనకృతి యెన్నెన్నిసారులు లక్ష్యముగా స్వీకరించి మేము వ్యవహరింపలేదు ? — 'కావ్యము' అను పేరు మాత్రము లేని మహాకావ్యమై, పురాణము అను పేరున్నను పురాణ లక్షణములకు విలక్షణమై సరస కవితా ధురీణ మైన ఆంధ్రపురాణమును చిరకాలముగా నెఱిఁగిన మాకు నేఁడు వచ్చి నీ వొనర్చు నల్పాల్ప వివరణము తృప్తి కూర్చునటయ్యా' అని యక్షరాస్యు లగు ఆంధ్ర నర నారీలోకము ప్రశ్నింపక మానుదురా ? ప్రశ్నించినచో 'శబ్దమంజరీ సమాప్తా' అన వలసినదే కాని మీఁద నేమున్నది?

అయినను మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి సమ్మాన సంఘ కార్యదర్శి, నిష్కామ కర్మయోగి శ్రీ నార్ని కేదారేశ్వరుఁడుగారి యుత్తరమును తిరస్కరించిన ట్లగు నేమో ? ఎవ రేమన్నను – తక్కిన శాస్త్రిగారి సారస్వత మటుపెట్టి, శాస్త్రిగారిని వ్యాసపీఠ మెక్కించి 'ఆంధ్రపురాణము నంతయుఁ గాదు. అం దందు మాత్రమే. అది యైనను స్థాలీపులాకముగానే మూడలించి విడువ సాహస మూనితిని.

'ఆంధ్రపురాణము' అను పేరు విన్నంతనే 'బ్రాహ్మము' మొదలగు అష్టాదశ పురాణములలోనిదా ? లేక 'సనత్కుమారము' మున్నగు పదునెన్మిది యుప పురాణములలోనిదా యిది' అని యనిపించును. కాని యీపురాణ మారెండు శాఖలకు సంబంధించినది కాదు. పురాణమునకు వలయు సర్గప్రతిసర్గాది పంచలక్షణములలో కొన్నియేని అనుషంగికముగా దీనియందు లేకను పోలేదు – వారి ఛాయతో వినూతన సృష్టితో, రంగస్థలి కెక్కి నిలిచిన పురాతనాంధ్రభూమిపాలుర చరిత్రమునకు దర్పణమైన – అపూర్వ పద్యకావ్యము. పద్యకావ్యమని గద్యములు లేనిది కాదు. ఇట్టి గద్య పద్యమయ కావ్యములను సంస్కృత లాక్షణికులు

చంపువు, లనినారు. అందురుగాక ! ఆంధ్రుల వ్యవహారమున మాత్రము ఛత్త్రిన్యాయమున పద్యకావ్యములుగానే పరిగణింపఁబడుచు వచ్చినవి - అట్టి యీ పద్యకావ్యమును సామాన్యదృష్టితో నరయ శ్రవ్యకావ్యమువలెఁ గనఁబడినను పెక్కు తావుల దృశ్యకావ్యమును దలపించుచుఁ దలయూఁపించుచుండును. ఇతివృత్తము పురాతన మగుటచే ఇతిహాసమును నగుచున్నది.

ఆంధ్ర వ్యాసమహర్షి "నన్నయభట్టారకుఁడు" భారతముగూర్చి

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహ మని
యైతిహాసికు లితిహాస మనియు
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ
యం బని మహిఁ గొనియాడుచుండ

వివిధ వేద తత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశ రాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరఁగుచుండఁ జేసె భారతంబు"

అని చెప్పిన లక్షణములలో నే యొకటి రెండో తక్క మిగిలిన వెల్ల లీయాంధ్రపురాణమున సరిపడుచుండుటచే - "ఆంధ్రభారతము" అన్నను సమంజస మగును. పరిశీలింప భారతమువోలె ధర్మశాస్త్రము. నీతిశాస్త్రము, మహాకావ్యము, సర్వలక్షణములకు లక్ష్యసంగ్రహము, ఇతిహాసము. పురాణమును గూడ నగుచున్నది.

అట్టియెడ కవిత్రయభారతమునకు వ్యావర్తకముగా మాత్రమే శాస్త్రిగా రాంధ్రపురాణ మని నామకరణ మొనర్చి యుందురు.

శాస్త్రిగా రేశుభ ముహూర్తమున శ్రీకారము చుట్టినారోకాని అంధ్ర సారస్వత సరస్వంతమున ఆంధ్రపురాణనామక నౌకకుఁ గర్ణధారత్వము వహించి "భారత ఘట్టోల్లంఘన పటిష్ఠ గాఢప్రతిభుని "నన్నపార్యుని ధ్రువతారగాఁ జూచుకొనుచు ననాయాసముగా నొడ్డెక్కి ధన్యులైనారు

వారి వాఙ్మయమున లాక్షణికత నిరూపించుట అసామాన్య మని మున్ముందు తెలియఁగలదు. అయినను నా కియ్యెడ సాహసింపక తీఱదు. ఈ పురాణమందలి శబ్దమున, అర్థమున, అలంకారమున, కథా కథనక్రమమున - అన్నిట - చెక్కుచెదరని ప్రాచీన లాక్షణికతలో నవీనత మెఱుపువలె తళుక్కు మని ప్రాచీన నవీన దృక్కులకు రెంటికిని విభ్రాంతి గొల్పుచుండును.

కావ్యలక్ష్మికి శబ్దార్థములు శరీర మనినారు పెద్దలు, ఆ రెండిటిలో శబ్దము మొదటిది. దాని లక్షణము తరువాతఁ జూడవచ్చును. కవితా మాలికయం దుఁ గ్రువ్వఁబడిన యాశబ్దము తా నెట్టి పరిమళముల వెదఁజల్లుచు సహృదయ హృదయముల కానంద పారవశ్య మొసఁగుచున్నదో ముందుగా రవంత స్మరింపనిదే శబ్దచర్చకుఁ బోవ మనస్సొప్పకున్నది. అది యైనను పరిమితమే.

సంస్కృతాంధ్రములందలి యేశబ్దము లైనను సరే! శాస్త్రిగారి రచనయందు విలక్షణ మగుటయే కాదు. ముద్ద బంతిపువ్వు రేకులవలెఁ జక్కఁగా నదికికొని యొకానొక యర్థ చమత్కృతిని వెల్లడించుచుండును.

కుమారసంభవ కావ్యమున పార్వతీదేవి తప మొనర్ప వనమున కేగ నుండఁగా - తల్లి వల దమ్మా' యని వారించు ఘట్టమున—

'...తపః క్వ వత్సే, క్వ చ తావకం వపుః ? పదం సహేత భ్రమరస్య పేలవం శిరీషపుష్పం న పునః పతత్రిణః' అన్నది. అమ్మా తప స్సెక్కడ? మృదువగు నీశరీర మెక్కడ ? మృదువైన దిరిసెనపువ్వు తుమ్మెదపాదముమ సైఁచును గాని పక్షి పాదమును సైపఁగలదా ? అని కలదు. శ్రీనాథ మహాకవి హరవిలాసమున ఈకథా సందర్భమునసే "నీ వెక్కడ? ఘోర వీర తప మెక్కడ? ఈపటు సాహసిక్యముల్, తక్కు శిరీషపుష్ప మవధాన పరత్వమునన్ మధువ్రతం, బెక్కిన నోర్చునో విహగ మెక్కిన నోర్చునో నిశ్చయింపుమా ? అని అద్దము నందువలె కాళిదాసుని భావమును ప్రతిబింబింపఁ జేసెను.

ఆంధ్రపురాణమున - ప్రాకృత సారస్వతమునఁ దన్మయుఁ యుండు హాలునకు భార్య ప్రేరణమున సంస్కృతవ్యాకరణము నేర్ప వే డ్క కలిగినది. ప్రాకృతభాషా మహాకవి యగు గుణాఢ్యుఁడు - మహారాజునకు సంస్కృతవ్యాకరణము దుర్భర మగు క్లేశము కలిగించు నని చెప్పెడి సందర్భమున.

చ. మృదు మృదు వైఁ క్రొందళుకు రేకులపువ్వునఁ
జివ్వజెక్కలన్ గదలెడి తేఁటి వ్రాలవలెఁ గాని
జగా మగ మోటు పుల్గు బెట్టిదముగ నల్లి కా
లిడి నటింపఁగ వచ్చునె మెత్తనౌ కళాహృద
యము మీఁది వ్యాకృతి మహీధర భారము
మోవ నేర్చునే? (సాత। ప. 101)

అను పద్యమునందలి ప్రతి విశేష్యమును గూడ రెండు మూఁడు ఉపరంజక విశేషణములు లేనిది లేనే లేదు! అవిశేష్యము లచ్చ తెలుంగై యెంత మృదువుగా నున్నవో యంతకంతె మెత్తగ నుండి యావిశేషణము లొక యనిర్వచనీయ మగు శోభకు హేతువు లగుచున్నవే।

ఈ పద్యమందలి దృష్టాంతము కాళిదాసీయము కాని స్వీయము కాదు. శ్రీనాథుని మించి- యొక దానితో సొకటి యతికికొను మెత్తని పదముల నేరి, అతుకులు తెలియ రాకుండఁ గూర్చి స్వీయమే యని భ్రాంతి కలిగింపఁగలిగిన శ్రీ శాస్త్రిగారి ప్రతిభ యన ఘము. 'యా నేన శబ్దాన్వయ మాలపామో యా నేవ చార్థాన్ వయ ముల్లిఖామః తై రేవ విన్యాస విశేష భవ్యైః సంమోహయంతః కవయో జగంతి' అను పెద్దలసూక్తి కట్టికవీంద్రుల రచనలే హేతువులు.

మీఁది పద్యమందలి "పువ్వులు" వట్టివి కావు. క్రొందళుకు రేకులుగలవఁట। ఆ రేకులును(అరుణా రుణము, ధవళధవళములు అని నట్లు) మృదు మృదువు లఁట! భృశార్థమున ద్విరుక్తః.. నై పద్యమున కది తకును దీప్తి నొసంగు చున్నది. తేఁటిజెక్కలో చివ్వజెక్కలఁట! సన్నగా నిడుపుగా నున్న వని సుకుమార మగు భావన, ఇఁక పులుఁగు అనిఁ జాతి యుండ —అది మగపక్షి అందును 'మోటు' పక్షి యఁట! ఆ మోటుఁ దనము గూడ జగా అత్యధిక మఁట!

ఇట్లు పాఠకుని హృదయమున నాటుకొని పోవు విశేషణములు రసము చిప్పిల్లఁ గూర్చుట యసా మాన్య విషయము! ఇట్లే పురాణమున సర్వత్ర భావ పుష్టితో కడగలకవిత యామూల చూడము నుండుటచే నెన్ని యని చూపఁగలము ?

దీని నవ లక్షణముగా గ్రహింతురు గాక!

ఇఁక నౌకచిత్రము, కాళిదాస వాక్కునందలి గౌరవమునకుఁ దెరచాటు లేకుండ 'రామభద్రగజాధిరాజమ్మౌ' 'గరుడాద్రి' యనెడి హౌదాపయి నధివసించి చెలఁగె రఘునాథనృపతి యాశ్లిష్టసానువైన యాషాఢ మేఘ మట్లు' అను పలుకుబడి 'ఆషాఢస్య ప్రథమదివసే మేఘ మాశ్లిష్టసానుం' అను మేఘసందేశ పద గుంఫనమున కంజలి పట్టినను గ్రంథచౌర్య మని యెవ్వరైన ననఁగలరా? ప్రాక్తన కవిచంద్రుల వాణియెడఁ గల పూజ్యభావము దెలుపుటకే గ్రంథమున నెన్నియో యిట్టి కోమలార్థ ఘటనములు గలవు.

పింగళి సూరనార్యుఁడు ప్రభావతీ ప్రద్యుమ్నమునందు- శుచిముఖి వాక్యరచన నింద్రుఁడు మెచ్చుకొను సందర్భమున 'ఇది కవిత్వ లక్షణము' అని వాచ్య మొనర్పక 'పలుక నేర్చుట బహు తపః ఫలముగాదె! అని కవితా లక్షణము నిరూపించుచు తొలుదొల్త' శబ్దసంస్కార మెచ్చుటను జాఱఁగనీయరా దనెను. కావ్యశరీరముల అట్టి చ్యుత సంస్కార దోషము వ్రణమువలె లేదా మచ్చలవలె నుండి జుగుప్సకలిగించు నని యాతనిభావము,

ప్రకృత మగు నాంధ్రపురాణమున శబ్దసంస్కార మెచ్చుటను అనఁగా సంస్కృతాంధ్ర పదములందెందును జాఱక మచ్చుటగొల్పును 'తిరుగులాడు (12. పు.) మెచ్చుల్ వోవు (85పు) ఊటలు వాఱు (94) ఈదులు వోవు (15 పు.) పిక్క లేసి (46 పు. ఊడని బాడె (58) అని ఈ విధముగా స్వయంకృతములును పరానుకృతులును నగు శబ్దపల్లవధాతువులెన్నియో యిందుఁ గానఁబడును. కాని అవి కృతకములవలెఁ గాక సహజము లట్లు యదికికొని పోఁటు అద్భుతము- ఎల్లయెందు (41 పు 75 పం) ఈ ప్రయోగము బాల ప్రౌఢ వ్యాకరణముల వివాదమునకు బీజమైనది. ఎల్లశబ్దము ద్రుతాంతావ్యయము అని బాలవ్యాకరణము చెప్పఁగా- నిది యవ్యయము గాదు. అని ప్రౌఢవ్యాకరణము సుజంతముగా నిరూపించును. 'ఎటిఁగె సకలశాస్త్రంబులనెల్లయందు భార. ఆ ది. 2. 159. ఎల్లయెందును రా వసియించు నెల్లయెడియుఁ దనయందు వసించుట ఉద్యో 2. 325 ఉదాహరించెను. బాలపక్షమున ఎల్లన్ + అందున్ = అనునది సమాసము 'అంద్వాదీనాం శక్తిమన్మాత్రతా క్వచి దిష్యతే అను నాథర్వణిక కారికచే- 'అందు సప్తమీ ప్రత్యయమే కాకస్వతంత్ర శబ్దము,దానికిఅందు చేత, అందుకొఱకు అందువలన- మున్నగు విభక్త్యంతములు కనఁబడుటచే- 'అందు' ప్రాతిపదిక మయినది. కావున - ఎల్లన్ + వారు అను నప్పుడు ద్రుతము నిత్యముగా లోపించి సమాసమైనట్లే, ఎల్లన్ + అందున్ - అను నప్పుడు గూడ- సమాసమున ద్రుతము లోపించి ఎల్లయందు అగును అని శాస్త్రార్థ ఘట్టము అని తెలుపుటకే శాస్త్రిగారీప్రయోగము నెత్తినా రని గ్రహింపఁదగును 'మాచవిగావు-' ఇయ్యది ముక్కు తిమ్మన్నగారి ముద్దుపలుకు పారి 1-12లో 'పాంకముగాని నీ వలపిబొంకులు మాచవిగావు' అన్నది సత్యభామ. ఇందు హాలుఁడు గుణాఢ్యుని పైశాచీ ప్రాకృత గ్రంథము నిరసించు పట్టున-

'కృతిలోని బాప పైశాచిగ -వ్రాఁత రక్తముగ సాగిన భూర్జపత్త్రి సంతతుల్, మాచవిగావు, అని అనినట్లు చక్కగా మార్పఁబడెను. మాకు చవిగావు అనునది. తెలుఁగు జాతీయము. కేవల మాస్వదనీయము మాత్రమే.

తెనుఁగు భాషలోని సొగసు నింతగా జీర్ణించుకొని సమయాను కూలముగా - ఉద్గారించు నేర్పు గలవారు సత్యనారాయణ శాస్త్రిగారి వంటి వారరుదు. చదివినదానిలోని సొగసుల నేఱిపట్టఁగలరు పట్టి యుచితముగా గూర్చుకొని "నాది" అనపించుకోఁగలరు శాస్త్రిగారు. అదివారి ప్రతిభామహిమము.

ఈ తీరున గ్రంథమునం దంతటను గల విశేషముల నందును అచ్చతెలుఁగు విశేషములను వివరింపనెంచ నది పెద్దగ్రంథము కాఁగలదు. కావున వానిని కొన్ని మాత్రము చూపెదను. సహృదయులు వివరించుకొని యానందింతురు గాక!

కానక కన్నకాన్పు = రామాభ్యుదయచ్ఛాయ, చిరకాలమునకుఁ గల్గిన సంతానము-

"కరఁగియున్న కడుపువెన్న మునింగిరో = పుత్ర ప్రేమమున మునింగిరో, కాదనెనునంత గుండెగలవాఁడ గాను = కాదను నంత ధైర్యము గలవాఁడను గాను అని భావము 'గుండె' యన ధైర్యము అను నర్థమున విచిత్రమగు ప్రయోగము.

"తండ్రి కనుంగవ నిప్పు నిల్వఁగన్" = కన్నుల లో నిప్పు నిలుచు టేమి? నిప్పులు రాలునట్లు ఎఱ్ఱగానైనది. అనఁగా పట్టరానికోపము కలిగె నని మాత్రమే తాత్పర్యము.

కన్నుల వెన్నెలవత్తి = ప్రియురాలు అనున ర్థమున నెంతటి సుకుమారమగు ప్రయోగమో! వాక్కుల కందనిది, "ఇయ మమృతవర్తి ర్నయనయోః" అని భవభూతి యనినదానికం టెను సుకుమారతరము.

""మోముఁదమి పూవు"" (49. వ.) చిటి బాలుఁడు (85) ఈ రెండు ప్రయోగములందును 'తమ్మి'కి 'తమి చిట్టికి చిటి' అని ద్విత్వరహితత్వము - సౌకుమార్యాతిశయ ద్యోతకమై యొక నూతన శోభ కలిగించుచున్నది. ఈ శబ్దములు అక్కటాది గణ పఠితములై సంస్కారమును చెందుచు శాస్త్రిగారి ప్రయోగ స్వాతంత్ర్యము చాటుచున్నవి.

అర్థము విషయమున పఠితృలోకము కడుజాగరూకమై యుండకున్నచో లక్ష్యార్థ వ్యంగ్యార్థములు మనసునకు రావు. వ్యంగ్య చమత్కార గ్రహణార్హత శ్రమసాధ్యము. ఈవిషయమున నొకలక్షణకర్త - 'అంధీభూయ గుణాగుణేషుతరవో వాతావధూతా ఇవ శ్లాఘంతే యది సాహితీం రసవతీ మజ్ఞాస్తతః కిం సుఖం? జానన్ వ్యంగ్య చమత్కృతీః పదగతీ రర్థౌచితీ శ్చావశాదంతః శర్మ య దశ్నుతే రసయితా సా జీవనాడీ కవేః అనినట్లు వ్యంగ్య మెఱిఁగి ప్రయోగించుటయు, వానిని గ్రహించి యానందించుటయు సులభసాధ్యములు కా వన్నమాట.

ఉ. చిత్తముపల్లవింప నటు చెంతకుఁ
జూడుము తెల్గుఱేఁడ! లో
కోత్తర రమ్య శిల్పము కదో! యిది...
రాలకున్ బ్రతుకు లిచ్చిరి సత్క
వులట్లు వ్యంజనావృత్తియ కాని
యొండితరవృత్తి నెఱుంగని శిల్పకోవిదుల్.

(శ్రీకృష్ణ-ప. 197) అనుపద్యమున శ్రీశాస్త్రిగారు వ్యంజనావృత్తి - ఉత్తమకవితాలక్షణముగా సూచించిరియే ఈ కావ్యమున బహుళముగా ధ్వని యనఁబడు వ్యంగ్యమే కనఁబడుచు నుత్తమత్వ మొందినది. అదికవితకు జీవనాడికదా!

'ఎడనెడ ముచ్చటించునెడ
నెప్పుడొ వేలుపుబాసలో తులం
దడవఁబసేగి సూదివలెఁ దాఁకను
బట్టపుదేవి గుర్రివ్వన
య్యెడల నెఱుంగ డిందువడి యింతయి
పోయి సహింపరాక దుం
దుడుకువడున్ నృపాలకుఁడు –
దొడ్డది రాణుల దెప్పు చెడ్డదిన్ —'

హాలుఁడు సంస్కృతభాష రానివాఁడని రాణి అప్పుడప్పుడు చెప్పుచుండెడిదఁట, ఈపద్య మాచ్ఛిక పద భూయిష్ఠ మయ్యును ప్రసాద గుణ భరితమువై సంస్కృతమందలి యర్థగాంభీర్య చమత్కారాదుల నెఱుఁగని లోపము నెత్తి రాజును రాణి దెప్పఁగా, నది సూదివలె హృదయమున గ్రుచ్చుకొని రాజునకు బాధకలిగించు ననిభావము. సంస్కృత స్వారస్యము నెఱుఁగక పోవుటను గ్రుచ్చును – అనఁగా హృదయమున చుఱ్ఱుమని నాటునట్లు పలుకును. కాని గ్రుచ్చుట యేమి? అనిపించును.

'సూదివలె' ననునుపమానముచే నంతగంభీర భావము ధ్వనించుచున్నది. మఱియు డెందము 'ఇంతయి' పోవునట 'ఇచటి ఇంత' అత్యల్పము అనునర్థము హస్తసంజ్ఞచే వ్యక్త మగుచున్నది. ఈ 'ఇంత' శబ్దము సందర్భమును బట్టి అధికార్థమును జెప్పును,

'ఇంతలు కన్నులుండ' అనునెడ హస్తాభినయమును, చేరెఁడు అనునర్థమును ధ్వనితము లగును, ఇంత తలపోయవు అను నెడ అత్యల్పముఅనునర్థము ధ్వనిత మగునట్లే ఇచటను సొగసైన వ్యంగ్యము మెఱయుచున్నది 'దొడ్డది రాణుల దెప్పు చెడ్డదిన్.' అను అర్థాంతరన్యాసాలంకారమున 'స్త్రీలు' అని అనక 'రాణులు' అనుటవలన రాజులను దెప్పుటవలన అను నర్థము వ్యక్త మగుచున్నది. మఱియు ఆ దెప్పు దొడ్డది చెడ్డదియును గూడ నగునఁట, రాజు సరసుఁడైనఁ దనలోపము సవరించుకొనును. విరసుఁడైన రాణికి హానికరము కావచ్చును. అను నంతటిభావము మూఁడు మాటలలో నిమిడినది. 'అణో రణీయాన్ మహతో మహీయాన్' వలె.

ఇందలి శబ్దములు దిరిసెనపూవులు. భావములు మకరందబిందువులు. సానలఁ దీఱిన పదసంస్కారము, అలంకారము రత్నదీపిక. ఈవివరణ మంతయు స్థాలీపులాకము. మిగిలిన రసాద్యౌచిత్య విచార చర్చ సహృదయుల కర్పిత మైనది.

'విసపు బర్రెత్రాఁచు - భూపాలరమణిఁ గొనసరి కోకొట్టె మఱి మేలుకొనని కరణి – పాము రాణిని కఱచిచంపెను. అని భావము – ఈకాసంత భావమునకు నింతటి కల్పనము ఇట్టిదే యీక్రింది పద్యము— 'శర్వవర్మప్రతిన సాతవాహనపతి యెదకుఁ బ్రత్యయంబు కుదురుగొలిపె గుదురు కొలుపలేదు గూడ + అప్పటికేఁడు ఢోల నూఁగు మూఁగబాలుఁడఁట – ఈమూఁడు వాక్యములును రాజునకు శర్వవర్మ ప్రతినపట్ల సందేహము కలిగెననెడి మాత్రము భావనే కలదు. మీఁదిపద్యమునందలి సూక్ష్మాతిసూక్ష్మమైన అర్థాంతరన్యాసమున గంభీరార్థమును – ఇందు మూఁడువాక్యములందు సూక్ష్మతమభావమును గలుగ వచించుట యన – ప్రౌఢియనఁబడు మహాకవిత్వ లక్షణము.

ఒక వాక్యమునఁ జెప్పఁ దగిన యర్థము నొక్క పదమునఁ జెప్పుటయు, నొక్క పదమునఁ జెప్పఁ దగిన యర్థము నొక వాక్యమునఁ జెప్పుటయు కవిత్వమునఁ బ్రౌఢి యనఁబడు నని పదార్థే వాక్య వచనా వాక్యార్థే చ పదాభిధా, ప్రౌఢిః వ్యాస సమాసౌచ సాభిప్రాయత్వ మస్యచ అని మాలతీ మాధవమందలి: 'యత్ప్రౌఢిత్వం' అను పదమునకు వ్యాఖ్యాత లిరువురును దండికవి లక్షణమును నుదాహరించినారు.

ఇట్టి ప్రౌఢి యీ యాంధ్రపురాణమున నామూల మాచూడమును గనఁబడును.

ఇఁక సంస్కృతపద ప్రయోగవిశేషములు కొన్ని యరయుదము. 'తొలిపాలు' అనఁబడు ప్రథమ భాగమునకంటె 'మలిపాలు' అనఁబడు రెండవ భాగమున సంస్కృతపద వైచిత్రి పెంపుగాఁ గనఁబడును. మాసకతిపయము:- "ఒకటి రెండును గాదు మాసకతిపయము నడచిపోయెను జూచుచుండఁగనె" అని (విజయపద్యము. 59) కలదు కతిపయము = కొన్ని, మాస = మాసః . లు అనునర్థమున మాసశబ్దము జాతివాచక మగుటచే 'పోటా యువతి స్తోక కతిపయ గృష్టి ధేను ... ధూర్తె ర్జాతిః' అనెడి పాణినీయముచే కతిపయ శబ్దము పూర్వనిపాత మై- మాసకతిపయము, అగుచున్నది. కాని 'కతిపయ దిన స్థాయి హతిసా దశార్ణాః' అని కాళిదాసును, 'కతిపయ దివసైః' అని విద్యానాథుఁడును కతిపయ శబ్దము పూర్వపదముగా నెట్లు నిపతించిరి అని శంకించుకొని మల్లినాథకవి 'పోటా యువతి స్తోక కతిపయ — ఇత్యాదినా కతిపయ శబ్దస్య ఉత్తరపద త్వేపి దినశబ్దస్య ఉత్తరత్వ మస్య శాస్త్రస్య ప్రాయికత్వాత్' అని త్రోవ చూపవలసివచ్చెను- ఈ రహస్యము సామాన్యముగా స్ఫురించునది కాదు. దానిని ప్రయోగించు నేర్పు గల శ్రీశాస్త్రిగారి శాస్త్రజ్ఞతను గూర్చి వేఱ వివరింపఁ బనియుండదు.

క్షణశః ప్రతీక్షః- (39పు) బహ్వల్పార్థా చ్ఛస్ కారకా దన్యతరస్యాం' అను పాణినీయమున శస్ ప్రత్యయము కాఁదా క్షణశః అని యైనది. ఇట్టివే అనేకశః కోటిశః-

'శతధా కౢప్త సహస్రధా వివృత లక్షానేకశః కోటిశ
స్తత విశ్వోదయ రమ్య రమ్యతర శశ్వత్సృష్టి కళ్యాణికా
రతిపాత్రంబును నెత్తుము మ్మొదలి పేర టాలివో.
(నా యక. 149.)

ఈ పద్యమున శస్ ప్రత్యయాంతము లే కాక ధాల్ ప్రత్యయాంతము లగు శతధా సహస్రధా అను నవ్యయములును గలిగి, సమాసము లగుట విచిత్రము- విశ్వము ఎట్టి దనః- శతధాకౢప్తము, సహస్రధావివృతము- లక్షానేకశః, కోటిశః తతము, అను విశేష ణోభయపద కర్మధారయముతోడి విశేషణ పూర్వపద కర్మధారయము- రమ్య. రమ్యతర, శశ్వత్సృష్టి- యును ఇట్టిదే -

నితరా ముద్భట సంగరము (నాయకప - 144) నితరామ్ + ఉద్భటము. నితరామ్- అ మంత మగు ప్రతిపదోక్తావ్యయము దానితో సమాసము. అపూర్వరీతి నిట్టి యవ్యయములతోడి సమాసములును గలవు.

'ఇదమాస్తా' మి ద్యుపక్రాంత వాదము (విద్యా 143). 'ఇదమ్ ఆస్తాం' అను వాక్యము ననుకరించు

టులో అవాక్యమున కంతకున ప్రాదిపదికత్వమును సుబ్లోపమును గలిగి సమాస మగుట యద్భుతము. "ప్రః కృతతాం గతః కలి రితి శ్రీసూక్తి విద్యాధరమ్మ్రు- ఇత్థార్ధ్యత్య మగా ల్లయం హి కుధియామిత్థం వద త్కిన్నరమ్మ్రు" అను అముక్తమాల్యదకు సహోదరముగా వెలసినది యాసమాసము.

ఇట్టిదే విద్యానగరపర్వము 171లో- "శతమానం భవ తీతి శ్రుతిపాఠ పురస్సర ద్విశుద్ద మహీసురై, వశకృత మహదాశీ స్సం, భృతాక్షతల" అనికలదు. "శతమానంభవతి" అను వాక్యము ఇతి శబ్దముచే అనుకరణ మని చెప్పఁబడుటచే మీఁది సమాసము వలనే దీనికిని సాధుత్వము.

మహత్ + ఆశీస్సు- అను సమాసమున మహచ్ఛబ్దమునకు "గొప్పవాడు, పెద్దది" అని యర్థము. కాని "పెద్దఆశీస్సు" అనరాదు. 'పెద్దది' అర్థమున అది కర్మధారయమై- "ఆన్మహత సమానాధికరణ జాతీయయోః" అను సూత్రముచే మహాశీర్వచనము అని యగును ఇచట పెద్దల యాశీస్సు కావున షష్ఠీసమాసమై- అత్వమును బొందక- "మహదాశీస్సు" అనియైనది.

"పాణౌకృతలక్ష్మీకా" అని విజయపర్వము పద్యమునఁ గలదు. ఇందలి "పాణౌకృత" శబ్దము చాల విచిత్రమైనది "నిత్యం హస్తే పాణా వుపయమనే" అను పాణినీయమున కృఞ్ ధాతు జన్య పద సంయోగమున 'హస్తే పాణౌ' అనునవి గతిసంజ్ఞాకములుగా నిపతింపఁబడి, 'కు గతి ప్రాదయః' అను సూత్రముచే "పాణౌకృత" అను రూపము నొందినది. "ఉపయమనము" అనగా- వివాహము అని కొందఱును, స్వీకారమాత్రము అని కొందఱును చెప్పినట్లు సిద్ధాంతకౌముది.

'పెండ్లాడఁబడిన' అను నర్థమున "త్రైకాల్య సత్యునకుఁ బా, ణౌకృత గిరిరాకపత్యునకు నిత్యునకున్" అని రాఘవపాండవీయమున నున్నది- "స్వీకరింపఁబడిన" అనునర్థమున పాణౌకృత లక్ష్మీకా" అని యీయాంధ్రపురాణమునఁ గలదు వ్యాకరణ శాస్త్ర రహస్యములు తెలిసినను కావ్యమున సరళముగా ప్రయోగించుట 'నాల్పస్య తపసః ఫలమ్'

నాదేయము, పూర్వజన్మీయము, లాలస్యము, పారాధీన్యము, భూయఃస్వాపతేయము, అనిదంపూర్వము, అధికారము, సౌఖశాయనికత, మున్నగు తద్ధితాం తాది విచిత్రప్రయోగము లీగ్రంథమున నడుగడుగునను ప్రస్ఫుటము లగుచుండును.

శాస్త్రీయపద ప్రయోగములందు శాస్త్రిగారి స్వాతంత్ర్యమునకు నొకటి రెండుఉదాహరణములు.

"తత్పరీపాలన" బద్ధ కంకణ తప స్సుకృతంబున (పునఃప్రతిష్ఠాపర్వము. 62) అను సమాసమున "పరి"యను నుపసర్గేకారమునకు దీర్ఘ మాదిష్టమైనది. "ఉపసర్గస్య ఘ ఞ్యమనుష్యే బహుళమ్" అను సూత్రముచే పరీపాకము, మున్నగు శబ్దముల సిద్ధి పాలన శబ్దము ల్యుడంతముగదా! అది పరమగుచుండ దీర్ఘ మెట్లని శంక కలుగ వచ్చును. కాని సూత్రమందల బహుళగ్రహణముచే ల్యుడంతము పరమైనను దీర్ఘము రావచ్చు నని శాస్త్రిగారి ఆశయమై యుండును. 'పరీమళ' శబ్దమునందలి 'మళ' అనునది ఘఞంతము కాకున్నను బహుళగ్రహణముచే ఉపసర్గదీర్ఘము నంగీకరించి నట్లు"

పరిపాలన శబ్దమునందును నంగీకరింప వలసి యున్నది.

సూయాణము :- (సాత. ప. 227) శబ్దరత్నాకరము ననుసరించి "దండయాత్ర" అను నర్థమునఁ బ్రయుక్తము. చిరకాలముక్రిందట ఆ శబ్దమున కర్థము చెప్పఁ బండితులు పత్రికలందు చర్చించినట్లు జ్ఞాపకము;

సీ. నడదినియలు సేసె నగరికి మాణిక్య మకుటమ లో దాల్చిన మనుజపతులఁ దగు నాజ్ఞ సూయాణముగ నొనరంచె మ చిగ నేలనాలుగుచెఱఁగుల కును. (విదా. 5-320లో) ధర్మరాజును వర్ణించు ఘట్టమున తిక్కనగారి ప్రయోగమున సూయాణ' శబ్దము కలదు. నేల నాలుగు చెఱఁగులకును వన శాసనము ను దండయాత్రగాఁ జేసె ననుట యంత సంగతముగాఁ గనబడదు. కన్నడపదము గా- కిట్టెలు వననిఘంటువున "సూచియాన" శబ్దభవ మని శబ్దమణిదర్పణమున నున్నట్లు తెలుపుచున్నాఁడు. సంస్కృత నిఘంటువులం దీసూచియాన పదము లేకున్నను- శబ్దమణిదర్పణము నాధారముగాఁ జేసికొని సూచియానము - సూదియొక్క నడక అను నర్థము గ్రహించి, వస్త్రపుటంచులందు నానావర్ణములను దారములనో సూదులతో పువ్వులవలెను, తీగలవలెను, కుట్టుట, బులూపని" అను నర్థమును గొందరు పండితులు నిర్ధరించిరి ప్రకృతమున ధర్మరాజుశాసనము- తగినది అనఁగా సముచితమైనది యగుటచే 'నేల నాలుగువంకలను వ్యాపించి, ప్రజలచే అలంకారమువలె శిరసావహింపఁబడుచుండె' నను భావము ప్రక్రమమున కనువుగా సరిపడుచున్నది. ఈవిషయమున శబ్దరత్నాకరము శాస్త్రిగారిని భ్రమపెట్టినదనవచ్చును. లేదా నాది భ్రాంతి కావచ్చును. మఱియు పురశ్చీనుఁడు, పురస్తాత్పరికాలంకృతుల్ (కృష్ణ. ప. 88) అశ్వోరసము (విద్యా. ప. 241) నాపాయము (233) స్వతోజనితము (159) మొదలగు వ్యాకరణవిశేషములు గలపదము లెన్నియో యిందుఁ గలవు. విజ్ఞులు గ్రహింతురు గాక.

రచనలోని చమత్కారము చూతము. విశిష్ట పదచన రీతి యనియు నదియే కావ్యమునకు "ఆత్మ" అని వామనుఁడు పలికెను అట్టి విశిష్ట పదరచన యని తెలుపుటకే సంస్కృతాంధ్రపదముల విశేషము స్థాలీపులాకముగాఁ జూపితిని- ఆనందవర్ధనాచార్యులు కావ్యమునకు ధ్వని ఆత్మ అనినారు ఆధ్వని. అనఁగా వ్యంగ్యార్థము 1 శబ్దము 2 శబ్దైకదేశము 3 అర్థము 4 వర్ణములు 5 రీతి. అనువాని నెల్ల నాశ్రయించియుండును. అని ఆలంకారికు లందురు. అవి యన్నియు నీపురాణమునందలివి వివరించినచో గ్రంథము పెరుఁగును. కావున అట్టి ప్రయోగములు కొన్ని చూపెదను. వానిని సహృదయులు వివరించుకొందురుగాక -

హాయి నకు సంస్కృతవ్యాకరణాధ్యయనము పూర్తి యైనవె. అదిచూచి యాత్రవిరాణి ఉప్పొంగిపోయినది ఆపట్టున రాణి

"మసలి వ్యసనుని జవ్వనంపు బెడంగు గని మురిసి పోవు సుకన్యయయ్యె" (పాప. ప. 140) నట.

"గుణాఢ్యుఁడు ప్రతిజ్ఞప్రకారము మూఁడుభాష
లున్ వీడిన మూఁగయై"

కానలకేఁగి- యెవ్వరితో నెట్టిసంభాషణను లేక
"దక్షిణామూర్తి యవతార తత్త్వజలధిఁ
జిందివిన యొక్కయమృతపుఁ జినుకుకునుక"
యయ్యెనట

మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వము
దక్షిణామూర్తిగాన.

ఉభయభారతి:- శర్వవర్మకును గుణాఢ్యునకు వాగ్వివాదములు పొడమినపుడు హాలుని భార్య మధ్యవర్తినియై- పూర్వము మండనునకును శంకరాచార్యులకును పూర్వోత్తర మీమాంసా శాస్త్రము లందు వాదమేర్పడఁగా మండనుని భార్య, సకల శాస్త్ర నేత్రి 'ఉభయభారతి' యెట్లు మాధ్యస్థ్యము తీర్పుతీర్చెనో యట్లే నిష్పాక్షికముగా తీర్చెడి దని భావము.

తెలుఁగుకోటలోని ఆహారపదార్థము లెవ్వరికిఁ దెలియకుండఁ దోఁపుపోయిన వఁట! కాని అసంగతి దేవుఁ డెఱుఁగు నఁట. 'అపాండవాస్త్ర మాయా రసకుండు ద్రోణసుతుం డెఱుఁగు నఁట! ఈ అశ్వత్థామ వంటి మాతుకుఁ డెవఁడో శత్రువులకు కోటలోని ఆహారపదార్థములు వశ మొనర్చియుండును. ఆ 'యశ్వత్థామ' ఎవ్వఁడో మాత్రము తెలియ రాకున్నది.

'ముసలి యభిమన్యువోలె నమ్మొగ్గరమున' వృద్ధుఁ డగు ప్రతాపరుద్రుఁడు శత్రువుల చేతఁ బడుటకు అవ్యవహిత పూర్వమందు ఒంటరి యయ్యు భీకర యుద్ధము చేయుచుండెను. కాని పద్మవ్యూహమునఁ జిక్కుకొని వైరులకు భయము కలుగ యుద్ధము చేయు పదాఱేండ్ల యభిమన్యునివలె నున్నాఁ' డను పెద్ద గంభీర భావము ముసలి యభిమన్యు పదమున వ్యక్తమొనర్పఁబడెను. ఆహా! 'అర ముగ్గిన గాంగేయుఁడు' ప్రతాపరుద్రుఁడు దేహముచాలించెనఁట'- భీష్ముఁ డెట్లు స్వేచ్ఛామరణ, మొందెనో యట్లే వయసుచెల్లిన ప్రతాపనృపతి శత్రువులచేతిలో మరణింపక ఇచ్ఛాపూర్వకముగా నర్మదాపూరమున యోగమార్గ మూని దేహము విడిచెనను గంభీరార్థము వ్యక్త మగు చున్నది. పవిత్రుఁడు. రాజయోగి ప్రతాపుఁ డయినాడు.

ఇట్టి పౌరాణిక పురుష గుణవిశేషములతో ప్రకృతగాథకు దీప్తి కలుగునట్లు నడచిన రచనలు చదువుతవు డెవని హృదయము ఝల్లు మనకుం డును?- ఎన్ని యని చూపఁగలము?

ఈరీతిగా శాబ్దికముగా ఆర్థికముగా నీయాంధ్ర పురాణ మేకాకారపుష్టి గలిగి శాస్త్రిగారి ప్రతిభావ్యుత్పత్తులకుఁ గరదీపికగా, కీర్తికి వైజయంతికగా వెలసినది.

పద్యకవితకు గుండెకాయ వంటివి యతి ప్రాసములు. అందు 'యతి' యా ధారావేగములో నెట్లు మొలిచిన ట్లదికికొనిపోయినదో యోగదృష్టి కేని గోచరింపదుగదా! 'కైత నేరుపు యతి గూర్చు కైపె తెలుపు' అని యడిదము సూరకవి యిట్టికవితలరసియే చెప్పియుండును. ఎంత దుష్కర ప్రాసమైనను తీఁగ ప్రాఁకినట్లు వెనుకటి పాదము కొననుండి క్రింది పాదమునకు ఉగి యదుకుకొని పోవలసినదే! ఎట్టి దుష్కరప్రాసము నైనను సుకరప్రాసముగా గూర్పఁ గల పోతనామాత్యున కీశాస్త్రిగారు గురువో శిష్యుఁడో యై యుండినట్లు తోఁచును.

మఱియు "తన్నుఁ గానివించుకొని", మంత్రిని రావించుకొని ఇత్యాది విచిత్ర పదబంధములందే కాదు. అప్రయత్నముగా రెండుమూఁడు పదములతో మాత్రమే సహజముగా వచ్చినట్లు "మాతంగ,

తురంగ" - "మాణిక్య గాణిక్య" - "తురంగ, తరంగ" "వేలావ, నైలావతీ" - "లుంగ, లవంగ" - "శౌక్తిక, మౌక్తిక" - మొదలగు సన్నయగారి ప్రయోగములు కనుప్రాసములుగా నీయాంధ్రపుంజమున లెక్కకు మీఱి యుండుట శాస్త్రిగారి తపఃఫల మనిపించును.

శ్రీనాథునివలె ఎత్తుగీతులందును. గీతపద్యములందును అంత్యానుప్రాసములు పెక్కులు గానఁబడును.

> ఎ గీ... వేంకటరావు, బావ మెన్నఁగపిలగోవు
> వెన్న అనియు
> ... వేణుగోపాలరావు మల్లెపూవుల ప్రోవు
> అనియు నెంతముద్దుగా గూర్పఁబడినవో!

> గీ. చుఱుకుఁజూపుల, బదనైన చిఱుతనవ్వు
> ముండ్ల నిండిన పసిఁడి మొగలిపువ్వు
> పూవుఁ బుడికిన విష సర్పమూర్తి ముట్టు
> బాలుఃదాఁకిన సింగపుఁ గాలిపెట్టు.

ఏవంవిధము లెన్నియో! అనిర్వచనీ యానంద దాయకములు. ఇందు శబ్దగతము లగు నిట్టి వైచిత్రిని మించి యర్థగత వైచిత్రి సర్వత్ర యుండుట యపురూపము. వాచ్య, లక్ష్య, వ్యంగ్యము లనెడు మూఁడు విధము లైన యర్థములలో రమ్యతరము రమ్యతమము అని నిర్ణీతములైన లక్ష్యార్థ వ్యంగ్యార్థములు ప్రతిస్థలమున నందుటచే నీకావ్యప్రశస్తిని జెప్పుట దుస్సాధము.

"మేగిమాట మీచెవి వైతుము". అని కలదు. మాటను చెవిలో వేయుట యనుచో ముఖ్యార్థము బాధితము కాఁగా లక్షణచే వినిపించుము" అను నర్థము స్ఫుట మగును. "కేవల పౌరుషంబునొ కించిన లాభ మేమి?" అనుచోట ఒలికించుటకు పౌరుషము ద్రవద్రవ్యము కాదే! అను ముఖ్యార్థ బాధయందు లక్షణావృత్తిచే ఒలికించుట యన "ప్రదర్శించుట" యను నర్థము స్ఫుటమగును.

ఎడందవెన్న కరఁగెన్, కన దమ్ములఁ దేనెగ్రమ్మె మొదలైన లక్షణోత్పాదిత వ్యంగ్యములు పెక్కులిందు లేకపోలేదు ఇట్టి లక్ష్యార్థ వ్యంగ్యార్థములే కాదు. ఉప మోత్ప్రేక్షా రూప కాతిశయో క్త్యాద్యలంకారములును, ప్రసాద మాధుర్యాది గుణములును, మధురాతిమధురమ లైన సముచిత నానా రసములును గలిగి యాంధ్రవాగ్దేవతావతంస కుసుమమైన మధునాపంతుల వారి కవిత్వమందలి లాక్షణికతకు నా యీయసంపూర్ణాల్పాల్ప వివరణము స్థూలారుంధతీన్యాయ లక్ష్యముమాత్ర మని విన్నవించుచున్నాను.

'మధునాపంతుల అన్నగారి

సంప్రదాయ మర్మజ్ఞత'

శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు

సంప్రదాయము నిలచిన నీరు కాదు. తటద్వయమ్మొరసి ప్రవహించు నిర్ఝరిణి. నదిలో జలమెప్పుడును ప్రవహించుచునే యుండును. ఎప్పుడును క్రొత్తజలమే. గట్లుమాత్రమే ప్రాతవి. అయినను మనము ప్రవాహనిత్యత్వ మంగీకరించుచున్నాము అట్టిదే పరంపరానిత్యత్వము. అది సంప్రదాయము. మందబుద్ధులకీ సంప్రదాయ రమణీయత భాసింపదు. అసలు పరిశుద్ధాంతఃకరణ మున్నవారికే రసానందలబ్ధి. రసానందము బ్రహ్మానంద సహోదరముకాదు. ఇది ధ్వనికారుల మతము. అభినవగుప్తపాదుల మంగళాచరణ శ్లోకమీ విషయమునే ప్రతిపాదించుచున్నది. శమాది షట్కసంపత్తి కలవారికే బ్రహ్మానందానుభవమని ఉత్తరమీమాంసా పారిభాషికము. ఇక్కడ పరిశుద్ధాంతఃకరణ మున్నప్పుడే కావ్యరసానందలబ్ధి. విషయ మొక్కటే. పరిభాషమాత్రము వేరు. ఇది సాహిత్యదర్శనముకదా! అందుచేత.

పూర్వభూమిక యొకటి యున్నప్పుడే ధ్వని-వ్యంగ్యము. ఇది సంప్రదాయగతమైనది. కావ్యచ్ఛందోరీతులలో మాత్రమేగాక ఆలంకారిక శిల్పవిషయము లన్నిటియందు సంప్రదాయము నిక్షిప్తమై యున్నది. కవి తీసికొన్న వస్తువునకు సంబంధించిన సంప్రదాయము మరియొకటి.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి అన్నగారు సంప్రదాయనిష్ఠుడు. ఆయన ఆంధ్రపురాణమున తీసికొనిన వస్తువే 'పురాఽపినవమ్'. అనగా సంప్రదాయ మనియే వస్తుధ్వని. మనకు వేదకాలమునుండి తల్లితండ్రులను దేవతాభిన్నులుగా నుపాసించుట సంప్రదాయము. శ్రీరామచంద్రుడు, భార్గవుడైన పరశురాముడు పితృపదాబ్జ భక్తులు. భార్గవులైన శ్రీ మధునాపంతుల అన్నగారు పితృశుశ్రూషగా 'ఆంధ్రమహావీరచరిత్రవించితిని'. అన్నారు. (తాతా! నీకు శుశ్రూషకున్), ఇది పరిమళితమైన రక్తగతసంప్రదాయ గుణోజ్జ్వలత కాక మరేమిటి ? పర్వాంత పద్యములందీ పితృభక్తి సర్వదా భాసించుచున్నది. తండ్రిగారు తనయుని సమ్యగుపాసన భాగధేయులట.

సంప్రదాయమే ఆలంబనముగా నున్న శ్రీ మధునాపంతుల అన్నగారి రచనలలో సంప్రదాయ మర్మజ్ఞత చూపించుట యనగా "కళ్లము"లోని ధాన్యరాశినుండి గింజల నెత్తి చూపించుటవంటిదే. అధికముగా సంప్రదాయ దూషణము విజృంభించు నేటి కాలమున అన్నగారు సంప్రదాయ నిష్ఠులని నిరూపించుటకు మాత్రమే యీ ప్రయత్నము. ఒకటి రెండు నిరూపణలు.

శ్రీ దేవీస్తుతులు కావ్యప్రపంచమున, పురాణ, తంత్ర, నైగమములందు పెక్కు. అన్నిటి కంటె మౌలికమైనది శ్రీ సూక్తము. ఇది ఋగ్వేదీయమైనది. శ్రీసూక్త విధానపూజాదులు ఉత్తమమైనవి. అందుచేత శ్రీదేవీ పూజా కల్పనాదులందు "ఋగ్భి రేవ" అని వైదిక అభియుక్తోక్తి. ఇది గూఢమైన, అతిమర్మమైన రహస్యవిషయము. దీనిని శ్రీ మధునాపంతుల అన్నగారు పాటించినతీరు మనోహరముగా నున్నది.

ఆంధ్రపురాణమున నాయకరాజ పర్వమున శ్రీరంగని ధునిదేవేరికి తంజనగరేశ్వరుడు విజయరాఘవునియందు జాలిపుట్టిన ఘట్టమున్నది. ఆయన వీరవ్రతనిష్ఠ చెడిపోకుండునట్లామె రక్షించినది. ఎప్పటియట్ల పండ్రెండువేలమంది తిని త్రేన్చిరి. శ్రీరంగమున శ్రీరంగనాథేశ్వరి ముక్కుఅ మాయమైనది. ధర్మకర్త పూజాదులను పెంకించినాడు, ముక్తామణి ముక్కుఅ పోగా అమ్మవారి ముక్కునందమింత కుందలేదుగాని పూజాదులకు ప్రాణసంకటమైనది. రంగనాయిక మది దయారసము వెల్లువయై యొక ముదుసలి పేరంటాలుపై నావేశించి కలరూపు వచించినది.

"పొంగళ్లె తడినంట కట్టియల వార్పుల్ రాక యప్పాచకుల్
దిసలందంగని ప్రాకృతాంగనయుఁ బోలెన్ బోయి యాప్రొయ్యిరాఁ
జంగఁ జేసైచితి నంటచేసితిని దంజావూర; నాసందడిన్
దిగజాఱెం బొగచూఱె ముక్కుకొస ముత్తెంబింత గుర్తింపరే!"

ఆ పలుకులువిన్న గుడియేలిక శ్రీరంగపురాధీశ్వరుని కీవృత్తాంతముచెప్పి కొందరు పెద్దలతో తంజాపురమునకుపోయి విజయరాఘవుని దర్శించి యావద్వృత్తాంతము విన్నవించెను. ఆ రేడు అమ్మవారి అభిమానమున కంజలించి తానై మంత్రులవెంట నన్నసత్రశాలకు పోగా నచ్చట అమ్మవారి నాసాముక్తామణీ దర్శనము లభించినది.

......'అమ్మవారి నా
సామణి దోసిటంగొని ప్రశంసలొనర్చుచు మోదభాష్పధా
రామధుపర్కపూజ లొనరన్ గనుదోయికి నద్దుకొంచు నా
భూమివిభుండు వేడెనిటు ముత్తెపుముక్కర చిత్తగింపగన్"—

....

దాసీభూత సమస్త దేవతలు చేతఃప్రీతి నీదీప్తి నెం
తే సేవింపగసాగి వేగిరమ తల్లీ ! రంగధామేశ్వరీ
నాసాగ్రంబున కీవు భూషణమవై నంగాని యోగుల్ నిది
ధ్యాస ధ్యానములందు ముక్కకొస లందన్ లేరు నిక్కంబుగన్...

తరువాత విజయరాఘవుడు తొమ్మిది నాసామణులను చేయించుకొని, వేనవేలు మేలి కానుకలను భద్రపరుపబడిన పసిడిపల్లకితో శ్రీరంగపురము చేరి అమ్మవారికి సమర్పించి "శ్రీరంగధామేశ్వరీ చరణసన్నిధానంబున నిలంబడి భక్తినిభృతాంజలియై అమ్మంగళదేవత కీవిధంబున నివేదనం బొనరించుకొనియె.

"కృతబుద్ధిన్ సకలాంధ్ర ... లోకైక దీపాంకురా !"
"క్షితిపై సర్వజనుల్ ... బాలార్కకోటిప్రభా !"
"నితరాముజ్జ్వల ... నారాయణీ ! పావనీ !"
"అతిసృష్ట్యాదుల ... సర్వభూతేశ్వరీ"
"క్రతుసంతానము ... ముకుందప్రియా".

విజయరాఘవుని నోటివెంట పలికించిన భావములన్నియు శ్రీసూక్త సంబంధమైనవి. ఇది అన్నగారి సంప్రదాయ నిష్ఠాగరిష్ఠత్వము. దీనియందు మరియొక ప్రగాఢ భావసౌకుమార్యము. శ్రీసూక్తము వైదికమంత్ర మండలములోనిది. దాని భావశబలతను చతుర్థుడైన విజయ రాఘవుని నోట పలికించినచో శిష్టులాగ్రహింపరా ? అది గ్రహించియే శ్రీసూక్తమునకు అనుబంధముగానున్న శ్లోకములనుండి మాత్రమే అన్నగారు పదములను తీసికొని విజయరాఘవుని నోట పలికించిన పద్యములందుపయోగించిరి.

ఇది శ్రీ మధునాపంతుల అన్నగారి సంప్రదాయ మర్మజ్ఞతకు చిన్న యుదాహరణ.

—o—

నేనెఱిగిన కవులు : "మ ధు నా ప ం తు ల"

శ్రీ అంబటిపూడి వెంకటరత్నం

...చరిత్రాత్మకమైనది ఆంధ్రకథా బంధురమైనదీ అయిన కావ్యాన్ని అన్వేషిస్తుండగా "ఆంధ్రపురాణం" కంటబడింది. నా ప్రాణం లేచివచ్చింది. ఆ పద్యాలు చదువుతుంటే నాకు శ్రీ శాస్త్రిగారితో బాంధవ్యమున్నట్టే భావించాను. రచనలోగూడా ఎవరివో పద్యాలు నేను చదువుతున్నట్లు అనుకోనేలేదు. గ్రంథమంతా రసవత్తరంగా రచించారు. ఆంధ్రుల చరిత్రను ఇలా రాయడమనే ఊహ నాకిదివరకు తోచనే లేదు. విశ్వనాధవారి ఆంధ్రప్రశస్తి, అటువంటిదే సత్యదుర్గేశ్వరుల గ్రంథమొకటి చూచాను. అవి ఖండకావ్యాల సంపుటులు అన వచ్చు. ఇందులో ఏకత్వం సాధించడానికి ఒక కృషి చారిత్రకంగా కనుపడుతున్నది. ఏదో ఒక కావ్యవస్తువు కోసం చరిత్రను అన్వేషించడం అనే ఆలోచనలో పడి నేనున్నానేగాని, ఈ నూతన రీతి రచన నాలో అంకురించలేదు. వారి గ్రంథం చదివి మూశాను. నిజంగా ఆంధ్రులకు తగిన గ్రంథం. ఆంధ్రులు గర్వించతగిన గ్రంథం ఈనాటికి నిర్మింపబడ్డదనుకొన్నాను. ఇంకా అనుకున్నాను. ఇది రేపు స్థాపింపబడే మహాంధ్ర రాష్ట్రానికి పూజ్యగ్రంథంగా గ్రహింప బడాలనీ వారికి గొప్ప సన్మానం జరిగితే బాగుండునని ప్రతి విద్యాలయం, ప్రతి గ్రంథాలయం దానిని తప్పక కొని మహారాష్ట్ర నిర్మాణవేళ దాన్ని పూజించి ఊరేగించాలని ఏమేమో బహువిధాలుగా అనుకున్నాను.

శాస్త్రిగారికి కూడా మహాకావ్యరచనకు తగిన కథాంశము ఒకటి దొరకక ఆంధ్రత్వం చొప్పిల్లే బహు కథలను రచించడమే మనకు ప్రస్తుతం ఉన్న అవకాశమని సిద్ధాంతంచేసి కున్నారు కాబోలు. అనుకున్నాను.

మధువు లూరే కవిత్వంతోనిండిన 'ఆంధ్రపురాణం' వంటి పద్యగ్రంథం మనకీ మధ్య వచ్చినట్లు లేదు. ఇది ఆంధ్రుల అదృష్టం. అదిన్నీ మహాంధ్ర రాష్ట్రావతరణవేళ మహాంధ్రం లోని బహుచారిత్రక ఘట్టాలను వర్ణించేది కావడం, దానికి మహాకావ్యత్వ సిద్ధి కలగడం; నిర్దుష్టం కావడం ముఖ్యంగా ఆంధ్రులకు ఆరాధనీయం కావడం తెలుగువారుచేసిన తపస్సు నకు ఫలమని నా విశ్వాసం.

"ఖాలముదప్పి పుర్వులకు భుక్తులు వెట్టెడి తాటియాకు గ
ట్టలు నెపుడెప్పుడో పుడమి డాగిన శాసనరాజి, వగ్గువా
రల బడినివ్వటిల్లిన పురాణ కథల్, ససిమాయు శిల్పముల్
తెలుగుచరిత్ర తొల్లిటి గతిన్ వచియించును గొంచియమ్మగన్"

కాబట్టి, ఇదమిత్థమని గట్టిగా నిర్ణయించుటకు వీలులేని ఆధార ఖండాలతో జాతి చరిత్రను నిర్మించడం కడుంగడు కష్టభూయిష్ఠం అయిన పని. ఉన్నదాన్ని ఎలాగో అతుకు పెట్టుకోవాలె. కొంత తెలిసి కొంత తెలియని చరిత్ర. దీన్ని వర్ణిస్తున్నారు కావ్య సరళిలో.

“ అరమరుగు మేలిముసుగులో నందగించు
నాంధ్ర చారిత్ర సురసుందరాంగి భంగి
మనసు పండువుగా నెంచుకొనెడి సిరికి
నోచువాడు రసజ్ఞత మోచువాడు ”

కనబడీ కనబడని ఆంధ్ర వధూటి సౌందర్యం ఇదివరకు కవులచే వర్ణింపబడ్డదే.

“ అరచాటగు నాంధ్రనవధూటి చొక్కపుంజనుగవరీతి ” యని “ కన్నియచన్నిపొన్ని మేల్పూన్న తల చన్నుదోయివలె ” నని విని ఉన్నాము కాని ఆ పోలికను చరిత్రకు పట్టించి ప్రస్తుతానికి సమన్వయ పరచడం ఎంతయినా సమంజసం. నిజానికి పూర్తి చరిత్ర లభ్యంకాలేదు తెలిసీ తెలియని చరిత్రలో కూడా సహజాంధ్ర సౌందర్యం ఉందని కావ్య పఠనకు మనకు ఉత్సాహం కలిగిస్తున్నారు శాస్త్రిగారు ......

సరిఅయిన పాఠకుడు కన్ను పెట్టుకొని చదివినట్టయితే జోటులు వలె కావ్యమణులు దొరుకుతవి. అవి కవియొక్క కవిత్వమనిపించు కొంటవి. దాన్ని గ్రహించడం సహృదయుని ధర్మం. ఆంధ్ర పురాణాన్ని చదివితే కావ్య మణులు లభిస్తవి. మహాకవి సందర్శనమవుతుంది. శాస్త్రిగారి పటం సంస్కృత సమ్మేళన సంచికలో చూసాను. “ ఆంధ్ర రచయితలు ” అనే శాస్త్రిగారి గ్రంథం ఇదివరకు చూచాను. వారు ఇటువంటి పద్యకవితా సమర్థత కలవారను కోలేదు. వారిని నేను చూడనట్లుగాని, వారితో నాకు పరిచయం లేనట్లు గాని నాభావనలో లేదు. వారునాకు సన్నిహితులని ఆప్తులనిఎందుకో నా భావం. వారి పద్యాలు చదువుతూఉంటే అంత ఆత్మీయతతోటి అనుభవం పొందుతాను. కాబట్టి నేనెరిగిన కవులతో వారి నొకరినిగా వ్రాయ సాహసించుచున్నాను.

ఈరీతిగా “ రామాయణ ” కర్తగా విశ్వనాథను, ‘ శివభారత ’ కర్తగా గడియారం వారిని, “ ఆంధ్రపురాణ ” కర్తగా మధునాపంతులను నేనను కుండే రీతిని సూచించాను.

(ఆంధ్రపత్రిక 1956 సెప్టెంబరు 8 సారస్వతాను బంధం నుండి గ్రహింపబడినది).

అభిజ్ఞ వాణి

"జే యనిపించుకొందువు"

శతావధాని వేలూరి శివరామశాస్త్రి

ఏ యెపుడో! గ్రహించి లిఖియించితి "గొప్పకవీశ్వరుండవై
జేయనిపించుకొందువని" చేసితి నన్ ఋతవాది సత్యనా
రాయణశాస్త్రి! కావునను సార్థకమాయెను నీదుపేరు మా
నాయన! నీదు నుత్సవమునన్ తన యుత్సవ మబ్బె వాణికిన్.

అద్యతనుల్ కవిప్రతతు లాంధ్రపురాణము నంది యర్ఘ్యమున్
బాద్యము వెట్టుడుం జదివి నైచితి దానిఁ బఠించుచుండఁగా
నద్యము పుట్టి హాలుఁడును నన్ని గుణాఢ్యులు వారె రాజరా
జాద్యు లిటాడుచున్న యటులైనది నూ! కలయిద్ది కాదుగా!

ఏమో మీరు కవీశ్వరుల్ కలపుచం దే యింద్రజాలంబునో
యామోదంబునొ లేక యేపసరునో యంటించి వ్రాయింతురా
స్వామీ! మమ్ములఁ గీలుబొమ్మలుగ నల్పం జాలునా లేనిచో
ఈమేమెక్కడ రాజరాజెచట మాకీ బంధ మెట్లయ్యెడిన్.

ఈయెడనున్న సత్కవుల నింతకు ముంగలి సత్కవీశులన్
వేయివిధాల విశ్వపదవిన్ నిలబెట్టితి విట్టి యొక్కని
న్నోయని పిల్చి సేసలిడనోపరె యెల్లరుఁ గూడి సత్యనా
రాయణ! వారివాఁడనయి యట్టులొనర్చెద నేన యొక్కడన్.

పద్యము సెప్పగాఁగలము పట్టను నీదగు పేరు సెప్పినన్
గద్యముగూడఁ బద్యమయి గర్వముతోఁ బరువెత్తుఁజూచితే
మద్యమయారె నీకవిత; మంత్రము నీదగుమాట చెల్లరే!
ఖాద్యము నీను బాస; సరిగా వచియించితినా కవీశ్వరా!.

చిరివాడ (30-9-1957).

" అక్షరలక్షలు "

మహాకవి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి

సాయముపాస్తివేళ వికసత్సుమగంధ మధూర్జి తాయువుల్
వాయువులింపునింప రవిభాను తళత్తళ దూర్మిమాలికా
ప్యాయన గాంగపూరమటు లాంధ్రపురాణమునంది సత్యనా
రాయణ శాస్త్రి! తద్రస పరాయణతన్ బఠియించితింజుమీ!.

నీ సాహిత్యము నీదువ్యాకరణ పాండిత్యంబు వాగర్థసా
రాసారాది వివేక పాక పదబంధౌచిత్య సాహిత్య వి
న్యాసంబుల్ కవితా తపఃఫలిత నవ్య స్తవ్య కావ్యత్వ రే
ఖాసాకారము లౌటఁగంటి మదిఁబుల్కల్ మిట్టి కన్నారగన్.

తలిదండ్రుల్. గురుపాదులిట్లు నిజసంతానంబు సుశ్రీకమై
ఫలితంబై కృతియై కృతార్థమగు సౌభాగ్యంబు భోగించి రం
జిలఁగా నాంధ్రపురాణ కర్తవయి శాస్త్రీ! సత్యనారాయణా!
యలరం జూపితి వాత్మవంశ గురు విద్యావంశ రత్నప్రభల్.

కలిగె మహాపురాణ మయగాథలు నేఁడు మహాంధ్ర జాతికిన్
గలిత నవార్థభావ రసగర్భము లుజ్జ్వల కావ్యసంపదల్
తెలుఁగున; కింక నుల్లసిలుఁ దీయముతాతలఁపుల్ తెలుంగుపై
నలలయి వేయినూటపదునార్లయి యక్షరలక్షతాగతిన్.

ప్రాయము లేఁత; నీపయిఁ గృపామయి భారతి; కైతపై నభి
ప్రాయము దొడ్డ; నీకుఁదగు బాసట 'సూరయ' తమ్ముఁ; డిల్లు వి
ద్యాయతనంబు; సుంతకొదవన్నది లే దిటు వేయిసత్కృతుల్
వ్రాయఁగదయ్య దైవబలపాక చిరాయురనామయంబులన్.

ప్రొద్దుటూరు (20-2-54)

" ఆంధ్రి ముద్దులాడి "

కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి

తన నునుపైఁటనీటు గనుఁదమ్ములకెమ్మొ ఘటింప రాగమున్
జను వచనంబు నెమ్మదికి సంతసముం బొనరింప లోకమం
దనయము ముద్దులాడి యనునాఖ్య వహించెడు 'నాంధ్రి' ప్రౌఢయే
యని చతురాననుల్ పొగడునట్టి బెడంగునఁ బెంపెసంగుతన్.

1939 ఆంధ్రి.

" కైమోడ్పు "

శ్రీ వానమామలై వరదాచార్యులు

బుధులెల్లన్ నుతియింప నాంధ్ర చరితల్ పూర్వోక్త మార్గమ్మునన్
సుధలంబంచ రచించె భవ్యకవితా శోభాయమానుండు శ్రీ
మధునాపంతుల వంశ మండనుడు శ్రీమత్సత్యనారాయణుం
డు ధరన్ గీర్తి వహింప నాదు కయిమోడ్పుల్ తత్కవిస్వామికిన్.

'పోతన చరిత్రము'

" మధువృష్టి "

శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

ఆ నన్నయ్య మహాతపోనిరతి నీ యందింతయై యంతయై
రాణింపన్, జలదార్భటిన్ కడుఁగభీరంబైన మార్గంబు నా
నానన్యత్వము గూర్పగా నవరసానందంబు సంధించి వీ
ణానాదస్వరయుక్తి నీకవిత తానై పారవశ్యంబిడున్.
ఆచారిత్రక వస్తువైభవము లోకాదర్శ భావంబులన్
పూచెన్, చక్కని రాణ్మహేంద్రపురి పెంపుల్ సత్యనారాయణ
ప్రాచుర్యంబునఁ బొల్చె – శాంతిమధువొల్కన్ రమ్యపుంస్కోకిల
శ్రీ చంచన్మధుమాస శోభ పులకించెన్ నీ యశోవీథికన్.

'ముదిగల్లు'

" క్రొత్త మలపు "

శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి

నన్నయ కవిత సుధానిధి
సన్నిభ మధురిమము ; సార్వభౌముని సుకవి
త్వోన్నతి చండీశు స్తన
సన్నిహిత కఠోర మన్న సామ్యమునందెన్.
నన్నవార్యుడు శ్రీనాథుఁడెన్ని సరణు
లెన్ని రన్నింటి లోఁగొని యాధునికుల
వలపు గొలిపెడి పోకడ వలఁకులరసి
మధునపంతుల సరిక్రొత్త మలపు లిచ్చె.

" ఆంధ్రి పూజార్థమై "

శ్రీ మిరియాల రామకృష్ణ

ఓహో ఆంధ్రపురాణ నవ్యకవితా వ్యోమస్థలీచంద్ర ! నీ
సాహిత్యామృతధారఁ ద్రాగి యిపుడా స్వర్గంబునందున్న ఆ
శ్రీ హాలాదులు రాజులున్ సుకవితా శ్రీనాథులున్ నీ కథా
వ్యాహారంబుల జన్మమెత్తుకొని రారా ! ఆంధ్రిపూజార్థమై.

" సుధలున్నవి ; నిధులున్నవి "

శ్రీ కరుటూరి సత్యనారాయణ

ఆయతమున్ మనోజ్ఞమగు నాంధ్రపురాణము నాలకించి ప్ర
జ్ఞాయుతమౌను తెల్గుభువి ; సత్కవిలోకములోన సత్యనా
రాయణశాస్త్రి ! మిమ్ము కవిరాయునిగా గణుతించి నిత్యపా
రాయణచేయు నెంతొయనురాగముతో జనలోకమాదృతిన్.

మధునాపంతుల కవివర !
మధురముగా మీరువ్రాయు మహితకృతులలో
సుధలున్నవి నిధులున్నవి
రుధిరము పొంగించు బలము రూపించు సదా.

"ఇవ్వి చాలవే"

విద్వాన్ శ్రీ బులుసు వేంకటేశ్వరులు

అరయగ శాశ్వతంబయిన "దాంధ్రపురాణము" సత్కవిత్వ మం
దు రసము చిందునెందుఁ గడుఁదుల్యము దానికి గద్యమందు నుం
దరమగు "ఆంధ్రపున్ రచయితల్" తలపోయగ వాక్య వైభవం
బు రమణమీఁకు, నీసుకవి పుణ్యయశస్సున కివ్విచాలవే?

"కలమ్మునకు జోహారు"

శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి

తెలుఁగున్ జాతికి బాసకున్ శుభసమృద్ధింగూర్ప మున్మున్నుగా
మొలకల్ నాటు చాళుక్యరాజచరితమ్ముల్, పూజ్యులౌ నన్నయా
దుల చారిత్ర మనన్య దివ్యరసమాధు ర్యైక ధుర్యమ్ముగా
నలరంజేసిన నీ కలమ్మునకు జోహార్వేటైదన్ మిత్రమా!

వైదిక సంప్రదాయ పరివర్ధిత మూర్తివి వేదశాస్త్ర మ
ర్యాదలతిక్రమింపక రసాభ్యుదయంబును భావసంపదల్
పాదుకొనంగ కైతనుడువంగల మేటివి; నీవుదక్క నీ
మేదిని వ్రాయజాలరసుమీ! యొరులాంధ్రపురాణ కావ్యమున్.

"సుధాకలశము"

డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

ఓ కవివర్య! తావక పయోధి గభీరలసత్కవిత్వ మం
దీకమనీయ కావ్యము జనించె సుధాకలశమ్ము భాతి న
స్తోకరసామరత్వమును జాఱకొనంగల దాంధ్ర దేవతా
నీకము దానిఁ గ్రోలి; ఇవె నీదగు కైతకు మన్నమస్కృతుల్.

"ఫలవత్సుచరిత్ర"

శ్రీ చేబోలు చిన్మయబ్రహ్మకవి

వివిధ పురాణసారమగు – విశ్రుత భారతవంశ కావ్య పా
టనమున నాంధ్రభాషను కడల్వెలుఁగొందగ వ్రాసె నన్నయ
ప్రవరుఁ డదేపురాణ ఫలవత్సుచరిత్రకు నాది పీఠమాం
ధ్రవరుల సత్పురాణకృతి దక్షత ప్రాప్తిలె నెంతభాగ్యమో.

"ఋషులో! సిద్ధార్థులో"

శ్రీ ఎస్. వి. రాఘవేంద్రరావు

గురువృత్తింగొని తెల్విజోతినిడి మీకున్ ఖ్యాతిఁ దేఁజాలు ప
ల్వురు శిష్యోత్తములన్ గడించితిరి; తెల్గున్నేల ధన్యంబగున్
చిరకీర్తి మిముఁ గాంచి; మీరు ఋషులో! సిద్ధార్థులో! "నానృషిః
కురుతేకావ్య" మనన్ నుడిన్ వినమె సంకోచింపనేలా యికన్.

"అంకితము"

శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి

ద్రాక్షలమాధురిన్ దెగడుదత్తున "నాంధ్రపురాణ" కావ్యమున్
దక్షత వ్రాసిమించు కవితల్లజు శిష్యుఁడు కృష్ణమూర్తి ఫా
లాక్షుని మీదఁ దెన్గున నుదాహరణంబు జగద్ధితంబుగా
దీక్షరచించి కానుకయిడె; దీని రసజ్ఞు లనుగ్రహింపుఁడీ !.

"రామలింగేశ్వరోదాహరణము"

"గుబాళింపులు"

విద్వాన్ సహదేవ సూర్యప్రకాశరావు

తేనె సోనల జాల్వార్చితీయ మొలుకు
లలిత లలితమ్ములైన నీ పలుకు జిలుగు
తలఁపుగమి గుబాళింపుల కలసి విదులు
నిను మహాకవి యంచు మన్నించినారు.

మధుమాస వాసరమ్ముల
మధువులు రాగములుచిందు మాధుర్యములన్
అధికముగా విరియించును
ప్రథితమ్మగు నీ కవిత్వభావ విభవముల్.

నీ మహనీయ భావకమనీయత లెల్లరి నాహరించి చే
తోముద మందఁజేసినవి; తూరుపుకోన సుతారపున్ సుధా
కౌముది వెల్లవేసినది కప్రపుఁగీర్తుల పాలవెల్లి రే
కా మృదులమ్ముగా విరిసి క్రమ్ముకొనెన్ కకుబంతరమ్ములన్.

అభిరూప వచనము

"ధ్వనిప్రాయమైన చతురకవితా విమర్శ"

వేటూరి ప్రభాకరశాస్త్రి

శ్రీ వీరేశలింగము పంతులుగారాంధ్రుల సర్వతోముఖాభ్యుదయమునకు తొలుత గ్రొత్తక్రొత్త త్రోవలు త్రొక్కినారు. అందు ముఖ్యములు : అప్రకటిత ప్రౌఢాంధ్ర ప్రకటనము, కవిచరిత్ర రచనమును, ఆంధ్రకవుల చరిత్రముఁ జిన్ననాఁడు నేను చదివి శ్రీ వీరేశలింగముగారి విశేషజ్ఞతకు గ్రంథ పరిశ్రమమునకు వెఱఁగుజెంది, తన్మూలముననే ప్రాచ్యలిఖిత పుస్తకశాల గుఱించి మదరాసు చేరి చిరకాలమందే చిక్కియుంటిని.

శ్రీవారి కవిచరిత్రమింక నెంతో సంతనగాఁ జాలఁగాఁ బెంపు నెందవలసియున్నది. శ్రీ వీరేశలింగముగారి కవిచరిత్ర పరిశ్రమమంతకుఁ బూర్వపువారైన శ్రీ గురుజాడ రామమూర్తిగారి రచనమునకుఁ గొంత సంగ్రహణము, కొంత సంస్కరణము, కొంత పూరణము ననఁదగియున్నది. శ్రీవారి గ్రంథముపై మరల సంస్కరణ పూరణములు సరిగాఁ జాలఁగా జరగవలసియున్నది.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారిపుడు క్రొత్త రచించిన 'ఆంధ్ర రచయితలు' అను నీగ్రంథ మాకార్యమును గొంత నెఱవేర్చుచున్నది. ఇందు వీరేశలింగముగారు కయికొన్న కవులచరిత్ర కొంత కలదు. దానికిఁ బూరణముగాఁ జేర్పఁదగినది, వారి గ్రంథ రచనము తరువాతఁ గీర్తిశేషులైన కవుల చరిత్రమును గొంతకలదు. వీరేశలింగముగారి యా నియమము తీరునఁగాక సజీవులయియున్న కవుల చరిత్రమును గొంతకలదు. కాని సజీవులై యున్న కవులలో వయస్సునను వైదుష్యమునను గ్రంథ రచనను ఆరితేఱి పండఁబాఱి ముగ్గిమొగ్గయున్న మహనీయులే యిందు గ్రహింపబడిరి. ఇఁక వారి చరిత్రమున భావికాలములోఁ జేర్పవలసినవి వయోవధియు, సాగనేని మఱికొన్ని గ్రంథముల రచనములననే యగును గాన నట్టివాని రచనమిప్పుడే జరుగుట వారికిఁగూడ నానందజనకమే యగునుగాన నది సంగతమే.

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి యీ గ్రంథనిర్మాణ మాయాగ్రంథకర్తల దేశకాలములు గ్రంథముల పేళ్లు మచ్చుపద్యములు ననుతీరునగాక ధ్వనిప్రాయమైన చతురకవితా విమర్శముతో వక్రోక్తి చమత్కృతితో రసవత్కావ్యమువలె గంభీరార్థమై మనోజ్ఞమై

యున్నది. కొందఱు కవులఁగూర్చి వీరు నెఱపిన ప్రశంసావాక్యములలోఁ గొన్ని పలుకుబళ్లై భాషలోఁ బాదుకొనఁదగియున్నది. శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు పద్యరచనమందును గద్యరచనమందును మంచివైపు వాటములెఱిఁగిన ఘగజాణలు. వయసున వారు కడుఁజిన్నలయినను నైదుష్యమున భావనాబలమునఁ గడుంగడు మిన్నలు. శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికిని శ్రీ రామకృష్ణ కవులకును సన్నిహిత బంధువర్గములోనివారు. వారి ప్రతిభావాసనలు వీరిలో నవ్వారిగా బాల్యముననే పరిమళింపసాగినవి. కృతిపతులగు వీరి తాతగారు వైద్యకవితాది విద్యలం దందెవేసిన చేయియని వినియుంటిని. అట్టివారికీకృతి నర్పించి తాతగారి యాశీరక్షతల నంది కృతికర్త ధన్యతఁగాంచెను.

ఏతద్గ్రంథరచన రూపమున నుపక్రాంతమైన శ్రీ శాస్త్రులుగారి కవిచరిత్ర రచనము వీరేశలింగముగారి గ్రంథమునకుఁ 'బరిశిష్ట' మనఁదగిన పర్యాప్త గ్రంథరచనమునఁ బరివర్ధిల్లుఁగాకని కోరుచున్నాను.

ప్రౌఢరీతిని 'ఆంధ్రీ' పత్రికాప్రకటనము ప్రశస్త పద్య గద్య కావ్యరచనముఁ బసిప్రాయమునందే నిర్వర్తింపఁజాలిన శాస్త్రిగారింకఁ బ్రౌఢులయి యతిప్రౌఢ గ్రంథముల నెన్నింటినేని చిరకాలము విరచింప గల్గుచుందురని ఆంధ్ర వాగ్దేవత వారిమూలమున గొప్ప యారాధనముల నంది శాశ్వతముగా నాంధ్రుల నానందింపఁ జేయఁగల్గునని విశ్వసించుచున్నాను.

'ఆంధ్ర రచయితలు' ప్రథమ భాగము
'తొలిపలుకు'లోని కొన్ని పంక్తులు.
(తిరుపతి 20-11-44)

"క్రొత్త కవళిక"

మల్లంపల్లి సోమశేఖరశర్మ

ఆంధ్ర పురాణమున చరిత్రకారులచే సత్యములుగా నిర్ధారితములైన చారిత్రక విషయములు కావ్య గౌరవభాజనములగునట్లు మధురముగను, మనోహరముగను అభివర్ణితములైనవి. చరిత్రకారుడు నీరసముగా పొడిపొడిగా నందించు పేలపిండి చరిత్ర సుధామధురోక్తి సమ్మిళితమై క్రొత్త కవళికతో సౌందర్యమును వెలార్చు తీర్పుతీరువలతో హృద్యమై ఆకర్షకమై తనరారుచున్నది. ఆంధ్రేతిహాస ప్రకాశకమైన ఈ ఆంధ్రపురాణము సరసకథామాధుర్య

ప్రాశస్త్యముల భారతేతిహాసమునకు సనతువచ్చుచు హృదయము నలరించునొక రసవత్పు ష్పేషు ఘటాఖండము. ముడిచరిత్ర యొక్క నవనవోజ్జ్వల స్వర్ణరత్న భూషాకృతిగా రూపొందించుట శాస్త్రిగారి రచనాశిల్ప వైదగ్ధ్య విశేషము...

ఆంధ్రపురాణమిది పంచలక్షణ లక్షితమైన మహాపురాణము కాదు– ఉపపురాణ మంత కంటెనుకాదు కవి కావ్యశంఖములోపడి పవిత్ర తీర్థమై ఆంధ్రజన సేవ్యమైన ఆంధ్రజాతి చరిత్రము.

ఆంధ్రపురాణము "చరిత్ర భూమిక" నుండి కొన్నిపంక్తులు
విజయ, మాఘము (1954)

"ఇతిహాసం...కావ్యం..."

కాటూరి వెంకటేశ్వరరావు

"ఆంధ్రపురాణం"లో పురాణ ఇతిహాస లక్షణాలేకాక, కావ్యలక్షణాలుకూడా ఉన్నవి ఇటువంటి మహాగ్రంథం వ్రాసిన సత్యనారాయణశాస్త్రిగారి వినయం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఆంధ్ర పత్రిక 9 అక్టోబరు 1957

గద్యం...పద్యం...

భమిడిపాటి కామేశ్వరరావు

శ్రీ శాస్త్రిగారు గద్యాన్ని పద్యాన్ని సమంగా నడిపించగల సమర్థులు...

"రఘువంశం పోకడలు"

శ్రీ జమ్ములమడక మాధవరామశర్మ

విద్వత్తూ, పటుత్వమూ ఆంధ్రపురాణ కావ్యంలో కన్పిస్తున్నాయి. [సత్యనారాయణ శాస్త్రి ఒక విశేషప్రజ్ఞ గలవాడు. అభ్యాసపటిమ బాగావున్నవాడు. గంభీరత ప్రదర్శితమవు తున్న దీయనగ్రంథంలో. ఆదర్శమున ఆనందము, ఆనందమున ఆదర్శమూ చిత్రించిన కవి. అలంకార పటిష్ఠమై, కాళిదాసు రఘువంశం పోకడలు చూపిస్తూ, ఆదికవి నన్నయ నడక ననుకరిస్తూఉన్న కావ్యం ఆంధ్రపురాణం.

" ఈ అమృతం వర్షించింది "

శ్రీ పురిపండా అప్పలస్వామి

మిత్రులూ విద్వత్కవులూ అయిన శ్రీ మధునాపంతులవారి ఆంధ్రపురాణం మహాకావ్యం—ఆంధ్రరాష్ట్రం అవతరించిన తొలిదినాల్లోనే మహాగ్రంథం ఆంధ్రపురాణం బయటకు వచ్చి, ఆంధ్ర సరస్వతికి ఉజ్జ్వలమయిన అలంకారం లభించడం ఆంధ్రుల అదృష్టం.

ఆంధ్రభారతం అవతరించిన గౌతమీతీరంలోనే ఆంధ్రపురాణం అవతరించడం విశేషం. ఆనాటి నన్నయ తిక్కనాదుల మధురకంఠం మధునాపంతుల కలంలో ఆంధ్రపురాణమై అమృతం వర్షించింది.

" నా విశ్వాసము "

శ్రీ నోరి నరసింహశాస్త్రి

ఆంధ్రరాష్ట్రము వచ్చిన కొలదిదినములకే "ఆంధ్రపురాణము" ప్రకటింపబడుట ఆంధ్రుల భాగ్యము. ఈ గ్రంథమును ఆంధ్ర కవిపండితలోకము గౌరవాదరములతో స్వీకరింపగలదని నా విశ్వాసము.

" రస సిద్ధులు "

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి

ఆంధ్ర సారస్వతమున ఆంధ్రపురాణము చిరస్థాయిగా ఉండగలదని నా నమ్మకము. శ్రీ శాస్త్రిగారు రససిద్ధులు.

"చరిత్ర, కావ్యేతివృత్తమవుతుందా !"

శ్రీ అనంత సోమసుందర్.

మధునాపంతులవారు ఔచిత్యమెరిగిన మహాకవులు. చరిత్ర కావ్యేతివృత్తమవుతుందా అనే ప్రబంధకవుల సంకోచాన్ని కాదని శ్రీ శాస్త్రిగారు నూతనమార్గం అవలంబించడం అభినందనీయం. తెలుగులో ఉన్న కొద్దిపాటి చారిత్రక కావ్యాల్లోనూ ఆంధ్రపురాణానికి ఒక్క గొప్పస్థానం ఉంది.

" మేరుపూస "

శ్రీ యామిజాల పద్మనాభస్వామి.

తొమ్మిది పర్వాలతో ఆంధ్రపురాణాన్ని పూర్తిచేసి ఒక తెలుగు దివ్యకీర్తికి మూర్తిని సంతరించి తెలుగుజాతికి సమర్పించారు శ్రీ శాస్త్రిగారు. ప్రతి పర్వరసోదయమయిన పురాణ మిది. సహజరమణీయమైన పలుకుబడి శాస్త్రిగారి పుట్టుతోడవు. క్రమశిక్షణతో కైవసం చేసుకున్న సంస్కృతాంధ్ర భాషలు రెండూ శాస్త్రిగారిని సాకల్యంగా అనుగ్రహించాయి. పెళుసుమాట కంచుకాగడా పెట్టి గాలించినా చూచినా దొరకదు. ఇటీవల వెలుగులోకి వచ్చిన గ్రంథాలమాలికలో ఈ 'ఆంధ్రపురాణము' మేరుపూస.

"నన్నయకు వారసులు"

శ్రీ దేవత సుబ్బారావు.

తెలుగు కవిత్వమునకు తొలిభిక్షను ప్రసాదించిన అక్షరరమ్యమూర్తిని నన్నపార్యుని మనము చూడలేదు. మధునాపంతులవారు బాహ్యమయమూర్తి నన్నయకు వారసులు. ఆది కవినుండి ఈనాటివరకూ మరేనాటివరకు రాజమహేంద్రపురం కవితాకస్తూరి గుబాళింపులకు ప్రస్తుతికెక్కినది,

"నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము... విప్రులయందు" అన్నాడు నన్నయ, మధునాపంతులవారికి అట్లుగాక, మనసు, పలుకు, కూడ నవ్యనవనీత సమానములె.

"నవ్యాంధ్ర పంచకావ్యపరిశీలనము"

శ్రీ నరసింహదేవర ఉమామహేశ్వరశాస్త్రి.

నవ్యాంధ్రములో మధురకావ్యములెన్నియో వెలసినవి. అందు కొన్ని రసఖండములుగా తేరినవి. కొన్ని యఖండకావ్యములైనవి. ఆ సాహిత్యఖనిలో నేనేరుకొన్న కావ్యరత్నము లీవైదును. పంచకావ్యములనగానే కాళిదాసాదుల రఘువంశాదులు, పెద్దనాదుల మనుచరిత్రాదులు ప్రసిద్ధములు. ఆది మహాలోక కావ్యపంచకము. అభినవము. సౌందరనందము, రాణా

ప్రతాపసింహ చరిత్రము, శివభారతము; ఆంధ్రపురాణము. బాపూజీ ఆత్మకథ, ఇవి నేనెన్నుకొన్న కృతులు. ఈ మైదింటి నొకచో చేర్చి నవ్యాంధ్ర పంచకావ్యపరిశీలనముగా వెలువరించితిని.

"కవిచరిత్ర రచన కత్తిపై సాము"

శ్రీ ఆవుల శివరామరెడ్డి.
ఆత్మకూరు

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు "ఆంధ్రపురాణము" అను పద్య కావ్యమును, 'ఆంధ్ర రచయితలు' అను ఆంధ్రకవుల చరిత్రను రచించిన ప్రసిద్ధులు. "ఆంధ్రరచయితలు"లో ఒక్క కవులనేగాక, చరిత్రాన్వేషణముచేసిన పరిశోధకులు, విలువగల విమర్శనములను వ్రాసిన పండితులను కూడ చేర్చి నూతనఫక్కీలో వ్రాసిన మహానుభావులు. జీవించియున్నవారి చరిత్రలను వ్రాయుట కష్టములలోకెల్ల కడు కష్టమయినది కత్తిపైసాము.

శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు, శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారు ఆంధ్రకవుల చరిత్రలను వ్రాసినారు. వీరు ప్రబంధములలోని పూర్వకవులు వ్రాసిన వంశావళిని బట్టియు, శాసనములలోని వ్రాతలను చూచియు వ్రాసినవారు ఇట్లు వ్రాయుట కొంతవరకు సులభమే కావచ్చును. జీవత్కవుల జీవితములను వ్రాయపూనుకొనుట ఏటికి ఎదురీతవంటిదే.

"నాచనసోముడు తొంగిచూస్తున్నాడు"

భారతి 1955 ఫిబ్రవరి.

తెలుగుదనం తొణికిసలాడే పద్యాలు ఆంధ్రపురాణంనిండా కోకొల్లలు. పద్యనిర్మాణ శిల్పంలో శ్రీ శాస్త్రిగారు ప్రాచీనాంధ్రకవుల అనుభవాన్నంతా పుణికిపుచ్చుకున్నారు. అత్యంతమూ శ్రద్ధవహించి ప్రతిపద్యాన్ని ఒక శిల్పమూర్తిగా తీర్చిదిద్దుతారు. కొందరుకవులు శబ్దాలంకారాలు వాడితే సుత్తిపుచ్చుకొని దెబ్బమీద దెబ్బ నెత్తిమీద కొట్టినట్టుంటుంది. శబ్దాలంకారాలు విన్యాసం చేస్తున్నట్టుకూడా అనుమానం తగలకుండా పూవులు పరిమళ్ళుకుంటూ పోగల మహామహుడు నాచన సోమన. శ్రీ శాస్త్రిగారి సీసపద్యాలు గమనించితే నాచన సోముడు ఆపదజాలముల జాలవల్లికలనుంచి తొంగిచూస్తున్నాడా అని భ్రమకలుగుతుంది సాహిత్యరంగంలోనేకాక ఆంధ్రజాతి చరిత్రలోనే ఒక అత్యంత ప్రధానసమయంలో ఆంధ్ర

పురాణం వెలువడ్డది. నవ్యాంధ్ర సాహిత్యంలో అవతరించిన కొలది కావ్యాలలో ఆంధ్రపురాణ మొక అమూల్యమణి.

"జాతికి సంజీవకరణి"

— పుట్టపర్తి నారాయణాచార్యులు.

మధునాపంతులవారి ఆంధ్రపురాణమును ఆసక్తితో పూర్తిగాఁ జదివినాను. గుణాఢ్యుల ఘట్టమును ఒకపర్యాయము ఒక పత్రికా సంపాదకునకు మళయాళమున నర్థముఁ జెప్పితిని. వారెంతో సంతోషపడినారు.

శ్రీ శాస్త్రిగారు నేర్పుతో నిర్వహించిన కవితాశిల్పము అపురూపమైనది. మహాకావ్యకర్త యెప్పుడును ఏ యవాంతర రసమునకు లొంగిపోరాదు. ఆ యా యంశములను సముచితముగ నిర్వహించికొనుచు అంగి గౌరవమును నిల్పుకొనుచుఁ బోవలెను. కవి యలతి హృదయుఁడైనచో యేదో యొక రసావేశములోఁబడి కావ్యమును వికృతముఁ గావించును. ఆ చాపల్యములకు లోనుగాక శాస్త్రిగారి హృదయము సముద్రగంభీరముగ నున్నందుకు ఆయన హృదయమునకు నా కృతజ్ఞత. శ్రీ శాస్త్రిగారి శైలి లలితమై జాతీయమైనది. వారు వాడిన పదశాస్త్ర పాండిత్యమును వెలార్చు శబ్దములుగూడ సంప్రదాయబద్ధములై ప్రసిద్ధములైనవి. "మారుమూల పదములనెంతగా వాడిన నంతపాండిత్యము" అనుకొనక లలిత పేశలముగా కావ్యమును నిర్వహించిన శాస్త్రిగారి రసికత కొనవంద్యమైనది.

వారి "స్వప్నసృష్టి" అద్భుతమైనది. ముఖ్యముగ గుణాఢ్యుల కథాఘట్టము, 'రుద్రవల్లి' అర్ధనారీశ్వరత్వము నన్ను ముగ్ధుని జేసినవి. ఆ ఘట్టము కెంపునవ్వు కడుసుముగ్ధతో నిర్వహింపబడినది. సత్యనారాయణశాస్త్రిగారు కొన్ని యపురూపములైన తెన్గులువాడిరి. అట్టివానిని నిఘంటువులలోఁ జేర్పవలెను. వారువాడిన "మొఱవోవని" (కా.వ.294) ప్రయోగమట్టిది. నన్నభట్టుల కథాభాగము చాల హృద్యముగా నున్నది. అందునఁ గర్ణాటకులైన నారాయణభట్టునకు వారిచ్చిన స్థానము నాకెంతో ముచ్చటఁగొల్పెను. నేఁడు "యితరభాషలను వానియోగ్యతలను నెంతగా గౌరవింపకున్న స్వభాషకంతగా సేవజేసినట్లగునను" ఒక విస్తారపు భావమన్ని కడలను వ్యాపించుచున్నది. ఈ సమయములో నిట్టి రచనములెంతో మేలుసేయును.

నిర్వచనముగ వ్రాయుట నాదృష్టిలో నదియొక పిచ్చి. వచనరచన కావ్యమున కెంతయో శోభఁగూర్చును. ఈ దృష్టిని తొల్త మరలించినవారు—విశ్వనాథవారు. అతర్వాత మధునాపంతులవారు.

ఇక నేమివ్రాయుదు ! శ్రీశాస్త్రిగారి రచన కంజలి.

జాతి పుచ్చిపోవుచున్న కాలమున నిట్టివారి రచనలు సంజీవకరణులు.

[illegible]

డా॥ సి. నారాయణరెడ్డి.

ఆ సనాతన భావాభి
గ్రథిత సంప్రదాయ సుధీ!
మధునాపంతుల కవి సం
యమి! చుళికీకృత వాగ్జలధీ!

తేనెకు తోబుట్టువు నీ
వాణి; దివ్యరసాస్థాని
వెన్నకు పెద్దన్న నీ ప్ర
వృత్తి; వినయ గుణావృత్తి.

ఆంధ్రియన్న, స్వసంస్కృతి పు
రంధ్రియన్న అన్నన్నా!
విస్మృత నిఖిలుడవు; ఏమి
చిత్రసిది ఓయన్నా!

నిన్నటి శతాబ్దమున కన్ను
దెరచిన రచయితల తలల
పత్తా గుత్తకుగొని వెను
పొత్తము కెక్కించినావు

జడలు గట్టినట్టి ఆంధ్ర
చరిత్రమును దువ్వి దువ్వి
అరీణ శిల్పక ధురీణ
పురాణముగ తీర్చినావు

ధరాగర్భ విలుప్తాంధ్ర
పురాకథలు తవ్వి తవ్వి
సురుచిర మణులుగా కావ్య
సూత్రమ్మున కూర్చినావు

నీమలచిన ప్రతికృతి; బ్రా
హ్మీమంగళ సుషమాకృతి
నీకు జరుగు సత్కృతి; ఆం
ధ్రీకమల పదార్చాకృతి.

"సుధీ మహామహశాస్త్రి!"

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి.

మడిగట్టుకొని శుభ్రమయిన పళ్లెంలోకి పూజ కోసం కోసిన నిత్యమల్లె పువ్వువంటివారు శ్రీ సత్య నారాయణశాస్త్రిగారు.

విదేశవాసన కల్తీలేని స్వచ్ఛమయిన తెనుగు చిరునవ్వు, కుహనా నాగరికత అంటని అచ్చపు కౌగిలి, ఆయన ఆస్తి.

తెల్లని లాల్చీ – శుభ్రమయిన ధోవతి – మెత్తని ఉత్తరీయం–నలుసంత కుంకంబొట్టు – అమాయికం గానేటిలోకాన్ని పెల్లగించి చూడగల చురుకైన చూపులతో – రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో సాధారణంగా ఎదురువచ్చే ఆవ్యక్తి అసాధారణుడని చాలమందికి తెలియదు

చూపులకు పొట్టిఅయినా మాటలకు చాలా ఎత్తు అని తరువాత తెలుస్తుంది!

ఒకసారి పల్లెపాలెం వీధిలో ఒక ఇంటి ప్రక్క నుంచి వెడుతున్నాం. ఆ ఇంటి ప్రాంగణంలోనుండి రఘువంశ శ్లోకాలు సుఖంగా వినిపిస్తున్నాయి. "ఓరియంటల్" ప్రాణికి ఆశ్లోకాలు వింటే ప్రాణాలు లేచివస్తాయి. ఏనాడో శాకుంతలంలో చదివిన "వహ్నిజేన వృక్షవాటికా మాలాప ఇవ ప్రాయతే" అన్నమాట జ్ఞాపకంవచ్చి తేరిపార చూచాను.

చల్లని మామిడిచెట్లనీడల్లో కడపరాతి పలకల మీద కూర్చొనిచదివే విద్యార్థులూ, వారికి కావ్య ప్రవచనంచేస్తూ బ్రహ్మవర్చస మొలికే ఒక శ్రోత్రియ యువకవి కనిపించారు. ఆ పాఠ ప్రవ చనంలోని ఆత్మీయత, పరిజ్ఞానం చూస్తే– ఒకనాడు కోనసీమలో గురుచరణ సన్నిధిని చల్లని చెట్లక్రింద చదివిన కావ్యపాఠం స్ఫురణకు తగిలింది. అప్పుడు శాస్త్రిగారిని సన్నిహితంగా చూచాను.

పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంధా లయంవారు శరన్నవరాత్రులలో సాహిత్య కార్య క్రమాలు ఏర్పాటుచేశారు. ఒకనాటి ఉపన్యాసానికి శాస్త్రిగార్లు వచ్చారు సాయంకాలం గ్రంధాల యంలో 'నన్నయ మితవచనం' అనే అంశంమీద మాట్లాడారు. ఉపన్యాసం అయింది.

తేటమాటలు, తెరిమరుగులులేని

సెలవివార నవ్వి చేరువకు వచ్చారు.

మరునాడుదయం ఒక మిత్రునింట కావ్యగోష్ఠి పెట్టారు.

ఆయనవ్రాస్తూన్న ఆంధ్రపురాణం నుండి "కావ్య హోమం" అనేఘట్టం చదివారు.

"భట్టు చదివిన యాకు నాచార్యుడంది
ఆహుతి యొనర్చు నగ్ని కుండాంతరమున;
అదియె శామిత్రవాహ్నిౘ అల్లకడె శమిత
అవుర! పశువగునేమొ కావ్యప్రతిష్ఠ"

ఆయన గొంతు వణకింది, మా కళ్లు చెమ్మ గిల్లాయి, కళ్లుమూసుకొని వింటున్నాం.

వెనుకటి మాటలు జ్ఞాపకం వచ్చాయి

"మీసల తేనియల్ విసపు మెచ్చులు,
నచ్చముగాని కౌగిలుల్
మోసపుఁగానుకల్, మొగము ముందరి
నవ్వులు నొల్కబోసి వి

'శ్వాస కృశించా హృదయ భార కలల్
ఉగ్గబోసి జీవితో'
ఆశలు దీర్ఘమౌనాన్న స్వర్గలా ? కవితాకళ
మ్మరించుటల్ ''

ఆపలుకులలోని వేదన-సుకుమారని నిజాయితీ—
తనదైన ఒక కూర్పు మనల్ని ముగ్ధులనుచేశాయి,
గోష్ఠి ముగిసింది.

సాయంత్రం ఇద్దరం కాకినాడ బయలు దేరాం.
బస్సు కదిలి ది మాటలకందుకున్నాం.
ఏమి ప్రసంగం అది !
ఎన్నటికీ మరవ్వరానిది.

కొన్నియేండ్ల చరిత్రలు – కొన్ని హృదయాల
బరువులు.

కొత్తకొత్త సాహిత్యాల విలువల మేళవింపులు—
కొన్ని శతాబ్దాల చీకటిపొదల్లో షికార్లుకొట్టి
వచ్చాం.

పట్నంలో బస్సు ఆగింది.
మా కబుర్లు మాత్రం ఆగలేదు.
వెనకటికి— భవభూతి అన్నట్లు—

నాటినుంచి అపరిహార్యమైన ఆత్మీయతను, ఆ ప్రేత
ఏర్పడిపోయాయి. ఉభయులు మధ్య. ఉత్తరప్రత్యుత్త
రాలు శోభాయమానంగా సాగాయి.

1930 నుంచి 1950 వరకు ఇంచుమించు భావ
కవిత్వం విలుబడి సాగింది. ఖండకావ్యాలకు గిరాకీ
పెరిగింది. పూర్వకావ్యాల తీపితో మొగంమొత్తి
పుల్లగా బిక్కగా చుర్రుమనేది ఏదైనావింటే బాగుం
డునని తోచింది ప్రజలకు.

గుంటూడ ముత్యాలసరాలు, రాయప్రోలు తృణ
కంకణం బాగా ప్రజలమధ్యకు వస్తున్నాయి.

సాహిత్యములో కొత్త ప్రయోగాలు చాలా
చేసింది. అవి తెలుగు సాహిత్యప్రియుల్ని తమ
వంకకు తిప్పుకుంటున్నాయి. కొత్తకొత్త కావ్యప్రక
నాలు జోరుగా సాగుతున్నాయి.

యువలోకం ఒక్కసారి [illegible] తిరిగింది.
వేమిభాషల్లో భావకవితానాయకుల ప్రభావం
అతిశయించింది. మహాకావ్య రచన మూలబడింది.

సౌందరనందం వంటి కావ్యం ఉన్నా దాన్ని
గురించినవారు కొద్దిమంది. ఒకవిధంగా వారినీ
భావకవుల్లోనే జమకట్టేవారు.

1950 నాటికి ఆ ఉరవడి తగ్గింది. ఆ వేడి చల్లా
రింది. స్థిమితంగా పెద్దకావ్యాల మీదకు మళ్ళింది
దృష్టి.

ఆంధ్రసాహిత్యంలో పూర్వసంస్కృతి, [illegible]కా
వ్యాల విలువలు ఆలోచనలోకి రావడం ప్రారంభిం
చాయి. కవిత్వమేగాని వేరే భావకవిత్వమంటూ
ఏదీలేదని తోచడం మొదలైంది.

పెద్ద భావకవిగా పేరెన్నికగన్న విశ్వనాథ విశ్వ
నాథ సత్యనారాయణగారు సంప్రదాయముఖులై
దాన్ని గట్టిగా సమర్థించడం. ఆధునికాంధ్ర సాహి
త్యానికి గొప్పమలుపు తెచ్చింది.

రామాయణ కల్పవృక్షం పుట్టింది.

Neo - Classicism (సంప్రదాయంలో
నవ్యత) పుంజుకోవడం మొదలెట్టింది విశ్వనాథవారి
కంటె ఒక అడుగు ముందుకువేసి చరిత్రలోని
భారతవీరుల ధర్మవీరానికి ప్రాణప్రతిష్ఠ చేసి,
దుర్భాకవారు, గడియారంవారు పెద్దకావ్యాలు

ప్రాయడం జరిగింది. ప్రజలు అటువైపు తిరిగారు. రాణాప్రతాపచరిత్ర, శివభారతం ఆంధ్రావళి హృదయాలను ఊపడం ప్రారంభించాయి. ఒకవైపు భావకవితకు ఒక్క ఛీలి అభ్యుదయ కవిత్వం అంటూ ఒకటి బయలుదేరి మార్క్స్ సిద్ధాంతాలమీద తనపని తాను చేస్తూనే ఉన్నది. అయినా మహాకావ్యాల మీద సంప్రీతి చల్లారలేదు రాణాప్రతాపుని శౌర్యం శివరాజు ధర్మనిష్ఠ. కవితారీతిలో కొత్తరుచులు పుట్టించాయి. పూర్వకావ్యాల అనూచాన వాసనలు చాదస్తాలు తొలగి కొత్త పలుకు, కొత్త చురుకు ఏర్పడింది. అప్పుడు మధునాపంతులవారు ఇంకొక అడుగు ముందుకువేసి ఆంధ్రుల చరిత్రనే అద్భుత కావ్యంగా మలచడానికి అంకురార్పణ చేశారు.

శాస్త్రిగారు సహజంగా కవితా సంప్రదాయంలో పుట్టి పెరగారు. తండ్రిగారు, మాతామహులు కవులు దగ్గరబంధువు వెంకటరామశాస్త్రిగారు రామకృష్ణ కవుల్లో ఒకరు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి కవితా విహారభూముల.

పల్లెపాలెం, ఇంజరం గ్రామాలు, ఆ శాఖీయుల కందరికీ ఆశుకవిత్వం అంటే మనజన్మహక్కు అని నమ్మకం. చుట్టూ సంమోహన నృత్యంచేసే ఆశుకవితాసుందరి వలలో పడకుండా, బయటపడడం శాస్త్రిగారి విశిష్టత.

వడ్డాది సుబ్బారాయుడుగారు ఒకప్పుడన్నారు.

"ఆశు కవితోగ్రవ్యాఘ్ర దంష్ట్రాళికే నప్పుభ్బా!
కవితాలతాంగి నెఱ సేయ ౦జాల"-అని

అధునికకవి రాయప్రోలువారుకూడా "జననీ ఏమిటి కింక ఆశుకవితా సంన్యాసమిప్పింపవే" అని ఒకనక్క మస్కారం చేశారు.

మధునాపంతులవారికి నిఘంటు కార్యాలయం పాండిత్యంఅందిస్తే కుటుంబవాసన కవితావ్యాసంగం చేకూర్చింది, తత్ఫలితంగా గద్యపద్యాలలో ఎన్నో రచనలుచేసి పత్రికల్లో ప్రకటించారు. మంచి అభిరుచిని ప్రోదిచెయ్యాలని తానే స్వయంగా "ఆంధ్రి" అనే పత్రిక నడిపారు.

ఆ అధ్యాయం ముగిసింది.

అమూరుగా ఉన్న మూసల్లో, ప్రహతిమైన మార్గంలో ఊ వ్రాసుకుపోవడం ఆయనకునచ్చలేదు లోకానికే నచ్చలేదేమో – నవ్యవాసన, కొత్తరుచి, రచనలో తప్పకుండా తేవాలని తోచింది.

నవకవి మిత్రుల ప్రోద్బలంతో ఆనాటి ప్రసిద్ధ నవ్యకావ్యాల్లు అభినవ ప్రక్రియలన్ని శ్రద్ధగా పరిశీలించడం ప్రారంభించారు. ఆధునిక దృక్పథం అవగాహన అయింది. ప్రాచీనగాథలు, పూర్వకథలు, అట్లావుంచి... కొత్తఉత్తేజంలో కావ్యం వ్రాయాలనే తహతహ పెరిగింది.

జాతీయత వెన్ను తట్టింది.
కథ — ఆంధ్ర వీరగాథ —
అప్పుడు "ఆంధ్రపురాణం" అవతరించింది,
ప్రతి పద్యమూ స్వంత ముద్రతో వచ్చింది.
నన్నయగారిమీద ఎంత అభిమానమున్నా—
ఆయనే ఆక్రమించలేదు. రచననంతా—

నన్నయ తిక్కనలు తెలియకుండా గంగాయమునల్లా కలిసిపోయి ఒక కొత్తప్రవాహం ఏర్పడింది. కొత్తరుచి వచ్చింది.

పారాధాన్య పిశాచీ
దారుణ హుంకారములకుఁ దలఁగి మనములం
దూఱడి, పోయిన బ్రతుకుల్

చేరిచి కొన్నిటులు సంతసించిరి తెలుగుల్"
ఆంధ్రపురాణంతో "సంతసించిరి తెలుగుల్"
ఆంధ్రావళి ఆప్యాయంగా అందుకుంది.

శాతవాహన పర్వంలోని 'కావ్య హోమం' చాళుక్య పర్వంలోని "భారతావరణం" కాకతీయంలోని ప్రతాపరుద్రుని పుట్టుక బాల్యం తలలూపించాయి.

వీరేశలింగంగారి తర్వాత మళ్ళా కవులచరిత్ర తడవినవారులేరు. శాస్త్రిగారు 20 వ శతాబ్దిలోని కవులచరిత్ర లేకాక ఆంధ్రభాషకు ఎనలేని సేవ చేసిన అందరి రచయితల చరిత్రను సంగ్రహించి మంచిపని చేశారు.

చిన్నయ్యసూరి తర్వాత వచ్చిన వ్యావహారికోద్యమం తెలుగు వచనరచననే మార్చివేసింది. అయితే- శాస్త్రిగారి గ్రాంధికపు చుట్టరికం చూచి చూచి వ్యావహారికంలోకి దిగనివ్వలేదు. గ్రాంధికమై వ్యావహారికంలా కనబడే ఒక మంచి ఒరవడిని పట్టుకొని జిగిబిగి కలవచనం వ్రాశారు శాస్త్రిగారు. అది అయన స్వంతమయిపోయింది అది రచయితల చరిత్రేకాదు. సాహిత్యంమీాద రుచికలిగించే ఉదాత్త రచన. శ్రీ సత్యనారాయణశాస్త్రిగారికి "ప్రాయమంకా క్రైవాలలేదు" కనుక ఆలేఖినినుంచి ఇంకా ఎన్నో మంచి రచనలను ఆశించవచ్చు.

కవిపూజకు అలవాటుపడిన రాజమహేంద్రవరం ఈ సత్కవిని ఉత్తమరచయితను, చేతులార పూజించడం. ఇంకొకసారి తన రసజ్ఞతను రుజువుచేసుకోవడం అని దృఢంగా చెప్పవచ్చు.

అధునా - మధునా

డాక్టర్ దాశరథి.

పద్యరచన హృద్యంగా చేయడం
పాత పద్ధతిగా భావించే
ప్రాజ్ఞులున్న ఈ లోకంలో
పసగలదే పద్యమంటూ
రసమున్నదే రమ్య కవిత్వమంటూ
ఆంధ్రుల ఔన్నత్యాన్ని చాటే
'ఆంధ్ర పురాణం' రచించిన
అశేష ప్రజ్ఞాధురీణా!
అమృతమూర్తీ ! సత్యనారాయణా !

మీ హృదయం ఎంత మెత్తనో
మీ కవనం అంత మెత్తన;
మీ భావన యెంత ఉన్నతమో
మీ జీవనం అంత ఉన్నతం;

పావన గోదావరీ పరిసరాలలో
ప్రథమ సంధ్యా భాను కరాలతో
రాజమహేంద్రవర పురంలో
రమణీయ కవితానందనంలో
అనుక్షణం ప్రయోజనాత్మకంగా

అమర కవిత వెలయించే మీరు
ఆంధ్రులందరికీ అభిమాన పాత్రులు
ఆంధ్రజననీ మహనీయ పుత్రులు
మహాకవీ ! మధునా పంతులవారూ !
మా నమోవాకములు అందుకోండి మీరు.

—o—

'శరన్మల్లిక'

శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ.

ఒక స్పృహణీయప్రతిభ సన్నజాజులతావి తెరవై ఆంధ్రసారస్వత వనీవీథులయందు నేఁడు వాహ్యాళి చేయుచున్నది.

శూరుల జన్మములును సురలజన్మములు ఎట్టివో నిజమునకు కవుల జన్మములును అట్టివే. ప్రతిభ స్వయంప్రభవముకదా ! ఎప్పుడు ఎచ్చట ఎట్లు ఆవిర్భవించునో !

అంకురము "ఆంధ్రి", అది–

పల్లెపాలెములో పందిరికెక్కినది. 'ఆంధ్ర రచయితలు' అను చిగుళ్ళతో అనలు పెనలు సాగి సాగి చేరువ గొడుగు మామిడికొమ్మలకు నెమ్మదిగా అల్లికొని చల్లని ఆ నీడలో ఏ స్తిమిత రమణీయ వేళలో తొడిగినదో ! 'ఆంధ్రపురాణపు' పూలగుత్తి తొడిగినది.

ఆ సౌరభము నేఁడు సుమనస్తర్పణ మొనర్చుచున్నది. ఆ ప్రతిభాంకురమునకు భవిష్యదభ్యుదయ ప్రియదర్శనులై ప్రోదిచేసి మురిసికొన్న తొలినాటి శాంతమధురానుభావులు తోటమాలు లిద్దఱు. మాతామహులు ఆకొండి రామమూర్తిగారు, మేనత్త పెనిమిటి ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, ఈ శుభ ప్రభాతవేళలో సంస్మరణీయులు.

కన్నతండ్రియా ! కొడుకు సత్కవియగుటకు కోర్కెపడిన మనీషి. పుట్టిన పొలమా ! కవితాసార మింకించికొన్నది. పెరిగిన పరిసరమా ! సారస్వతోద్బోధ మహనీయము. సత్యనారాయణశాస్త్రిగారు కాక మఱియెవ్వరు సత్కవులగుదురు ? సత్కవి శబ్దమునకు పర్యాయపదమున్నచో–ఒక్కటే. అది– 'సత్యనారాయణశాస్త్రి'

ఆద్యత నాంధ్రకవితా మూలరసాలము చెళ్ళపిళ్ల వేకటశాస్త్రిగారు. ఆ రసాల శాఖకి సశాఖ రామకృష్ణకవులు.

" ఎదుటఁ జెళపిళ్ల వేంకటబుధుఁడు రామ
కృష్ణకవు లాప్తబాంధవశ్రీల మెఱయ " (ఆంధ్రపురాణము)

నాటి తెనుఁగు వాఙ్మయమునకు రామకృష్ణకవుల వలన కలుగవలసియున్న మేలు నేఁడు సత్యనారాయణశాస్త్రిగారివలన ఇబ్బడిగా ఫలించుట ఆంధ్ర శారదాసంకల్పముగాక వేఱొకటిగఁ గానరాదు.

"నాకు మఱల యౌవనమైన రానలయును. వేంకటరామశాస్త్రి బ్రతికినైన రావలయును. ఈ రెండును జరిగెడివికావు. కథాసరిత్సాగర రచన నీవలనకాక యింకొకరివలన నెరవేరదు"

ఈ మాటలు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు సత్యనారాయణశాస్త్రిగారితో తమ ఆస్థానకవి పట్టప్రదానోత్సవ సమయమునాఁడన్నవి. నాటికి ఆంధ్రపురాణరచన ప్రారంభమే కాలేదు. సంకల్పరూపమున నున్నదేమో!

చెళ్ళపిళ్ల కవిస్వామి క్రాంతదర్శిత్వ మట్టిది! సత్యనారాయణశాస్త్రిగారు తమ హృదయములో కవితాగురుపదమును రామకృష్ణకవులకే 'విూఁదు' కట్టుకొన్నారు. శాస్త్రిగారి కవితాభ్యుదయమును జూచి యానందించుటకు రామకృష్ణకవులు నేఁడులేరు.

ఆ యానందము ఒక్క బిందువైనను పొలివోనీయక శివరామశాస్త్రిగారే చూఱఁ గొనిరి. "నాయన! నీదు పూజనమునన్ దనపూజన మబ్బెవాణికిన్". కోలంకలో పూర్వము శాస్త్రిగారికి జరిగిన సమ్మాన సందర్భమున శివరామశాస్త్రిగారి సందేశములోని ఆ యానంద బిందు నిష్యందమే పై పద్యచరణము. నాటిసభకు అధ్యక్షులు కాటూరి వేంకటేశ్వరరావుగారు.

ఇవి యన్నియును భావించి చూడఁగా బాహ్యములైన యీ సన్నివేశముల అట్టడుగున ఈ కవి కుటుంబముయొక్క ఆంతరమర్మ స్యూతమైన ఒకానొక అమృతస్నేహ తంతువు పొడకట్టకమానదు.

శాస్త్రిగారి కవితావైదుష్యాదిక పరికరము నేటితరములోనిది కాదు. దానిని పరిమళింపఁజేయుచున్న శరన్మల్లికా స్వచ్ఛమైన శుచిత్వరేఖయే వారి అచ్చపురూపు. వినయ సంవృతమైన ప్రాగల్భ్యమును ప్రసాదగర్భితమైన మాధుర్యమును శాస్త్రిగారి పలుకుబడి పట్టియిచ్చును.

పాండిత్యము, కవితావైభవము, మనస్విత, శుచిత్వము, హితమితసూనృతాలాపము, ఇన్నింటి అమర్పుతో అందగించిన వ్యక్తిత్వము నాన్యతోదర్శనీయము.

వారి స్వరూపమును యథాతథ్యముగ నిరూపించునేర్పు ఒక్క వారి రచనలకేకలదు. పండితుఁడైన కవికాని— పరిశోధకుఁడైన విమర్శకుఁడుకాని— అంతశ్చక్షువు సమున్మీలితము కానినాఁడు వందమంది రచయితల వందరకములైన ఆంతర ప్రతిభాస్వరూపములను అంత విస్పష్టముగా దర్శించి చిత్రింపలేఁడు. ఆ నూరు రచనలు నూరు కావ్యఖండములు. శాస్త్రిగారు

కవులచరిత్రములను నిబంధించి వచనమునకు కవితాగౌరవమును, పద్యములలో నిబంధించి రాజుల చరిత్రములకు కావ్యగౌరవమును సంతరించిపెట్టిరి.

ఆంధ్రపురాణము ఆంధ్ర వాఙ్మయసరస్వతికి అనర్ఘ మణిహారము.

హాలమహారాజునుండి విజయరాఘవనాయకునివఱకు–గుణాఢ్యునినుండి చేమకూర వేంకటకవివఱకుఁగల రాజుల కవుల రసవచ్చరిత్రఘట్టములు స్ఫటికములు పవడములువలె పర్యాయ గ్రథనశోభతో భూషణభూష్యభావము నందియున్నవి.

ఆంధ్రజాతికి ప్రాతస్స్మరణీయములైన మహాత్ముల మహితానుభావములన్నియు ఒక్కచో దర్శనమిచ్చు కుడ్య చిత్రరచన అది! వర్ణనము కథనము చిత్రణము సంభాషణము రసభావములు సముచిత సన్నివేశ చారుత్వమునందిన మహారచన.

సూత్రప్రాయముగా శాస్త్రిగారి కవితాతత్త్వము "లోతరసి మేయంబోవువారికి తలమునుకలై శృంగభంగముచేయు" చమత్కార ప్రాధాన్యముగలది.

ప్రధానముగా నన్నయ్యయును శ్రీనాథుఁడును శాస్త్రిగారికి గురుస్థానమనిపింతురు.

తండ్రికిఁ గృతియిచ్చుటలో పింగళిసూరనతోడి సామ్యము గోచరించును.

శాస్త్రిగారి తెనుఁగుకూర్పుగాని సంస్కృత గుంఫనముగాని శాస్త్రిగారివే.

పూర్వకవితానుశీలన పరిపుష్టితోడి లాక్షణికమైన ఒక ఆధునికతాముద్ర వీరి శైలి యందలి వైశిష్ట్యము.

స్థానాంతర పరిగ్రహము జన్మాంతర పరిగ్రహమువంటి దయినచో యీ రాజమహేంద్రవరపు జన్మలో శాస్త్రిగారు నాకగ్రజులు. సంసార విషవృక్ష ప్రథమ ద్వితీయఫలము లైన కావ్యామృత సాధుసల్లాప రసానుభవములయందు మేము సహభోక్తలము.

శ్రీనాథ విరచితమై ఖిలమైపోయిన ఆరాధ్యచరిత్రము శాస్త్రిగారి అమృతపాణితల మునుండి ఆవిర్భవించు శుభసమయమునకై ప్రతీక్షింతము.

అనుల్లంఘనీయమైన వారి యాదేశమును శిరసావహించి నా చాలమి యెఱింగి యును నే నీనాలుగుమాటలు వ్రాయుచున్నంతసేపు ఆంధ్రపురాణములోని

"ఓ దివ్య మౌక్తికను! నిను
నా దోయిటఁ గొంచెపఱచినాఁడను"

అన్న సూక్త్యర్థభావనయే నా మనస్సును లోఁగొనుచున్నది.

—o—

శైష్యోపాధ్యాయిక

వేదుల శ్రీరామచంద్రకీర్తి

విద్యారంభమునకు దొలుత బ్రహ్మోపదేశము చేయుట పితృపాదులకే నియతమైన విధి. ఇది ఆర్షసంప్రదాయము. కాఁగా, ఎవ్వరికైనను దొలి గురువు తండ్రియే.

బ్రహ్మశ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తిగారు సత్యనారాయణశాస్త్రిగారి జనకులు. తన బాల్యమునఁ దిరుగదోడి శాస్త్రిగారితోపాటు శబ్దమంజరి వల్లెను, శాస్త్రమును ముట్టెను.

గీ॥ మరల నాతోడబసి యీడు తిరుగదోడి
యాడె- జతఁగూడె- నక్షరాభ్యసనమెనసె
శబ్దమంజరివల్లె శాస్త్రమ్ముముట్టె-
గవిగ దీవించె- తనగొంతు కలిపిపంచె-

ఇదిగాక;

నీ మృదుశయ్యమీద శయనింపగరాఁగ బురా
మహాకవి
స్వాముల వ్యంగ్యభావ రససంపద లెంచుచు
మేలుకొల్పుగా
నామది నెచ్చరించితివనా, చిననాట; గురుం
డటన్న నీ
వే మఱినాకు; నీవెనుక వేంకరామశతావ
ధానియౌ

బాల్యమునుండియు దనప్రక్క బరుండబెట్టుకొని బ్రహ్మీముహూర్తమున మేల్కొల్పి సాహిత్య ద్రుమముల కాలవాలములైన శబ్దమంజరి, అమర నిఘంటువులను తనతోకూడ చదువుచు, అయాప్రసంగములలో మహాకవుల సుద్దులను విని పించుచు, కుమారునిలో గవితానురక్తియు, సాహిత్యాసక్తియు బ్రోదిచేసినది తండ్రిగారు మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారు. ఆయన మృదుశయ్యమీద శయనించినందుననే శాస్త్రిగారి శయ్యగూడ మృదుమధురమైనదికానోపు.

ఆయన శాస్త్రిగారి నాయన. మొదటి గురువు. కావుననే శాస్త్రిగారు పితురంతేవాసియై వాసికెక్కినారు, అహోయంతన మానిశాత్యయముగా లాలించి, ఉగ్గుపాలతోపాటు, గోరుముద్దలతోపాటు సాహిత్య నవనీతమును తినిపించినారు. కొడుకు కవి కావలయునంచు గోరుకొన్న తల్లిదండ్రుల ముద్దు చెల్లించు భాగ్యము, నదృష్టము సత్యనారాయణ శాస్త్రిగారి కబ్బినది.

ఉత్తరహిందూస్థాన పరిభాషలో కవిరాజనగా ఆయుర్వేద వైద్యుడు. ఆయుర్నిగమవేదియైన తండ్రి గారొకరీతిగా కవిరాజు. కావ్యకళావేదియైన కుమారుడింకొకరీతిగా కవిరాజు.

ఆయుర్వేద వైద్యమున తండ్రి సిద్ధహస్తుడు. ఒక్క మందుపొట్లముతో దుర్భర శిరోవేదనను మటుమాయముచేసి నూటపదియార్లు కానుక నందికొన్న కవిరాజు తండ్రి. సాహిత్య వ్యవసాయమున శ్రీఖండమును బ్రోదిచేసి కావ్య సౌరభములను వెదజల్లిన కవిరాజు కుమారుడు.

చెవినిల్లుగట్టుకొని కవితా మాధుర్యమును వెలువరించి తనయునిలోని కవితాశక్తిని మేల్కొల్పినది తండ్రిగారే. తండ్రిగారి నిరంతర కవితావ్యాసంగమే

భ్రమరకీటన్యాయమున సత్యనారాయణశాస్త్రి ద్విరేఫ శాబకములోని కవితాచైతన్యమును మేల్కొల్పినది. ఝుంకారముచేయుచు నీ ద్విరేఫము నవ్య కావ్య పుష్పములతో తోరణము కట్టినది. శ్రీఖండము నాఘ్రాణించినది. ఆంధ్ర రచయితల రచనలలోని మరందమును గ్రోలినది. అఖిలాంధ్ర చరిత్రమును బుక్కిలించి పురాణించినది.

నా యెఱింగినంతలో తన తండ్రికే కావ్యము నంకితముచేసిన మొదటి మహాకవి పింగలి సూరన.

కం. మజ్జనకున కర్పిత ధీ
మజ్జనకునకు, హరనుతి సమార్జితమాయో
న్మజ్జనకున కమలచిదన
మజ్జనకున కమృతరస నిమజ్జనకున్.

అని పింగళి సూరన,

శ్రీమధురనైజ మంగళ
నామాదృశ తనయ! సత్యనారాయణమూ
ర్తీ! మన్నయనామృత వ
ర్తీ! మత్కవితా ఝరీసరిత్పతి! సుకృతీ!

అని సత్యనారాయణశాస్త్రిగారు,

'ఆత్మావైపుత్రనామాసి' యను శ్రుతి ననువ రించుచు,

శా. ఈనోటం బలికించు మాటలివి నీవే; పాట
లున్నీవె; తం
డ్రీ నాగిసిన యక్షరాక్షరము నీవే; నాకు
ప్రత్యక్ష వి
జ్ఞానజ్యోతివి నీవ; తత్త్వమున;

అనుచు,

నాకూర్చిన యీకృతి నీకుడుగరచేసి కృతినాదు నన్నారు. పితృబ్రహ్మ యుపదేశం బాదేశంబుగా గాని ఆంధ్రపురాణము పూర్వార్థమును పితృప్రియ సఖుని కుమారులైన రేమెళ్ల వేంకటరావుగారికి కృతి యిచ్చినారు. తండ్రిగారితో తండ్రిగారికి మైత్రి;

ఆయుర్వేదచికిత్స హేతువుగ అందిచ్చిన చేయి, చెల్మిబలమై చేదోయిచేదోయికిం, దీయం బెంచుచు దెచ్చినది, డెందంబు డెందంబుతో రాయంజేసిన మైత్రిగాఁ బెంపొందినది.

అట్టి వేంకటరాయణింగారి కుమారునకు నా కుమారుడవైన నీవీగ్రంథమును గృతియిమ్మని ఆజ్ఞాపించినారు,

కాని, ఆంధ్రపురాణపు నుత్తరార్ధముతో పితృ పాదముల కంజలించినగాని తనివోవక దానిని తండ్రి గారికే అంకితమొనర్చినారు.

'నీరుకొలఁది తామరసుమ్మా' అనునట్లు, కవితా లత సాహిత్యబలమును శాస్త్రపాటవమును, గలిగిన కాని, నవనవోన్మేషముగ మొగ్గదొడిగి చివురింపదు. పండితులందఱు కవులు కాకపోవచ్చును, కాని, కవులందఱు పండితులు కాక తప్పదు. మహేంద్రవాడ సుబ్బారాయశాస్త్రిగారి శుశ్రూషలో కావ్యనాటకముల సిద్ధాంతకౌముదియు జనివి అకళించుకొని సాహిత్యస్రష్టకు గావలసిన ధాతుపుష్టిని సంపాదించి నారు. సాహిత్యము విషయములో సత్యనారాయణ శాస్త్రిగారి కావ్యప్రత్యయమును గల్పించిన గురు ముఖ్యులైన మహేంద్రవాడ గురువంశస్వామి సుబ్బారాయశాస్త్రిగారిని కృత్యాదిలో మాతాపితల వెను వెంటనే స్మరించి, సత్యనారాయణశాస్త్రిగారు,

మాతృదేవోభవ
పితృదేవోభవ
ఆచార్యదేవోభవ

యన్న ఉపనిషద్వాక్య మర్యాదననుసరించినారు. అనూచాన మార్గమును తలపించినారు.

* * *

'ఎదుట చెళపిళ్ల వేంకటబుధుడు, రామ
కృష్ణ కవులాప్తభాంధవ శ్రీలమెఱయ'

నని సత్యనారాయణశాస్త్రిగారు పేర్కొన్న రామకృష్ణ కవులలో వేంకటరామశాస్త్రిగారు పితాపుర

సంస్థానకవులు. ఈయన శాస్త్రిగారికి మేనత్త పెనిమిటి. సత్యనారాయణశాస్త్రిగారు కన్నులు తెఱచిన నాటికే పిఠాపుర మహారాజాంధ్రభోజులైనారు. వేంకట రామకృష్ణకవులా భూజాని యాస్థానిలో కవిరత్నములు కథలలో, కావ్యములలో వర్ణితులైన భోజరాజులు, కవిరత్నములు వీరేకాబోలు నన్న భావమానాడు పొడకట్టెడిది.

వేంకటరామకృష్ణకవులు అక్షరలక్షలిచ్చునట్టి నృపులను, అట్టి కవీంద్రులను ప్రత్యక్షము చేయఁజూపిన కవులు.

సత్యనారాయణశాస్త్రి గారెఱింగిననాటికి, తిరుపతి వేంకటకవులును, రామకృష్ణ కవులను యుద్ధపర్వములు ముగిసి ఏకశేషవృత్తికి లోనై, శాంతిపర్వములో నుండెడివారు వేంకటరామశాస్త్రిగారు, కథాసరిత్సాగరమునకేతామెత్తి నిరంతర రచనా వ్యాసంగములో నిమగ్నులై యుండెడివారు.

అప్పుడే రెక్కలువిచ్చిన మధుద్విరేఫము చేసెడి అలతియలతిఝుంకారములోని మార్దవము, నావుకతలను గమనించి కాఁగలవాడని మెచ్చి ఆశీర్వదించి తమ పలుకుబడిని తోడిచ్చినారు,

వేంకటరామశాస్త్రిగారు, తాము కావ్యరచనా వ్యాసంగమున గడించిన విశేషానుభవమున కీతడు తగిన 'వారసు'డని గుర్తించి శాస్త్రిగారిని హెచ్చరించినారు. ఆ దివసములలో ఆయనతో మాట్లాడుటే విద్యాభ్యాసము అనుకొనెడివారము. నన్నయాదులలోని ఉక్తివైచిత్ర్య లను, చిన్నయాదుల శాబ్దశౌచ్యమును ప్రాసంగిక ధోరణులలో వెలువరించి మెల్లగా సత్యనారాయణశాస్త్రిగారిని తమ గురుత్వాకర్షణ పరిధిలోనికి చేరదీసినారు. ఆయాకవుల కవితా వైశిష్ట్యములను వెలువరించి పులకరింపఁజేసినారు.

'ఆంధ్ర' పత్త్రికాస్థాపనమును, నిర్వహణమును, సత్యనారాయణశాస్త్రిగారి కవితాప్రస్థానములో నొక ముఖ్యఘట్టము. 'ఆంధ్రి' కర్త శాస్త్రిగారే కాని, దీనికి కారయిత, ప్రేరకులు ననుమోదకులును వేంకటరామశాస్త్రిగారే. ఆ కాలముతో నప్పటికే సిద్ధహస్తులైన, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులుగారు, పిశుపాటి చిదంబరశాస్త్రిగారు మొదలుకొని, వర్ధమానులగు విశ్వనాథ సత్యనారాయణ, తుమ్మల సీతారామమూర్తిచౌదరి మొదలగు వారందఱును తమ రచనల నందించి యాంధ్రి నలంకరించినారు.

పత్త్రికానిర్వహణములోఁగూడ సత్యనారాయణశాస్త్రిగారు, నవ్యమార్గముల నవలంబించినారు. ఆయా రచనలను 'పొడిగా' ప్రచురింపక, అధోజ్ఞాపికలలో, వాడియున్నను, వేడిలేని, వ్యాఖ్యలను సంతరించు పద్ధతిని వేంకటరామశాస్త్రిగారు ప్రవేశపెట్టినారు. వెనుకనుండి పిల్లలచే గాల్పించు కాకరపూవత్తులవలె, వెంటనే చుఱుక్కన్నను, నీవ్యాఖ్యలు వెనువెంటనే రచయితల ముఖములలో చిఱునవ్వులు చిందించినవి. ఈ 'రిమార్కులు' రచయితలకు వినోదము కల్గించెనేగాని, విషాదము నొందింపలేదు. సంపాదకుని చేతిలో తమకు వచ్చిన 'మార్కు'లవలె వీనిని పరిగణించి వానికొఱకాత్రుతతో వేచియుండెడివారఁట. ఈ పద్ధతి వేంకటరామశాస్త్రిగారు పెట్టిన ఒరవడి, సత్యనారాయణ శాస్త్రిగారు దిద్ది తీర్చిన మెఱవడి.

బోధయిష్ణువులైన వేంకటరామశాస్త్రిగారు, సత్యనారాయణశాస్త్రిగారిని పుత్త్రనిర్విశేషముగా చేరదీసి, యాదరించి, తీర్చి దిద్దినారు. దీనికిదోడుగ సత్యనారాయణశాస్త్రిగారికి కవితావిద్య ప్రాక్తన జన్మసంస్కారలభ్యముకూడ

జయంతి తే సుకృతినో
రససిద్ధాః కవీశ్వరాః,

—:o:—

గురుదక్షిణ

శ్రీ శనగన నరసింహస్వామి

పావన గౌతమీ స్నానభాగ్యము, రాజమహేంద్రమందిర
శ్రీ విపులానుబంధ మొడసేయఁజాలని కౌతుకాప్తి నాం
ధ్రావనిపై మఱొక్క పరియాయముతోచిన నన్నిభట్ట భూ
దేవుడవంచు నిన్ను గుఱుతించితి నంచితసాహితీవ్రతీ!

స్వస్థానవేషభాషా పరత్వమునకు స్వచ్ఛాంధ్ర జీవనసరణి సాక్షి –
నానాపురాణ విజ్ఞానసామగ్రికి ప్రతిలేని వ్యుత్పత్తిబలము సాక్షి –
అసమమత్యమరాధి పాచార్యతా లక్ష్మి కతిలోకలోకవిజ్ఞతయె సాక్షి –
నిత్యసత్యవచన నియమ సంప్రీతికి 'జాషువా' పై విమర్శంబు సాక్షి –

అమృత సూక్తినిధికి నక్షర రమ్యతా
గతికి సుప్రసన్న కథల తతికి
అమలముకురమైన 'ఆంధ్రపురాణము'
సాక్షి – వేఱెయింక సాక్ష్యమేల?

పండంబాఱిన పాండితీవిభవ మా పాండిత్య పర్యాప్తికిన్
నిండుంబ్రాణము వోయఁజాలు ప్రతిభోన్మేషంబు తత్ప్రాతిభో
ద్దండత్వంబునకున్ బవిత్రతను సంధానించు వాక్ శాసనో
చ్ఛండత్వంబును నేకమైన కవితాసంపత్తి నీదే సుమా!

మాసిన శాసనోక్తముల మాటునడాఁగి; పురాణగాథలన్
గాసట బీసలై పలపు కగ్గిన పూర్వమహాంధ్ర భూమిభృత్
భాసురవంశవృత్తముల ప్రౌఢకృతిన్ బచరించు కీర్తి వి
న్యాసము నీకెదక్క రసికావళి నీఋణ మీఁగజాలునే?

నిను గురుదేవుగా బడయనేరని నేరమి దూరమై మనం
బున నొక వింతమోదము గుబుల్కొన శక్తికొలంది పద్యవం
దనములు బంపుచుంటి గురుదక్షిణగాగొని మీ పరోక్ష శి
ష్యునిపయి చిందుమయ్య శుభసూక్తములన్ గవితామహోదధీ!

అధునా కోను నసేవతే! — శ్రీ కేశిరాజు వెంకటనృసింహఅప్పారావు

మధునారంజిత మాంధ్రరాజ సుయశోమందార బృందావనం
మధునాపూరిత మాంధ్రమాతృకరశుంభత్స్వర్ణ పాత్రం మహత్ !
మధునాపంతుల సత్కవీంద్ర కృత రమ్యాంధ్రేతిహాస స్తుతా
మధునా కోను నసేవతే వసుమతీమాంధ్రీం సుపుత్రప్రసూమ్ !

కామేశ్వరీ — శ్రీ చిలుకూరి రామభద్రశాస్త్రి

కామేశ్వరీ సోమనారీ! త్వద్వంశ్యా రాధ్యతాంగతా
కుర్యాత్త్వాం ధన్యతారోగ్య భాగ్యాయుః పుత్రపౌత్రిణమ్.

మార్గదర్శి — సన్నిధానం నరసింహశర్మ

పులకలువుట్టగా రసికమూర్తులు తాము సుధానుభూతి లో
తులనిధులన్ గ్రహింపగ మధుస్రవదూర్జితధార దీయనా
గళమునవిప్పి పుంస్కికము కమ్మగ 'దేశి' చిత్రపాడె మం
గళకరభావనా మహితకావ్య మనోహర 'మార్గ' పద్ధతిన్

ఘన పద - అర్థము — గాడేపల్లి కుక్కుటేశ్వరరావు

మెత్తన వర్తనంబు, సుతిమెత్తన చిత్తము, మాట యంతయున్
మెత్తన, కావ్యసృష్టి మఱిమెత్తన శబ్దము నేరుకొంటయున్
మెత్తన, యిన్ని మెత్తనలు నిండిన త్వచ్చరితంబునన్ గవీం
ద్రోత్తమ! వింతయే ఘనుడవోయి యటంచు జగమ్ముపల్కుటల్ !

సంధ్యాసఖి!

శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ

సమమధుర సంగతోక్తి
క్రమలక్ష్య ప్రతినవార్థ కైరవ గంధ
భ్రమదిందిందర సహృదయ
సమదియోద్గేయకీర్తి సరణి సితఘృణీ!

వాసితమైన యేభవాము వాసనయో! యిటనాను, నీదు సా
వాసము మల్లికాప్రసవవాసము నిత్యనవీన సౌహృదో
ల్లాసము విస్మృతిక్షణ విలాసము గౌతమియొడ్డులందు, సం
ధ్యాసఖ! సంస్కృతాంధ్ర కవితావనితాహృదయాధి వాసముల్.

పాయనికర్మబంధముల పట్టునకందక యాంధ్రభారతా
మ్నాయవిలీన తేజ మపునర్భవమాటఁ దలంచిలోన, నా
రాయణభట్టు పీవనెద రాఁగిలి, సత్యమెమైన పత్యనా
రాయణశాస్త్రి వౌటకదిరా! యది మించునె? యెన్నిభంగులన్.

అజ్ఞకృతప్రశంసలు సహస్రములైనను నిల్వఁబోవు, త
త్త్వజ్ఞులసూక్తిరేఖుం డనుభవప్రమితంబు నివాతదీపమై
విజ్ఞహృదబ్జపీఠికల వెల్గును సంస్కృతికల్గుదాఁక, సా
రజ్ఞులునిన్ను బోలికలరా! యధునాంధ్రవచో వసుంధరన్.

ఏ రాజ్యమ్ములు సాగనీ! మఱియుఁదామే రాజులేయేలనీ!
చేరన్ నాటికినేటికిన్ గవులు నిన్ శ్రీగౌతమాపత్యవాః
ఘూరంపున్ సయిదోడుగా సుకవితాభోగం బవిచ్ఛిన్నధా
రారమ్యంబగు రాజ్మహేంద్రనగరీ! రాజద్యశోవైఖరీ!.

చిరంజీయాత్

శ్రీమల్లంపల్లి వీరేశ్వరశర్మ

నేటికవీంద్రకోటి గణనీయుఁడు సత్వచరిత్ర సంపదన్
మేటి యజాతశత్రుఁడు సమృద్ధరసాంధ్ర పురాణభారతీ
హాటకగర్భుఁడున్ మహితనైక జనుస్సహయాత్రికుండు, చి
త్పేటిక సత్యసత్కవి, నుతింగనుగాతఁ జిరాయురున్నతిన్॥
ప్రాయమ్మారయఁ జిన్నయయ్యుఁ గవితాప్రౌఢిన్ గుణౌఘమ్ములన్
జ్యాయస్త్వమ్మున నించుమించయి కవిత్వైరావతారూఢుఁడై
ఆఁయుష్మంతుఁడు సత్యసత్కవి, సతీప్రారూఢ వీణావళీ
శ్రేయః ప్రేయణితోరసార్ద్ర సుకృతిశ్రీఁ జేసి వర్ధిల్లుతన్॥

మధునాపంతుల కులనిధి
రఘునా మధునాఽభిషిక్త పదవారినిధిః
విధినా విధునా విధునా
మధునాచ, సమం చిరంజీయాత్.

శివమ్

అక్షరదర్శనము

ఉషశ్రీ
ఆకాశవాణి

తెలుఁగున్ జాతి మహేతిహాసము నగస్త్యుంబోలె నాపోశనిం
చి లలిన్ నీతలిబాస ముగ్ధమధురస్ఫీతిన్ రసామ్నాయమై
వెలయుం జేసిన తావకీన కవితావేతృత్వమున్ కోటి గొం
తుల శ్లాఘించె త్రిలింగధాత్రి కవిజోదూ! నీకు దీర్ఘాయువౌ.
నవపర్వోజ్జ్వలమై తనర్చుకృతి నానందమ్మునై నీపితృ
శ్రవణాలంకృతి జేసి యాపయి పదర్చాపుష్పమై క్రోలగా
హావణింపం దొరకొన్న యిద్ధమతి వౌరా! దీనితో నీదుపు
ట్టువు ధన్యత్వమునందె కబ్బమును గండూషించె సౌరభ్యముల్.

ఆంధ్ర రచయితలు - అక్షరార్చన

సూర్యశ్రీ

"'ఏమో! యీకృతి యెంత శాశ్వతమటోయీ! యందురా ? కాదు కా
నీ. మాధుర్యధురీణ కావ్యరచనా నిత్యోత్సవ శ్రీకళా
ధాముల్ నూర్వురు పెంచు నీ యమృత గాథా జ్యోతు లీనాటితో
నే మిన్నందియు వట్టి 'మందకొడు' తానే యెట్టులూహించినన్!"

ఇది మహాకవి మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు తమ 'ఆంధ్రరచయితలు' అను గ్రంథము యొక్క అవతారికయందు రచించినది. కృతిపతి పండిత అకొండి రామమూర్తిశాస్త్రిగారు కవిగారికి మాతామహులు. వారియందుగల గౌరవముతో, ఎంతో కృతజ్ఞతతో మధునాపంతులవారు వారికీ కృతి నీయదలచిరి. అట్టియెడల, ఆ భావభారమున కనవైన భారము, శాశ్వతత్వము నీ కృతియందున్నదా ? లేదా ? యన్న ప్రశ్న యుదయించుట అస్వాభావికముకాదు. దానికి హృద్యమగు సమాధానమే పై పద్యము. ఏ గ్రంథమునకైనను మనికియు, మన్నికయు రెండంశములను బట్టి యేర్పడును. మొదటిది విషయము, రెండవది విన్యాసము. 'మాధుర్యధురీణ కావ్యరచనా నిత్యోత్సవ శ్రీకళాధాము' లను నూర్వుర నాశ్రయముగా చేసికొన్నది విషయము. కావున అత్యంతోదాత్తము. ఇంక విన్యాసము సంగతిని ప్రసంగింపవలయును. అది ఆత్మసమీక్షాయణము; కత్తిమీది సాము వంటిది, ఏమాత్ర మెక్కువైనను అహంకారముగా భాసించున; ఏమాత్రము తక్కువైనను అసమర్థత్వముగా ననిపించును. కావున సహజవినయసంపన్నులయిన సత్యనారాయణశాస్త్రిగారు విన్యాసవిషయమున మూకీభావము వహించిరి. నిజమునకు సహృదయ సమీక్షకుల కర్తవ్యమది. ఆ కర్తవ్యమును గుర్తించి యథోచితముగా నిర్వర్తించుటయే ప్రకృత వ్యాసపరమార్థము.

ఈ గ్రంథమునందు తొంబదియాఱు వ్యాసము లున్నవి. ఆఱు వ్యాసములందు కవులజంటలు ప్రసక్తము లయినవి. అందువలన మొత్తము నూటయిరువురు రచయితల గాథ లిందున్నవన వలయును. '...కళాధాముల్ నూర్వురు' అని యనుట 'ఆదిఁదొడంగి మూఁడు కృతు' లని యనుటవంటిది.

పూర్వము 'కవి జీవితములు' కలవు; 'ఆంధ్ర కవుల చరిత్రలు' కలవు; 'శతక కవుల చరిత్రలు' కలవు. కవి శబ్దము రూఢినిబట్టి పద్యకవిత్వ సంధాతలకే యన్వయించును. రచయితృ శబ్దము విస్తృతార్థము గలది, రచయితృ శబ్దము కవి, విమర్శక, పరిశోధకాది సర్వసామాన్య రచనాకార వాచకమగునని యాలోచించి యిపుడీ కూర్పునకు 'ఆంధ్ర రచయితలు' అను పేరు పెట్టనాయెను. వెనుకటి వలెఁగాక వర్తమాన సారస్వతము వేయిపడగలై విస్తరిల్లిన దనుకొంటిమి. ఒక పద్యకవుల చరిత్రముతే సంధానించినచో, యావజ్జీవము చరిత్రాన్వేషణముచేసిన పరిశోధకులు- సంపుటములకొలఁది విలువగల విమర్శనములు వ్రాసిన పండితులు- మున్నగువారు చరిత్రకెక్కక మఱుఁగుపడవలసినదేనా ? 'రచయితలు' అన్నచో బాధయుండదు. ఈ యూహతో నీ నామకరణపు మార్పు జరిగినది."

ఈ మార్పు సమంజము, సముదాత్తము.

పూర్వమున వెలసిన కవిజీవిత చరిత్రలు పూర్వ కవి చరిత్రలు. పదునెనిమిదవ శతాబ్ది తుదివరకు సాగిన సాహిత్య మొక దిక్కుగా సాగినది. పందొమ్మిదవ శతాబ్దినుండి బహుముఖీనమైనది, శాఖోపశాఖలుగా విస్తరిల్లినది. ప్రాచీన కవిత్వభాండారమెంతయున్నదో, అధునిక సారస్వత భాండారమంతకెన్నో రెట్లు మించియున్నది, దీని నంతటిని చరిత్ర కెక్కించుట పవిత్రకార్యముగా శాస్త్రిగారు భావించి. పందొమ్మిదవ శతాబ్దియందు పుట్టినవారి జీవిత సాహిత్యసమీక్షలతో మొదటి సంపుటి రూపు దిద్దుకొన్నది. ఇరువదవ శతాబ్దియందు జన్మించిన సాహిత్యకుల విశేషములతో ద్వితీయ సంపుటి రావలసియున్నది. మఱి ౧౯౦౦ సం॥తో ముగించుటకు బదులు, ఒక యేడు ముందుకుసాగి ౧౯౦౧ సం॥లో జననముగల శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారి నిందుఁజేర్చుట, వారినిగూర్చిన వ్రాయసము ద్వితీయ భాగమునకు "నాంది"పాఠము కాఁగలదని యిపు డిక్కడ మనాకూ్నచనముసకు–" అని ద్వితీయభాగము విషయమును శాస్త్రిగారు ప్రసంగించియే యున్నారు ఇది ౧౯౫౦ నాటి విషయము. నాటినుండి నేటివరకు సాహిత్యాభిమానులు తదధీనమానసులై యున్నారనుట వాస్తవము. తొందరలోనే ద్వితీయ సంపుటి ప్రకాశమునొంది సహృదయ హృదయవికాసమును సమకూర్పగలదని నా విశ్వాసము; నా దృఢాభిలాషము

సరి! ఈ సమీక్షలలోకొన్నింటిని తమసంపాదకత్వమున వెలువడిన "ఆంధ్రి" యందు వెలువరించిరి. అవి యొక గ్రంథముగా సైతము వెలువడినవి. ఆంధ్రీ కుటీరము ప్రకటించినది. 1944 లో ప్రకటితమైన యీ గ్రంథమున 44 గురు రచయితలనుద్దేశించి రచితములైన 41 వ్యాసములున్నవి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పీఠికను సంతరించిరి. ౧౯౫౦లో లో 'అద్దేపల్లి అండ్ కో' వారు ప్రకటించినది అభివర్ధిత సంస్కరణము అదే ౧౯౫౩ లో పునర్ముద్రిణము నొందినది.

ఆంధ్రవాఙ్మయమున నేడు శ్రీ వీరేశలింగం పంతులుగారి కవుల చరిత్రతో సరితూగఁగల గ్రంథమిది యొక్కటియే. అందు కవుల బాహిరరూపము చిత్రింపఁబడినది. ఇందు రచయితల ఆంతరరూపము చిత్రింపబడినది. అది సంతరించుటకు పంతులుగారెంతశ్రమపడియుండినారో యిది సంతరించుటకు శ్రీ శాస్త్రిగారును అంత శ్రమపడినారని పాఠకులు స్ఫుటముగా గుర్తింపగలరు."

"ఈ గ్రంథము చదివిన, దిగ్గజములవంటి అనేక జీవద్రచయితల గోష్ఠిలో పాల్గొనుచున్నట్టు విలక్షణానుభూతి కలుగును. దానంజేసి బుద్ధి నిశితమును ప్రతిభ నవనవోన్మేషితమును అగును. శ్రీ శాస్త్రిగారు ఆశించిన పరమార్థమే యిది".

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు శాస్త్రిగారు పడిన శ్రమను చూచి చూచి, తూచినట్లు పలికిన పై పలుకులతో ఏకీభావము లేనివారుండరు. పూర్వ కవుల చరిత్రలను సంతరించుటకు తత్తద్గ్రంథములతోపాటు శాసనములను, చరిత్రములను, వైదేశికుల లేఖలను కైఫీయత్తులను, కవిలెకట్టలను నింక నిటువంటివానిని శోధింపవలయును. ఇంత శోధించి కావలసినదానిని సాధింపవలయును, ఒక్కొక్కప్పుడదియంతయు కొండనుత్రవ్వి యెలుకను పట్టుటయే

కావచ్చును. నవ్యరచయితల చరిత్రలను సంతరించుటకు తత్తద్గ్రంథములతో పాటు దినచర్యాగ్రంథములను, దైనిక పత్రికలను, విమర్శన వ్యాసములను తత్తదాంతరంగిక లేఖలను – ఇంక నిటువంటివానిని శోధింపవలయును. వీని నెన్నింటిని శోధించినను, వృద్ధుల నాశ్రయించి వారివలన వారికి తెలిసిన విషయమును సేకరింపక తప్పనిసరి యగును. అందఱమన సత్త్వము నొక్కవిధముగా నుండదు, కొందఱు సులభప్రాప్యులు కావచ్చును; విషయమునుగూడ ముక్తసరిగా అందజేయవచ్చును కొందఱు సులభప్రాప్యులే కావచ్చును, కాని ముక్తఝరివంటి వారి ప్రసంగమునందు అభిలషితవిషయము సులభప్రాప్యము కాకపోవచ్చును. కొందరు పూర్తిగా విముఖులుకూడ కావచ్చును. కొందఱు సందేహగ్రస్తులు కావచ్చును. కొందఱు మఱకువ వలన తప్పుత్రోవ నాదరింపగా, కొందఱు తెలిసి తెలిసి తప్పుత్రోవ పట్టింపవచ్చును. విషయసంపాదన మిన్ని చిక్కులతో కూడియుండును, ఇన్ని చిక్కులను విప్పుకొని అడ్డంకులను దాటి, సమీచీనమైన నిర్ణయమును చేసికొని సర్వాంగ సుందరమైన సమీక్ష వ్రాయుట మాటలతో అగుపనికాదు. సత్యనారాయణశాస్త్రిగారు మనసుంచి చేసినపని యిది. కావుననే సూటిగా మనసును తాకి, వంద తీగల వీణగామార్చి, దివ్యనాదము లొలికించి పరమానుభూతిని కలిగించుచున్నది. పరోక్షమును ప్రత్యక్షము గావించుచున్నది.

ఇప్పు డింక నొక్కొక్క విషయమును వింగడించి చూతము 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి' యన్నది శాస్త్రము. దానిని కావ్యమున కన్వయించి చెప్పుకొనుట కాలక్రమమున పరిపాటియైనది. వ్యాసముల విషయమునగూడ అ నియమ మన్వితము కాకపోదు– అట్లే యితర సాహిత్యభేదముల విషయమునగూడ అన్వయింపవచ్చును, వచ్చుననికాదు – వలయునని యనుటయే సంభావ్యము. తొలినుండి తుదివరకు సుందరముగా నున్నప్పుడే ఏవంవిధ రచనము కళాపదార్థము కాగలదు సత్యం శివం సుందరమ్మను త్రిపుటి కళావ్యక్తికి శ్రీరామరక్ష.

ప్రకృత సమీక్షాగ్రంథమునందు విషయప్రతిపాదనము జరిగిన విధానమును గుర్తింతము. ప్రతివ్యాసమునకు ముందర కులము, గోత్రము. సూత్రము, తల్లిదండ్రులు. జన్మస్థానము, జన్మతిథి, రచించిన గ్రంథములు– ఇత్యాది విషయములను పట్టిక రూపమున చూపిరి. ఇది విషయ సంగ్రహమా ? అనిపించును. కాని అట్లు కాదన్న విషయ మేయొక్క వ్యాసము చదివినను వెంటనే విశదము కాగలదు. దాని ప్రయోజనము దానిది. చూచినవెంటనే కన్నులకు కట్టునట్లు రచయిత్ర జీవితకృషి స్థూలరేఖలు **(Bio-data)** ఇందు కనుపట్టును. వ్యాసమునందు విషయ ప్రతిపాదనము పెక్కురీతులలో జరుగును. ఒకే విధముగా నిర్వహించినను నిర్వహింపవచ్చును; అట్లు చేయరాదను నిర్బంధములేదు. ఏకరీతి రచన స్వస్పంద సుందరము కాజాలదనుట సర్వవేద్యము. మూడో, ఏడో స్వరములలోనికి ప్రస్తరింపబడినపుడే సంగీతము, వైవిధ్యము నాదరించినప్పుడే సౌందర్యము. ఈ రహస్యము నెఱిగిన శ్రీ శాస్త్రిగారు సముజ్జ్వల సౌందర్యసమారాధకు లగుట, వైచిత్రీ సంపాదనము గావించుట స్వాభావికమే కాని సాశ్చర్య సంభ్రామకము కాదు...

వందలమందిని 546పుటలలో ఇమిడించి యింపులు సొంపులు దిద్దిన గ్రంథకర్త చాతుర్యము సర్వథా సౌష్ఠవధుర్యము. కొందరు ఈ సంపుటి యందు చేరవలసిన రచయితలను చేర్పలేదని, లోపముగా సాటోపముగా వచించుటకలదు. రచయితయే తాము మరచినట్లు గుర్తించుకొని కొందఱు పేరులను పీఠికయందు తెలిపిరి. వారేకాక యింక నెందరో యుందురని యంగీకరించిరి. ఇది లోపమే యగుచో, ఇట్టి లోపము సాపవాదముకాక సార్వత్రిక మగుటయే స్వాభావికము. కవికులతిలకుడు 'ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాంపరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః' అన్నది స్మర్తవ్యము.

ఇంతవరకు నిది వింగడించి చూపుట విశ్లేషణము వివేకమునకు సహకరించును. అంగాంగ దర్శనము శాస్త్రీయ విధానము; అది సౌందర్యప్రధానము కాదు. సౌందర్య దిదృక్షువులకు సమగ్రదర్శనమే సముపాదేయము. సంశ్లేషమే రసోత్సేకమునకు సాధనము. కావున విషయమునకు, విన్యాసమునకు సంబంధించిన యీ విశ్లేషణము వలని వివేకముతో. ప్రతివ్యాసము రసోల్లాసమని గుర్తింపనగును. పదముల పొందిక, తీర్చినట్లున్న వాక్యములకూర్పు, వాక్యముల సమీకరణము, ముక్తాప్రాయములైన సూక్తుల సంఘటింపు- ఇవన్నియు, ఏ వ్యాసమున కావ్యాసమునే ఒక రాసఘట్టముగా చూపుచున్నవి. మొత్తమిది యంతయు వ్యాసతీర్థము.

పరిష్కృతములుగా నున్న సూక్తులను పలుకుబడులను కొంత గుర్తింతము.

ఉత్పర్స్యతే మమ కోఽపి సమానధర్మా- నిరంకుశాః కవయః - సుకవితా య ద్యస్తి రాజ్యేన కిమ్ - కౌముదీ యది కంఠస్థా వృథాభాష్యే పరిశ్రమః - మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథన్తే - శుచిర్విప్ర శ్శుచిఃకవిః అర్కశుష్కఫలకోమలస్తనీ పెద్దిభొట్లు గృహిణీ విరాజతే-కవులకు గద్యము గీటురాయి - గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్నసంశయాః - మృదులం నవనీత మీరితం నవనీతాదపి సజ్జనస్య హృత్ - అమ్మల మనమున్ నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగవాఁడు- పుత్రాదిచ్ఛేత్పరాజయమ్-వ్యాకరణమొక్కత్రోవ మహాకవులొకత్రోవ- పుత్రాత్సద్గతిరితిచే త్తదపి ప్రాయోఽస్తి యుక్త్యసహమ్-తేహి నో దివసాగతాః-ఆత్మన్యప్రత్యయం చేతః, ఇట్టి వింకను నెన్నో సముచితముగా వ్యవహృతములయినవి, ఆజానజము - భిన్నోదర సోదరుఁడు- వార్షిక బహూకారము - కనిష్ఠికాధిష్ఠితుఁడు- త్రవ్వితండములు —బాధముగా- పురాజానుషము - శైష్యోపాధ్యాయిక - గజగర్భము మొదలయిన పదములు ప్రయుక్తములై పరిసరములను ప్రకాశింపజేయుచున్నవి.

"చిన్నయసూరి వ్యాకర్తయేకాదు, కావ్యకర్త కూడను. భాషాభిజ్ఞుఁడే కాదు, సంగీత కళావిజ్ఞుఁడు కూడను. సరస్వత్యుపాసకుఁడేకాదు, హయగ్రీవోపాసకుఁడుకూడను, సుస్థిర యశస్సంపాదకుఁడే కాదు, 'సుజనరంజనీ'పత్రికాసంపాదకుఁడు కూడను" అని మొదలయిన విధముగా కూర్చిన సమీకృత వాక్యముల కూర్పు రచయిత నేర్పునకు దర్పణము పట్టుచున్నవి'

ఈ విధమైన కూర్పువలన జిగియు బిగియు నేర్పడి సన్నివేశము ప్రభాసన్నివేశమై ప్రకాశించును. 'అల్పపదముల ననల్పార్థ రచన'లోని పరమార్థమునుపరమోత్తమము గాగ్రహించి నిర్వహించిన అక్షరశిల్పి శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు.

'ఆంధ్ర రచయితలు' రచయితల జీవితచరిత్రలను చెప్పుచున్నది. ఈవిధముగా సత్యనారాయణ శాస్త్రిగారు చరిత్రకారులు. ఇందు రచయితల రచనలనుగూర్చిన సమీక్షలున్నవి. ఈ విధముగా నీయన విమర్శకులు. ఈ రెండింటిని గ్రంథనామ రూపములనుబట్టియే స్పష్టముగా గుర్తింపవచ్చును. ఈ రెండింటితోనే ఆగిపోక రచయిత వ్యాఖ్యాతగా మూల్యనిర్ణేతగా, నిరుక్తికారునిగా, మనస్తత్వ పరిశీలకునిగా, ప్రబోధకునిగా, ఉత్తమ భావుకునిగా, చమత్కార ప్రియునిగా, తులనాత్మక పరిశీలనా ధురంధరునిగా, అతులితలలిత ప్రౌఢ గద్యవిహారునిగా సాక్షాత్కరించుచున్నారు.

ఇన్నింటను రచయిత లక్ష్యము దీప్తియే కాని, వ్యాప్తికాదు. వ్యాప్తినే సమ్మతించినయెడల ప్రకృత గ్రంథము పరిమాణమున నిబ్బడియో ముబ్బడియో అంతకు నెక్కుడో అయియుండెడిది. అట్లు కాకుండుటలోని యందమే శాస్త్రిగారికి సమ్మతము.

'ఆంధ్ర రచయితలు' రచయితృ జీవితరచనా సమీక్ష గ్రంథము. అది స్పష్టమే. అంతకుమించి చూపు పారించినప్పుడు, అది ఉత్తమ సంకలన గ్రంథము. ఎన్నికగన్న వండలాది పద్యముల కది పెన్నిధి. చతుర్విధ కవితామార్గముల కాచార్యకము వ్యాస నిసృక్షువులకు శిక్షకము. సూక్తిముక్తాహారము. అనుభవసారము. సాహిత్యచరిత్ర పరిశీలన ప్రవణులకు సంచకరువు. మృతకల్పులయిన కతిపయరచయితలను మరణతల్పము నుండి లేపి చిరంజీవులను చేయుచున్న సంజీవనౌషధము. రసహృదయులకు ముహుర్ముహురాస్వాద్యమానమగు రసాయనము; ఉత్తమోపాయనము బిగువుచెడని, సొగసు విడని రచనయందుత్సాహము కలవారి కెల్లర కుపాస్యము.

ఇంతవరకు 'ఆంధ్రరచయితలు' ఆలంబనముగా సత్యనారాయణశాస్త్రి శ్రీ చరణుల సారస్వత మూర్తికి నా అక్షరాంజలి. ఇప్పుడిది నా పద్య నైవేద్యము.

> 'అధునాతన కవి జగమున
> మధుమయ భణితికి మహర్షి మాన్యసమీక్షా
> విధి మార్గదర్శి యగు మా
> మధునాపంతుల రసజ్ఞమణికి జొహారుల్.'

—o—

రాజమహేంద్రవరం అంటే....

శ్రీ ఎల్. మాలకొండయ్య

అలనాడు వ్రాశాడు వ్యాసుడు
అమరభాషలో పురాణాలు పద్దెనిమిది
ఈనాడు వ్రాశారు మీరు
ఈ నా తెలుగులో పందొమ్మిదవపురాణం
ఈ నా తెలుగుల ఆంధ్రపురాణం

వాస్తవాలో – అవాస్తవాలో !
వ్యాసకృతాలు ఆ పురాణాలు
వాస్తవికతకు భావుకతకు
ప్రస్తుతిపాత్రం మీ అక్షరాంధ్రపురాణం

రాజమహేంద్రవరం అంటే
నన్నయ, శ్రీనాథుడు, కందుకూరి
రాజమహేంద్రవరం అంటే
చిలకమర్తి, పడ్డాదీ, మధునాపంతుల

గౌతమి గుర్తుకు రాగానే
గుర్తుకువచ్చేది ఆనాటి భారతం
గౌతమిని స్మరించి పులకరించగానే
గుర్తుకువచ్చేది ఈనాటి ఆంధ్రపురాణం.

—:0:—

"విందు"

శ్రీ జయంతి వేంకటశాస్త్రి

అతుల పురాంధ్ర రాజచరితామృత ఘట్టముల న్మథించి వి
స్తృత రస కావ్యబంధరుచి దీపిత సత్కృతిగా నొనర్చి రం
జిత మహదాంధ్ర పౌరుష విశేష మహామహిమాభిరామ సం
స్కృతికతి మాధురిన్ కలుగజేయు న దాంధ్రపురాణ మొక్కడే.

"పండువెన్నెల"

శ్రీ రామడుగుల సుబ్బారావు

అది శరద్రాత్రి. గోదావరీ కుల్యపై సోమేశ్వర పురాభిగమనము. మందమారుత శీకరములు మా శరీరాలకు చక్కిలిగింతలుపెట్టి సర్వోత్సాహమును కలిగించు శుభసమయము నావ నడచుచున్నది. మూడవ యామమైనది. మా శాస్త్రి హృదయాకాశములో కవితా మేఘు ముఱిమినది. ఆతని గొంతునుండి వచ్చిన కవితా మధుబిందువులు మా డెందాలను ఆర్ద్రము చేసినవి. కవితాకన్య మా సహాధ్యాయుని వరించి వచ్చి ఆశ్లేషమొనరించుకొన్న శరద్రాత్రిఅది. అది నాకు మధుస్మృతి.

"మధువాక్"

శ్రీ చేబోలు శేషగిరిరావు

సనాతన ధర్మ సంస్కృతియోం కే
పునీత భావామృత జలలే కే
రుచిర కల్పనా కమలశోభితా
మధునాపంతుల మధువాక్ సరితా !

ఆంధ్రభూప జీవన రత్నోంసే
తెలుగు కవి జీవన మణియోం సే
భరా ఆంధ్రపురాణ మధుసాగర
రాజిత ఆంధ్ర సాహిత్య భువిపర్॥

ఆధునికాంధ్రసాహితీ చంద్రశాల

"ఆంధ్ర పురాణము"

శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి

అశేషమనీషిభూషితులైన శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు సంతరించిన ఆంధ్రపురాణము చదువగా—

",గౌః కామదుఘా సమ్యక్ప్రయుక్తా స్మర్యతే బుధైః । దుష్ప్రయుక్తా పునర్గోత్వం ప్రయోక్తుస్సైవ శంసతి" యను శ్లోకము ప్రథమపాదలక్ష్యంగా గనఁబడును; రెండవ పాదమున కుదాహరణల నంతముగా జనించు నీ రోజులలో ఆంధ్ర పురాణమువంటి మహాకావ్యము ప్రదర్శించు బహువిధ ప్రయోగ పవిత్రత, సంప్రదాయ బహుధా పరిరక్షణ ప్రయత్నము, అభిజ్ఞులైన సాహితీ వేత్తల హృదయాకర్షణ నిదానాలై పాఠకుల నతమస్తకుల నొనర్చురీతిని పరమ రమ్యముగా దేశభక్తి నుద్ఘాటించి యుద్భవింప జేయుచున్నవి.

ఆంధ్ర పురాణోత్తరార్థములోని విశేషములు స్థూలముగా బరిశీలించుట ప్రస్తుతము.

ఆనెగొందె సంస్థానము ఢిల్లీ సుల్తాను తుగ్లకు వల్ల పతనమైన సంగతి తెల్పుచు అక్కడనున్న హరిహరరాయలు, బుక్కరాయలు దానిని నిలబెట్టలేకపోయిరన్నమాట యీ కవి పలుకులలో.

""హరిహరాదులు నాఁడెంత యడ్డపడియు గెలుపు సాధింపలేక సిగ్గిలిరి బెగ్గడిలిరి; మృత్యుంజయతను బండించుకొనియె నీప్సితము నిండ నా జంబుకేశ్వరుండు"అని యున్నది. అక్కడి దేవుడు జంబుకేశ్వరస్వామి. ఆ రాజ్యములో హరిహరుడు సచివుడు. 'అతని సహజుడు బుక్కరాయలు కోశాధ్యక్షుడు; అని కవివచించుటలో అనుజన్మడనుటకు సహజుడని ప్రయోగించుట సహజమైన గడుసుదనము దెల్పు సారస్యము చాటుచున్నది. పై పద్యమున 'జంబుకేశ్వరు డీప్సితము నిండునట్లుగా మృత్యుంజయతను బండించుకొనియె నన్న వాక్య తాత్పర్యమేమిటి? రాజ్యము పరాధీనమైనది అదే యీశ్వరేచ్ఛ. ఆ యీశ్వరుడు మాత్రము మృత్యుంజయుడే, అక్కడనున్న యాతని నామము జంబుకేశ్వరుడని, ఆ పని జరిగినది. తుగ్లకుద్వారా. ఆ తుగ్లకు ఈశ్వరేచ్ఛకు కార్యరూప మిచ్చినవాడు. కాబట్టి యాతని యీప్సితము పండినది, ఆ పంట జంబుకేశ్వరునిది ఆ జంబుకేశ్వరుడు తుగ్లకు అనిపించు ధ్వనిలో తుగ్లకు మాయావియైన జంబుకస్వామి యను నూహకు కొంచెము తావున్నది. ఈరీతిని ప్రస్తుతాంశమున చెప్పక చెప్పు కొన్ని ధ్వనిప్రాయమైన విషయములు స్ఫురింపజేయుట మహాకవి లక్షణము.

ఇంతకు ఆనెగొందె హరి హర సోదరుల చేతులలో బునరుద్ధరింప బడినది. అందుచేతనే జంబుకేశ్వరుడు మృత్యుంజయతను బండించుకొన్నాడనుట; హరిహరాదు లడ్డపడినను ఈపని యాగదు అనుట లోకసహజమైనమాట. అది యిక్కడ సహజముగా నతుకుట హరి హర బుక్కరాయల యౌన్నత్యమునకు సూచన హరిహరాదు లడ్డపడినను నొక్కొక్కప్పు డొక్కొక్క ఆపద తప్పదు, ఆ తప్పకపోవుట హరిహరాదుల ఓటమిగా గనిపించినను నిజమునకు వారి కోటమిలేదు. అది విధి

నిర్ణయము. దానికి వారి వ్యతిరేకత సాగదు. ఇది లోకములోని సత్యము, అసత్యము ప్రవర్తించుటకీమాటలు. ఇక్కడకూడ హరి హరాదుల యీ ప్రయత్నము విఫలమగుటయే తప్ప వారికి శాశ్వతమైన యోటమిలేదు వారు చివరకు విజయము సాధించి విద్యానగర రాజ్యస్థాపనచేసిన కారణ జన్ములు.

ఈ మహాకథ ప్రసన్న కథాకలితార్థ యుక్తిగల యీ కవితలో నుండి భాసించుచున్నది. అది సహృదయ వేద్యము. సహజ సుందరమైన యీ గీతపద్యమింతటి మహార్థము హృదయమున దాచుకొన్నది గదా!

ఇంక నానారుచిరార్థ సూక్తినిధిత్వమున్న ఆంధ్ర పురాణకవిత పరిశీలించినకొలది నెన్నిచోటుల నెంతెంత సుందరోదార భావాలు దాచుకొన్నదో వివరింపబోయిన గ్రంథ విస్తృతికా ప్రయత్నము కారణమగును. గ్రంథవిస్తృతి నీ కాలము సహించలేకపోవుచున్నది. ఇతరుల కక్షరరమ్యత యుండనే యున్నది.

సరే! మఱికొన్ని స్థాలీపులాకన్యాయముగనే పరికింతము. హరిహరులు విద్యారణ్యుల దర్శించునపుడు—

"అరుణార్కద్యుతిరేఖలాశ్రమపుల: ప్రాంతావనీ
జాత బం। ధుర పర్ణాంతర జాలభాసురములై తోపన్
సమాధ్యంతమం । దర విప్పంగనులెత్తి యివ్వి
పొదలేల్లారార! చెల్లెక్కు ట। బ్బురమంచున్
మఱియంతలో నపుడనవ్వున్ దాను దద్భ్రాంతికిన్"

అను పద్యమున 'అరవిప్పం గనులన్ను ప్రయోగము చక్కనిది. వీరి ప్రయోగాలలో మార్దవముతో గూడిన ప్రౌఢి సర్వత్ర పరిదృశ్యమాన మగుచుండును. దానికి గ్రంథమంతయు ప్రమాణమే. అది యట్లుంచి యిక్కడి విషయమేమనగా – హరిహరులు ప్రత్యేకోద్దేశముతో స్వామి ప్రదర్శనమునకు వచ్చిరి, కుందేటిని తట్టుకొనలేక కుక్క పారిపోవుటచూచి యాశ్చర్యపడి యందలి రహస్యమేమో తెలిసికొనవలెనన్న వాంఛకూడ వారి హృదయములనున్నది. ఈసందర్భమునకు నాందిగా స్వామివారు సమాధినుండి లేచి కన్నులు తెఱచుసరికి అరుణార్కద్యుతి రేఖలు పర్ణాంతర జాలభాసురములై పొడలుపొడలుగా నాకుల కదలికకనుపుగ గదలుట గనిపించినది. అవి లేళ్ళవలె భాసించినవి ఆ దర్శనము క్షణమాత్రమైనను ఆ యూహ స్వామికి చిత్రమై తద్భ్రాంతికి స్వామి నవ్వుకొన్నారు. ఈ భ్రాంతిలోని రహస్యమే కుందేటి మగంటిమితో సమన్వయించినది. ఇది భావి కథా సూచన. మృదు మధురపద సన్నివేశములో భావుకత్వమిముడ్చుకొన్న యీ పద్యము గడుసైన పద ప్రయోగముతో ప్రకాశించుచు నొక భావి కథా శిల్ప నిర్మాణమునకు పునాదియైనది.

స్వామి కన్నులు తెఱచి "ధర్మధేనువది ముక్కాల్ కుంటియై కంటువెల్లువగా నీరోడియున్ వడకుగొని నిల్చున్నెడు" అన్నారు. కలియుగమున ధర్మమొకే పాదమున నిల్చునన్న భావమెంత చక్కని తెలుగుదనము నింపుకొన్నదో పరిశీలింపుడు.

ఇక ఉద్యోగ పర్వమున 'సారపు ధర్మమున్విమల సత్యము' అను తిక్కనగారి పద్యము శ్రీకృష్ణునినోట రాయబారపు సమయమున వచ్చినది. ఆ పద్య భావము ఒక శాశ్వత విమలసత్యము. ఆ పద్యముతో

సమానముగా తూగు పద్య మిక్కడ విద్యారణ్యుల నోటవెలువడిసందర్భశుద్ధి సంతరించుకొని యౌచిత్యమును బ్రదర్శించినది.

"పుడమిన్ ధర్మమధర్మపుంబెడద బెంపుం బాసిపోనున్న య। ప్పుడు విద్వాంసులు కార్యదక్షులుమ బ్రోపుంజూపి యద్దాని గి। ద్పడకుండన్ సరిదిద్దనొప్పు; నటుతప్పన్ వారికే ముప్పు చే। పడుగానీ; చెడకుండ ధర్మమును నిల్పం దైవమొం డుండెడిన్"

ఈ పద్య మెత్తుగడలో వాక్యములనిలుపుదలలో పలుకుబడిలో సమాప్తిలో సర్వథా స్వతంత్రమై తిక్కనగారి పలుకుబడి మెలకువలు చక్కగా నాత్మీయ మొనర్చుకొన్నదనుటకు దీనితోపాటు తిక్కనగారి రచనలు పరిశీలించుటమే ప్రమాణ మగుటయు తిక్కన శైలియందు ప్రతిబింబించు చున్నదన్న నొక్కమాట చాలును. ఆమాట స్వభావోక్తి మాత్రము కాగలదు. ఇంతకు సందర్భశుద్ధి యిక్కడ దీనికెంత ప్రకాశము ప్రదర్శించినదో గమనించిన సహృదయుల యానంద మమందము యుపనప్రతారణ మణగించి ధర్మసంస్థాపన చేయ వలెనన్న యూహ స్వామి తమ యెదలో గల్గినదని తెల్పుచు 'కదలున్ మాయెదలోన నొక్క శివసంకల్పంబు రేఖాకృతిన్' అన్నారు, ఈ వాక్యము సరళముగా సామాన్యపాఠకుడు గమనించి ముందుకు పోవుటకు వీలుగా నున్నదిగదా! దీనివెనుకనున్న పవిత్రభావము ఎంత లోతైనదో సంప్రదాయజ్ఞులు గుర్తించినప్పుడు కవితా పరమార్థము తెలిసి కవి ధన్యుడైన పవిత్రవాక్కుగల మహావ్యక్తి, యనుకొందురు. మహాన్యాసములో 'తన్మేమనశ్శివ సంకల్పమస్తు' అను వాక్యము తఱచుగా వినిపించు నొక భాగమున్నది. ఇందు సృష్టిరహస్యమిమిడి యున్నది వేదమంత్రాల తాత్పర్యము జీర్ణింపజేసికొన్న మహర్షుల నోటినుండివచ్చు వాక్యము లిట్లుండును. అట్టి శివసంకల్పము విద్యారణ్యులకు గల్గినది. ఇది లోక కళ్యాణ ప్రదమైన సంకల్పము. దాని కనుకూలముగా జక్కని విద్యానగర సామ్రాజ్య స్థాపనము జరిగినది. దండ్యాచార్య శాసనానుగుణముగా నౌచిత్యము పాటించుటయే ముఖ్యము. అట్టి యౌచిత్య మీ గ్రంథమున బహుముఖముగ ప్రదర్శితమైనదనుట కెన్నని యుదాహరణ లీయగలము? 'బంగరుగద్దెన్ నిను నిల్ప నొక్క వెలుగాజ్ఞాపించు నాత్మీయమై' అని ఆత్మీయమైన ప్రేరణ గురువులు వెల్లడించిరి

(కృష్ణాపత్రిక 1965 ఆగష్టు 28).

—:o:—

పీఠిక

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

అధునాతనాంధ్రసారస్వతమున నీ అంధ్రపురాణముతో మరియొక మహాగ్రంథ మదయించినదని చెప్పవచ్చును మహాగ్రంథములను లెక్కవేసినచో సంఖ్య తక్కువయే కావచ్చును. వీనియందు దోషములు గూడఁ జూపించవచ్చును. కాని నిస్సందేహముగా గుణబాహుళ్యముగాగల గ్రంథములు చిన్నిచిన్ని ఖండకావ్యములు వందలకొలఁది కలవు. పెద్దయెత్తుమీద వ్రాసిన గ్రంథముల సంఖ్య చాల తక్కువ.

ఆధునికకాలాంతర్నిహిత గుణప్రాబల్యము వలన భారీయెత్తుగడమీద గ్రంథరచన సాగదు. కాలపుముద్రను తిరస్కరించిన ప్రతిభాశాలులగు కవులే మహాగ్రంథముల కెత్తుగడ నెత్తుదురు. అంతటి మహాగ్రంథములు రెండు రకములు. పూర్వ సంప్రదాయానుగతములు. ఆధునికభావ ముద్రాముద్రితములు. ఈ రెండురకములైన గ్రంథములయందుఁ బరస్పరగుణసమ్మేళన ముండదని కాదు. ప్రాధాన్యవివక్షచేతఁ బ్రాచీనాధునాతన గుణాధిక్యము కలవి యనిమాత్రమే.

ఇట్టి యధునాతన భావపరామృష్టములైన గ్రంథములు కొద్ది. సౌందరనందనము, తుమ్మలవారి ఆత్మకథ. రాణాప్రతాపసింహ చరిత్రము. శివభారతము, ఈ రాశిలోఁ బ్రసిద్ధికెక్కిన గ్రంథములు. ఆ జాతిగల గ్రంథము మఱల నీ యాంధ్రపురాణము. దీని రచయిత మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు. వీరాంధ్రదేశమునకు సుపరిచితులు ఆంధ్ర రచయితలన్న గ్రంథము వ్రాసి యధునాతనాంధ్రకవి చరిత్రమునకు కవితానీరాజన మెత్తిన వారు. పూర్వాంధ్రకవి చరిత్రవిషయమున శ్రీ వీరేశలింగము పంతులుగారెంతచేసిరో యధునాతనాంధ్రకవి చరిత్రమునకు శ్రీ సత్యనారాయణశాస్త్రిగారంత చేసిరని చెప్పవచ్చును.

తద్గ్రంథరచనము వలననే శ్రీ సత్యనారాయణశాస్త్రిగారికి నాధునికాంధ్ర కవితాజగదభిమానము మిక్కిలిగా నున్నదని తెలియవచ్చును. దానికి శిఖరాయమాణముగా తానే యొక స్వతంత్ర మహాకావ్యము వ్రాసి యీ యధునాతనాంధ్రకవితాజగత్తులో వెలసిన మహాకావ్యకర్తలతో తానుగూడ నొకఁడనిపించుకొనుటకు నీ కావ్యరచన చేసెను. ఈమహాకావ్యకర్తృపంచకమున నీయనగారిస్థితియు భద్రమే.

ఆధునిక నాగరికతకు సంస్కృతి మూలస్తంభములలో చరిత్ర యొకటి. చరిత్రమనగాఁ బాశ్చాత్యులు చరిత్ర నెట్లుభావించిరో తద్భావనానుకూల సంస్కృతిబీజనిక్షేపహేతువు. చరిత్రము మనపూర్వులకుఁ దెలియనిదికాదు, తద్విషయమున, బూర్వుల దృష్టివేఱు. అర్వాచీనులదృష్టి వేఱు. పురాణము పంచలక్షణము. అఐదు లక్షణములలో నొకటిపూర్వరాజచరిత్రము. ఈ గ్రంథమున కాంధ్రపురాణ మనిపేరు. ఈ కవియే 'సర్గప్రతిసర్గాది పంచలక్షణలక్షితము కాని యీ పురాణము'న్వ్రాసినాడు. మన పూర్వుల

దృష్టిప్రకార మిది ఏకదేశము. ఆధునికుల ప్రకార మిది చరిత్ర,

ఈ గ్రంథమునకుఁ బూర్వోదాహృత గ్రంథములకుఁ జాలభేదముకలదు. పూర్వోదాహృతగ్రంథములలో మిక్కిలి స్వతంత్రమైనది సౌందరనందమొక్కటే. తక్కినవానిలో రెండు చరిత్రగ్రంథములు. ఒకటి తెలుగుసేత. సౌందరనందమునకు మూలమున్నను రచన స్వతంత్రమై కవుల ప్రతిభ సముద్దీపించుటకు నధికానుకూలభూమిగా నున్నది. ఆ రెండుగ్రంథములు చరిత్రాంశవసలను పొందుపఱచుచు దానిని పరిహరించకుండఁ బరిమిత ప్రదేశమునందుఁ గవులు తమ ప్రతిభను వెలార్చవలసిన స్థలములు. ఈ గ్రంథము వానికంటె మరియుఁ దక్కువగా కవియొక్క కావ్యకథారచనా శిల్పమునకు వెసలుబాటిచ్చునది.

కవిప్రతిభ ద్విధాభూతము. కథారచనా సంబంధమైనది ఒకటి. అంశభూతములైన వర్ణనాదికసంబంధమైనది రెండు, ఇందులో మొదటిది లోకోత్తర శక్తిచేత సంపాదింపదగినది. రెండవది సమృద్ధియైన కవితాశక్తి యున్నచో చేయదగినది ఈ రెండవ శక్తి పూర్వశక్తిమంతులకంటె నెక్కువసంఖ్యగల వారియొద్ద నుండును. ఆ సంఖ్యతోఁ బోల్చినచో నీసంఖ్య చాలపెద్దది. మఱల లోకపుదృష్టితో చూచినచో నీసంఖ్య చాలచిన్నది ప్రధానత ! ఈ ఆంధ్ర పురాణమునందు ద్విధాభూతమైన యీ ప్రతిభలో రెండవరకపు ప్రతిభకే వెసులుబాటున్నదిగాని మొదటిరకపు దానికిని స్థానముకాదు, శాతవాహనులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్లు, విజయనగరరాజులు పరంపరగా దీనికొన్నచో నుత్తరోత్తరము బలీయము. ఒక ఖండముకంటె మఱియొక ఖండమునందు నధికచరిత్రాంశములు లబ్ధమగుచున్నవి. చరిత్రాంశము లధికముగా లభ్యమైన కొలది కవి కవిగా కాక పద్యరచయితగా మిగిలిపోవును. వట్టి పద్యరచనాశక్తియే యొకనిని మహాకవినిగా జేసినచో నష్టములేదుకాని యధిక జిజ్ఞాసువులపట్ల నది యల్పశక్తిపాత్రమే యగును.

కాని యే శక్తియైనను నధికముగా నున్నప్పుడు దానికిఁ దక్కువతనము పట్టదు. ఒక జహంగీరు మామిడిపండు కాదేని క్రొత్తపల్లివలస సంఖ్య తక్కువగా లభించును, రుచి జిహ్వా పరమతర్పణము. కాని యవి సమృద్ధిగా దొరకవు, దొరకకపోవుట సృష్టిలక్షణము. బంగినిపల్లి సమృద్ధిగా దొరకును. నీలాలు సమృద్ధిగా దొరకును. రసాలు సమృద్ధిగా దొరకును. మామిడిపండ్లన్న - శబ్దము వీనియందే యెక్కువ రూఢము. జహంగీరు క్రొత్తపల్లివలసలు లోకోత్తరవస్తువులు. పరమౌచిత్య రససంధాయక మహాకథాగ్రథనము తాదృశమైనది లోకమునందు నూటికి తొంబది తొమ్మండుగురు కవులు ద్వితీయ కక్ష్యాగతులు. తత్కక్ష్యాగతాంశములను బహు ప్రతిభా పంపన్న శక్తిచేతఁ బరమరమణీయముగా చేసి మహాకవులన్న పేరు గడించినవారే యెల్లరును. కనుక రెండవ శక్తికి కావ్యప్రపంచమున తక్కువ స్థానములేదు. ఆ రెండవశక్తి సమృద్ధిగా నున్నచో నెవ్వడును మహాకవియే.

ఈ గ్రంథ మంత్తము రాశిలోనిదని వాకొంటిని. ఆ యుత్తమస్థితి యేతచ్చరిత్ర విషయక కాలనిర్ణయముగాని చరిత్రాంశముల యొక్క యోగాములను గుఱించినగాని నిర్ణయింపవలసినది గాదు. చరిత్రము వేఱు. కావ్యము వేఱు. కావ్యమునకు రావలసిన ప్రశస్తి కవియొక్క కవితాశక్తిచేత వచ్చును. ఆ కవితాశక్తి యెట్టిదని ఈ కావ్యము నందలి ప్రశ్నము విచారణీయాంశము.

కవితాశక్తి యనగా ననంతముఖములు కలది. అది యొక్క విషయము నాశ్రయించియుండదు. అందులో మొదటిది యూహశాలిత. ఆయూహ ఉక్తి వైచిత్ర్యము నాశ్రయించి క్రొత్తక్రొత్తగా నుండును. అట్టి శక్తి యీ కవియందు చాలయున్నది. ఈ కావ్యమును నీ కుడుగరగా నిత్తునని కవి తన తండ్రితో నన్నాడు.

తండ్రి యిట్లన్నాడు

నా, యన నీతీయని కోర్కి చందనము పూయన్
జంద్రికల్వోయ నెమ్మన మెంతేఁ దనివోయె.

ఈ రచన భావవిషయమున నన్నయ్యగారిని మించినది. నన్నయ్యగారు పుత్రగాత్ర పరిష్వంగసుఖము చందనము చంద్రజ్యోత్స్నయున్ వలె జీవులకు హృద్యమనెను. ఈ కవి కొడుకునూహయే తండ్రికి చందనము చంద్రజ్యోత్స్న యనుచున్నాడు.

కథలోనికి పోయినచో మఱియు మఱియు నందములైన కూర్పులీ కవి చేసెను. ఉదయపర్వమునందు హరిశ్చంద్రకథ యున్నది యాగపశువుగా నిచ్చినచో హరిశ్చంద్రునకు కొడుకు నిత్తుననియె వరుణుడు. ఒప్పుకొని కొడుకును కన్నాడు హరిశ్చంద్రుడు; ఈ సంగతి రాణికిఁ దెలియదు అపురుటి బిడ్డను కని రాజు 'కాని నవ్వు' నవ్వును.

గాణిఁగననీడు తన యెదలోని నొవ్వు
ఆరఁబండిన తములపుటాకుఁ బోని
లేఁబుఱిటి యాలి పసిపొత్తిలికి పెడంగు
రోహితుని ముద్దు, చేడు దారుణతరాసి
ధార మెఱుఁగారు తేనెపూతగఁ దలంచు॥

ఇది యిట్లు వ్రాయుట ఆ రాజు మనస్సులోని బాధావైశిత్యము సంపూర్ణముగా సాక్షాత్కరించునట్లు వ్రాయుట.

ఈ కావ్యమున శాతవాహన పర్వములోఁ బ్రధానముగా హాలుని సారస్వత ప్రియత్వమును గుణాఢ్య కథయు నున్నవి. గుణాఢ్యుడు రాజుచేత నిరాకరింపబడి యడవులలోనికి బోయెను.

నోరుమాలిన మేలి జంతువులలోన
నోరు తెఱచిన నాలి జంతువులలోనఁ
జదలఁ దారాడు పులుగుల కదుపులోనఁ
గారడవి యెల్లను గుణాఢ్యసూరి యొకఁడు"

అనుట. మఱియు గుణాఢ్యుడు శిష్యులను రాజు కడకుఁ బంపించెను. రాజుచేతఁ దిరస్కరింపబడి వారు వచ్చిరి.

అరసె నాచార్యుఁ డంత శిష్యయుగళిమ్ము
మొగము మొగ్గల మ్రొగ్గినవగపు వగరు

ఆ రాజు తరువాత క్షాంతిమూలుడు వచ్చినాడు అతడిచ్చినాడట 'బాపలకు అక్షనాగళ్ళ పంటుచేను'

కాకతీయపర్వములో ప్రతాపరుద్రుడు పసిబిడ్డ ముమ్మడాంబ బిడ్డను పెంచుచున్నది.

కనులకు సువాంజనం బొడికముగ నద్ది
పెదవి చప్పుడుచేసి లేనుదుటి నడుమ
బొట్టు ముట్టించు వేళ—

ఈ ప్రకృతి పరిశీలన మట్లుండగా "ముట్టించు" అన్నశబ్దము ఎంత యుచితముగా నున్నది!

ఢిల్లీచక్రవర్తి జలాలుద్దీన్ మాలిక్ కాఫరును దండయాత్రకు బొమ్మనెను, ఇది కాకతీయ పర్వములోనిది.

ప్రాజ్యతర భారతీయసామ్రాజ్యకాంక్ష
నూలుకొన నిట్లు వెచ్చని నోరుతెఱచె.
ఓ చమూనాయకా! తుది నొక్కమాట
తెనుగురాజును గెలిచి వచ్చిన కటారి
నెత్తు నిన్నెట్లు మెత్తుమో ఏమియేమి
యిత్తుమో పాదుసాచేతి కెముకలేదు.

ఈ యుదాహరణలయందు ఈ కవిగారి కవితా శక్తి ఎచ్చట నెట్లువలయునో నచ్చట నట్టియంద మును బొసగించుకొనగలదని తెలియగలము.

ఈయన తెలుగు పలుకుబడి సౌకుమార్యములకు బహూదాహరణములు జూపించవచ్చును అందులో నివి కొన్ని. అవతారికలో నీ గ్రంథము నచ్చొత్తించి నటువంటి, తరతరములుగా తమ కొలము నకు వారి కొలమునకు మైత్రియైనటువంటి వెలమ దొర రేమెళ్ళ వెంకటరావుగారిని గురించిన పద్యము–

అతని మొదటిపంటయైన వేంకటరావు
భావమెన్న గపిలగోవు వెన్న
మలితనూజుడైన లలితుండు వేణుగో
పాలరావు మల్లెపూల ప్రోవు.

ఇందలి రెండు నాలు చరణములు. వానిలోని యమకస్పర్శ మిగుల సుకుమారముగా నున్నవి.

కమ్మలవెట్టి వేడ్కతొలగన్ దలపారగ
నొక్కతూరి నా
యన్నవ నేత్రుచూలు పసుపాడిన తత్ప్రసవిత్రి
పొత్తిటన్
గన్నది చాలు నింతకువినా వరుణా నినుగోర ...

మొదటి రెండుచరణముల మెత్తదనము వట్టి మెత్తదనమేకాక హరిశ్చంద్రుని సంతానకాంక్షా వ్యంజకత్వలక్షణము, మూడవ చరణములోని "వినా వరుణా నినుగోర' అన్నచోటి తెలుగుపద్య రచనము లోని యందము తెలియుట చూడదగినది,

మిసిమిపస గలిగిన రసాల రసికరాజు
కొమ్మ కౌగిటి వలపులఁ గులికియాడు
బండిగురివింద లేదీగ యెండిపోయె
దీపకర్ణి మిగిల్చి శక్తిమతి సనియె॥

ఇది దీపకర్ణ భార్యావియోగ వర్ణనము. తొలి మూడుచరణముల మెత్తదనము ఆ రాజుయొక్క భార్యాగతసుకుమారభావనాజనిత వియోగాగ్ని కెంత ద్యోతకముగా నున్నది !

కొన్నిపద్యముల చివర– మఱియు గీతపద్యముల చివర యమకము వేసినచోఁ బద్యమున కెంత సొగసు వచ్చునో చూడుడు.

కాకతీయ పర్వములోనిది.

అరసి గవిపట్టినన్ రుద్రమాంబ చదురు
పదికి పదిపాళ్ళు వీరసంపదకు కుదురు

ఇది యిట్లుండగా నీకవి యనేకములైన తెలుగు మాటలు తెనుగు పలుకుబళ్ళు వాడును. అంగలించు, వింగడించు, ఎగతము, చక్కదము వక్కణము, దునేదారు, వజీరు. ఇట్టిమాటలు పద్యశోభాహేతువులుగా నర్థవంతములుగా ప్రయోగించును.

ముమ్మడాంబకు సుతోదయమయ్యెను. ఒక దాసి యా వార్త చక్రవర్తినికిఁ దెలియఁజేసెను రుద్రమదేవి యా దాసికి 'చేమునుంగనుడుగరలు' ఇచ్చిన దట. ఈయన తెలంగాణ శబ్దమును ఉకారసహిత లకారముగానే వాడను. తెలుంగాణము తెనుంగాణము అని.

ఈ కవిగారి తెలుగుపలుకుబళ్ళ సౌకుమార్యము లిట్లుండగా నీయనగారి సంస్కృత పాండిత్యము ప్రౌఢియుగూడ కొంతతెలుపు. హరిశ్చంద్రుని కొడుకు రోహితుడు తాను వరుణునకు యాగపశువుగా దత్తుడయినాడని తెలిసికొనెను.

....కుమారు
మనసులో దాగియున్న యమాయికతకు
నొక నవీనధోరణిని లౌకికపు తెలుక
కలిపి నటులయ్యెఁ దండ్రిదుఃఖంబు చుఱుకు
ఇవి భావము చెప్పుటలోని ప్రౌఢి,
సాతవాహన పర్వములో రాజు

"భాషాబహిర్వేషమే యాలోచించి తిరస్కరించు నె గుణాఢ్య గ్రంథము' చాళుక్యపర్వము లో నన్నయ్యగారు చనిపోగా—

'పమ్మినయుమ్మలమ్మ మెయి భారత భారతి యుట్లరణ్యమధ్యమ్మున విహ్వలింప'

'అకటా యిట్లు మహమ్మదీయుల రణప్రారంభ దుర్వృత్తి వారికమైపోయెఁ దెనుంగు దేశమున' ఈ మూడుదాహరణములయందు శ్లేషాత్మకమైన ప్రౌఢి, ఎంత హృదయంగమముగా నున్నదో చూడ

వచ్చును. బ్రహ్మవర్చసము, పుత్రజాతుడు, మొదలైన సుప్తుప్వ్యాకృతి శబ్దస్వరూపముల వాడగలవాడీకవి,

పూర్వసంప్రదాయ సిద్ధముగా కవిత్వము వ్రాయు కవికి ఆస్తికత గొప్ప దీప్తి తెచ్చు లక్షణము. ఈయన యొద్ద నది సమృద్ధిగా గలదు.

'ఇంతకును నెల్లకృతులకు నెవడుకర్త
ఎవడు భర్త యతండు కర్తృత్వ భోక్తృ
తాద్యతీతుండు సర్వకావ్య ప్రపంచ
భద్రతకు మూలహేతువు పైని కలడు.'

ఆహా! ఎంతచక్కని జీవలక్షణము కలవాడీకవి. మంటిజీవుడు కాడు

ఈయన యాస్తికత వట్టి భావనావిషయముకాదు. వేదశాస్త్ర గత బహు విషయములు తెలిసికొన్న లోతు కలది. రోహితుని యూపమునకు బిగించిరి. దానిని పాలగుంజ యన్నాడు.

'పాలగుంజన్ గృతాంతుని చందంబున గుంజి కట్టి విశసింతున్' శ్రౌతవిషయము తెలియకుండ నడిగాని దీక్షణీయేష్టి ఉదవసానీయేష్టి మొదలైన వానిని తెలిసికొన సాధ్యముకాదు ఇది శ్రౌత విద్యాపరిచయము. జైనమతము ప్రబలినపుడు చాళుక్యపర్వమున 'తొలగెన్ వైదిక సంప్రదాయములు కత్తుల్నారె జైనమ్ము వేదలతాజాలము నుత్తరించుటకు స్యాద్వాదాసురీ తాండవోజ్జ్వలత లీల్మెఱెను. అని వ్రాసెను. జైనమతమునకు స్యాద్వాదమని-కూడ పేరు. ఇది యిట్లు వ్రాయుట షడ్దర్శనీ పరిచయ సూచకము.

ఇక్కడ నొకమాట చెప్పవలసి యున్నది. నన్నయ్యగారు భారతాంధ్రీకరణము జైన బౌద్ధ మతముల ప్రాబల్యము తగ్గించుటకు వ్రాసినట్లుగా నాధునికులయందు ప్రచారమేర్పడినది ఈ ప్రచారమునకు నాధార మెచ్చట నున్నదో తెలియదు. ఆధునిక దృష్టితో దేశచరిత్రయు భాషాచరిత్రయు వ్రాయువారు చేసిన యభూతకల్పన ఇది విశ్వవిద్యాలయాలలో జదివినవారందఱకు నిదియొక విశ్వాసమైపోయినది. దీనికి భారతావతారికలో బ్రమాణము లేదు. శాసనములలో నున్నట్లు చెప్పబడినట్లు లేదు. ఇట్టి కల్పనలు పరిహరించుటకు దేశము చేయదగినది. ఈ గ్రంథకర్త వంటి గొప్ప కవులైనను అట్టివానిని పరిహరించవలయును, ఈకవి జ్యోతిషమునందు కూడ పరిచితికలవాడుగా దోచుచున్నది కార్తాంతికులు ప్రతాపరుద్రుని జాతకము' సూచి

'ఇది పీఠికపై నరసింగ మనభిప్రాయంబు' అన్నారు. ఇచ్చటి పీఠికయన్న మాట పరిభాషా శబ్దము.

పూర్వకవులను సంగ్రహించుట, సంగ్రహించిన చోట మెఱుగులు చూపుట యుత్తమకవి లక్షణము,

"పూర్వకవీశ్వర వాక్ప్రయోగ దక్షుడు
కరుణామతి యెవ్వడతడు కవి యనం బరగున్"

అని యప్పకవి వ్రాసిన కవిలక్షణము ఉత్తమ కవియొక్క యీ లక్షణ మెట్లుండునో యొక చిన్న యుదాహరణము జూపెదను.

'ఓ మిహిరాంశువంశ కలశోదధిపూర్ణశశాంక' యన్న శృంగార నైషధములోని సంబోధనము పెద్దన్నగారు 'ఓ చతురాస్యవంశకలశోదధి పూర్ణ శశాంక' యని యెత్తి వ్రాసికొనినారు. ఆ సమాసమునకుగల యౌచిత్యము శ్రీనాధునియందు విచార్యము. పెద్దన్నగారియందు సువ్యక్తము తానన్నచో ప్రవరునకు గౌరవము మిక్కుటముగా లేదని సిద్ధతనిని బ్రతారించుటకు జేసిన ప్రయత్నములో నీ సమాస గుంఫన మొకటి పూర్వ కవీశ్వర వాక్ప్రయోగదక్షత్వ మిట్లుండవలయును. నన్నయగారి పుత్రగాత్ర పరిష్వంగ సుఖమునకు ఈకవి మెఱుగు పెట్టుట యిదివఱకే చూపించితిని. ఈక్రింది పద్యము చూడుడు. సరిగా నన్నయ్యగారి రచనమువలె నున్నది,

ఆయత తూర్యధుర్య విజయధ్వనిలో సుము
హూర్తవేళకున్
శ్రీ యువరాజమూర్ధమభిషేక మొనర్చిరి
మూడుమాఱులా

మ్నాయ మహాభిమంత్రిత సనాతన భారతఖండ
పుణ్యనా
దేయ జలంబులం గడఁగి తీయని దెందములం
బురోహితుల్.

ఇంక నే యితర కవివలెనైన బద్యము వ్రాయ వచ్చుగాని నన్నయగారివలెఁ బద్యము వ్రాయుట చాల క్లేశమైనపని.

చాళుక్యపర్వములో 107 పుటలోని మొదటి పద్యము- కాకతీయ పర్వములోని 157 వ పేజీలో శ్రీనాథుని పద్యములోని రెండు చరణములే తీసికొనుట వీనికిఁ బ్రబలోదాహరణములు. అన్నిటికంటె నాశ్చర్యము 'అభిషేకములు సేయసంపెఁ గాశీశ్వర ప్రథమ సంసారి కీశ్వరునకెలమి' కాశీపుర ప్రథమ సంసారియనుట శ్రీనాథుని మనస్సులోనికిఁ దూఱి తీసికొని వచ్చిన మధుర సమాసము.

ఈ దేశమునందెంత క్రొత్తమార్గమున గవిత్వము వ్రాయుచున్నామని చెప్పుకొనుచున్నను భారత రామాయణాదుల నుండియు మన సంప్రదాయపుఁ బరిస్థితుల నుండియు నుదాహరణలు నుపమలు తీసికోక తప్పదు. మేము తాజాకవుల మనుకొనుచున్నవారి రచనలలోనే యిట్టివి సమృద్ధిగా నున్నప్పుడు ఈ కవివంటి సంప్రదాయశుద్ధి కలిగిన కవి యొక్క రచనలో నెందుకుండవు?

హాలునిరాణి "ముసలిచ్యవనుని జవ్వనపుంబెడంగు గని మురిసిపోవునాటి సుకన్యయయ్యో' హాలుడు సంస్కృత భాషాధ్యయనము చేసిన తరువాత నన్న మాటయిది.

దేవగిరిరాజు రుద్రమదేవి మీఁదికి యుద్ధము చేయవచ్చుచు "ఏమయ ఆడుదానియెడ నేడ్తెఱ నూపెదవేయటన్న శ్రీరాముని జెప్పెదన్ బరశురాముని జెప్పెద వాయిగప్పెదన్" అయనతో యుద్ధము చేయునపుడు "రుద్రమాంబ యయ్యాల మరల్చునప్పటి బృహన్నల తీరును మారుచేయుచున్' కాకతీయ పర్వములో

ఆంధ్రులు మహమ్మదీయులు నడ్భుతముగఁ
బదియు నెనిమిది నాళ్ళయబ్భారతీయ
రణమునొకనాడు నూపి రారడము పెరుగ॥

ఇట్టివి కలవు. ఇవి యెందుకుఁ జూపితిననగా గొన్ని యాధునిక కావ్యములందు ఈ పురాణ కథాసామ్యము వెగటుగా దోచును. ఈయన గుంఫనలో నా వెగటుదనము లేదు. ఇద్దఱు తురుష్కులు యుద్ధము చేయునప్పుడు లేదా ఒక తురుష్కుడు మఱియొక హైందవుడు యుద్ధము జేయునపుడు వారు కర్ణార్జునులవలె యుద్ధము చేసిరనగా వెగటుగా నుండును. కర్ణార్జును లెక్కడ? వీరెక్కడ యీ పోలికయేమి యనిపించును. అట్టి అనౌచిత్య స్పర్శలేనిది వీరి సంతరింపు.

ఇదియుఁగాక మఱికొన్ని యంశములు కలవు. జాతికొఱకొండు రెండు చూపించెదను. కాకతీయ పర్వములోని 175 వ పుటలో చివరి సీసపద్యములో విభక్త్యంతములు వేయుటలోని నేర్పు చూడవచ్చును, సీసపద్యము తెలుగు ఛందస్సులో నొక కాణయాచి. దానిని కవులు తమ ప్రతిభకొలది వాడుకొనవచ్చును.

మఱియు నొక్కమాట. ఈకవి తెలుగులయందుఁ గూడ, నందులోఁ జరిత్ర విషయములందుఁ గొంత పరిశ్రమ చేసినవాడు, దానికి తార్కాణ 'ధర్మదార' యన్న శబ్దము వాడుట ధర్మదార పట్టించిరనగా శంఖము పూరించిరని యర్థము. ఇది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిశోధన యని చదివినగుర్తు.

ఇట్లు ఒహులక్షణ విచారణ చేసినను కావ్యముయొక్క ప్రాణము చెప్పినట్లు కాదు. సాతవాహన చాళుక్యపర్వములలో కావ్యాత్మ యేదిగాఁ గవి నిర్ణయించుకొనెనో తెలియగలదు. హాలుని గుఱించిన విస్తారమైన వర్ణనము. భారతావతరణమును గురించి పెంచిన యభిమానము కవియొక్క యభిమాన విషయమును తెలియజేయును. ఈ రెండు రచనలు కవియొక్క పాత్రపోషణాదిక వాంఛానిరూపణము చేయవు. పౌరాణిక కథా మూర్తులను ఒక దివ్యమైన వెలుగులో చూపించుటకే ప్రయత్నించుచున్నవి. ఆంధ్రపురాణమన్న శబ్దమే కవియొక్క యీ దృష్టికి సాక్ష్యముగా నున్నది. కాకతీయ పర్వములో రుద్రమదేవిని గుఱించి మిక్కిలి పెంచి వ్రాయబడినది. ఇదియంతయు నాధునిక భావనావైఖరి

ఇట్టి మహాగ్రంథము వ్రాసి శ్రీశాస్త్రిగారు పవిత్ర లోకమునకు నాంధ్ర చరిత్రజ్ఞానము కలుగజేయుటకుఁ బ్రయత్నము జేసినందుకు వారి కాంధ్రజాతి ఋణపడియున్నవి.

'ఆంధ్రపురాణము' పూర్వార్థ పీఠికనుండి
విజయవాడ

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

భారతీయ సంస్కృతి అఖండమైనది. తత్సంస్కృతి పరిణామమునకు అనేక జాతులు తెగలు తోడ్పడినవి అట్లగుట ఈ సంస్కృతి కేవలమేక జాతి జన్యమని చెప్పుటకు వీలు లేదు.

చరిత్రకు తెలియని కాలమున నుండియు కూడ మన భరతవర్ష మనేకజాతులకు, తెగలకు ఆశ్రయమిచ్చి ప్రఖ్యాతి గన్నది. వీనిలో ననేక ములు దేశాంతరములనుండి వచ్చి యిచ్చట నెలవు లేర్పరచుకొని దీనినే జన్మదేశము చేసికొనుటలో దేశస్థములయిన, విదేశీయము లయిన జాతులకు జాతులకు, తెగలకు తెగలకు అనేక సంఘర్షణలు, సంగ్రామములు వాటిల్లినవి. దేశీయములైన జాతుల ఆచార, మత, ధర్మాదులకు విరుద్ధములైన, భిన్నములయిన ధర్మములు గల మతాచారముల నవలంబించిన జాతులు, తెగలు దేశమున బ్రవేశించినప్పు డెల్ల నీ సంఘర్షణము, సంగ్రామము తప్పనిసరియగుచు వచ్చినది. ఆ మొదటి పోరు, ఆ మొదటి ఉద్రేకము చల్లారిన పిదప దేశాంత రాగతులును, దేశస్థులును అయిన జాతుల వారిలోసమరస భావ మేర్పడి, మైత్రికుదిరి ఏక గర్భ జనితు లయిన సోదరుల లోవలె ఉభయయులకు భ్రాతృభావ మేర్పడి వారు ఏక కుటుంబములోని వారివలె వర్తించి వృద్ధి నందుచు వచ్చిరి. మనదేశ చరిత్రమంతయు ఈ జాతుల విగ్రహసంధి కార్యములను, సంఘర్షణ సామరస్యములను దెలుపు వాఖ్యానము.

భారతవర్షమున ప్రవేశించిన ప్రతిజాతికి దేశస్థమైన ప్రతిజాతికి ఒక ప్రత్యేక సంస్కృతి యుండెడిది. ఒక్కొక్క జాతికి ఒక్కొక్క విధమయిన ఆచారములు, ఆటపాటలు, సంగీతము; నృత్యము వాద్యము, మతభావములు మొదలయినవి ఉండునని చెప్పుట అనవసరము. నేటి భారత జాతి ఇట్టి పరస్పర విరుద్ధ ధర్మ విశ్వాసాచారాదులు గల జాతుల, తెగల నుండి యేర్పడినది. అట్లే నేటి భారతీయ సంస్కృతి కూడ అన్యభూములనుండి వచ్చి యీ భూమిని మాతృదేశము కావించుకొన్న విదేశీయములు నయిన జాతుల బహువిధ భిన్న సంస్కృతుల సమాహారమే సమస్త వాహినులును మహాసాగరమున బ్రవేశించి తమకానుకలను రత్నాకరునకు సమర్పించునట్లు అన్య దేశాగతములయిన జాతులన్నియు తమ సంపద నంతనూ దేశీయజాతి

సంపదతో గలియబోసి, భారతవర్ష పూజ్యపీఠ మున నుంచి, స్వార్థమును పరిత్యజించి "పరార్థ మును" భజించినవి, అఖండ భారత జాతిలో ఐక్యమయి పోయినవి. నేటి మహాభారతీయ సంస్కృతిలో, సభ్యతలో ఎన్ని జాతుల, తెగల సంస్కృతి సభ్యతలు అంతర్లీనములయి పోయి నవో ఎవరి కెఱుక?

భాషలోగాని, మతాచార విశ్వాసములలో గాని. సంగీతమునగాని నేటి అఖండ భారతీయ సంస్కృతిలోని ఏయే ఛాయలు. భావములు, ఆటలు, పాటలు. రాగములు. తాళములు, ఎంతెంత వఱకున్నది? అని తెలిసికొందమన్న అట్టి ప్రయత్నము మసాధ్య మగుచున్నది. ఆనవాలే మాత్రము తెలియనంత చక్కగా ఒక దానితో నొకటి కలిసిపోయినవి. నేటి జన సామాన్యమున వేల కొలది సంవత్సరముల క్రిందట భారత వర్షమున నున్న, ప్రవేశించిన జాతులకు సంబంధించిన వారి నేర్పరించి చూపు టయే నేడు కష్టమగుచున్నపుడు వారి సంస్కృ తులను విడదీసి గుర్తించుట అంతకంటెను కష్ట తరమని వేఱు చెప్పనక్కరలేదు. అయి నను ఆయాయి జాతుల స్వత్వములివి యని కొన్ని కొన్ని విషయములందు దెలుపుటకు కొండగుర్తుల వంటివి కొన్ని మన కందందు లభించు చున్నవి.

ఉదాహరణమునకు ఒక్కగానకళను దీసి కొందము. భారతీయ గాన కళ నేడు మనకు మనకు విశదమగుచున్న రీతిని సమగ్రత నొందుటకు వివిధ జాతుల కృషి, సామరస్య ములే కారణములు. ఆయాయి జాతులు తమ గాంధర్వ రాగ సంపద నంతనూ కలియబోసి భారతీయ గాన కళావిష్కరణమునకు కారణము లయినవి. ఒక్కొక్క జాతి తన స్వత్వమని చెప్పుకొనదగిన రాగ తాళాదికములను భార తీయ గాన కళార్ణవమున మేళనము నొందించి అపూర్వములు, అద్భుతములు నైన "మేళము" లను వెలయించినవి. ఆయా జాతుల పేర బరగు రాగ విశేషములను మన గాన కళ మేళములలో రాగములలో పెక్కింటిని జూపవచ్చును. ఆంధ్రి లకు గూడ ఒక విశిష్టమయిన, విలక్షణమయినరాగ ముండెడిదని, దానిని ఆంధ్రి యను వారని మన కిపుడు "బృహద్దేశి" యను సంగీత గ్రంథము ననుసరించి తెలియుచున్నది.

"బృహద్దేశి" యన్నది మతంగముని విరచిత మయిన ఒక సంగీత గ్రంథము. అందు "ఆంధ్రి" అనురాగ ముదాహృత మయినది. శార్ఙ్గ్యాలుని మతముననుసరించి 'మాళవపంచమ' మనురాగమున ఆఱు "రాగిణులు' కలవనియు వానిలో "ఆంధ్రి" యొకటనియు మతంగముని తన "బృహద్దేశి యందిట్లు చెప్పినాడు.

''విభావినీ తు పౌరాలీ వేగవంతేతు పంచమా

ఆంధ్రీ గాంధారికా చైవసత్ స్యుర్మాళవ పంచమమ్"

దీని ననుసరించి ఆంధ్రులను జాతె వారికి ఒక విశిష్టమయిన రాగ విశేషముండె ననియు, అది "ఆంధ్రి" యనియు, భారతీయ గాన కళకు ఆంధ్రులు దీనిని పూజోపహారముగ సమర్పించి రనియు విశదమగుచున్నది.

బృహద్దేశి "ఆంధ్రి" రాగ స్వరరూపాదికముల నిట్లు వివరించు చున్నది,

మధ్యమాంశ పంచమాంత భావనాస్త ధ్రువే సజ
ఆంధ్రీ తువిభ్రశతాలోకే వ్యాధ దుస్తేసు(?) గేయతే

ఈ రెండవ శ్లోకము దోషభూయిష్ఠముగ నున్నది. కాని భావము కొంచెము బోధపడు చున్నట్లున్నది. దోషములమాట కేమిగాని, ఆంధ్రులకు "ఆంధ్రి" యను నొక విశిష్టమయినరాగ మొకటి యుండెనని తెలియుటయే మనకానందము.

ఇట్టి కొండ గుర్తులింకను దొరకుచో ఆంధ్రుల తొలుతటి సభ్యతను నిరూపింపగుదురను కదా!

ఆంధ్రి సంచికనుండి
అక్టోబరు 1941

ఉషోవీణ

శ్రీ పాలెపు వేంకటరత్నం

పసరుఁ జివురుల మేసి
పరభృతము నీయశము
కసితీఱ "కో" యనుచు
గాన మొనరించురా!

* *

పాడు నిద్దుర మత్తు
వీడరా! లేవరా!
నవ్య చైతన్య మా
నందమునఁ గాంచరా!

* *

ఇవిగో! చూడుముర క
న్నెదుటఁ బెట్టితిని ప
ల్నాటి వీరుల తళ
తళ లీను కైదువులు

* *

తొల్లింటి నీ సీమ
నుల్లసిల్లిన కళల
వెలయింపరా తొంటి
వలె నేడు నాంధ్రుఁడా!

గంటంబుఁ గొనర తి
క్కన కవీంద్రుని పోల్కిఁ
గల్పింపుముర! దివ్య
కావ్యమధువాహినులు

* *

ఉలిఁ జేతఁ బూనరా!
కలవీడి లేవరా!
వెలయింపరా! శిల్ప
కళ హంపిలోవలె!

* *

పలక కుంచియఁ బూని
వ్రాయరా చిత్రములఁ
దలపోసికొని యజం
తా బౌద్ధ చిత్రాల

* *

వీణ చేకొని విహగ
వీణతో శ్రుతిఁగల్పి
ప్రాభాత గీతికలు
పాడరా! ఆంధ్రుఁడా!

వాఙ్మయము - దేశాభ్యుదయము

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

ఆంగ్లమున "లిటరేచర్" అనదానినే తెలుగున "వాఙ్మయ" మనుచున్నాము. ఈ రెండు శబ్దములకును గూడ వ్యాపకార్థము, సంకుచితార్థము గలవు వ్యాపకార్థమున నక్షరములలో (Letters) నున్నదెల్ల 'లిటరేచరే' యగును. అట్లే వాగ్రూపమున నున్నదెల్ల వాఙ్మయమే యగును ఈయర్థమున గావ్య నాటకాదులే కాక తర్క-వ్యాకరణాదులు. కెమిస్ట్రీ, ఫిజిక్సు మున్నగునవి యన్నియు లిటరేచరు లేక వాఙ్మయమే యగును. కాని యీ వ్యాపకార్థమున నీపదములవాడుక తక్కువ. సంకుచితార్థమున నీ రెండుపదములును "సాహిత్య" మనుదానిని దెల్పును.

ఈ సాహిత్యమునకును నితర వాఙ్మయమునకును గలభేదమును పాశ్చాత్యవిమర్శకులు నిర్వచించియున్నారు ఏ గ్రంథము తనయందలివిషయముచేఁ గంటె, సుకృతి వైచిత్ర్య నైపుణ్యాదులచే నెక్కుడు మనలను రంజింపఁజేయునో యది సాహిత్యము (జేరునని వారు నుడివిరి. దేశచరిత్రలు, భౌతిక శాస్త్రములు, దర్శనములు మున్నగునవి మనలను రంజింపఁజేయు ననుటలో సంశయములేదు. కాని యవి, వానియందలి విషయమును బట్టియే మనలను రంజింపఁజేయును. గాని శాకుంతలాదులవలె రసరీతి శయ్యాలంకారాదుల వలనఁ గాదు. కావున నవి 'సాహిత్యము' లోఁ జేరవు. చారిత్రకాది గ్రంథములు గూడ నొప్పుడు సాహిత్య దృష్టితో రచింపఁబడవచ్చును. బాణుని 'హర్ష చరిత్ర' మిట్టిదే. ఆంగ్లములో నిట్టివి చాల గ్రంథములు గలవు. మెకాలే 'History of England' గిబ్బను 'Decline and Downfall of the Roman Empire' మున్నగున విట్టివియే. (ఈ గ్రంథములో నున్నన్ని చారిత్రక లక్షణములు 'హర్షచరిత్రము' లో లేనిమాట వాస్తవమే) ఇవి చదువునపుడు, సాధారణ చారిత్ర గ్రంథములను జదువునపుడువలె, మన దృష్టి యందలి విషయముపైననే కాక యందలి రసరీతి శయ్యాదులపైనఁ గూడ నుండును. ఇట్లే వైద్యులు దర్శనములు మున్నగునవి గూడ సాహిత్య దృష్టితో రచింపఁబడవచ్చును. అపుడా గ్రంథములకు సాహిత్యమున స్థానము లభించును.

సాహిత్యము వినోదార్థమే కాక విజ్ఞానార్థము గూడ ననుట కిట్టి గ్రంథములు సాక్ష్యము. కవులు నితర రచయితలు దలంచుకొనుచో నిట్టి విజ్ఞానదాయక సాహిత్యము నధికముగ వెలయింపఁజేసి యాంధ్రులలో నార్థిక నైతిక చారిత్రక రాజకీయాది విజ్ఞానము నపారముగ వ్యాపింపఁజేయవచ్చును. రచయితల కిట్టి శక్తియున్నను, నేఁటి మన కవులును రచయితలును చాలమంది సాహిత్యము కేవలము వినోదార్థ మనుభావముతో నుండుట శోచనీయము. కావ్యము కాంతాసమ్మితమని తెల్పిన మన యాలంకారికులు గూడఁ గావ్య ముత్కృష్ట ధర్మబోధ చేయవలెననియే నుడివిరి. ప్రభుసమ్మితము లగు వేదములు, మిత్రసమ్మితము లగు పురాణములు సేయు బోధనే కావ్యములు లలితరీతులలోఁ జేయవలెననియే మన ప్రాచీనుల యభిప్రాయము. కావ్యము ప్రజలధార్మికాభ్యుదయమునకుఁ దోడ్పడవలె ననియే వారియాశయము. ధర్మబోధ చేయని కావ్యముల యాలాపములను విసర్జింపవలె ననియే వారు నుడివిరి. కావ్యము లోకజ్ఞానమును గల్గించునదిగఁ గూడ నుండవలెననియు మన పూర్వులు చెప్పిరి చతుష్షష్టి కళలు నేర్చినవాఁడే కవి కాఁగలఁడని నన్నెచోడాదులు వ్రాసిరి.

ఎట్లయినను గవికిఁ బాఠకహృదయ రంజనమే కాక మానవాభ్యుదయము గూడ నుండవలెనని మన వారును బాశ్చాత్యులును గూడ నుడివియున్నారు.

"విశ్వశ్రేయఃకావ్యం- తదదోషా పరిష్కృతా చ వాగర్థా" అను నన్నయభట్టారకుని వాక్యములలోఁ గావ్యముయొక్క యీ రెండు ప్రయోజనములును జెప్పఁబడి యున్నవి. ఇందు మొదటి వాక్యము మానవాభ్యుదయము ప్రయోజనమును, రెండవది వినోద ప్రయోజనమును, దెల్పుచున్నవి. మానవజీవితమునకు సంబంధించినదిగనే వాఙ్మయము డవలెనని పాశ్చాత్యులు గూడ నుడివిరి.

"Litarature is the criticism of life"

(వాఙ్మయము జీవిత విమర్శనము)

అని మాత్యూఆర్నాల్డ్ అను సుప్రసిద్ధాంగ్ల విమర్శకుఁడు చెప్పినాఁడు పోప్ అను ప్రసిద్ధకవి గూడఁ గవిత్వములో నేది ప్రతిపాదింపఁబడవలె నను విషయమున "The best study of man is man" అని నుడివియున్నాఁడు కవిశిరోమణియైన షేక్స్పియరు కూడ మానవ ప్రకృతి నాటకములోఁ జిత్రింపఁబడవలెనని వక్కాణించినాఁడు.

పాశ్చాత్య కవులు మానవ ప్రకృతిని జిత్రించుటలో—మానవుని గుణదోషములను విపులముగ నిరూపించుటలో—తమ చాతుర్యమును హెచ్చుగాఁ గన్పఱచినారు. ఈ విషయమున షేక్స్పియరు సిద్ధహస్తుఁడు. మానవప్రకృతి యెన్ని పోకడలఁ బోఁగలదో యాతని నాటకము వలనఁ దెల్లము గాఁగలదు. అయిన నేమి? అది మానవు నెంతవఱకు సంస్కరించు ననున దనుచే నెప్పుడును భారతీయ కవిపుంగవు లిట్లు మానవుని ప్రకృతిని సృష్టికవ్యపరీక్ష గావించుటతోఁ దృప్తి నొందలేదు. షేక్స్పియరు నాటకములలో వలెనే మహాభారతములోఁ గూడ మానవ ప్రకృతి చిత్రణము, పాత్రపోషణము గన్పట్టును. కాని మనవారి లక్ష్య మింకను పైఁ గలదు. మానవ ప్రకృతిని దాఠకుఁడు

గ్రహించినఁ జాలదని వారి యాశయము. పాఠకునకుఁ జెడుపట్ల ద్వేషము, మంచిపట్ల ననురక్తి గల్గు విధమున మన ప్రాచీన వాఙ్మయము రచింపఁబడినది. మానవుని సంస్కరించుశక్తి భారతీయ వాఙ్మయమునకు హెచ్చుగఁ గలదు. కావ్యములోని యీ నీతిని బోధించు గుణమునె పాశ్చాత్యులు 'డైడాక్టిసిజం' (Didacticism) అందురు. ఈ లక్షణము పాశ్చాత్య కవులలోఁ గూడ నచ్చటచ్చటఁ గలదు. కాని పాశ్చాత్య వాఙ్మయములో నీతి బోధచేయు శక్తిగల కావ్యములలోఁ గవితా సౌందర్యము తక్కువ. ఈ రెంటి సంపుటి భారతీయ వాఙ్మయములో నుండుటయే దాని విశిష్టత. ధర్మము, సౌందర్యము, (The didactic and the aesthetic) అందుఁ జక్కని పాళ్ళలోఁ గలిసియున్నవి. రామాయణ మెంత ధర్మబోధకమో యంత సుందరము. ఎంత సుందరమో యంత ధర్మబోధకము. అట్టి కావ్యము పాశ్చాత్య వాఙ్మయమున లేనేలేదు. తెలుఁగులో నిట్లు కవితా కళను, ధర్మబోధను సమ్మేళనము చేసికొన్న గ్రంథము కవిత్రయమువారి భారతము కళ కొఱకు ధర్మమును గాని, ధర్మము కొఱకుఁ గళనుగాని త్యాగము చేయనక్కఱలేదని సంస్కృత రామాయణము, తెలుఁగు భారతము శాశ్వతముగ ఋజువుచేసినవి. ఈగ్రంథము విశ్వశ్రేయః కరములే కాక యదోషపరిష్కృత యర్థపూరితములు గూడనని చెప్పవలెను. కేవల వినోదార్థము గ్రంథములను వ్రాసి వినోదవేదతరు ధర్మపశువును. బలియిచ్చు నాధునికులు కొందఱీ గ్రంథములనుండి గ్రహింపఁ దగిన పాఠ మెంతయో కలదు. కాళిదాస మహాకవి కావ్యములలోఁ గూడఁ బైన దెల్పిన యుత్తమ లక్షణముల సమ్మేళనము గన్పట్టుచున్నది.

పైనఁ దెల్పిన హేతువులవలన వాల్మీకి కాళిదాస నన్నయాదులు లోకమునకు ఆనందప్రదాతలేకాక శాసకులుగూడ నగుచున్నారు. పటిష్ఠమైన కవివాక్కు హృదయమునఁ దూరి పాఠకునిలోఁ బరివర్తనము గలుగఁగలిగినట్టు రాజశాసనము చేరఁజాలదు. నేఁడు హిందువుల దేహ

ములపైన నెవ్వరు పరిపాలన గావించుచున్నను, ప్రతి హిందూస్త్రీ హృదయము పైనను పీఠము వేసికొని రాజ్యము చేయునది వాల్మీకి సీతయు, ప్రతిపురుషుని హృదయసీమను పాలించు నాతఁడు శ్రీరామచంద్ర మూర్తియు నని చెప్పవచ్చునుగదా! ప్రపంచములో నెచ్చటనైనను నిజముగఁ బాలించువారు మహాకవులే యనియు, నీ యంశమును మనము గుర్తింపలేకున్నామనియు "Poets are the unacknowledged Legislators of the world" కార్లైలు అను విమర్శకుఁడు నుడివియున్నాఁడు. భారతీయ వాఙ్మయమున నిట్టి ప్రచ్ఛన్న శాసకులు హెచ్చుగ నున్నారనునది యెల్లరంగీకరించిన యంశము. ఇట్టికవు లితరదేశములలోఁ గూడ నున్నారు కాని లేకపోలేదు. ఇట్టి పవిత్రకృత్యము నెఱవేర్చు శక్తిగలది కావుననే కవిత్వమును గ్రేమున్నగువారు Celestial fire (దివ్యాగ్ని) మున్నగు శబ్దములతో వ్యవహరించినారు. ఈ యగ్నిని దేవతలకు హోమము చేయుటకుఁగాని శీతబాధితుని యార్తిని దీర్చుటకుఁగాని యుపయోగింపవలెను గావి, కొంపలను గాల్చుట కుపయోగింపరాదుకదా! లోక కళ్యాణముపట్ల నుపేక్షాభావమును గన్పరచి శుష్కవినోదము ననుసంధించు కావ్యములకంటె లోకకళ్యాణ భంజకములై తాత్కాలిక క్షుద్రానందము నొసగూర్చు కావ్యము లెక్కువ గర్హ్యములు. కేవలము శ్రుతిస్మృత్యుక్త ధర్మములనే కావ్యములు ప్రతిపాదింపవలెనని నేను నుడువుటలేదు. నేఁడు మన జాతీయ జీవితములో మనల నెదుర్కొను సమస్య లెన్నియో కలవు. వాని పరిష్కారమునకుఁ గవులెంతయో సహాయపడఁ గలరు, ఆర్థిక సాంఘిక నైతిక రాజకీయ వైజ్ఞానిక విషయముల నికృష్టస్థితిలో నున్న మన ప్రజలను గవులు రచయితలు నుద్ధరింపవలసిన మార్గము లెన్నియో కలవు. ఇట్టి విషయములఁ గవులెట్లు తోడ్పడఁగలరో తెల్పుటకు నొక యుదాహరణము నిచ్చెదను గత శతాబ్దములో ఇంగ్లండులో ఫ్యాక్టరీలలోఁ బనిచేయు బాలురు చాలకష్టముల పాలుచేయఁబడుచుండిరి. 'మిసెస్ బ్రౌనింగ్' అను కవయిత్రి బాలురయా బాధలను హృదయవిదారకముగ వర్ణించుచుఁ గొన్ని పద్యములను వ్రాసెను. అవి ప్రతి పార్లమెంటు మెంబరు హృదయమునకుఁ దగిలినవి. కొలది దినములలో పార్లమెంటులో నొకబిల్లు ప్రవేశపెట్టఁబడి శాసన రూపమును దాల్చినది. దాని వలన నా బాలుర కష్టములు తొలఁగినవి. ఇట్లు జాతీయ జీవితములోఁ బరివర్తనము దెచ్చిన రచయిత లెందఱో కలరు. మన యాంధ్రులలో నట్టికవులు, రచయితలు నింకను హెచ్చుమంది బయలుదేరలేదు. నేఁటి కెట్టికావ్యవస్థ లవసరమని యాలోచించినవారే తక్కువగ నున్నారు.

పద్యకావ్యములు, గద్యకావ్యములు, నాటకములు, ప్రహసనములు మున్నగు వాఙ్మయ విశేషముల మూలమున దేశమునకు ఆర్థిక నైతిక సాంఘిక ధార్మిక రాజకీయాది విషయములలో సేవచేసి తమకు నచ్చిన విధమున దేశాభ్యుదయమునకుఁ దోడ్పడిన యాంధ్ర రచయితలు బొత్తుగ లేకపోలేదు. మత సంఘ విషయములలో శ్రీయుతులు కందుకూరి వీరేశలింగముగారును, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రిగారును ముందుగఁ బేర్కొనఁదగినవారు. ఈయిరువురును దమ భిన్నదృక్పథముల కనుగుణముగ మత సంఘసేవ నొనగూర్చు సారస్వతమును వెలయింపఁజేసిరి. ప్రస్తుత కాలమున శ్రీమతి కాంచనపల్లి కనకాంబగారు వేదాంత విషయమునఁ దమ కవితా కళను వినియోగించుచున్నారు. శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు నేఁటి కవసరమైన "ఆంధ్ర ప్రశస్తి" "ఆంధ్ర పౌరుషము" "చెలియలికట్ట" "వేయి పడగలు" మున్నగు నుత్తమ గ్రంథములను రచించియున్నారు, ఇట్టి దేశాభ్యుదయకర వాఙ్మయస్రష్ట లింకను గలరు. కాని వారందఱను నిటఁ బేర్కొనుట సాధ్యముగాదు.

దేశము సర్వతోముఖవైభవోపేతమై యలరారిన కృష్ణదేవరాయల కాలమునఁగాని భోజునికాలమునఁగాని "యెట్టి వాఙ్మయము బయలుదేరవలె" ననుప్రశ్న కంతయావశ్యకత లేదు. కాని జాతి సర్వవిధముల నూతన జీవము నొందవలసియున్న యీ దినములలో నదే ముఖ్యసమస్య. రోము మండుచుండఁగాఁ బర్వతముపైనఁ గూర్చుండి సంగీతమును బాడుకొనుచుండిన నీరో చక్రవర్తివలెఁ గాక మన రచయితలు, కవులు దేశస్థితిని గూడఁ గొంత దృష్టిలో నిడుకొనవలెనని నా యభిప్రాయము. (1941 మే 'ఆంధ్రి')

అభాగిని *

శ్రీ శ్రీవిక్రమ దేవవర్మ.

జయపుర రాజ్యాంతర్గత రాయగఢయందు శర్కర కర్మాగారము గలదు. దానికిఁ గొంత దవ్వునందు రంగపల్లి యను నొక చిన్నపల్లె యున్నది. అందు నా కర్మాగారమునందుఁ బాటుపడువారె నివసింతురు. ఆ పల్లె నడుమఁ గలబాట గులకఱాలతోడ నున్నగాఁ గావింపంబడి యున్నది. గొంపలు బిరుసుగల మట్టిగోడల తోడనె కట్టఁబడి వాని పెణకలు దబ్బగడ్డితోడఁ గప్పఁబడి యుండును. లోపల మట్టి నూనెగల బుడ్లయందు వెలుఁగు దివ్వెలవలనఁ గలుగు కఱదూపము సాలెపట్లును నిండియుండును. ఆ కొంపలు మానిసులకె కాక యెలుకలకును బొద్దింకలకును డెంకులు. ఆ పల్లెయందు నున్నవారు రోజునందు నెనిమిది గంటలు పాటు పడుటవలనఁ గలుగు కష్టమును బాపికొనుటకు సంజతఱిఁ గొంచెము కల్లుఁ ద్రాగి యించుక సుఖియింతురు. అప్పుడప్పుడు వారినడుమఁ గలుగు జగడముల వలన వారి గొంతుకల నుండు తెమడ సమయుచుండును.

ఆ కర్మాగారమునందుఁ బాటుపడుటకై కమల యనులలన యా పల్లెకు వచ్చి యొక గది యద్దెకుఁ గైకొనెను. అది తప్ప నందు నద్దె నిచ్చి కాఁపురము సేయువారు మఱెవరును లేకుండిరి. అదియె యద్దె నిచ్చునది యగుటవలనఁ దాను లజ్జించుచుండెనో లేక గర్వించుచుండెనో యవ్విషయము దానిమదికె యెఱుక. దాని ప్రాయము రమారమి యిరువదియేండ్లు. శరీరము నాతి దీర్ఘము నాతి హ్రస్వమును; మఱి నాతిపీనమును; నాతికృశమును; ఛాయ పదరెండు వన్నెల బంగారు. అరాళ నీలాలకలు దాని శారదపూర్ణేందు వదనమున కొకింత యావరించి స్వల్పగ్రసిత గ్రహణాకారమును సూచించుచుండెను. కనులు గండుతుమ్మెదలను గలిగిన తెల్లతామరఱేకులను గేలిసేయుచుండెను. దాని యంగప్రత్యంగములు శిల్పికల నాతీతములు. దానిని జూచు మగవారి చూపులె కాక, యాఁడువారి చూపులు గూడ సుందరాకృతికి సూదియంటు నున్నట్లు దానిపైని కంటుకొని కొంతసేపు నిలచుచుండెను. అది యొక్కతియె యైన వారల సాయమును గోరక మఱి యొరుల జోలిని గలుగఁజేసికొనక తాను మేనువంచి పాటుపడి గడియించు కూలివలనఁ గాలమును గడుపుచుండెను.

ఆ కర్మాగారముయొక్క కర్మపరీక్షకుని పేరు సూర్యమూర్తి. వాఁ డవివాహితుఁడు. వాని వయస్సించుమించు ఇరువదియేండ్లు. వాని ముఖము ప్రసన్నము; నయనయుగము విశాలము, వక్షము విస్తృతము, వర్ణము కేతకకుసుమ సదృశము. వానిమనము కమలయందు లగ్నమయ్యెను. దానంజేసి వాఁడు పనిని బరీక్షించు నెపమునఁ గమల కడకుఁ దఱచుగా వెళ్లుచుండెను. వాఁడు దానికడకు వెళ్ళునపు డది వానిని గన్గొనినంతఁ గని తనతలను వంచికొని భయభక్తులతోడఁ దన పనిని జేసికొనుచుండెను. తనకడకె వాఁడు దఱచుగా వచ్చుచుండుట వలన వాని మనోభావము నది గ్రహించినను, దాని మనసునకు నూఱుపాటు గలుగకుండెను. ఇట్లు గొంత కాలము గడచెను.

వసంతఋతువు ప్రవేశించి జగమునకు నాతిశీతమును నాత్యుష్ణమును గలిగించెను. నవమాలిక పుష్పవతియై మధుపపాళి నాకర్షింపఁ దొడగెను. ఫలభరితరసాల సాలములపైఁ గూయుచుండి పికములు పంచమస్వరమును వెల్లడించి విరహుల యుల్లములను దల్లడింపఁ జేయసాగెను. ఆ రామములు కిసల కుసుమ ఫలభరితములయి జననయనానందకరము లగుచు నొప్పెను.

నాఁడు పూర్ణిమా సాయంకాలము. ఆవులు మేఁతమేసి మఱలుచుండెను. ఖగములు నిజనీడములకు జేరుకొనుచుండెను. చంద్రుఁడైంద్రశిరముపైని సూర్యుఁడు వారుణీశిరముపైని నిలిచి మాఱుఁదేయు హీరకమాణిక్య చక్రములవలె విరాజిల్లుచుండిరి అప్పటికె కర్మాగార కర్మకరులు దమపనులను ముగించి నిజనివాసముల కేగిరి. కాని-కమల మాత్రము తనపని ముగియకుండుటవలను దానిని ముగింపఁ బని సేయుచుండెను. అవ్విషయమును సూర్యమూర్తి దెలిసికొని కమలకడ కేగి దానిమూఁపుపైఁ దనచేతి నిడి "కమలా ! నిన్నును నీ పనుల నేర్పును గన నా డెందమున కెంతయో యానందము గలుగును. నీ తోడఁ గొన్ని మాటలాడవలెను ఇక్కడ మాటలాడ వలను పడదు. కనుక నీవు సందేహింపక యిప్పుడె నా మందిరమునకు ర"మ్మనెను. యువతీ యువకుల యేకాంత మేళన మపదర్థకర మగునుగదా ! కమల వానికోర్కి కియ్యకొని వాని యింటి కేగెను. అది వానిగదియందుఁ బ్రవేశించి నంతనె యా దూర్తుఁడు దానిని గౌఁగిలించెను, వేఁడి తాఁకుడువలన వెన్న గరఁగకుండునా ? అంతనుండి ప్రత్యేక నిశియందు నెవ్వరు నెఱుంగ కుండునట్లు కమల సూర్యమూర్తి మందిరమునకు వెళ్ళుచు వచ్చుచుండెను. కొంతకాల మున కది గర్భవతి యగుట దెలిసినంతనె వాని మదికి దిగులు గలిగెను. అంత వాఁడు దానిని బుజ్జగించి గర్భవిచ్ఛేద మును జేసికొనవలెననియు నట్లు చేసికొననిచో భరింపశక్యముగాని నింద గలుగుననియును దానికి బోధించెను. అది సమ్మతింపమి నా పాపి బెదరించెను, కాని-కలుగఁబోవు నిందకు నప్పటి బెదిరింపున కది సరకుసేయక "నేనా పనిని జేయ"నని దృఢముగాఁ జెప్పెను. మాతృవాత్సల్య మధికతమముగదా ! ఆవిశ్వాసఘాతుకుడు దానియందు లేని దోషము నారోపించి దానిని గర్మాగారమునుండి తొలఁగించెను. అది మఱుమాటాడక విదేశమున కేగెను. ఆ యభాగిని యెట్టి శిశువును గనెనో యేమయ్యెనో తెలియదు. (1941 మే "ఆంధ్రి")

గోపాలలీలా సుధాలహరి

శ్రీ నిడుదవోలు వేంకటరావు. ఎమ్ ఏ.

శృంగారరసోల్లసిత మగు నీ యాంధ్రప్రబంధము కళింగకవి యగు ప్రయాగ కామేశ్వర కవిచే రచియింపఁబడినది... విజయనగరము దరినున్న శ్రీ రామతీర్థ క్షేత్రమున వెలసిన శ్రీరామునకుఁ గృతి--- ఇందు మూఁడాశ్వాసములలో గోపికావస్త్రాపహరణకథ వర్ణింపఁబడియున్నది—గ్రంథవిషయము ననుసరించి గ్రంథమునకు "గోపికాజనముక్తవస్త్రాపహరణ, బాల గోపాలలీలాసుధాలహరి." అను పేరెంతయు దగియున్నది.

కామేశ్వరకవి నేఁటికి రెండుశతాబ్దముల క్రిందట విలసిల్లియుండెను. ఈతఁడుభయ భాషాకవియై, ఆశుకవిత్వమునఁ గూడ పేరువడసి పెక్కుకృతులు రచియించెను. వానిలో నీగోపాలలీలా సుధాలహరియు భద్రాచలధామశతకము నను రెండుమాత్రమే లభ్యమగుచున్నవి. ఈతఁడు "కల్పనా కల్పమంజరి" యను పేర ఆజుఁడిందుమతిని పరిణయమైన కథను, ప్రబంధమును, సుదంతాపరిణయ మును వేతొక తెలుఁగు కబ్బమును రచియించెనని తెలియవచ్చుచున్నది—ఇవి నేఁడు దొరుకుటలేదు.

కామేశ్వరకవి కృతు లేవియు ముద్రితము కాలేదు. గోపాలలీలా సుధాలహరియందు గద్య యిట్టిది. "ఇది శ్రీరామచంద్ర కరుణారసప్లుత హృదయాలవాలసంజాత భక్తిలతావేల్లితానల్ప కల్పనా ప్రసూనసమంచిత కవితాశచీప్రియ, ప్రయాగనారసింహపౌత్త్ర సరేశ్వర పుత్త్ర, కౌశిక గోత్ర పవిత్ర నిఖిలసుధీ జనవిధేయ కామేశ్వర నామధేయప్రణీతం బైన బాలగోపాల లీలాసుధాలహరియను శృంగార ప్రబంధంబునందు సర్వమును తృతీయాశ్వాసము"

కామేశ్వరకవి కవిత రసవంతమైనది.

> "దుండగ మేలజేసెదవు తోయజసాయకదండ నిల్చి, కో
> దండము దించి మాచెలికి దండము పెట్టుము రెండు కన్నులన్
> నిండిన నీరు దోయిటను నింపి శపించుఁ దదశ్రువారిచిన్
> దండనచేయు ఫాలశిఖి తండ్రినుమీ కడు శిక్ష సేయఁగన్"

ఇత్యాది గోపాలలీలా సుధాలహరి పద్యములు ప్రసిద్ధములు. భద్రాచలధామశతకము "భద్రా, చలధామా ! రామ ! నీలజలదశ్యామా." అను లకార ప్రాసఘటిత మగు కందపద్యశతకము

గోపాలలీలా సుధాలహరియందు కామేశ్వరకవి తాను ప్రయాగ వేంకటాద్రి కవికృతమగు "గోపికాంశుకాపహార" మను ద్విపదకావ్యమును పద్యకావ్యముగ రచియించినట్లీ క్రింది గీతపద్యము వలనఁ దెలియుచున్నది.

ఆ వె "అగు ప్రయాగ వేంకటాద్రీంద్రకృతగోపి
కాంశుకాపహార మనెడి ద్విపద
కావ్యమేను పద్యకావ్యం బనల్పక
ల్పనలఁ జేయఁదలఁత భక్తి నతిని."

ఈ ద్విపద కావ్యమును నిప్పుడు లభించుటలేదు. ఈ వేంకటాద్రికవి కామేశ్వర కవికి పెద్దతండ్రి. ఈతఁడు తెలుఁగుకవి యగుటయేగాక సంస్కృతమున మహాపండితుఁడై మహామహోపాధ్యాయ బిరుదము ధరించి ఢిల్లీచక్రవర్తిచే సన్మానింపఁబడిన మహావిద్వాంసుఁడు. ఈతనిఁగూర్చి వేఱుగా నెఱిఁగింతును

కామేశ్వరకవి పద్యకావ్యము వేంకటాద్రికవి ద్విపదకావ్యము నెట్లనుసరించెనో తెలియుటకు నాధారములేదు. ద్విపదలను పద్యములో ననువదించినపుడు ద్విపదపంక్తులనే నాయాజాతి వృత్తిచ్ఛందస్సుల ననుసరించి మార్పులు చేయుచు రచియించు సంప్రదాయ మాంధ్రకవులలోఁ గలదు. శ్రీనాథమహాకవి పాల్కురికి సోమనాథుని ద్విపదపండితారాధ్య చరిత్రమును పైరీతిగనే పద్యకావ్యముగ వ్రాసినట్లు తెలియుచున్నది. కామేశ్వరకవి యట్లే చేసెనేమో యని యూహింపఁదగియున్నది.

పద్యములు ద్విపదలో నేమాత్రము మార్పుచేయని పదకము ననుసరించి చింతలపూఁడి యెల్లకవికృత విష్ణుమాయానాటక పద్యకావ్యమును ద్విపదకావ్యముగా కంకటి నారసింహకవి రచియించెనని యీ వఱకుఁ దెలిపియుంటిని. *ఇదియును నొక మంచిపద్ధతియే. మూలగ్రంథములోని పాఠములుగాని, గ్రంథములోఁ గొంతభాగము ఖిలమైనచో నా కొఱవడిన విషయములను దెలిసికొనుటకీ పద్ధతి మిగుల తోడ్పడును.

"ఆంధ్ర"

* విష్ణుమాయానాటక పద్యకావ్యము మదరాసు విశ్వవిద్యాలయమువారు తొలుత ప్రకటింపఁగ నది దోషభూయిష్ఠముగను నపరిష్కృతముగను నుండుటచే ఆంధ్రభోజులను శ్రీ శ్రీ శ్రీ పీఠికాపుర మహారాజేంద్రులు నగు శ్రీ సూర్యరాయప్రభువర్యు లీ గ్రంథమును సుపరిష్కృతము గావించి విద్వజ్జన మనోరంజనముగ ముద్రాంకము గావించి ప్రకాశింపఁజేసిరి, 'ఆంధ్ర' వైశాఖ.

గారు (శబ్ద విచారము)

శతావధాని శ్రీ వేలూరి శివరామశాస్త్రి

లోకులు విద్యావృద్ధులకును వయోవృద్ధులకును గారు తగిలింతురు. సవస్కులను. బాలురను ఏమోయి యనిగాని ఏమిరా యనిగాని సంబోధింతురు పెక్కు కారణములచే అయ్యా, అండీ, ఓయీ, ఓసీ, ఏమిరా, ఏమేలు, మారుచుండును,

"గారు" అనునది భయభక్తులను తెల్పుమాట. దీని పుట్టుపూర్వోత్తరములఁగూడ నట్టివే. ఇది, బహువచనమయినను ఏకవచనమునఁ గలసిపోయి గౌరవమును వెలిబుచ్చును, ఉదా :- తాతగారు, కేవలబహుత్వమును దెలుపుటకు వెంకయ్య, పుల్లయ్యగార్లని యందురు కావున "గారు" అను దానిని గౌరవమును దెలుపు ఏకవచనమని యననగును.

గారు అనునది గౌరవమును దెలుపు ఏకవచనమగునెడల "గాఁడు" అనునది నైచ్యమును దెలుపు ఏకవచనము ఏలిగాఁడు ఈ 'గాఁడు' దిగువ వర్ణములవారి కంటు కొన్నది. కొందరు శాస్త్రజ్ఞులు మిడిమిడి సాహిత్యము కలవారిని సాహిత్య గాండ్లనుటకు బదులు గాఁడు ప్రత్యయాంతములవి వేళాకోళము చేయుదురు, కల, వాఁడు అను రెండు పదములు "కలాఁడు"గా మారి కాఁడు కానగును విల్లుకలవాఁడు విలుకాఁడు. అందము కలవాఁడు అందగాడు.

కల, వారు కారు అయి గారు కావచ్చును అగుచో విలుకాఱు అను బహువచనమున శకటరేఫము ఎటులు వచ్చెను? "ండ్రు" అను నీసంయోగపు బరువును మోయుటకు ఈ శకటము వచ్చెనా. ఇది పరిశీలింపదగిన విషయము.

గాఁడు అనునది నైచ్యమును తెలుపును గావున ఏలిగాఁడు మొదలగు పదములను వారు తమ సారస్వతమునుండి ఎత్తివేసిరట ఇది ప్రశంసనీయము. పల్లియలలో నిన్న మొన్నటివఱకు "గారు" వినఁబడునదికాదు. "ఏమోయినాన్న" "ఏమే అమ్మా" అను సంబోధించు బాలురు నేఁటికి నన్ని కుటుంబము లందును జెదురుగాఁ గలరు. మిగిలిన పెద్దలయెడలను పూజ్యుల యెడలనుగూడ గారు వినఁబడదు. అది పల్లియల ప్రేమకును నిరాడంబరతను పతాక

పల్లియలందలి పామరులకు 'గారు' అపరిచితము వారెంత పెద్దలయినను 'నీవు' అని యందురు. పిల్లలకు మీరు అనుమాట రాదు. ఏలసినఁ బెద్దలెవరును వారిని మీరు అని సంబోధింపరు. గాన వారి వాఙ్మయమున మీరు అనుపదము మృగ్యము. వారెంత పూజ్యులయినను నీవు అని అమాయకముగా నందురు. క్రొత్తవారెవరేని వచ్చుచో, పిల్లలు వారిని నీవు అని అనుటయు నింటివారు కుఱ్ఱలను కసరుటయు కుఱ్ఱలు చిన్నఁబోవుటయు మామూలు. ఇపుడిపుడు పల్లెలందునూ బాలురు ఏమండీ నాన్నాయనియు, నాన్నగారనియు నేరుచుకొని నాగరకులై పోవుచున్నారు. ఈ పదము లా తండ్రికొడుకుల నెంత దూరమునకు నెట్టుచున్నదో మరి యా నాగరకత అనగ్నుల కంటె ఎంత నగ్నమయి పోవుచున్నదో వారి తండ్రులు గమనించి యుండరు. కుఱ్ఱల ప్రేమకిది వేరు పురుగు. పిల్లలకే గారు అనునది చాల బారు, నాగరికతకు రూపమే కాని హృదయములేదు.

బ్రాహ్మణ క్షత్రియులు గారు తోడనే పుట్టిరి. వీరు తమలోఁ దమకును బరులకును 'గారు'. వెలమ వారిలోఁ జిన్నయుఁ బెద్దయు లేక ఒకరి కింకొకరు గారు. వీరించుమించు 'గారు' మతస్థులు. వీరిలో వీరు తిట్టుకొను నపుడేని మానవుని మీఁది గౌరవము తీసివేసినను 'గారు' మీఁది గౌరవము తీసివేయరు. వీరికి 'గారు' పేరులో నొక భాగమే యాయెను కావుననే కొందరు ఫలానా వారు: "వెంకట రాయణింగారుగారు" అని చేవ్రాలు చేయుదురని యెకసక్కెము లాడుదురు.

వైష్ణవులకును లింగధారులకును 'గారు' రూఢము. ఉదా: అయ్యగారు, అయ్యవార్లంగారు, అయ్య అనునదే గౌరవమునకు వాచకము. పైని 'గారు' దానిపైన మఱియొక 'గారు'. అయ్యవారు పేరైనటులును దానిమీఁద నీ 'గారు' ఎక్కినటులును కానిపించును.

అగ్రవర్ణములవారు కొందరితరుల వర్ణము నారయక 'యేమండీ' అనిగాని 'యేమోయి' యనిగాని సంబోధించి ప్రసంగ క్రమమున వారి వర్ణము నెరింగి నోరు కఱచుకొందురు. గంభీరులు కొందరు 'యేమండీ' యని గాని 'యేమోయి' యనిగాని యనకయే తమ ప్రసంగమును సాగించుకొని పోగలరు. ఇట్టి జాగరూకత శ్రీ బులుసు పాపయ్య శాస్త్రిల వారి కుండెడిదని వినికి.

నేటి బడులలో సహాధ్యాయులకు గాని శిష్యులకుగాని 'గారు' పట్టింపంతగా నున్న చందము కాన రాదు ఏలూరు మ్యునిసిపల్ బడిలో నొక బెస్తకుఱ్ఱఁడును, నేనును కలసి చదివితిమి. మా యిరువురకును ఆబడిలో సెకండు ఫారముతో ఆంగ్ల సరస్వతి యత్వాహిని యాయెను. అతఁడు కళాయిపని నేర్చి యేలూరు బజారుతల నంగడిపెట్టెను. నేను పండిత వేషము వేసితిని ఒకనాడు శనివారపుఁబేట జమీందారులు శ్రీ పార్థసారధి అప్పారావు గారితో ఏలూరు వెళ్ళట తటస్థించెను, రోడ్డుమీఁద జనము క్రిక్కిరిసి యుండుట వలన బండి యాఁగవలసి వచ్చెను. ఆ ప్రక్కనే ఆ బెస్తకు రడు గిన్నెలకు కళాయిపెట్టుచూ బండిలోనున్న నను "ఎన్నాళ్లాయెరా నిన్నుఁజూచి" అని బిగ్గరగా అనెను, నేను బండిదిగితిని. పరస్పర యోగక్షేమములు తెలిసికొని సంతసించితిమి. ఈ లోపున బండికి దారి విడెను. నేను మరల బండియెక్కితిని. జమీందారుగారు ముమ్మొదటఁ గొంచెమాశ్చర్య చకితులైరి: కాని మా సహపాఠిత్వము విని సంతసించి తమ కొలమువారికట్టి ప్రేమసౌరభ మింకిపోయినందులకు వగచిరి.

దిగువవర్ణపుఁ బండితుల నెగువవర్ణపుఁ బండితు లింతవరకు నేస్తాయియనియే కాలక్షేపము చేసికొనుచూ వచ్చుచున్నారు. దిగువ వారును ఊరకుండుచునే యున్నారు. కాని వారి సవర్ణులను వారునుగూడ లోలోనఁ గించ పడుచున్నారు. వారినటుల నొప్పించుట పాడియా ! "గుణాః పూజాస్థానమ్"

ఎవరిని నీ వనవలయునో మఱి యెవరిని మీరనవలయునో యా సంగతి యించుమించుగా నంద తెలుఁగుదురు. అది తెలిసియే లోకుల వ్యవహారము తూకముగా నడచును. తూకము తప్పినప్పటికిని యేవ్యక్తి యయినను మీ రనిపించు కొనవలయునని ప్రత్నించుచో వారిని మీరని వ్యవహరించుట సామాన్యవిధి. ఇఁక నచట గుణమే యున్నయెడల గౌరవింపవలయునని వేర చెప్పవలయునా ?

ఔత్తరాహులు గంగాజీ యనియు గాశీజీ యనియు వ్యవహరింతురు, గంగగారు, కాశీగారు అని తెలుగువారెవరేని యనరు గాని గంగమ్మ యని యందురు, కాశమ్మయని పేరుపెట్టుకొందురు. ఈ గారు విషయము భాషాస్వాభావ్యము వింతభాషలో గంగరో ఏమంగురో వంటి వింతలుండునా? "వాగ్వైవ చిత్ర్యాణా మనంతత్వాత్" ఈ సముద్రము నిపుడు కదిలింప జనదు.

ఇపు డౌత్తరేయులీ గారు మొదలయిన (ఆప్ అని) బహువచనములం దొలగించి నీవు (తుమ్, తుమి) చేసివేయ వలయునని యొక యుద్యమ మారంభించుచున్నారు కాని ఇది సఫలము కాదు. స్వభావము దురతిక్రమము. మదరాసు దొరతనమువారు యమ్మారావ్వే తీసివేసి శ్రీయనిరి. కాని కోర్టుభాషలో నీవు తప్ప మీరులేదు. ఇది చింత్యము. లోకవ్యవహారమున నీవు తుడిచిపెట్టుకొనిపోదు.

ప్రేయసికింగాని ప్రియతమునకుంగాని గారులేదు. కాననే ఆచార్య గోవర్ధనుడు.

శా. ఏమండీ యని పిల్చుచోఁ బరుసమౌనేమోయి నాఁబిల్చినన్
సామాన్యంబగు, నేమిరా యనుచునన్ సంబోధనం జేయుచో
నామోదంబు ననుగ్రహం బెవరికో నవ్వారె దాంపత్యపున్
స్వామల్ : కానిచి నల్ప భార్య. పతుపై నాథుండు చూపట్టెడిన్

అని పల్కెను.

పరోక్ష ప్రత్యక్షములలో తేడా గలదు. "హరి నాగభూషణం ఏం పాడేశాడోయ్" "నారాయణ దాసు ఏం హరికథ చెప్పాడోయ్" ప్రత్యక్షమున నీ యేక వచనప్రయోగమును జేయరు. అటులు చేయుచో దొక్క బద్దలగునని వారికిం దెలియును. ప్రతిష్ఠగలవారందఱకును ప్రత్యక్షములో గారు తగులును గోడచాటగుచో మాత్రము పేరే మిగులును వారు గోడచాటునం బొంచుండీ ఈ యేక వచన ప్రయోగమునకు సంతాప పడవలసిన పనిలేదు. వారిపేరులే గౌరవమునకుం బర్యాయపదములు కాళిదాసు నెవరును కాళిదాసుగారని యనరు. మృత్యువు లేనివారి కెవరికిని "గారు" లేదు. ఒకవేళ నున్నను దాని కర్థములేదు.

కవులు పొగడువేళం గాంతలు రతివేళ
సుతులు ముద్దువేళ శూరవరులు
రణము సేయువేళ రా కొట్టి పిలుతురు........

ఆ యీ స్థలములలో రాకుండు గౌరవము "గారు"కు లేదు. ఇన్ని వేదములలో ఇన్ని దర్శనములలో దేవుని చివర నెవరేని "గారు" చూచి యున్నారా!

"ఆంధ్రి"

ఆంధ్రి

శ్రీ కుందూరు ఈశ్వరదత్తు

క్షేమేంద్రుఁడు దేశౌచిత్యవర్ణనములు కావ్యమునకు శోభగూర్చునని వ్రాయుచు, రాజశేఖర మహాకవి చెప్పిన ఈ క్రింది శ్లోకము ఉదాహరణముగాఁ దాను రచించిన "ఔచిత్య విచారచర్చ" యను గ్రంథమునందు బేర్కొనెను.

కర్ణాటీ దశనా కితః శితమహారాష్ట్రీ కటాక్షాహతః
ప్రౌఢాంధ్రీస్తన పీడితః ప్రణయనీ భ్రూభంగ విత్రాసితః
లాటీ బాహువిచేష్టితశ్చ మలయస్త్రీ తర్జనీతర్జితః
సోయం సంప్రతిరాజశేఖరకవి ర్వారణాసీం వాంఛతి.

పై శ్లోకమును గ్రోడీకరించి దానిక్రింద నీవ్యాఖ్యానమును క్షేమేంద్రుఁడు వ్రాసెను. "అత్రకర్ణాట మహారాష్ట్రాంధ్ర లాటమలయ లలనా సంభోగ సుభగః కాలేన గలితరాగ మోహః సంప్రతి రాజశేఖర కవిర్వారాణసీం గంతు మిచ్ఛతీత్యుక్తే శృంగార రస తరంగిత వరాంగనాప్రసంగే అనంగ నిరర్గల దక్షిణాపథ దేశోద్దేశమధ్యే ప్రణయినీ భ్రూభంగ విత్రాసిత ఇతి దేశోపలక్షణ విరహితాకేవల ప్రణయినీ పదేన దేశౌచిత్యముపచిత మప్యనుచితతాం నీతమ్"

కర్ణాటక శాసన సంపుటములందలి యొక హొయిసల రాజశాసనములో ఆంధ్రస్త్రీ స్తనవర్ణనముగలదు. ఆ రాజును వర్ణించుచు శాసనకవి ఈ క్రింది విశేషణములను రచించెను

"లాటీవధూటీ కటిసూత్ర, ఆంధ్రీ నీరంధ్ర బంధురస్తనహార, ఘూర్జర నితంబినీరత్న కేయూర, కర్ణాటకామినీశశివదనమణి మయముకుర . . . . . .

దక్షిణహిందూదేశ శాసన సంపుటములలోఁ బ్రకటింపఁబడిన యొక శాసనమందలి హృదయానంద కరమగు ఆంధ్రస్త్రీ వర్ణనమును జూడుఁడు—

"తాభ్యాం సుతాభూ దిభకుంభతుంగ ఘన స్తనద్వంద్వ భరానతాంగీ
సూరాంబికా బింబ ఫలాధరోష్ఠీ లోకేర్థినాం జంగమ కల్పవల్లీ."

ఆంధ్ర వధూ పృథుపయోధర వర్ణనములు కవి కల్పించిన యతిశయోక్తులు గావనియు, నవి కేవలము స్వభావోక్తులే యనియు, దేశ్య స్త్రీ శరీరావయవ శోభా సౌభాగ్యగరిమమును సూచించునవియే యనియు, రసిక జన హృదయ వేద్యమేగదా.

తెలుగు వనితలకిట్టి యున్నత స్తనమండలమునకుఁ దోడుగా, వారి దుకూలాంచల ధారణమునందును విలాససౌష్ఠవమున్నది. ప్రాచీనాంధ్రకవి యొకఁడు కవిత్వ తత్త్వమును ప్రసంగించుచుఁ గవిత్వ మిట్లుండవలెనని బంధించిన విషయమెల్ల రెటింగినదే.

చ. ఘనతర ఘూర్జరీ కుచయుగ క్రియ గూఢము గాక ద్రావిడీ
స్తనగతిఁ దేటఁగాక యెలదాటగు నాంధ్రవధూటి చొక్కపుం
జనుఁగవఁబోలె గూఢమును జాటుదనంబును లేకయుండఁ జె
ప్పిననది పోఁ గవిత్వమనిపించు నగించటుగాక యుండినన్.

ఆంధ్రస్త్రీలకు పైట ధరించుటలోఁ గల సొగసు భరత ఖండమునందలి యితరమండలస్త్రీలకు లేదనియు, నది వారికిఁ బెట్టని సొమ్మనియు గ్రహింపఁ గలము. పైఁటవేసికొనుటలోఁ దెలుఁగు జోటులు తమ స్తనద్వంద్వమును దేటయు మాటునుగాక గాపాడుకొను ఫణితి యాంధ్రేతర మానవతుల కలవడలేదు.

ఆంధ్రస్త్రీలు ప్రాచీనకాలమందు రవికయుఁ బయ్యెదయు ధరించి యెఱుంగరు, అమరావతీ స్తూపము మొదలైన ప్రాచీనాంధ్ర శిల్పస్థానములను జూచినచోఁ బై విషయము విశదము కాఁగలదు, ఈ ఆచార మిం కను ద్రవిడ. మళయాళ దేశములందున్నది, ఆంధ్రదేశమునకు మహారాష్ట్ర, ఘూర్జరదేశ సంపర్కము గలిగినతరువాత, మన దేశస్త్రీలు రవికను ధరించుట కలవాటుపడిరి. దానితోఁ బైటయు నలవాటయినది. మొదటఁ గటిప్రదేశమునకుఁ బై భాగమున కంచెలయు, నది విడిచి రవికయుఁ దరువాత రవికయుఁ బైటయు ధరించుట యాచారమైనదని తలంచుచున్నాము. ఈ కాలమున గంచెలయు, రవికయుఁ బైటయుఁగూడ నాంధ్రయువతులు ధరించుచున్నను రవిక యుత్తరదేశాచారము. దాక్షిణాత్యనాగరికత మాత్రముగాదు. (1940 జూన్ "ఆంధ్ర" నుండి.)

ఆశీః

శ్రీయొప్పారఁగఁ బండిపండితుల్ యాశీర్వృష్టి వర్షించుతన్
నీ యుద్యోగము గోలివాణి కవివాణీ రూపమై వచ్చి నీ
సాయుజ్యంబును జెందుతన్ రసకళాసౌందర్య సంపత్తిచే
నాయురారోగ్యము పుష్కలంబగుత ! నీ కాంధ్రీ ! జయం బబ్బుతన్.

పత్రిక పుట్టినన్ బురుడుపట్టనుగాని సమస్తలోకవై
చిత్రికి వ్యాఖ్యసేయునొక చెల్లెలొ తమ్ముఁడొ పుట్టెనంచు హృత్
క్షేత్రమునం దలంతుఁ బరికింతును మిత్రుఁడ వచ్చె నంచు, వా
క్సత్రముకగ్గె నంచుఁ బరిషత్తుద యించెనటంచు నాంధ్రరో !

వేలూరి శివరామశాస్త్రి

"ఆంధ్ర పురాణము" ఈనాటి మహాకావ్యము

ఆచార్య దామెర్ల వేంకటరావు.

ఆంధ్రసాహిత్యంలో ఆధునిక పురాణ రూపంలో కావ్యరచన చేయడం చాలా అరుదు. అట్టి కృతిని తలపెట్టి శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు ఎంతో రసవత్తరమైన మహాకావ్యాన్ని తెలుగులోకానికి ప్రసాదించారు, అది "నేటి" తెలుగులో ఉత్తమకావ్యము, సాహిత్య అకాడమీవారి 1965 సంవత్సరపు అవార్డు పొందిన కావ్యము. ఆ గుర్తింపబడిన ఔచిత్యము యీకృతిని మహాకావ్య మనిపించి ఆయనను మహాకవిని చేసినది. ఆయన ఇంకా చాలా వ్రాశారుకూడాను.

చరిత్ర కావ్యరూపాలలో ఒకటేకాని గద్యలో కాలానుక్రమంగా ఆయా కాలాలలో దేశాన్ని ఏలిన వంశాలూ జరిగినవృత్తాంతాలూ పొడిమాటలలో వ్రాసుకుపోతే అది రసవంతమైన సాహిత్యంగా పరిగణింపబడజాలదు. కథాకథనంమాత్రమే అవుతుంది. సాధారణంగా చరిత్రలు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చి యుద్ధాలు, రాజ్యవిస్తరణాలూ గెలుపులూ. ఓటములు ఇత్యాది వృత్తాంత వివరణములుగా మాత్రమే ఉంటాయి. ఇవి కృతకళాఖండాలుకావు. అదే పద్యరూపంగా భావప్రాధాన్యము దాల్చి చిత్రింపబడినప్పుడు ఒక స్థిరత్వమునొంది రసవంతమయిన కావ్యమవుతుంది. అందుకే పురాణ రూపమున చిత్రింపబడిన చరిత్రే ఎక్కువ గౌరవాస్పద మవుతుంది ఆకారణంచేతనే అనాది సిద్ధంగానున్న భారతజాతియొక్క సాంప్రదాయం పురాణాలనే గుర్తించిందికాని పొడిచరిత్రలకు తావియ్యలేదు. పొడిదేశచరిత్ర అన్నది రచయితల దృక్పథాలబట్టి ఒకదానికొకటి పరస్పర వైరుధ్యంతో అస్థిర వైఖరిని దాల్చిఉంటుంది. అలాంటి సంశయాస్పద చరిత్రనే మనదేశాన్ని పాలించిన పరప్రభువులు మనపైన రుద్ది ఎన్నో అనృతాలతో మన మనస్సులను కలతపరచి మనలను భావదాసులను చేశారు. పైగా అలాంటి చరిత్రరచనే మన భారతీయులకు తెలియదని అంటూ మనని అనాగరికులుగా చిత్రించి ఆక్షేపించారు. మన పురాణాలు పుక్కిటికథలనీఎంత మాత్రమూ నమ్మదగినవి కావనీ బోధించి మోసపుచ్చారు. ఆధోరణిలోనే మన విద్యావిధానం పరప్రభువుల ప్రభావంలో వక్రగతి నొందినది. కాని మనస్సును స్వతంత్ర వాతావరణం ఆకర్షించి స్వతంత్రాలోచనలు పొడచూపడంతో పురాణాలే నమ్మదగిన చరిత్రలనీ పరాయిలు మనకు కూర్చి చూపిన చరిత్రలు అబద్ధాలు, అస్థిరాలూ అని తెలుసుకున్నాము పురాణాలు కవికృత కళాఖండాలు. వట్టి వృత్తాంత సంపుటాలు కావు

చరిత్రను రసవంత మొనర్చి పద్యరూపమున స్థిరత్వమిచ్చిన పురాణగాథలే హృద్యములై నమ్మదగినవి, గౌరవింపదగినవని తెలుసుకున్నాం ఈ సందర్భంలో స్వర్గీయ ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు స్మరణీయులు. వారు తొమ్మిదిమాసములపాటు మాత్రమే మెరపుతీగ లాగున రాజమండ్రీ ప్రభుత్వ విద్యాబోధనాభ్యసన కళాశాలలో (Govt Training College) చరిత్రాధ్యాపకత్వం చేశారు. ఆపుణ్యకాలంలోనే నేనా కళాశాలలో ఎల్, టి(L.T.) ట్రైనింగు అవడం సంభవించింది.

దుగ్గిరాలవారితో ఆనాటి నాసహజీవనం నాజీవితంలో బహురసవత్తరమయిన అధ్యాయ మయింది. ఆ మహనీయుడు పటువైనమాటలలో వాదిస్తూ, భారత రామాయణ, భాగవతాది పురాణ గ్రంథాలే నిత్య సత్యాలనీ పాశ్చాత్యులు తెచ్చిపెట్టిన చరిత్రల నేవి అన్నీ అబద్ధాలూ, నిస్సారములు, చంచలములూ అని చమత్కారంగా విమర్శించేవారు, ఆంగ్లంలో ఆయనవ్రాసిన మాటలివి.

"Puranas are eternal varieties. Their characters and situations are permanent unchangeble truths. The so called Histories introduced by the westerners are either untruths or Half truths or unsteable truths varying with different historians.

అట్టి దుగ్గిరాలవారి వివరణము ఎంత యథార్థమో క్రమంగా నేటి భారతీయ చరిత్రకారులే గుర్తిస్తున్నారు. మనపురాణాలన్నీ నిజమయిన చరిత్రలు కావన్న భ్రమ నన్నావరించి ఉండేది. అది యిపుడు తొలగి పోయింది.

పురాణంలో కవి యథార్థ చరిత్రనే తీసుకొని వానిని రసవంతమొనర్చి పద్యరూపమున స్థిరత్వము నొసగి రమ్యమైన గాథగా చదువరులకు సమర్పిస్తాడు. అందుకే చరిత్రకు పురాణరూపం సుస్థిరమైన గౌరవాస్పదమయిన, చిరస్మరణీయమైన రూపమని చెప్పక తప్పదు

ఆంధ్రుల చరిత్రను ఆంధ్రపురాణముగా రచించిన శ్రీమధునాపంతులవారు ఆంధ్రలోకానికి అమూల్యమైన సేవచేశారు. మధురమైన శైలిలో తన కవితాచాతుర్యమును వినియోగించి చరిత్రాంశములకు ప్రాణముపోసి చరిత్రలోని యుగయుగాలను పర్వములుగా విభజించి, ఒకసుస్థిర రూపమున ఆంధ్రుల చరిత్రకు అపూర్వమైన విశిష్టతను సమకూర్చిన మహాకవి మనశాస్త్రిగారు.

ఆంధ్రదేశమును ఆయా కాలాలలో ఏలిన రాజ వంశములపేర్లు వరుసగా ఆయా పర్వాలకు వినియోగింపబడినవి, ఆంధ్రభూమిని స్వతంత్రరాజ్య స్థాపనమయిన తొలియుగాన్ని ఉదయపర్వమని వరుస వెంబడి 'సాతవాహనపర్వము', 'చాళుక్య పర్వము', 'కాకతీయపర్వము' 'పునఃప్రతిష్ఠాపర్వము' 'విద్యానగరపర్వము' 'శ్రీకృష్ణ దేవరాయపర్వము' 'విజయపర్వము', 'నాయకరాజపర్వము' అని నవ పర్వములలో ఆంధ్రుల ఉజ్జ్వలచరిత్రను ఎంతోరమ్యముగా సక్రమముగా చిత్రించుకొని వచ్చారు. ఆయా వంశకాలాల ప్రధానలక్షణాలను సరళమైన గేయ రూపంలో హృద్యములను చేసారు. ఈ పద్యాలు చదువుకుంటూ పోతూంటే మన చరిత్రవాహిని మధురగానము మ్రోగుతూఉన్నట్లు ఎంతో ఇంపుగా ఉంటుంది.

అవతారికలోనే కవియొక్క ప్రసిద్ధ వంశలక్షణమూ, ఆయన వ్యక్తిత్వపు సహజసౌమ్యతా, ఎంతగానో మనల్ని ఆకర్షిస్తుంది, ఆపరిచయమే మనహృదయాలను కట్టివేస్తుంది అల్లా ప్రారంభమయిన మనహృదయ స్పందన కావ్యాంతము వరకూ మనలనావహించి ఉంటుంది. ఆ కవితామాధుర్యం మనలను ఉన్మత్తులనుచేసి వేస్తుంది. అల్లా మన ఆంధ్రుల సుదీర్ఘచరిత్ర మనస్మరణ పేటికలో సుస్థిరమై పోతుంది, అందులకే మధువాపంతులవారి ఆంధ్రపురాణం మహాకావ్యమనిపించుకొంటున్నది.

—:o:—

మోదము

విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునకవి.

ఏతత్పురవరమున కథు । నాతన కవివర్య ! సత్యనారాయణ శా
స్త్రీ ! తెచ్చితివిటు సద్యశ । మాతత మోదంబు తెల్గులందఱి కబ్బెన్.

ఆంధ్రానందము

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

కాలగరుడి జనాహిభక్షణము సేయ । భరిత సుప్తాస్థికల నేరి చల్లి రసము
మేల్కొలిపితి వాంధ్రానంద మేర్పడగ న । వాభ్యుదయము మహాకవీ! వందనములు.

కర్రా చంద్రశేఖరశాస్త్రి

హిమ సంహతులు - బాడబదీప్తి । పాలకడలిపై పేరిన మీగడ
అధునా 'మధునాఫణితుల' చేరి । ముత్తెపు చిప్పను మొలచిన ఆణి
అమృతభాండ-మా-ఆంధ్రపురాణం । జయతు సుకృతితత్ రససిద్ధి !

మాష్టారూ !

ఎస్. వి. ఎల్. ఎన్. వరప్రసాద్

దీపించిన ఒక దశాబ్దపు వెనుకనుంచి
నా కవితా బాల్యక్రీడల క్రీనీడల వెలుగుల్లోంచి
'మాష్టారూ' అనే తెలిసీ తెలియని
ఒకానొక నాపూర్వార్ధంలో పరిచయమైన మీ శబ్దం
నాచే యిప్పటికీ వాక్కరత్నుల్ని పండిస్తోనే వుంది
నాపూహల్లో సిగ్గిల్లిన మృదువచన కవితా మాధ్వి
రాగిల్లిన మీ పద్యాల పెద్దముత్తైదువుల సరసన
వినమ్రంగా ఒదిగి కూర్చుని,
పృథువచః సౌందర్య రహస్యాలు వింటో
నవవధూటిలా కురుల్ని సవరణించుకుంటూనే ఉంది.

—o—

వెన్నెలలు

శ్రీ మధునాపంతుల సూరయ్యాశాస్త్రి

నవమల్లీకుసుమాప్తమై ప్రవిలసన్నాసాగ్ర ముక్తామణి
చ్ఛవి కాచార్యకమై మృణాళధవళచ్ఛాయా సహోదర్యమై
దివిషద్గాంగ నటద్ధునీ ప్రతిభటోద్వృత్తుల్ తగన్ నిత్య శు
భ్రవిలాసస్మిత మింపగున్ ధవళిమాద్వైతాకృతిన్ దల్లిరో!

ఒసఁగున్ నిర్మలమాయశమ్ము; కవితోద్యోగంబునన్ గెల్పు లిం
పెసఁగం జేయును; కల్మినిచ్చు; నెదలో నేదో పరీపాక మ
త్యసమాన స్థితిఁగూర్చు; సజ్జనుల బంధౌఘంబులం ద్రుంచు నో
ప్రసవిత్రీ! భవదంఘ్రిసేవ యొనరింపన్ రాని దేముండెడిన్.

భ్రమరీ శిక్షణదక్షదైశికము శోభామూలమా నీ కటా
క్షము కామాక్షి! నిమేషకాలమున మెచ్చంగా విపన్మోక్షమున్
సమకూర్చంగద! నిర్జరేశ్వర పురీశైవాలినీ వీచికా
క్రమ నీవీకరణప్రవీణమగు వాగ్ధారన్ బ్రసాదించుచున్.

కళలకుఁ గేళికాలయము కర్మకవీంద్ర మహావచస్సము
త్పలవన చంద్రికామధురధార శశాంక శిఖోదయస్త మస్తకో
జ్జ్వల కనకాద్రిధన్వి ప్రియభామిని యెన్నఁడు మాదుపేద క
న్నులకు సుధాంజనంబు నిడునో దురితంపుపొరల్ తొలంగగన్.

నతులర్పించె దమో చరాచరమయీ! నానాజగత్సృష్టి ద
ర్శిత సచ్ఛక్తిమయీ! దయామయి! దిశాసీమామయీ! చిన్మయీ!
గతి నీవే కదె! యో పరాపరమయీ! కల్యాణమాయామయీ!
తత విద్యామయి! నీకు 'వెన్నెలలు' మాతా! యో నిశాహర్మ్యయీ!

మూఢమానవ మమతాభి మోక్షణములు
శక్రమణిదీప్తి శిక్షా విచక్షణములు
రమ్యలోకత్రయీ రాజ్యరక్షణములు
తల్లిచూపులు వరదానదక్షిణములు.

'దేవీనవతి' తెలుగునుండి

తెనుఁగు భారతము : వచనోపక్రమము

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

ఆంధ్ర మహాభారతమున నన్నయభట్టారకుల యవతారిక యున్నది. ఆయన సర్వసిద్ధాంతముల కా యవతారిక ఆయువుపట్టు. లక్షణగ్రంథఘట్టముగా నున్న యీ భాగములో వ్యాఖ్యానతః విశేష ప్రతిపత్తి గోచరించుచునే యుండను. 'నహి సందేహాదలక్షణమ్' అవతారికలో రాజరాజనరేంద్రుని కొలువు నభివర్ణించుచు వ్రాయబడిన యొక వచన మున్నది. ఆ కొల్వునఁ గూర్చుండిన విద్వజ్జనులు అయిదు శ్రేణులుగా నున్నారు. ప్రథమశ్రేణి వైయాకరణులది. రెండవది భారత రామాయణాద్యనేక పురాణప్రవీణులైన పౌరాణికులది. మూఁడవశ్రేణిం దీర్చియున్నవారుమహాకవులు. నాల్గవ యైదవశ్రేణులకుఁ దార్కికులు వైణిక గాయకాదులు వచ్చిరి. ఇది నన్నయ భట్టారకులు సాక్షాత్తుగాఁ జూచి చెప్పిన రాజనరేంద్రుని సభాభవన ప్రాంగణములోని ఆసనశ్రేణీ పరిష్కరణము కదా! ఇక్కడ నొక చిక్కు.

ఒకనాఁడు సులతాను కొలువులో షాజీ పుత్రుఁడైన శివాజీకి అయిదువేల సరదారులు కూర్చున్న పంక్తిలోఁ బీఠము చూపఁబడెను మనస్వియగు శివాజీకి అది భరింపరాని పరాభవమైనది ఆ మహారాష్ట్ర నాయకుఁడు వారు చూపిన యాసనము కంటె ఉన్నతోన్నతమైన యాసనముమీఁదఁ గూర్చుండఁ దగినవాఁడనన్న ఆత్మప్రత్యయము కలవాఁడు. పీఠోన్నతి యన్నది యెత్తు పొడవు వెడల్పులనుబట్టి నిర్ణయింపఁదగినది కాదుకదా! తన పీఠముప్రక్క నెవరి పీఠము లున్నవి! ఆ పీఠములం దాసీనులగువారు ఎట్టితరహావారు! ఇది కదా ప్రశ్న. మాటలతో వేతే తుటారింప నక్కఱలేదు తన దృష్టికి వాఁడు విశిష్టుఁడుకాని తుల్యుఁడు కాని కానిచో, అట్టివానిప్రక్కఁ దనకుఁ బీటువేసిన పెద్దమానిసితోఁ దగవు తప్పదు. ఇదియొక యవమానముగా నొకఁడు పట్టించుకొనఁడు. ఒకఁడు పట్టించుకొనును. పట్టించుకొన్నవాఁడు ఆత్మగౌరవము కలవాఁడుగా విజ్ఞలోకములో నభినందితుఁడగుచున్నాఁడు. మొదటివాఁడు అమాయికుఁడేని, యోగియేని కావలయును.

లోకజ్ఞుఁడు సద్వినుతావదాత చరిత్రుఁడునైన నన్నయ రాజరాజు కొలువులో నేశ్రేణికిఁ జెందిన పీఠమున సమాసీనుఁ డాయెనో! యన్నది యొక వివిదిష. ఆ రాజరాజానురక్తుఁ డెచ్చటఁ గూర్చుండుఁగాక! పురస్కారమున కేమి కొదవ? ఇంతకు భట్టారక పీఠము అభివర్ణిత శ్రేణులకు భిన్నమైన యొక ప్రత్యేక స్థానమున నుండవలయును. ఆ స్థానము రాజమనోహరుని యంతరంగముకంటె నన్యముకాదు.

ఈ శ్రేణీకల్పనము వలన మనము గుఱుతింపవలసినది నన్నయభట్టారకుల హృదయము. ఆయనకుఁ బ్రథమాభిమానశాస్త్రము శాబ్దము. తరువాత మహాకవిత్వము. పదపడి తక్కినవి. ఈ క్రమములోఁ బూర్వపూర్వ మాయనకు గాఢాభిమాన విషయములు. తాను విపుల శబ్దశాసనుఁడు

'ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః' కనుక సభలో వైయాకరణశ్రేణిని ముందుంచుట జరిగినది. నన్నయ తాను బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుఁడు. రెండవశ్రేణిలోఁ బౌరాణికులను గూర్చుండఁజేసినది యీ విజ్ఞాన నిరతి. నన్నయ తాను మహాకవి యగునుగదా, మృదుమధుర రసభావ భాసురనవార్థ వచనరచనా విశారదుఁడైన మహాకవి యగునుగదా, ఈ మహా కవిత్వమునకు మూఁడవస్థానము నేల చేసికొనెను! అహంకార నిరాసార్థమా? ఆయన దృష్టిలో దాని కదియే స్థానము కావలయునా?

'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని యధ్యాత్మవిదులు వేదాంతమనియు నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని కవివృషభులు మహాకావ్యమనియు ఇత్యాదిగానున్న పద్యములో నీక్రమము మఱియు స్పష్టపఱచి భట్టారకులు చెప్పియున్నారు. ఇంతకంటె నక్కజముగా 'తన కులబ్రాహ్మణు ననురక్తు ననవిరళజపహోమ తత్పరు విపుల శబ్దశాసను సంహితాభ్యాసు' ఇత్యాది సీసములో నీక్రమము సువ్యక్త పడుచున్నది. విపుల శబ్దశాసనత్వము తరువాతఁ బురాణవిజ్ఞానము. తరువాత ఉభయభాషా కావ్యరచనము. ముమ్మాటు ఈరీతిగా శాస్త్ర-పురాణ కవిత్వకళల యొక్క క్రమత పూర్వపూర్వ విషయములపై తనకుఁగల తత్పరత భట్టారకులు చెప్పినట్లైనది. రాజశేఖరుఁడు కావ్యమీమాంసలో శాస్త్రకావ్యములు-కావ్యశాస్త్రములు-కేవల కావ్యములు-కేవల శాస్త్రములు-ఈ రకముగా విభజనము చేసెను. పరస్పరద్ధర్మానుశాసనమైన మహాకావ్యముగా ఆంధ్రభారతము నుపక్రమించుటలో భట్టారకుల మెలఁకువ తెలుఁగు సరస్వతి యలికమున విశేషక రచన యగుచున్నది.

ప్రాచీనశాస్త్రము లన్నియు నేశబ్దముతో నుపక్రాంతము లగుచున్నవి? అందుఁ గొన్ని మంగళార్థకమైన 'అథ'తో నారంభమైనవి. 'అథాతో ధర్మజిజ్ఞాసా'— 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' ఇట్లు పూర్వోత్తర మీమాంసా సూత్రములు ప్రవర్తిల్లినవి. 'అథ శబ్దానుశాసనమ్. కేషాం శబ్దానాం' ఇట్లు పాతంజల మహాభాష్యము. ఓంకారమునకు అథ శబ్దము సహోదరము. ఈ రెండును మాంగళికములు.

> ఓంకార శ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా
> కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాంగళికా వుభౌ॥

తత్త్వప్రాస్త్రాదియందుఁ బ్రయుక్తమైన యీ 'అథ' అవ్యయమై మంగళార్థకమేకాక అధికారద్యోతకము కూడ నగుచున్నది. నామలింగాను శాసనము దీని కయిదు అర్థములు చెప్పినది. మంగళము అనంతరము-అరంభము- ప్రశ్నము-కృత్స్నత— ఇవికాక 'మేదిని' దీనికి సంశయ మనునర్థము కలదనెను నన్నయ అవతారికలో పక్రమణమునకు అథ శబ్దార్థ విచారమునకు ఏమి సంబంధమందురు! 'అథ శబ్దార్థమునకు సరియగుతెనుఁగు అనియన్నది అథ వర్ణద్వయాత్మకమైనది. 'అని' యు నట్టిదే. అందును ఇందును అకారమే ముందున్నది. 'అథ' లోని థకారము తెనుఁగులో 'ని' వర్ణముగా దిగినది ఈ తద్భవతలో మనము సంతోషపడ వలసినది తవర్గను దాఁటకుండ జరుగుటయే. ఒకానొక ముచ్చటకుఁగాని యిందు మనకుఁ తద్భవతా

ప్రసక్తి యక్కఱలేదు. అథ అనంతర్యార్థకము. 'అని' యన్నదియు నట్టిదే. ఈ సంస్కృతాంధ్రావ్యయములు రెంటికీ ఇంత బలిష్ఠమైన బాంధవ మున్నది.

నన్నయభట్టారకులు దేశభాషాకృతి రచనము దేవభాషాశాస్త్ర సంప్రదాయానుగతమైనది. ఆంధ్ర మహాభారతము 'అని సకలభువన రక్షణప్రభువులై యాద్యులైన హరిహర హిరణ్యగర్భ పద్మోమా వాణీపతుల స్తుతియించి తత్ప్రసాద సమాసాదిత నిత్యప్రవర్ధమాన మహామహీరాజ్య విభవుండును నిజభుజ విక్రమ పరాజితారాతిరాజ నివహుండును నఖిల జగజ్జేగీయమాన నానాగుణ రత్నరత్నాకరుండునై పరగుచున్న రాజరాజనరేంద్రుండు"

అను వచనముతో నుపక్రమింపఁబడుట చూడఁగా పూర్వోత్తర మీమాంసాది శాస్త్రములవలె అథశబ్దసహోదరమైన 'అని' మున్మొదటఁ బ్రయుక్తమయ్యెనని విజ్ఞులు తెలిసికొనియుందురు. ఆంధ్ర మహాభారత మిటులు భట్టారకుల యుపక్రమణ సంప్రదాయముతో శాస్త్రమై కవివృషభులకు మహాకావ్యమగుచున్నది. మహాకావ్యమైనపుడు కావ్య ప్రయోజనము ఆదియందు సూచింపఁబడవలయును గదా! 'ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశములలో నే యొకటియేని యుండవలెను ఒకటికాదు, మూఁడింటికి మఱియగు గద్యమే ఆద్యప్రయుక్తమైన దన్నచో నన్నయగారి హృదయము నారాధించుట యగును.

తొలివచనమున హరిహర హిరణ్యగర్భులకు నమస్కారముచేయఁబడుట- తత్ప్రసాద సమాసాదిత... అనుటవలన రాజనరేంద్రునకు ఆశీస్సు లొసఁగఁబడుట గోచరమగుచున్నది, మఱి వస్తు నిర్దేశము! అది యెక్కడనో కాక ప్రథమతః ప్రయుక్తమైన శబ్దములోనే యున్నదని నా చేయుచున్న మనవి. నన్నయ తాను పాకశాసని, భారత ఘోరరణమున నుద్యతుఁడై దుష్టశిక్షణసాధుభువన రక్షణములు జరుపవలసినవాఁడు, నారాయణ సహాయుఁడైన యీ నరునితో ధర్మము మహాభారతమునఁ బ్రతిష్ఠితమైనది. దుష్టనిగ్రహమునకు సంగ్రామము వలసియున్నది భారత సంగరము జరిగినచోటు కురుక్షేత్రము ధర్మక్షేత్రము. 'భారం సంగ్రామం తనోతి విస్తారయతి' అని భారతమునకు వ్యుత్పత్తి చెప్పుదురు. ఇంతకు తేలినది భారతవస్తువు సంగ్రామము. నన్నయగారు ఆయోధనార్థకమైన అని శబ్దము నాదిలోఁ బ్రయోగించి వస్తునిర్దేశము నెంత గుప్తము గావించినారో యిపుడు విచారింపవచ్చును.

'యథాయుధానాం కులిశ మింద్రియాణాం
యథామనః ।
తథేహ సర్వశాస్త్రాణాం మహాభారత
ముత్తమమ్ ॥ మార్కండేయపురాణం.

మంగళార్థకమైన అథ శబ్దమువంటిదే యగు 'అని' తో మహాభారతారంభమగుట— అదికాక వస్తునిర్దేశ కరణోద్దేశమున సంగ్రామార్థకమగు 'అని' తో సమారంభగుట- చూడఁగా. తెనుఁగుభారతమును శాస్త్రముగా మహాకావ్యముగా నాంధ్రులకు అనుగ్రహించెడితలంపు నన్నయమహర్షి కుండె? 'అక్షరాణా మకారోస్మి' అనికదా భగవద్వచనము.

ఆంధ్ర మహాభారతము వంటి సారస్వత ప్రథమావతారము ఛందోబంధేతరమైన అని సకలభువన రక్షణేత్యాది వచనముతో నారంభింపఁబడెనా? మఱి—

శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహంత్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవామ్ ।
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజ భవ శ్రీకంధరా శ్శ్రేయసే।

మూర్తిత్రయస్తవాత్మకమైన యీ శ్లోకముమాట యేమైనది! ఇది యాంధ్రపద్యము కాలేదు అంతరంగకృతమైన కవిప్రార్థనము శిష్యశిక్షకు గ్రంథాదినుంచుట యాచారము కదా! తెమఁగు భారతము అచ్చముగా ఎచ్చటనుండి యుపక్రాంత మయిన దనఁగా నాయొద్దనుండియే యని కొట్టవచ్చినట్లు గ్రంథారంభ సర్వసముదాచారగుంఫితమైన తొలి వచనమే చెప్పుచున్నది పంచమవేదము నాంధ్రీకరించునపుడు ఛందఃపురస్కారము విధిగా జరుగవలసియుండగా గద్యారంభము శాస్త్రసంప్రదాయ సుందరమైన భట్టారకుల హృదయమును పట్టి చూపుచున్నది, అయన గద్యపద్యములకు తుల్య ప్రతిపత్తి యిచ్చిన మహాకవి. ఏనాఁటికిని ఛందః ప్రసన్నమయిన తెనుఁగు పద్య గద్యములకు నన్నయగారిదే ఆద్యస్థానము. తెలుఁగు భారత సరస్వతి గద్యపద్య స్వరూపిణి,

యా వర్ణపద వాక్యార్థ గద్యపద్యస్వరూపిణీ
వాచి నర్తయతుక్షిప్రం మేధాదేవీ సరస్వతీ !

శ్రీ శంకరులు

—o—

నన్నయ తిక్కనలు - అవతారికల తెన్నులు

ఇరువురును రెండు మహోన్నత శిఖరములు. మొదటివానిది ఋషిమార్గము. రెండవవానిది రసమార్గము. కాలపరిణామము కవితాపరిణతికి సూచకము. భట్టారకులవారికి సోమయాజులవారికి నడుమనున్న కాలము రెండు దశాబ్దులకు మించినది. నన్నయ యనూదిత భారతశేషము విరాటాదిగఁ దిక్కన యాంధ్రావళి మోదమునకుఁ దెనుఁగు చేసెను. నన్నయాత్పూర్వము చెప్పఁదగ్గ తెలుఁగు సాహిత్యము బయలుదేఱలేదన్నచో, కాళిదాసాది సంస్కృతమహాకవుల రచనలు నన్నయకు ఉపజీవ్యము లయ్యెనని చెప్పకతప్పదు నన్నయకుఁ గాళిదాస ప్రభృతు లనుకార్యులనుటవలనను, తిక్కన సోమయాజికి నన్నయ ఉపజీవ్యుఁ డనుటవలనను వారివారి స్థానగౌరవములను లాఘవపఱచుట కాదు.

సోమయాజి నన్నయ భారతకృతి సారమును అవతారికను పురోడాశమువలె సేవించిన పుణ్యపురుషుఁడు. నన్నయ భారతావతారిక తీరు తిక్కన నాఁటి కొక గడుసు మెఱుఁగుదేఱినది. అట్లే లోపలి రచనయు. రాజరాజనరేంద్రుఁడు భారత శ్రవణాసక్తి సందర్భము సర్వము నన్నయ పరోక్ష పరిభాషణ ఫణితిలోఁ జెప్పెను. సోమయాజి ప్రత్యక్షసంభాషణ ఫక్కిలోఁ దన కృతిరచన హరిహరనాథ ప్రసక్తి చెప్పుకొనెను. ఈ ప్రత్యక్ష పరోక్ష కథనవిధానములలో నన్నయ తిక్కనల దెవరిమార్గము వారిది. నన్నయ మంగళశ్లోకానంతరము ఆఱు గద్యపద్యములలో రాజరాజు గుణాకృతి విశేషములు వర్ణించెను. మంత్రి పురోహిత సేనాపతి దండనాయకాది పరీతమగు నిండుఁ గొలువులో సుఖోపవిష్టుఁడై చళుక్యాన్వయాభరణుఁడు '......నిత్య సత్యవచను మత్యమరాధిపాచార్యు సుజను నన్నపార్యుఁ జూచి' యిట్లు పలికెనఁట. 'నన్ను నన్నపార్యుఁ జూచి' అని చెప్పుకొనవలసి యుండియు, అస్మచ్ఛబ్దప్రయోగము అహంతాస్ఫోరక మగునని కాఁబోలు. పరోక్షపద్ధతిలో నన్నయ వ్రాసికొనిపోయెను. 'నేను' శబ్దముతో అంటిముట్టకుండుట పెద్దల భాషణాచారములో నున్నది. 'మీ పేరేమి ?' అని యడిగినపుడు 'రామయ్య యందురు.' 'కామన్న యందురు' అను వృద్ధ వ్యవహారము క్రమముగా నిపుడిపుడు దూరమగుచున్నది. తురీయాశ్రమస్థులైనవారిలో కొందఱు 'నేను' నకు బదులుగా 'వీఁడు' వాడుకొనుట నేఁడును వినుచున్నాము.

ఆచారౌచిత్యమునకు జీవగఱ్ఱ యనఁదగునన్నయ కృత్యాది తానై సంతరించుచున్నను చాటుననుండి పరోక్షభాషణము చేయించెను. అని యానతిచ్చిన విని యక్క-విపరుం డిట్లనియె'— నానారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహాభారత సంహితారచన బంధురుఁడయ్యె— 'నన్నపార్యుఁ జూచి యిట్టులనియె'— ఈ తీరున అవతారిక నన్నయ ఆత్మలక్షణమునకు దర్పణము, ఇట్టి పరోక్షపద్ధతి ఆధారము చేసికొని యొకరెవరో అవతారికలోఁ గొంతభాగము నారాయణభట్టు వ్రాసి యుండునని చమత్కరించినారు. నేఁడు పానుగంటి వారి నాటకములు కొన్నిటికి కూచి నరసింహము

గారి నాందీప్రస్తావన రచన లున్నవేఁటు! ఇది యట్టిది కాదు.

నన్నయ నాఁటికిగల పరోక్షకథన విధానము తిక్కననాఁటికి ప్రత్యక్షకథనముగాఁ బరిణతమైనది_ సోమయాజి 'పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్', 'ఒక్కనాఁ డిట్లని వితర్కించితి'– 'నన్ను నాకర్షించి కొలిపించుకొని'— 'ఏనును భక్తిమయంబగు'— 'నాపుట్టు కృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడ నైతి'— నేర్చిన భంగిఁజెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్'— మహాకవిత్వ దీక్షావిధినొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్'— ఏవం విధముగా అస్మచ్ఛబ్దములతో, ఉత్తమ పురుషలతోఁ గృత్యాది గ్రుచ్చియెత్తెను తెలుఁగుమీఁటిన యానాఁటి కీతిరు అహంకార ద్యోతకము కాదన్న మాట.

నన్నయకు మున్ను సంస్కృత సారస్వతమునకుఁ గల విలువ తెలుఁగునకు లేకుండెను. అమరభాషా మర్యాదలు గౌరవించు భట్టారకుఁడు దైవప్రార్థన తద్భాషలోనే రచించి సంతుష్టుఁడయ్యెను; 'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ...' ఇత్యాది.

తిక్కననాఁటికి దేశభాష దేవభాషా సహపీఠమున ఆసీనురాలయ్యెను. 'శ్రీ యన గౌరినాఁ బరగు...' ఇత్యాదిగఁ దిక్కన పరతత్త్వ ప్రశంస తెనుఁగుననే జరిగెను. నిర్వచనోత్తర రామాయణమున 'శ్రీరాస్తాం'— ఉండుఁగాక! భారతకృత్యాదిలోఁ దిక్కనయుఁ దన కిశోరదశలోని శ్లోకము 'కమస్థి మాలాం కిము కౌస్తుభం వా పరిష్క్రియాయాం బహుమన్యసే త్వం, కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం తవ స్వాదు వద ప్రభో మే' అన్న దానిని సందర్భింపఁజేసెను. "శ్రీవాణీ..." శ్లోకముతో నన్నయ త్రిమూర్తిస్తవము నే యుద్దేశమునఁ జేసెనో, తత్సబ్రహ్మచారియగు నుద్దేశముతోనే తిక్కన 'కిమస్థిమాలాం...' శ్లోకముతో హరిహరనాథస్తుతిచేసి యుండును. ఇరువురును ఉభయకవిమిత్రులు; ఉత్తమశ్లోకులు.

సోమయాజి కృత్యాదిలో నొక వైలక్షణ్యము! తాను కలగాంచును. కలలో, తనతండ్రి కొమ్మన కనఁబడి హరిహరనాథుని గూర్చి పరిచయము చేయును. హరిహరుఁడు 'కృతిపతిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ!' అనును తిక్కనగారి స్వప్నము సత్యార్థగంధి.

అక్కడ రాజనరేంద్రుఁడు తానై నన్నయను తెనుఁగులో భారతము రచింపవేఁడెను. రాజరాజు అన్నది యింతే: '..భారత బద్ధనిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్, భారతము తన కంకితముగా నిమ్మని యతఁడు తేలలేదు. హరిహరుఁడో! కృతినర్థించి వచ్చితినసెను. వాస్తవమునకు రాజరాజునకుఁ గృతిగ్రహణకాంక్షయు నుండదా? రచియింపుమనుటలో రచించి నా కంకితము సేయుమను నర్థము ప్రతీయమాన మగుచున్నదా? నన్నయ లోకజ్ఞత అవతారికలో బహుముఖముగా గోచరించును.

తిక్కన అవతారికలోని విలక్షణతలలో స్వప్నప్రసంగమొకటి. షష్ఠ్యంతములును గ్రొత్తలు. సోమయాజి పిదప కొందఱు ప్రబంధకారులు కలలు

గాంచిరి. షష్ఠ్యంతములు సరేసరి షష్ఠ్యంతములు లేనిచోఁ బ్రబంధమే కాదనునంతటి గాఢప్రచారము వానికి వచ్చినది. కృతిపతి వ్యవహారమునఁ గాక సంస్కృతకావ్యమున ఈ పద్ధతి యొక మాదిరిది. శైశవేఽభ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణాం వార్ధకే మునివృత్తీనాం... రఘూణామన్వయం వక్ష్యే— రఘువంశము తెలుఁగువారి షష్ఠ్యంతములకు దిగ్దర్శినియైన దనవచ్చును. సోమయాజి యెత్తుగడలలో షష్ఠ్యంతముల కవిరళ ప్రచారము, స్వప్నసంగతికి విరళప్రచారము చేకూరినది.

నన్నయ భారతము రాజరాజునకు వినిపించెను. తిక్కన హరిహరనాథునకు భారత మంకితము చేసెను. "పట్టు కృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడనైతి' నని జన్మచారితార్థ్యమును తిక్కన లెక్కించుకొనెను. నన్నయ కటులుకాదు 'అమలిన తారకాసముదయంబుల నెన్నను సర్వవేద శాస్త్రముల యశేషపారము ముదఁబునఁబొందను. ...భారత భారతీసముద్రము దరియంగ నీఁదను విధాత్ర్యనకైనను నేరఁబోలునే!' అను సంశయమాయన యంతరంగమున నున్నది. రెండున్నర పర్వములకు మాత్రమే పర్యాప్తమైన తనభవిష్యము తొలుతనే తలపోసికొన్నాఁడు. 'హృదయాహ్లాది విరాటపర్వముల నుద్యోగాదులుం గూడఁగా బదునేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై యొప్పఁగాఁ దుదిముట్టన్ రచియింపుటొప్ప బుధసంతోషంబునిండారఁగన్' ఇట్టిది తిక్కనగారి విశ్వాసము సాధారణముగాఁ గృతికర్త కృత్యారంభమున మంగళపద్యములు కొన్ని వ్రాసి, కృతిసమాప్తి చేసి, పదపడి కృత్యాదికి మరలవచ్చి మఱికొన్ని చేర్పులు చేయుచుండునేమో! నేఁడు కృత్యాద్యవస్థలు లేవు. నన్నయ కృత్యాది మున్ముందరనే రచించి యుండును. తిక్కన కొంతముందు, కొంత వెనుక వ్రాసియుండెనేమో!

నన్నయ తన పూర్వవంశీయులను గూర్చి కాని, తలిదండ్రులను గూర్చికాని యేమియుఁ బ్రసంగింపలేదు. ఆపస్తంబసూత్రుఁడనని, ముద్గలగోత్రుఁడనని చెప్పుకొనెను. తిక్కన తన తండ్రి గుణవిశేషము సమగ్రముగాఁ బేర్కొనెను. 'తన కులబ్రాహ్మణు' మున్నగు సీసములో నన్నయ నిజవిశేషములు వెల్లడించెను. తిక్కన తన తండ్రినిగూర్చి యొక సీసము వ్రాసెను. ఇష్టదేవతాభ్యర్థనములో నన్నయది తనివితీరని శ్రద్ధ. 'హరిహరాజ గజాననార్క షడాస్య మాతృసరస్వతీ గిరిసుతాదిక దేవతాతతికి' ఒక గ్రుక్కలోఁ బ్రణతిపారము చెప్పినాఁడు. విద్వత్సంస్తవనీయభవ్యకవితావేశుండు... మున్నుగా భారతి ప్రశంస నవీనముగాఁ జేసెనేకాని, ప్రత్యేకించి అజగజాననాదుల స్తుతికిఁ పద్యము వ్రాసినవాఁడు కాలేదు. తిక్కన. 'విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్' అని చెప్పిన తిక్కనకు భట్టారకుఁ డొక బ్రహ్మ.

నన్నయ భారతావతారికలోని భూయోధర్మము తిక్కన యవతారికలో నున్నది. రెండును పుష్పవంతులు ఒకనికవిత ప్రసన్నకథా కలితము. వేఱొకనిది ఊర్జిత కథోపేతము; ఒకఁడు నానారుచిరార్థసూక్తినిధి; వేఱొకఁడు నానారసాభ్యుదయోల్లాసి. ఒకఁడు జగద్ధితమునకు భారతము వ్రాసెను: వేఱొకఁడు బుధసంతోషమునకు భారతము వ్రాసెను.

ప్రథమునిది కర్మభావన. ద్వితీయునిది బ్రహ్మభావన నాదృష్టికిటులు తోఁచును, "అమల సువర్ణ శృంగఖురమై..." భారత బద్ధస్పృహులగువారికి నెప్పుడు బహుయాగంబుల ఫలంబు పరమార్థమగున్'— నన్నయ విశ్వాసము తాదృశము.

'జనన మరణాదులైన సంసార దురితములకు నగపడకుండగఁ దొలఁగు తెరువుగను వెలుంగు నీకిచ్చితి' మన్నగునవి సోమయాజి బ్రహ్మభావనకు సూచికలు. పరమార్థతః కర్మబ్రహ్మభావనైక్యము చెప్పఁబడునుగదా! తెలుగు సారస్వతమున నన్నయ తిక్కనల భారతావతారికలు పూర్వోత్తర మీమాంసలకుఁ బ్రతిచ్ఛందములు. భట్టారకులది జైమిన్యంశ. సోమయాజులవారిది ద్వైపాయనాంశ. తెలుఁగు కవులపాలిటికి వారు ధర్మబ్రహ్మదర్శన కారులు.

—o—

నన్నయ తిక్కనల గద్య పద్యములు

నేఁటికిని కొన్ని పల్లెటూళ్ళలో నిత్యము పురాణ శ్రవణము జరుగుచుండును భారతమో రామాయణమో ఒకరు చదువుట, ఒకరు అర్థము చెప్పుట సాధారణముగా నలవాటు. సహపాఠక నిరపేక్షముగా సాగెడు పురాణములు నుండును. అనఁగా పాఠకుఁడు వ్యాఖ్యాతయుఁ దాన. పట్టణమందలి పౌరాణికులు సాధారణముగా అసహాయులుగానే యుందురు.

నేను పెరిగిన పల్లెటూర తెలుఁగుభారతము పురాణముగా చెప్పఁబడుచున్నది పాఠకుఁడు వేఱు. పౌరాణికుఁడు వేఱు. పాఠకుఁడు నాటరాగములో ప్రార్థనాదికముచేసి ఘట్టముతీసి పద్యము పాడెను. రాగరంజితముగా విసరి చదువుటలో, ఆచదువునది వచనమైనను పద్యముగానే సామాన్య శ్రోతకు భాసించెను. రసానుగుణమైన రాగముతో పాఠకుని పద్యాంతస్వరమున శ్రుతికలిపి పౌరాణికుఁడు 'అర్థము' పాడును మరలఁ బాఠకుఁడు చదివి పాడును. పౌరాణికుఁడు అర్థము చెప్పును. రాత్రి వేళ సద్దుమణఁగి యున్నది. పురాణశ్రోతలు తన్మయావస్థకు వచ్చుచున్నారు ఘట్టము ఆదిపర్వము లోనిది. నన్నయగారిది అచ్చటి గద్యమును బద్యమువలెనే రాగములోఁ గలిపి పాఠకుఁడు పాడఁగా. గుటికి బారెఁడు ఇంచుమించులో అది పద్యమేమో యన్నసవి నాచెవికిఁ దగిలినది. "అది యేమి పద్యమయ్యా" అని పాఠకు నడిగితిని అతఁడు కవిత్వపుఁ గర్మమునఁ న్నిపుఁ దగుటచే 'వ' అని పద్యముఖమున న న్నదని జవాబుచెప్పినాఁడు. 'ఓహో! వచనపద్యము కాఁబోలు!' అని నవ్వుకొంటిని. పురాణరాగ సమ్మేళనముతో నన్నయగారి గద్య పద్యములకు అద్వైతము ఆ పాఠకుఁడు నాఁటిరాత్రి బోధించినట్లైనది. తరువాత గ్రంథము నందుకొని ఒకఁడొకఁడు చదువుకొని పోవుడును గదా! అబ్బురపాటుతో నానందము! ఆ ఘట్టమిది:

'వ. నీవు బ్రాహ్మణుండవు నీ వెద్దిసేసిన సేసీక చను లోకహితుఁడ నయిన నాకు శాపంబిచ్చి లోకంబులకెల్లఁ జెట్టసేసితి వదెట్లనిన...'
(ఆది. ౧.౧౪౦)

ఇందు పూర్ణబిందువులు రెండు అరసున్నలుగా మార్చి, మూఁడవ పాదములో యతిభంగమున కోర్చి, రెండవచరణములో సూర్యగణముచేర్చి. నాల్గవపాదములో రెండక్షరములు తొలఁగించి చూచినచో 'ఆటవెలఁది' యైనది. ఇదిగో!

నీవు బ్రాహ్మణుఁడవు నీ వెద్దిచేసిన
నీక చనును (గాక!) లోకహితుఁడ
నయిన నాకు శాపమిచ్చి లోకంబుల
కెల్లఁ జెట్టచేసి తెట్టులనిన.

అది యాది, సర్వదా నన్నయగారి గద్యము లీదృష్టితో పరిశీలించుకొనుట యగుచున్నది. ఆయన ఆంధ్రవాఙ్మయమునకు ఛందోవతారకము. గురు పద్యవిద్యకు నాద్యుడు వాల్మీకి అక్కడ నెట్లో, ఇక్కడ భట్టారకుఁ డటులు. తిక్కన విద్యాదయితుం' దని భట్టారకు నుట్టంకించుటలో రహస్యము పద్యవిద్యకుఁ జెందినదే.

క్షేమేంద్రుఁడు తన 'కవి కంఠాభరణము 'నఁ గవితాభ్యాసము కావించువారి కోసము కొన్ని దారులు ఏర్పఱచినాఁడు ఛాయోపజీవి, పాదోపజీవి, పద్యోపజీవి, భువనోపజీవి— ఈ తీరులయిన తరగతులు కల్పించి మూదలించినాఁడు. అది తలఁపునకు రాఁగా; నన్నయ గద్యములు కొన్ని వేరుగా నేటి యొసఁగి ఆపదములతో అలఁతియలఁతి మార్పు చేర్పులు చేసికొనుచు గీతాది పద్యములుగా వ్రాయఁజూడు డని కొందఱు పద్యవిద్యార్థులకు మచ్చులు చూపి చెప్పితిని. అభ్యాసికమైన నిపుణతతో ఈ పద్ధతి లెస్సగా నున్నదని వారి యనుభవము వారు చెప్పిరి. దీని సారార్థము : నన్నయ భట్టారకుని ప్రతిగద్యము ఛందోనిర్బంధ మధురమైన పద్యముగా నుండుననియే. అన్నింట నొక శ్రుతి మోహనమైన రాగచ్ఛాయయున్నటులే తోఁచును.

(౧) అట్టియెడ కద్రువయు వినతయు వినోదార్థంబు విహరించువారు కరిమకర నికరాఘాతజాత వాతోద్ధూత తుంగతరంగాగ్ర సముచ్ఛలజ్జల కణాసారచ్ఛటాచ్ఛాదిత గగనతలంబైన దాని నుద్యానంబునుం బోలె బహువిద్రుమ లతాలంకృతంబైన దాని...'

(౨) వానిం జూచి కాని కడువనోల్లనని దేవయాని యేడ్చుచున్నఁ బెద్దయుఁ బ్రొద్దునకుఁ బ్రసన్నుండై శుక్రుండు తన యోగదృష్టిం జూచి లోకాలోక పర్యంతభువనాంతరంబునఁ గచుం గానక సురాసమ్మిశ్ర భస్మమయుండై తన యుదరంబున నున్న యక్కచుం గని...'

(౩) 'అదియును నూఱుయోజనంబుల వెడల్పును నూఱుయేఁబది యోజనంబుల నిడుపును నేను యోజనంబుల తనర్పునుం గలిగి వైహాయసంబయి కామగమనంబయి వ్యపేతశీతాతపంబులు సకల కాలకుసుమ ఫలభరిత పాదపవన సంకీర్ణసరోవర విరాజితంబయి తపఃప్రభావంబున నమరేంద్రుచేత నిర్మితంబయి కరంబొప్పుచుండు నట్టి సభయందు..

(౪) వ. 'అట్టి యవసరంబున ద్వారవతినుండి యాహుక ప్రేషితుండయి యొక్కరుం డతిత్వరిత గతిం బఱతెంచి సాల్వుచేత నక్కడ వసుదేవుండు పట్టువడియె...' (అరణ్య-౧.౧౯౦)

ఈ వచనము గీతగమనము కలది. ప్రథమ చతుర్థ చరణములయందు ఒక్కొక్క యక్షరము చేర్పవలసియుండును, యతిమైత్రి చూడరాదు.

గీ. అట్టి యవసరంబున(ను) ద్వారవతినుండి
యాహుకప్రేషితుండయి యొక్కరుం డ
తిత్వరితగతిం బఱతెంచి సాల్వుచేత
నక్కడ(న్) వసుదేవుండు పట్టువడియె.

(౫) దానవభస్మసాత్కరణ దారుణము ...
(అరణ్య ౧ ఆ.౧౯౩)

ఏను సముద్రతీరంబున సాల్వుతోడం బది నెలలు యుద్ధంబుసేసి వాని వధియించుపోంటె నక్కడ మసలితి నది కారణంబుగా మీకు దుర్వ్యసనావసరంబున నబ్ధ సన్నిధానుండనయితి నదియెట్లని యుధిష్ఠిరుండడిగిన నాతనికి సాంభకాఖ్యానంబు సవిస్తరంబుగాఁ గృష్ణుం డిట్లని చెప్పె...

(ఆది. 1 150 వ)

ఈ చివరి వచనము ఉత్పలమాలలో వ్రాయఁగుదురును. ఏను సముద్రతీరమున నెంతయు సాల్వునితోడఁ బోరియున్ వాని వధించుపోంటె

.. .. సౌంధికా ఖ్యానము ... ... ఈ రీతిని ప్రాసస్థానములుకూడ ఈ వచనమే సూచనము చేయుటలేదా !

(౬) మఱియు సారథింజూచి విహ్వల మానసుండయి యిట్లనియె. (అరణ్య 1 169)

'మఱియు సారథిఁజూచి విహ్వలమానసుండయి యిట్లనెన్'—ఇది సరళవృత్త చరణగతిలో సాగిన వచనము.

(౭) అగ్నిభట్టారకు ననురూప శుభవచనంబులు (ఆది. 2,250)

ఈ వచనము నన్నయభట్టారకు ననురూప శుభ వచనంబులకుఁ బౌనరుక్త్యముగా నున్నది.

అగ్నిభట్టారకుఁడు, విష్ణుభట్టారకుఁడు, భర్గభట్టారకుఁడు, అని పెక్కుచోట్ల నన్నయభట్టారకుఁడు ఉపయోగించెను, పూజ్యార్థకమైన యీ భట్టారక శబ్దము వాడఁబడిన పట్టులనెల్ల నన్నయగారి ఆత్మసమాశ్రయమైన కవిత్వమూర్తి సహృదయులకు చక్షురాతిథ్యము చేయుచునే యుండును.

భటతీతి భట్టః వాగ్మి భట పరిభాషణేతన్ ప్రత్యయః = పూజ్యః

దండి, భట్టబాణుఁడు, సుబంధుఁడు మున్నగు సంస్కృతకవులవియు, ప్రాచీనాంధ్ర ప్రబంధాతర్గతములైనవియునగు గద్యములలోఁ గొన్ని పద్యశైలీకములు లేవా ! యనవచ్చును. ఉండవచ్చును. కేవల వచనకృతులుకాక చంపూఫణితిలో నున్న కృతులు చూచినపుడు పద్యముప్రక్కనున్న గద్యమెట్లునడచినది? గద్య పద్యముల తూకమెట్లున్నది? మొగ్గుతగ్గులెట్లున్నవి ! మనము పరామర్శింపఁ గలుగుదుము. కేవల వచనకృతులలో, కేవల పద్య కావ్యములలో ఈరీతి విచారమున కవకాశము లేదు

ఇక్కడ విశేషము, నన్నయగారి గద్యపద్యము లొకే గ్రుక్కలో దిరుగును. పద్యములోని నాద మే స్థాయిలో నుండునో దానివెంటనున్న గద్యమున కదేస్థాయి నాదము. కవిత్వములో నదియొక గాంధర్వవిద్య. ఎక్కడ నేవృత్తము వ్రాయవలెనో ఎత్తుకొన్న గద్యము ఎంత పరిమాణములో నుండవలెనో పద్యగద్యముల సంధులెటులు తీర్పవలెనో ఏతాదృశ రచనా రహస్యవిద్యా సమున్మీలనమునకు నన్నయ మూలశిల్పి. ఆంధ్రకవిత్వ విశారదుం'డన్న వెంట 'విద్యాదయితుం'డని తిక్కన చెప్పుటలో నుద్దేశమేమి ? గద్యపద్య రచనావిద్యకు ఆయన దయితుఁ డనుటయేకదా !

ఇఁక, తిక్కనగారి పద్యము లించించుక మార్చుకొనుచు వచనశైలిలో వ్రాసికొనిపోఁగా నదియొక మహాగద్య గ్రంథము. శ్రీ వీరేశలింగముగారికి 'గద్యతిక్కన' యను బిరుదమున్నది. దానికి దాత యెవరోకాని మంచి పరిజ్ఞాత. తిక్కనగారు ప్రత్యేకమైన వచనగ్రంథము వ్రాసినవారుకాదు, పయి పెచ్చు నిర్వచనముగా నుత్తరరామాయణము వ్రాసెను. మఱి, భారతములో నడుమ నడుమ గద్యములనుబట్టి యతఁ డందు లోకోత్తరుఁడనియుఁ వీరేశలింగముగారు నేఁడు తిక్కనవంటి వాఁడనియు ఈ బిరుదమునకుఁ జెప్పవలసిన యన్వర్థతయగునా? ఇట్లు తోఁచుచున్నది.

నన్నయ పద్యవిద్యకువలెనే, తిక్కన గద్య విద్యకు ఆద్యోపదేష్ట. నన్నయ గద్యమును సైతము

పథ్యముగా పాడిచూపించెను. తిక్కన పద్యములో వ్యక్తవాఙ్మధురమైన గద్యము నుపన్యసించెను. వారి గద్యపద్యములు రెండునుగలసి మహాకవిత్వము. ఆంధ్రకవిత్వ విశారదత్వమున వారిరువురు సగర్వ్యులు. పద్యము ఫలభూమి. గద్యము కర్మభూమి యైనచోఁ గర్మభూమినుండి ఫలభూమికిఁ జేర్చువాఁడు నన్నయ. దేవభూమిని తెలుఁగు పుడమిలోఁ దిలకింపఁజేసినవాఁడు తిక్కన. నాకలోకవాసియైన తండ్రిని తనదగ్గఱకు రప్పించుకొనఁ గలిగినాఁడు.

తిక్కన గద్యశైలీరీతి యెట్టిది ! సమాపకక్రియాపదబాహుళ్యము ఆయనరచనలో నొకయొడువు. గొలుసుకట్టుతనమునకు క్త్వార్థకము లుపయోగించుచు, తిక్కన యెక్కడికక్కడ తెగదెంపులు చేయును. సుదీర్ఘవాక్యములు చేయఁడు. మహామంత్రిగా నుపన్యసించుచున్న రీవి ఆయన పద్యగద్యములలోఁ గనఁబడును ఆధునిక కాలమున వచనరచనలో నెన్నో పోకడలు వచ్చినవి. ఆయన్నింటికి నాదిశిల్పము తిక్కనగారిది. ఈ పద్యము చూడుడు.

> తప్పి జనించె; వ్రేళుల పుటంబులు పొక్కఁ
> దొడంగె; గోళ్ళలోఁ
> జిప్పిలఁజొచ్చె నెత్తురులు; చిత్తము నాకుఁ గడు
> న్వశంబుగా;
> తప్పుర మిచ్చటిచ్చటను నాసలవచ్చితి; నెంత
> దవ్వొకో ।
> యిప్పటిభంగి నొక్కడుగు నేఁగెడుదానికి
> నోర్వ నెమ్మెయిన్.

ఈ పద్యమున అఱు-ఏడు సంపూర్ణక్రియలున్నవి. ఒక్కొక్కటి ఒక్కొకవాక్యము. ఇది ఛందస్సులోఁ జూపించిన యొక సుకుమారమైన గద్యపద్య, నేఁటి నిపుణుఁడైన వచనరచయిత ఈ మాదిరి వామన వాక్యములు వ్రాయుటకు ముచ్చటపడును. వేఱొక కవి "డప్పిజనించి, వ్రేళులపుటంబులు పొక్కి,... గోళ్ళలో నెత్తురుచిమ్మి....' అనురకముగా క్త్వార్థకములు వాడి అవిచ్ఛిన్నపద్య భావధారకు 'పాడి' యొనర్చితినని సంతోషపడును. ఆశైలి సొగసు, ఈశైలి నెరసు అనుటకుఁగాదు, తిక్కనగారి పద్ధతి యిది.

> ఇమ్మదిరాక్షి డస్సె; మనకీ నడుమన్
> విడియంగ నొండుచో
> టిమ్మనుగాదు; నిక్కమున నేమును డస్సితి;
> మట్లుగాన నీ
> వెమ్మెయినైన దీని భరియించి పురంబు
> సమీప భూమికిన్
> దెమ్మని చెప్ప నాతఁడును దెచ్చెఁ బ్రియంబునఁ
> బుష్పకోమలన్.

'ఈమె యలసినది. ఈనడుమ విడియుటకు మనకు వేఱొకచోటు అనుకూలముగాదు. నిజమునకు మేమును అలసితిమి నీవెట్లులైన ఈమెను పురసమీపమునకుఁ గొనిరమ్ము....' ఇది క్రియాపదభూయిష్ఠమైవ గద్యరచన తీరు.

> పగ యడఁగించు టెంతయు శుభం; బది
> లెస్స యడంగునే పగన్
> బగ వగగొన్న మార్కొనక పల్కకయుండఁగ
> వచ్చునే ? కడున్
> దెగ మొదకత్తిపోవఁ బగదీర్పఁగ వచ్చినఁ
> గ్రౌర్యమొందు; నే
> మిగతిఁ దరంచినన్ బగకు మేలిమిలేమి
> ధ్రువంబు కేశవా !

ఇది శతవృద్ధ మాజనని యిప్పుడు మృత్యువుఁ
బొందె; నిట్లు సే
యుదుము కులప్రయుక్త మగుచున్న సనాతన
ధర్మ మిత్తెఱం
గ దహనకర్మ మొల్ల; మదిగా నిదిగా మును
నిశ్చయించి మా
మొదలిటివా రొనర్చు విధముం గొనియాడితి
మేము నియ్యెడన్

ఈ పద్యములు వ్యక్తవచోబంధ మాధురీ సగంధములైనవి. ఈ రచనతీరు క్రొత్తది. క్రియాపద బహుళమై శకల శకలములుగా నున్న లఘువాక్యములతో ఒక మహాభావమునందు తాత్పర్యము చెప్పెడి పద్ధతిగలది 'గద్యశైలి' యనుకొన్నచో ఆ పోకడకు తిక్కనగారిదే యొరవడి.

నన్నయగారి ఇట్టి రచనాఫణితి భట్టారకులవారి లోను లేకపోలేదు. ప్రాచుర్యమును బట్టి చూచుకోవలెనుగదా!

వాఁడి మయూఖముల్ గలుగువాఁ
డపరాంబుధిఁ గ్రుంకె, ధేనువుల్
నేఁడిటు వచ్చె నేకతమ; నిష్ఠమెయిన్ భవదగ్ని
హోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁ బడియెఁ బ్రొద్దునుబోయెఁ
గచుండు నేనియున్
రాఁడు; వనంబులోన మృగరాక్షస పన్నగబాధ
నొందెనో!

ఈ పద్యములో అయిదాఱు పొట్టివాక్యములున్నవి. ఇవి యన్నియు దేవయాని పరిదేవన భావమును ప్రకటించుటలో పర్యవసన్నమగుచున్నవి. లఘువాక్యములు నాద ఖండములు. అవి వ్యక్తములు అవ్యక్తనాదమునందు వానికిఁ బర్యవసానము. అవ్యక్తము అఖండము. ఇవుడు గద్యము వ్యక్తవాక్కు. అది ఖండము. పద్యము అవ్యక్తవాక్కు. అది అఖండము. ('గద వ్యక్తాయాం వాచి'- గద్యతే (భ్వాది) పాదాః సన్త్యస్య అన్యేభ్యోఽపి- ఇతియప్, గద్యపద్యౌ కృతౌకవేః) ఇది వేదాంతముకాదు. గద్యపద్య శబ్దముల పుట్టుపూర్వోత్తరములు ఈ యర్థమును చాటుకొనుచున్నవి.

పద్యము ప్రకాశస్వరూపము. గద్యము విమర్శ స్వరూపము; వద్యము మొగ్గ. గద్యము పువ్వు; పద్యము పరమశివుఁడు. గద్యము విరాట్పురుషుఁడు. గద్యపద్యములుఁ బ్రకృతి పురుషులు; ప్రయోగోపసంహారములు—

ఇటులు లోలోనఁ జొచ్చుకొని చూచినచోఁ దెలుఁగు కావ్యసారస్వత భవిష్యదభ్యుదయమునకు నన్నయ తిక్కనలు కూడఁబల్కుకొని ఏకనాళావలంబి ఫలయుగళముఁ బోని తమ తమ ప్రత్యేక శైలులతో అమృతభిక్షననుగ్రహించిరేకదా!

మహాకవి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారికి

సమ్మాన సంఘము సమర్పించుకొను

సాహితీ సమర్చనము

విద్వత్కవి ప్రభూ !

నమోవాకములు.

నేడు మిమ్ము సమ్మానించుకొను అదృష్టము కలుగుట మాపుణ్యావిశేషము. చిరకాలాంచితమైన మా కోరిక యీడేరిన ఈ శరత్కాల ప్రశాంత సాయం శుభవేళ, ఆనందాతిరేకమున మా మనస్సులు తరంగితము లగుచున్నవి. నయనములు బాష్పపూర్ణము లగుచున్నవి. కంఠములు రుద్ధము లగుచున్నవి. హృదయములు ఆర్ద్రము లగుచున్నవి.

పవిత్ర గౌతమీ జలశీకరములతో పావనమై సురుచిర చారిత్రక ప్రఖ్యాతిని, సుస్థిర సాహితీ పరిపుష్టిని సంతరించుకొన్న రాజమహేంద్రనగరి మహాంధ్ర సాహితీ సామ్రాజ్యమునకు కేంద్రస్థానమను కీర్తి ఆంధ్ర సారస్వత మూలపురుషుడు నన్నయభట్టారకుని భారతాంధ్రీకరణముతో విలసిల్లి తరతరాల విస్తరిల్లి మీ ఆంధ్రపురాణ కావ్యావిష్కరణతో వికసించినది. నన్నపార్యుని కవితారీతిని, అక్షరరమ్యతను, రుచిరార్థసూక్తిని తలపించి, మైమరపించు మీ కవితా మధురోహలు ఆంధ్ర భాషారమణికి గళాభరణ సంపద.

పలుకు పలుకున అమృతము కురియుచు, క్రొత్త యుజ్జ్వలతలు ఒలయుచు, రసజ్ఞ హృదయభాండమున సురధేనువై పయోధారలు పిండుచు ఛందస్సుందరమైన మీ ఆంధ్ర పురాణము తెలుగు సహృదయులకు కవితా రసాభిషేకం. మధురతో దర్కములగు పదములకు హృదయ స్పృశములగు భావములు జోడించి అరమఱుగు మేలిముసుగులో నందగించు ఆంధ్రచారిత్ర సుందరాంగి సొగసును మనసు పండువుగా రూపొందించి నవపర్వముగా వెలయించి ఆంధ్రసాహిత్యాకాశంలో వెన్నెలలు వెలయించారు. మెత్తనౌ మీ కళాహృదయము నుండి వెలువడిన ఆ కావ్య వీధీవిహారము సాంద్రశరత్పూర్ణ చంద్రిక సోకినట్లు, కలువపువ్వుల గాలి కదలినట్లు; ముత్తెములు దోసిళ్ల పోసినట్లు; అమృతహ్రదస్నాన మాచరించినట్లు; పరమార్థమాధురి దొరకినట్లు.

ఉత్తమశ్లోక గాథా తాత్పర్య సనాథమై, మాధుర్యధురీణ కావ్యకవితా నిత్యోత్సవ శ్రీకళాధాములు సూద్గర అమృతగాథాజ్యోతులు దీధితులనీను 'ఆంధ్రరచయితలు' గ్రంథమున–మీ చిత్రణ చాతురి నిరుపమానము. మీ వచన వచోనైపుణి అపూర్వము. మీ వచనము పద్యసౌందర్యమును, మీ పద్యము వచన సౌలభ్యమును కలిగి కలకండము పండిన మీ వాక్కున ఆంధ్రభాషామాధురి నిండినది.

సాహితీ ప్రౌఢిమకుతోడు దార్శనికమైన ఒక క్రొత్తచూపు కూడ కవిత్వమున కవసరమనుటకు మీ రచనలు లక్ష్యములు.

సత్త్వగుణాఢ్యులైన మీ వ్యక్తిత్వ వైశిష్ట్యము మీ సాహితీ వైభవానికి తావి. మాధుర్యము మీయింట పంటకావుననే— మీ మనసులో మాటలో తియ్యదనము. మూర్తిలో స్ఫూర్తిలో హుందాతనము. భాషలో భావములో మెత్తదనము. మీ దర్శనము నందనవనీ సందర్శనము మీ సాన్నిహిత్యము అమృతసేక సాహిత్యము. మీతోడి సంభాషణము గాంధర్వగాన సంతర్పణము: గగనధునీ తుషార స్పర్శనము; రసాల ఫల మాధుర్య రసాస్వాదనము; పూర్ణచంద్రోదయ నిష్యందము; పారిజాత సౌరభ సమ్మోహనము. మీ పలుకు తెలుగుమాగాణికి తేనెజల్లు. మీ కవిత ఆంధ్రసాహితీ సామ్రాజ్యమునకు మధుకోశము. మీ భావము కపిలగోవు వెన్న. మీ మనసు మల్లెపూల ప్రోవు.

ఆంధ్రీ కుటీరమునందు అమృతప్రాయముగ జిగురించిన మీ సాహితీలత "ఆంధ్రి" పత్రికా నిర్వహణలో యందగించి ఆంధ్రపురాణ కావ్యరచనతో కీర్తి వల్లీమతల్లి నలుదెసల ప్రాకినది. మీ కావ్యములలో సంప్రదాయము చెంగట ఆధునికతకు సమాదరణసిద్ధి. దేవవాణి ముంగిట తెలుగుపలుకుబడికి రంగవల్లీరచన. భిన్నమార్గముల సమన్వయభావం మీ సొత్తు. ఇట్టి మహనీయులైన మీఉనికి రాణ్మహేంద్రనగరి కీర్తికి నవస్ఫూర్తి.

ఆయురారోగ్య ఐశ్వర్య కవితా సరస్వంతులుగా మిమ్ము చిరకాలము చూచుకొను భాగ్యమునకై పరమేశ్వరుని కోరుచున్నాము.

రాణ్మహేంద్రవరము
స్వస్తిశ్రీ చాంద్రమాన రాక్షసనామసంవత్సర
కార్తిక శుద్ధ పంచమి స్థిరవారం
8-11-1975

భవదీయ

సమ్మాన సంఘము

'సాధువాదము' డాక్టర్ వి. వి. యల్. నరసింహారావు

మధునాపంతులవారి మంజుకవితల్ మాగాణులై నస్య స
న్నిధులై తెల్గుల గుండెలో రుచులు పండించెన్; రసావేశ సే
వధి కేతాదృశ కావ్యకల్పన కళా పల్యంకికారూఢ ధీ
నిధి కర్పించెద సాధువాద మృదు మాణిక్యాంశు మంజీరముల్.

'నాకధుని' శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు

నీ కవితా విశేషముల నేర్పులు చూడఁగ నాంధ్రకే యశః
పాకము తెచ్చిపెట్టుఁగదె! పావన మాంధ్రపురాణ కావ్య మ
స్తోక కుతూహలంబునను దొందరవెట్టఁ బంపఁ బోవఁగా
నాకధునీ ప్రవాహ మది నా కది యీఁద రసార్ణవంబగున్

'వాగ్విభవము' శ్రీ అత్తిలి వేంకటరమణ

ఒక విశ్వనాధ, తుమ్మల
ఒక మధునాపంతులఁయును, ఒక గడియారం
మ్మకటా! పెంపేదిన యాం
ధ్రికి సుస్థితి నిల్పినట్టి కృతవాగ్విభవుల్
పదిపల్కు లోకమాట నొదిగించి బహుళార్థ
భరితంబుగావించు గఱువతనము
మిఱుమిట్లు గొలిపించు సురుచిర శబ్ద సం
యోజనమున మించు నొసపరితన
మెదలోని లోఁతుల గుదిలించి రసముఁ జి
ప్పిలజేయ నేర్చిన జిలుగు శిల్ప
మెంత మీ రచనలం దివతళించెనో యెంచి
ప్రహ్వాశీర్షుఁడ, జయవాదగళుఁడ
జయ మగుత మీకు ఆర్షవిజ్ఞానమూర్తి!
జయ మగుత మీకు పరమసౌజన్యరాశి!
జయము హృత్పీఠ సుస్నాత శంభులింగ!
జయము సత్యనారాయణశాస్త్రి పాద!

—:o:—

స్వాగత వచనము

శ్రీ గంధం సీతారామాంజనేయులు
సమ్మానసంఘ ఉపాధ్యక్షులు.

★ ఆంధ్రదేశమున లబ్ధప్రతిష్ఠులైన విద్వత్కవులలో ప్రముఖులు శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు. వారు మా కోరికను మన్నించి మా చేయు సమ్మానమునకు విచ్చేసియున్నారు. వారికి రసజ్ఞులైన ఈ మహాసభ పక్షమున స్వాగతము పల్కుచున్నాము.

ఓ మహాసరస్వతీ ! స్వాగతము

★ 'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ' యని ఆంధ్రభారతాది కావ్య శ్రీకారము చుట్టిన నన్నయ కాలమునుండి శ్రీనాథుడు, కందుకూరి, చిలకమర్తి, వడ్డాది, శ్రీపాద, కవికొండల, నేదునూరివంటి ఉన్నత సాహిత్యార్చకుల గ్రంథసుమార్చిత గౌతమీసరస్వతీ తీరస్థమైన రాజమహేంద్రవర తీర్థభూమిలో మహాకవి శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి మహోదయుల ఈ మహా సమ్మానసభ చరిత్రాత్మకమైనది. ఈ మహాసభాధ్యక్షస్థాన మంగీకరించి స్వీకరించిన ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీ అధ్యక్షులు, ప్రఖ్యాత రచయితలు, రవీంద్రవిశ్వకవి శిష్యులు, వివిధోన్నత పదవుల నధిష్ఠించినవారు అయిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారికి మా స్వాగతము.

రెడ్డిరాజ్య పాలిత రాజమహేంద్రవరమునకు విచ్చేసిన బెజవాడ గోపాలరెడ్డిగారూ ! మీకు మా స్వాగతము.

★ పదప్రయోగ కోశములలో, విరచితానేక గ్రంథములలో పీఠికలలో విమర్శనా వ్యాసములలో పుంఖానుపుంఖములైన ఆంధ్రవాఙ్మయ చరిత్రాత్మక రచనములుచేసిన ఆచార్యులు శ్రీ దివాకర్ల వేంకటావధాని మహోదయులు. శ్రీవారు సభాప్రారంభకులుగ విచ్చేసియున్నారు. వారికి మాస్వాగతము.

ఆంధ్రవాఙ్మయ చారిత్రక పురుషా మీకు మా స్వాగతము.

★ నేత్రపర్వము చేయుచున్న నాయకరాజులు, తెలుగు ఎదదల పీఠాధిపతులు, ఆంధ్రకేసరి అనుచరులు శ్రీ తెన్నేటి విశ్వనాధముగారు ఈ మహాసభలో— నేటిమేటి రచయితలచే రసపేటికయైన 'మధుకోశ' ప్రత్యేక అభినందన గ్రంథము నావిష్కరించుటకు విచ్చేసియున్నారు. ఆంధ్రనాయక విశ్వనాథులకు మా స్వాగతము.

తెలుగునాయక రాజశిఖామణీ మీకు మా స్వాగతము.

★ ప్రసంగముచేయుటకు విచ్చేసిన, జిల్లా కాంగ్రెసునాయకులు, ఆంధ్ర పురాణకృతి ప్రియ బంధువులైన శ్రీ రేమెళ్ళ తిరుపతిరావుగారూ ! మీకు మా స్వాగతము.

★ సాహిత్య న్యాయవాదులు, విశాఖజిల్లా సారస్వతోద్బోధకులు, రచయితలునయిన గణపతి రాజు అచ్యుతరామరాజుగారు ప్రసంగముచేయుటకు విచ్చేసినవారు. వారికి మా స్వాగతము.

★ 'ఆకాశవాణి' లో భారత రామాయణాదులను కషాయమధుర కంఠంతో వినిపిస్తూ ఆబాల గోపాలం ఆంధ్రులను ఆకర్షిస్తూఉన్న విఖ్యాతరచయిత 'ఉషశ్రీ' గారూ ! మీకు మా స్వాగతం.

★ నవభారత గురుకుల స్థాపకులై, కార్యశూరులై కవిజనాభిమానమును చూరగొనిన ప్రముఖ విద్యావేత్తలు ఉత్తమ శాసనమండలి సభ్యులు, రాజమహేంద్రవర పురప్రముఖులు శ్రీ తన్నీరు బుల్లయ్యగారు, ప్రసంగముజేయుటకు విచ్చేసినవారు. బుల్లెయ్యగారూ మీకు మా స్వాగతము.

★ సంగీత సాహిత్యముల తీయదనములను ఆకలించుకొని, ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమి సభ్యురాలై అనేక బహుకృతులందిన ప్రముఖరచయిత్రి శ్రీమతి కోడూరి లీలావతీదేవి ఈ మహిళాసంవత్సరమున జరుగుచున్న ఈ మహాసమ్మానసభకు ప్రసంగించుటకు విచ్చేసియున్నారు. సోదరీమణి లీలావతిగారికి మా స్వాగతము.

సంగీత సాహిత్యసభలు ఘనశుభ దినచర్యలుగాగల రాజమహేంద్రవర పురజనుల సమక్షమున ఈ మహాసమ్మానసభకు దూరదూరములనుండి విచ్చేసిన పండిత, కవి, రసజ్ఞ, ప్రముఖుల కెల్లరకూ, పురప్రముఖులకూ రసజ్ఞసభాసదులకు ఎల్లరకూ మా స్వాగతము

—o—

138A



18-10-75 తేదీని 'శ్రీ విశాఖ సారస్వతవేదిక' నిర్వహించిన శ్రీ తెన్నేటి విశ్వనాధముగారి
81 వ జన్మదినోత్సవ సభకు శ్రీ శాస్త్రిగారు అధ్యక్షత వహించిన సందర్భము.
సభా ప్రారంభముచేసిన శ్రీ ఎమ్. ఆర్. అప్పారావుగారు, ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులు.
దిగువకుడివైపు కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామిగారు, దిగువ ఎడమవైపు శ్రీ జి. అచ్యుతరామరాజు గారు



శ్రీ శాస్త్రిగారు జన్మించిన గృహము. మాతామహస్థానము
(ఏలండు) పోలవరము.

138b





138 C



స్వాగతం పలుకుతున్న "సమాచారం" సంపాదకులు
శ్రీ G. S. R. ఆంజనేయులుగారు.



సమ్మాన సభాప్రారంభోపన్యాసము చేస్తున్న డా. దివాకర్ల వెంకటావధానిగారు

139d

అధ్యక్షోపన్యాసం కావిస్తున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు
డా. బెజవాడ గోపాలరెడ్డిగారు



శ్రీ కేదారేశ్వర దంపతులు శాస్త్రిగారికి పాదపూజచేస్తున్న దృశ్యము

13.9 E



శ్రీ కేదారేశ్వర దంపతులు శాస్త్రిగారిని గజపుష్పమాలాలంకృతులనుచేసి
గౌరవిస్తున్న దృశ్యం.



సమ్మాన సంచిక "మధుకోశము" ఆవిష్కరిస్తున్న శ్రీ తెన్నేటి విశ్వనాథముగారు

139 F



శ్రీ శాస్త్రిగారికి "మధుకోశము" అందజేస్తున్న శ్రీ తెన్నేటి విశ్వనాధముగారు



సమ్మానానంతరం శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి సమాధానము

139 G



శ్రీ శాస్త్రిగారితో, శ్రీ నాన్ని కేదారేశ్వరుడు వారిసతీమణి శ్రీమతి కోటమహాలక్ష్మిగారు



ఎడమనుండి : సర్వశ్రీ రేమెళ్ళ తిరుపతిరావు, ఆర్. వి. మహేశ్వరి (సెక్రటరీ, A. P. పేపర్‌మిల్సు), తేన్నేటి విశ్వనాధము, డా. బెజవాడ గోపాలరెడ్డి, మధునాపంతుల, నార్ని కేదారేశ్వరుడు, G. S. R. ఆంజనేయులు, G. అచ్యుతరామరాజు

139 H

సభావేదిక : ఒక నివేదిక

స్వస్తిశ్రీ రాక్షసనామ సంవత్సర కార్తిక శుద్ధ పంచమి స్థిరవారం (8-11-75) సాయంకాలం 4 గంటలకు సన్ననివానజల్లు పూలజల్లుగాభావించి మహాకవి శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారింటినుండి శ్రీ శాస్త్రిగారితో శిష్యులు పురప్రముఖులు; దూరాలనుండివచ్చిన సాహిత్య బంధువులు, బంధువులు ఎందఱెందఱో పూరేగింపు బయలుదేరింది మంగళవాయిద్యాల ఘోషతో; శాస్త్రిగారికి జైవారాలు పలుకుతూ జయధ్వానాలతో సాగుతున్న ఆ మచ్చనైన పూరేగింపు రాజవీధిగుండా సభాస్థలి దుర్గా వెంకటరమణారావు కల్యాణమంటపం చేరింది. నన్నయ ద్వారందాటి వీరేశలింగ ద్వారంసమీపించేసరికి వేదవిద్వాంసుల ఆశీర్వచనములతో పూర్ణకుంభంతో స్వాగతమివ్వబడింది.

సరస్వతి శాస్త్రిగారిని సమ్మానవేదికపైకి ఆహ్వానిస్తోందేమో అనిపించేటట్లు వేదికపై నిండైన సరస్వతీవిగ్రహం సన్మానంచేస్తున్న వారి కళాభిమానంకి నిదర్శనంగా సర్వవిధ సాలంకృతవేదిక. పూలతోరణాలు, వానరాలేదేమో అనిపించేటంతగా ఆశీనులైవున్న జనసందోహం, తెలుగునేల నాలుగు చెరగులనుంచీ వచ్చిన రసజ్ఞులు, రాజమహేంద్రవర పండితులు, కవులు, కళాభిమానులు, వివిధరంగాల పురప్రముఖులు, మహిళామణులు, అధికసంఖ్యలో హాజరయిన ఆ సమ్మాన సభలోనివా రందఱూ ఎన్నాళ్ళనుండో ఎదురుచూచిన ఆ సమ్మాన సభా ప్రారంభానికి ఎదురుచూస్తున్నారు.

సన్మానసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ నార్ని కేదారేశ్వరుడు పేరుపేరున స్వాగతం పలుకుతూండగా, శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని సమ్మాన సంఘ ఉపాధ్యక్షులు శ్రీ గంధం సీతారామాంజనేయులు, శ్రీ మధునాపంతులవారిని సమ్మాన సంఘ సహాయకార్యదర్శి శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు, డా. దివాకర్ల వెంకటావధాని గారిని శ్రీ మద్దుల వాసుదేవమూర్తి, శ్రీ తెన్నేటి విశ్వనాథంగారిని శ్రీ బొల్లాప్రగడ అక్కిరాజుగార్లు వేదికపైకి తోడ్కొనివస్తూండగా వారికి శ్రీయుతులు కనకప్రవాసి, సన్నిధానంనరసింహశర్మ, గాదేపల్లి కుక్కుటేశ్వరరావు, యస్. వి. రాఘవేంద్రరావు గార్లు పద్యస్వాగతం ఆలాపించారు. బ్రహ్మశ్రీ తాతపూడి రామకృష్ణమూర్తి అవధాని ప్రభృతులు వేదాశీస్సులు పలికారు. విజయశంకర సంగీతకళాశాలకు చెందిన కుమారి పి. విజయలక్ష్మి సంపూర్ణలు ప్రార్థనచేశారు. సదనం విద్యార్థినులు 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గానంచేశారు.

అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, ప్రారంభకులు డా. దివాకర్ల వేంకటావధాని మధుకోశం ఆవిష్కర్తలు శ్రీ తెన్నేటి విశ్వనాథం, ఆంధ్రాపేపర్ మిల్స్ (రాజమండ్రి) సెక్రటరీ శ్రీ అర్. వి. మహేశ్వరి, శ్రీ రేమెళ్ల తిరుపతిరావు, శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు, శ్రీ ఉషశ్రీ, శ్రీ తన్నీరు బుల్లయ్య శ్రీమతి కోడూరి లీలావతి, శ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మగార్లు వేదికనలంకరించియున్నారు.

కోవాలని, నన్నయ తర్వాత మళ్ళీ ఇక్కడ ఒక మహత్తర కావ్యం ఆవిర్భవించడానికి వెయ్యేళ్ళు పట్టిందనీ, మహాకావ్యాలు ఎప్పుడూ అంతేనని, అర్ధరాత్రి కూర్చొనివ్రాసే రసరహితకావ్యాలు బండ్లకొలదీ వున్నా ప్రయోజనంలేదని మహాకావ్యాలు రచించాలంటే పూర్వజన్మ సుకృతం వుండాలని, నన్నయ మూర్తితో తమ స్వీయానుభవాన్ని ఆంధ్రపురాణంలో చూపించిన శ్రీ శాస్త్రిగారు అధునికయుగంలో మరోనన్నయ అని హర్షధ్వానాల మధ్య అభిభాషించారు.

ఈ సమ్మాన శుభసమయంలో శ్రీ నరసింహదేవర ఉమామహేశ్వరశాస్త్రీగారు తమ గురువర్యులైన శాస్త్రగారికి తామువ్రాసిన 'కావ్యసరసి' కృతిని అంకితమిచ్చారు.

శాసనమండలి మాజీసభ్యులు శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు శ్రీ శాస్త్రిగారిపై తామువ్రాసిన పద్యాలు చక్కగా వినిపించారు.

శ్రీమతి కోడూరి లీలావతీదేవి మధునాపంతుల వారి కవిత్వంలోని మాధుర్యాన్ని లాలిత్యాన్ని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రేమెళ్ళ తిరుపతిరావు ఆంధ్రపురాణ కృతిభర్తకు తాము సన్నిహితులమని చెపుతూ శాస్త్రిగారి కుటుంబంతో తమకు తరాలుగా వుంటూన్న స్నేహితాన్ని విశదీకరించారు.

శాసనమండలి సభ్యులు శ్రీ తన్నీరు బుల్లయ్య ప్రసంగిస్తూ అపారమైన విద్వత్తు సంతరించుకున్న శ్రీ శాస్త్రిగారి శాంతము, సౌజన్యము, వినయ నమ్రతలు ప్రశంసనీయాలన్నారు.

శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు సమాధాన వచనంలో తమకు సమ్మానం సంకల్పించిన శ్రీ నార్ని కేదారేశ్వరుడుగారికీ, సమ్మానంలో వారికి సహకరించిన ఆంధ్రకేసరి యువజనసమితి సభ్యులకు, శిష్యులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీ శాస్త్రిగారు తెలుగుజాతి మహాభ్యుదయపరంగా ఆంధ్రపురాణం ముగింపులోవ్రాసిన పద్యాలతో సభాసదుల హృదయాలకు విందుచేశారు.

కనువిందుగా మూడుగంటలపాటు జరిగిన ఈ సమ్మాన సాహిత్యసభ వినువిందుగా సహస్రాధికులైన రసజ్ఞులను సహృదయులను అలరించింది.

సమ్మానసంఘ సహాయకార్యదర్శి శ్రీ యాతగిరి శ్రీరామనరసింహారావు సందేశాలు చదువగా శ్రీ పున్నమరాజు నాగేశ్వరరావు వందనసమర్పణ చేశారు

హృదయపూర్వక శుభాకాంక్షలతో

స్వర్గీయ కరక అప్పలస్వామిగారు స్థాపించిన

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర
కళ్యాణ మండపము
మెయిన్‌రోడ్, ఇన్నీసుపేట,
రాజమండ్రి – 2

ట్రసుబోర్డు చైర్మన్
చింతల పైడిరాజు

ట్రస్టీలు : కరక శ్రీరామవీరవెంకటసత్య నారాయణ, బండారు శ్రీరామ మూర్తి, వద్దిపర్తి లక్ష్మీనారాయణ.

అన్ని శుభకార్యములు జరుపుకొనుటకు సర్వసౌకర్యములు గలవు.

శ్రీ కృష్ణా ట్రంకు ఫ్యాక్టరీ
కరకవారి సందు–రాజమండ్రి–1

నాణ్యమైన స్టీలుట్రంకులు, కేబిన్ సూటులు వగైరా ఉత్పత్తి దారులు.

పార్టనర్సు :
వద్దిపర్తి లక్ష్మీనారాయణ
కరక వీరవెంకట సత్యనారాయణ
చింతల త్రిమూర్తులు

'శిశు ప్రాణదాత' 'వైద్య విద్యావిశారద' 'కళాప్రియ మహోదయ' 'కళోద్ధారక'

డాక్టర్. పి. సీతారామభార్గవ

వైద్య సేవాసదనం

కోరుకొండ.

తూ. గో. జిల్లా. ఆంధ్రప్రదేశ్

మహాకవి మధునాపంతులవారికి మా శుభాకాంక్షలు

మంగళవారపుపేట కో–ఆపరేటివ్ అర్బనుబ్యాంకు లిమిటెడ్, రాజమండ్రి.

ఫిక్సెడ్ డిపాజిట్స్‌లో హెచ్చింబడిన డిపాజిట్ల రేట్లు

6 నెలలకు 8% 1 సం॥కు 10% 3 సం॥కు 11% 5 సం॥కు 13% తీసుకొనబడును.

సిహెచ్. వి. ప్రసాదశర్మ, చైర్మన్

కె. సోమసుందరరావు, పెర్సనల్ యింఛార్జి

సమ్మాన మహము

శ్రీ కాశీభట్ల శేషయ్యశాస్త్రి

ఢాకాల గండపెండారమ్ము లేదాయె
కవి లోకమాన్యుడన్ గణనయెట్లు
కాంచన ఘంటికా కంకణంబును లేమ
వెలయు నీ పాండితీ విభవమెట్లు
వందిమాగధజన బృందంబు నేలని
కవిరాజు రాజ్యమ్ము ఘనతయెట్లు
దర్పసూచక బిరుదమ్మొక్కటియులేమ
సభ నెదుర్లేనట్టి ప్రభయదెట్లు

ఏమి పుణ్యంబు చేసిరో, యేమి చొక్క-
మందు చల్లిరో యాంధ్రాళి మానసముల
మధునపంతుల సమ్మాన మహము నేడు
మహిత విస్మయమోద సంపదలనించె.

శ్రీ కె. వి. యస్. అప్పారావు

సకల పురాణాళిసారమౌ భారతం బాదినన్నయయిటన్ బాదుకొలిపె
స్కాందపురాణోక్త కాశికాఖండంబు శ్రీనాథకవి విరచించె నిచట
భాగవత పురాణ భాగధేయమునిటన్ శ్రీపాదకవి ద్విగుణీకరించె
ఆంధ్రపురాణంబు నతి రమ్యముగ నిటన్ సంతరించె మధునాపంతులకవి

ఆదినుండి నేటి దనుక నాంధ్ర భువికి
వ్యాసపీఠి రాజమహేంద్రవరము! ఇచట
వరుసతోడ నాంధ్రపురాణ బాదరాయ
ణునకుఁ జేయు సమ్మానమ్ము నుతికిఁ దగును.

శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి

శ్రీగుణ స్సుందరార్థ నిబిరీసము లాంధ్రపురాణ ముఖ్యముల్
ధీగరిమన్ రచించి – రమణీయ కవిత్వరసానుభూతి నా
లోఁ గలిగించి– సంస్కృతి విలోకముఁగూర్చి నసత్కవీంద్రు, శ్రీ
భాగవతాగ్రణిన్, హరి – కృపారసమూర్తి – అనుగ్రహించుతన్.

కవితా మధుమూర్తి — కొండేపూడి సుబ్బారావు. (విశాఖపట్నం)

తిక్కనవైన తెన్గునుడి తీరులు చూఱలుగొన్న మన్నికన్
చక్కని మేలుకైత ప్రభుసమ్మిత మాంధ్రపురాణ కావ్యమం
దొక్కొక పద్యమే రసమహోదధి, తేనియసోనలాని పెం
పెక్కిన పైడితీవ వికసించిన పూవులప్రోవు లన్నియున్.

వ్రాయనువచ్చు కావ్యములు, వ్రాసినవానిని ముద్రితమ్ముగాఁ
జేయనువచ్చునున్, రసవశీకృతముల్ విగళన్మరంద ధా
రాయుత భావతీవ్రతలు, రమ్యతరాక్షర శబ్దకల్పనా
శ్రీయుతమైనకైత లొకరిద్దరె నోఁచిన నోముపంటయే.

కావ్యసరసి (కృతి) — నరసింహదేవర ఉమామహేశ్వరశాస్త్రి

పలుకరించినఁగాని తలయెత్తిచూడక ఆలోచనావీధినరుగు ప్రకృతి
ఆఁచి తూఁచి వచించు సమృతనిష్యందియా మితభాషణమ్మున మెలఁగు సుకృతి
వామనమూర్తిగా వరలి రాణ్ణగరిలో విక్రమించు మహా త్రివిక్రముండు
ఆంధ్రపురాణంబు నందించి యఖిలాంధ్ర జన సంస్తుతులఁ గొన్న ఘనయశస్వి
ధీర గంభీర మధుర సుస్మేర మైన మోములో బ్రాహ్మ్యవిజ్ఞానపూర్ణ రూప
మందగించు మహాకవి-చందనార్ద్రి శీతలుండు గురుం డిది స్వీకరించు !

సాహితీ సమ్రాట్, ఆంధ్రకల్హణ, మహాకవి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి

సమ్మాన సందర్భమున

పలువిధముల సహకరించిన సహృదయులందఱికి

హృదయపూర్వకముగా కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాము.

సమ్మాన సంఘము

వీరేశలింగాస్తికోన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తూ వేలాదిమందికి విద్యాదానమిస్తూ, వీరేశలింగంగారి ఆంధ్రకవుల చరిత్రకు పరిశిష్టగ్రంథముగా 'ఆంధ్ర రచయితలు' అందించిన

మహాకవి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారికి

ఘనసన్మానం సందర్భంగా

యుగపురుషుడు వీరేశలింగం పంతులుగారు నెలకొల్పిన హితకారిణీ సమాజము

శుభాభినందనములు

హితకారిణీ సమాజమువద్ద అమ్మకమునకుసిద్ధముగానున్న శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారి గ్రంథములు

1. అభిజ్ఞాన శాకుంతలము, 2. రాజశేఖరచరిత్రము, 3. స్వీయచరిత్ర, 4. నీతిచంద్రిక–విగ్రహము

5. నీతిచంద్రిక–సంధి, 6. నీతికథామంజరి ఇత్యాది గ్రంథములు గలవు.

1. రు. 25 లు, అంతకుపైబడిన ఆర్డరుకు 20 శాతం కమీషను యివ్వబడును.

2. వి. పి. పి. ద్వారాగాని, ఎం. ఓ. ద్వారాగాని పంపబడును.

ప్రతులకు యీ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

శ్రీ దంగేటి. లక్ష్మణరావు, గౌరవ కార్యదర్శి

హితకారిణీ సమాజము, రాజమండ్రి-3, ఫోన్ : 183

అమలాపురం సహకార భూమి తనఖా బ్యాంకు లిమిటెడ్,

స్థాపన : 1930

అధ్యక్షులు : శ్రీ వాడ్రేవు జగ్గరాజుగారు

అమలాపురం తాలూకాలోని 71 గ్రామాలలోని రైతులకు

దీర్ఘకాలిక అప్పులనిచ్చుటద్వారా గణనీయమైన సేవచేస్తున్న సహకారసంస్థ.

1-10-1975 నాటికి బ్యాంకు అభివృద్ధి వివరములు :

సభ్యుల సంఖ్య : 2690. వాటా ధనము ; రు. 409540 మూలనిధి : రు. 1.10 లక్షలు.

1974-75 లో 424 మందికి యిచ్చిన అప్పుల మొత్తము : రు. 10.15 లక్షలు

1974-75 లో బ్యాంకు సంపాదించిన అంచనా నికరలాభం రు. 17096/-

ఎస్. ఎస్. శర్మ

కార్యదర్శి

HYDERABAD

The range of power

- Steam Turbines & Turbo-Alternators (1.5 MW to 110 MW) - for Industries and for Power Generation.
- Turbo-blowers and Turbo-compressors
- Pumps
- Minimum Oil Circuit Breakers (25 KV to 132 KV) and Air Blast Circuit Breakers (132 KV to 400 KV)
- Centrifugal Compressors for Fertilisers, Petroleum, Petro-chemical, Chemical, Refrigeration, Steel and other industries.

Bharat Heavy Electricals Limited
(A Government of India Undertaking)
HYDERABAD 500032

FDSH BHEL 741

ఫోను : 27

మురమండ సహకార గ్రామీణ బ్యాంకు మురమండ

(రాజమండ్రి తాలూకా)

ప్రారంభం **29 - 6 - 1955**

అధ్యక్షులు : శ్రీమతి ఈదర సుందర మాణిక్యం

ఉపాధ్యక్షులు : శ్రీ రేమెళ్ళ రమణయ్య దొర

సభ్యుల సంఖ్య 3242

సభ్యుల వాటా ధనం	రు	2,40,000/-
ప్రభుత్వ వాటా ధనం	రు	1,47,000/-
డిపాజిట్లు	రు	1,50,000/-
రిజర్వులు	రు	30,000/-
74,75 లో యిచ్చిన అప్పులు	రు	5,31,000/-

సన్నకారు రైతులకు పాడిపశువులు కొనుటకు రు. 1,19,000/— అప్పులు మంజూరు చేయబడినవి.

రాజమండ్రి కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఏరియాలో వున్న ఏకైక గ్రామీణ బ్యాంకు.

కట్టా సత్యనారాయణ
సినియర్ సూపర్‌వైజర్, శక్రటరీ.

గురువర్యులు శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి సన్మాన సందర్భమున మా హృదయపూర్వక శుభాభివందనములు :

కటారి సిరమిక్ ఇండస్ట్రీస్,

కటారి గార్డెన్సు

మోరంపూడి రోడ్డు, తాడితోట,

రాజమండ్రి-533103.

Phone No 8 Gram : KATARI

Manufacturers of **Katari Brand Pickle Jars & Refractories.**

ఆంధ్ర సాహిత్యాకాశంలో పూర్ణచంద్రోదయంవంటి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి

సమ్మాన సందర్భమున మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ సూర్యా

ఆయుర్వేద నిలయం

పిఠాపురం - **533450** (ఆంధ్ర) ఫోన్ **60**

Grams : "SURYA" **PITHAPURAM.**

ఆయుర్వేదములో గొప్ప పరిశోధన

నేటివరకు అసాధ్యముగ నున్న అనేక కఠినవ్యాధులను

సులభముగ తగ్గించుచున్న

దివ్యౌషధములు

వైద్యమార్తాండ

ఆయుర్వేద పరిశోధక శిరోమణి

పాలంకి వెంకట సూర్యనారాయణమూర్తి

(Dr. P. V. S. MURTY)

SURYA'S MEDICINES
SAN PRODUCTS

మందులకు (విళ్ళలు) పథ్యానుపానములు లేవు.

సలహా ఉచితము.

150

With the Best Compliments from :

T. NARASIMHA RAO

Secretary, Lions Club

RAJAHMUNDRY.

ముఖసౌందర్యమునకు

జాలీ ఫేసుపౌడరు, స్నో

వాడండి

జాలీ పెరఫ్యూమరీ వర్క్సు, ఫోను - 98 - రాజమండ్రి

ఘనసన్మానాన్ని పొందుతున్న శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారికి మా శుభాభినందనలు.

శ్రీ లక్ష్మీ ఆయుర్వేద నిలయం

256 రకముల ఆయుర్వేద దివ్యౌషధములతో సుమారు 24 బ్రాంచీలుగల గొప్ప ఆయుర్వేద సంస్థ!

ఉప్పాడ – తూ॥గో॥జిల్లా

సంస్థాపకులు : 'భిషగ్వర' శ్రీ నాగాభట్ల కామేశ్వరరావు

మేనేజింగ్ పార్టనర్ : శ్రీమతి నాగాభట్ల భవానీజోగాంబగారు

ప్రధాన చికిత్సకులు, మేనేజరు: వైద్యాచార్య శ్రీ N.V.N. సూర్యనారాయణమూర్తి.**R.M.P**

వైద్యవిద్వాన్ & విశారద శ్రీ నృసింహదేవర పాపారావుగారిచే స్వయంపరిశీలనతో—

సశాస్త్రీయముగా తయారుచేయబడిన–సుప్రసిద్ధ ఆయుర్వేదౌషధముల సంస్థ!

మృదు మధుర కవితా పెన్నిధి
మధునాపంతుల మా రాజమందిర నిధి
ఈ
సమ్మాన మెంత
పుర ఋణభార మంతరింపగ.

శుభాకాంక్షలతో
రోటరాక్ట్
రాజమండ్రి.

ఫోను : 21

రఘుదేవపురం సేవా సహకార పరపతి సంఘం, రఘుదేవపురం

(రాజమండ్రి తాలూకా)

ప్రారంభము **14-6-1927**

అధ్యక్షులు :
శ్రీ పాలచర్ల వెంకట్రావు

ఉపాధ్యక్షులు :
శ్రీ దాసరి వెంకటరావు

సభ్యుల సంఖ్య 1246

వాటా ధనం	రు. 2,91,000/-
డిపాజిట్లు	రు. 1,00,000/-
74-75 లో యిచ్చిన అప్పులు	రు. 8,45,000/-
74-75 లో నికర లాభం	రు. 16,500/-

రాష్ట్రంలో బంగారంపై అప్పులు యిచ్చే ఏకైక సేవా సహకార పరపతి సంఘం

జె. వీర్రాజు
సూపర్‌వైజర్-మేనేజరు

కడియపులంక నెహ్రూ విశాల సహకార పరపతి సంఘం

ప్రారంభము : **2-3-1958**

అధ్యక్షులు :
శ్రీ పాటంసెట్టి గనిరాజు

ఉపాధ్యక్షులు :
శ్రీ బూరసు సత్యనారాయణమూర్తి

సభ్యుల సంఖ్య : 889

వాటా ధనం	రు. 94,000/-
డిపాజిట్లు	రు. 50,000/-
రిజర్వులు	రు. 30,000/-
74-75 లో యిచ్చిన అప్పులు	రు. 4,50,000/-
74-75 లో నికర లాభం	రు. 13,500/-

74-75లో సన్నకారు రైతులకు పాడిపశువులు కొనుటకు రు. 60,000/-లు అప్పు యివ్వబడినది

రాజమండ్రి తాలూకాలో ఆదర్శప్రాయమైన విశాల సహకార పరపతి సంఘం

వి. పనసరామన్న
సూపర్‌వైజరు-శక్రటరీ

With best compliments of :

Cable : SUNCAST | **Phone : 78**

SREE KRISHNA GRAPHITE AND CRUCIBLES PRIVATE LIMITED

17-51 Morampudi Road : RAJAHMUNDRY-3.
A. P. INDIA.

Manufacturers of : Graphite Crucibles upto 1000 lbs, Renders benefication of Graphite in Scientific methods to the specification of the indentors.

Sole Selling Agents for : **"RAJA" & "SUNCAST" Brand Graphite crucibles.**

ఇన్నీసుపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నెం. 3015
రాజమండ్రి.

స్థాపకులు : డా॥ పాలకోడేటి గురుమూర్తి

అధ్యక్షులు: శ్రీ కన్నూరు సత్యనారాయణరావు

ప్రారంభము : **20-12-1918**

సభ్యుల సంఖ్య		2032
వాటా ధనం :	రు	95,740/-
డిపాజిట్లు :	రు	4,71,354/-
రిజర్వులు :	రు	2,39,243/-
74,75 లో బ్యాంకుయిచ్చిన అప్పులు	రు	3,95,000/-

బంగారంపై అప్పులుయిచ్చు పథకం ప్రారంభింపబడినదని, ఫిక్సెడు డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీరేట్లు అమలు పరచబడినవని తెలుపుటకు సంతసిస్తున్నాము.

చిట్టాప్రగడ సుబ్బారావు
సూపర్వైజరు-మేనేజరు.

With Best Compliments from

COSMOPOLITAN CLUB

RAJAHMUNDRY.

మహాకవి మధునాపంతుల వారికి

హృదయపూర్వక శుభాకాంక్షలు

ఆదర్శ జాతీయ గృహపరిశ్రమ

ఫోను : 2154

శోధన్ పెయింట్స్

రాజమండ్రి.

With compliments from :

M/S. Techno Pack Private Limited,

Manchukonda Gardens, VISAKHAPATNAM-530 007.

Phone : 4 2 7 2. Telex : 049 - 269

Manufacturers of :

Polyethylene and paper laminated jute bags for packing fertilizers and chemicals *

L- D. Polyethylene extrusion Products. *

With Best Compliments from :

PAPPU VEERANNA & SONS.

DOWLAISWARAM.

RAJAHMUNDRY R. S. E. G. Dist.

(Telephone No. 9 9)

BOMMURU.

Manufacturers of :

Iron beam scales, C. I. Weights, Drilling machines, Jigger m/c, Coir fibre machinery, Iron safes, and

Re-rolling M.S. Rods from 6 mm dia to 16 mm dia

Telephone : 2004

With Best Compliments from :

SREE MURALI KRISHNA

Motor Works & Engineering Works,

AUTOMOBILE AND MECHANICAL ENGINEERS

DEALERS IN EVERYTHING IN AUTO MOBILES

RAJAHMUNDRY-2

(Andhra Pradesh)

పురుషులందు

పుణ్యపురుషులు వేరు

రేవులందు

విశాఖ రేవు వేరు

వివరములకు :

కార్యదర్శి

విశాఖ పోర్టు ట్రస్ట్

విశాఖపట్నం.

The Andhra Pradesh Mining Corporation Limited

(A WHOLLY STATE OWNED UNDERTAKING)

11-5-4011, Red Hills - HYDERABAD - 500004.

Grams : MINICORP. Phones : 38402 - 3.

A MINE OF MANY MINERALS
AND ALL FOR INDUSTRIES

What's your Industry ? Ceramics ? Refractories ? Then you can Indent on our ball clay and fire clay. Perhaps you own a Glass Industry or a Foundry. Then you will do better with our Silica Sand of Various Fractions.

There is also asbestos fibre of various grades, dolomite in lumps for Paints and Fertilizers. Serpentine for Mosaic Tiles. Quartz of High Purity for Sodium Silicates. Felspar for Ceramic and Glass Industry. Also Bauxite, Rockphosphate, Graphite.

ANDHRA PHOSPHATE PRIVATE LIMITED

(A Joint Venture with Andhra Pradesh Mining Corporation)

Administrative Office:

47-9-38, Dwarakanagar, VISAKHAPATNAM-530004.

Phones: Offi. 5058 MD,Res. 2232 Grams: "PHOSPHATE".

Leading Mining Complex of Quality

'ROCKPOSPHATE'

and

'VERMICULITE'

Interested parties of repute who are
In the field of industrial minerals
may write for their trade enquires.

L. MALAKONDAYYA, M. A. IAS.
Chairman.

P. C. RANGA RAJU
Managing Director.

With Best Compliments from :

Tel Phone 2023 & 2023 A. Tel: Grams : SPRALUMIN

The High Class & Cheapest Aluminium Ware House
In Andhra Pradesh

WHERE?

SALUMURU POTHARAJU & Co.,

ALUMINIUM MERCHANTS

Innispeta :: RAJAHMUNDRY-2

సలుమూరు పోతరాజు & కో.,

అల్యూమినియం వ్యాపారం,

ఇన్నీసుపేట, రాజమండ్రి - 2

ది ఆర్యాపురం కో-ఆపరేటివు అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నెం,3127రు,

గ్రామ్స్ : రాజమండ్రి. ఫోన్ నెం. 209.

స్థాపితం : 1918. రజతోత్సవము : 1943 స్వర్ణోత్సవము : 1969

అధ్యక్షులు : డా॥ పొన్నాడ వేంకటాద్రి,

ఉపాధ్యక్షులు : శ్రీ మజ్జి స్వామినాయుడు.

డైరెక్టర్లు :

శ్రీ కొండేటి రామచంద్రరావు, శ్రీ వానపల్లి వీరాస్వామి, శ్రీ షర్లి అప్పారావు, శ్రీ గండుబోయిన అప్పారావు, శ్రీ రాయవరపు వేంకట్రావు, శ్రీ కూండ్రపు అప్పారావు. శ్రీ తొక్కల రామాంజనేయులు

డిపాజిట్లు ఇన్సూరు చేయబడినవి. అన్నిరకముల బ్యాంకింగు వ్యాపారములు చేయబడును.

ఫిక్సెడ్ డిపాజిట్లపై 10 ½% వరకున్నూ, రికరింగు డిపాజిట్లకు విలియాపరు, ఫిక్సెడ్ డిపాజిట్లపై 15% నుండి 22% వరకూ వడ్డీ ఇవ్వబడును. పెన్షన్ డిపాజిట్లు. సేఫ్ డిపాజిట్ లాకర్లుకలవు. ఇండ్ల తనఖాపైన, బంగారు వెండి వస్తువుల తాకట్టుపైన రు. 4,000/- లు వరకు అప్పులు ఇవ్వబడును.

మూలధనము రు, 53,04,373. డిపాజిట్లు రు. 49,81,829. రిజర్వులు రు. 3,09,355
అప్పులు ఇచ్చినవి రు. 41,87,992 టర్నోవరు రు. 1,64,00,000

కాతాదారులకు తృప్తికరమైన సేవయే మా ధ్యేయము.

కార్యదర్శి. కొమ్మూరి శ్రీనివాసరావు, బి. కాం.

158

వ్యాధి నివారణమునకు

ఆరోగ్య సంధానమునకు

ఆయుర్వే దౌషధ సేవనము

ముఖ్య సాధనము

ఆయుర్వేదౌషధములను అత్యంత శ్రద్ధతో
శాస్త్రీయముగా నమ్మకముగా తయారుచేయు
ఉత్తమ సంస్థ

వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము

చింతలూరు. : : (తూర్పుగోదావరి జిల్లా)

ఆంధ్రప్రదేశ్ లో 38 బ్రాంచీలు 36 ఏజన్సీలు గలవు.

గ్రామ్స్ : సూపర్ బజార్.

ఫోన్స్ : అఫీసు 873
ఎం.డి. రెసిడెన్సు 1247

ది గౌతమి కోపరేటివ్ సూపర్ బజార్ లిమిటెడ్.,

రా జ మ ం డ్రి. నెం. డి. 1440

ఇంటివద్దకు సరుకు సరఫరా చేసే పథకము

ప్రకాశంనగరం, గాంధిపురం ప్రాంతములతోసహా. రాజమండ్రి. పురపాలిత ప్రాంతములోనివసించు గౌతమి సహకార సూపర్ బజార్ సభ్యులనుండి వివిధ వినిమయ వస్తువులను తమ తమ గృహములవద్దకు సరఫరాచేయు నిమిత్తం ధరఖాస్తులు కోర బడుచున్నవి.

ఒకటవ తేదీనగాని, ఆ తర్వాతగాని యింటివద్ద సరఫరాచేయు వీలుగా ముందునెల 28 వ తేదీలోగా కావలసిన వస్తువుల వివరములతో (ముఖ్యంగా ప్యాక్ చేసినవి) కూడిన ధరఖాస్తు పత్రములను సూపర్ బజార్ మేనేజింగు డైరెక్టరుకు పంపవలెను.

ధరఖాస్తులో పేరు, ఇంటినెంబరుతో విలాసము, వీధిపేరు మొదలైన పూర్తివివరములు ఉండవలెను. సరుకున్నంతవరకు, సూపర్ బజార్‌లో లభించే ధరకు (ప్యాకింగు చార్జీలు అదనం) డబ్బు యింటివద్ద చెల్లించే పద్ధతిని సరుకు యింటివద్దకు సరఫరా చేయబడును.

ఎం. ఎస్. బి. చలపతిరావు
ఎం.ఏ.,ఎల్.ఎల్.బి.,
మేనేజింగు డైరెక్టర్.

PA12A202

mcm/app/2

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PAK 12A202
పుస్తకం పేరు	మొగ్గ కోశము
తారీఖు	6/9/23
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	191
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	C1, ii, iv, 142
లేని పేజీలు	No
తయారు చేసినది	Nandhu
పేజీలు విడదీసినది	Nandhu
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	Amrutha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good